పేకమేడలు

రంగనాయకమ్మ

1 Rsk010308

పేక మేడలు

రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
హైదరాబాదు

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
ప్రచురణ నెం. 9
పేకమేడలు (నవల)

ముఖచిత్రం :
'బాపు'

రచనాకాలం: 1962

1వ ముద్రణ : 1962 జూలై
....
5వ ముద్రణ : 1973 డిసెంబర్
6వ ముద్రణ : 1975 నవంబర్
7వ ముద్రణ : 1982 ఏప్రిల్
8వ ముద్రణ : 1993 నవంబర్

ఈ నవల
మొట్టమొదట 1962లో
"ఆంధ్రప్రభ" వారపత్రికలో
సీరియల్‌గా వచ్చింది.

ధర : 13 రూ.లు

ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు, విజయవాడ-2.

రంగనాయకమ్మ అడ్రసు
సి-44, ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్,
హైదరాబాదు-500 033.

ముద్రణ :
శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్
సీతారామపురం, విజయవాడ-2. ఫోన్:431422

అంకితం

ఈ రచనలో ఇంకా ఏదో తెలీని లోటు వుందనీ—నా హృదయాన్ని పూర్తిగా చూపించలేక పోయాననీ—నా వేదన సరిగా వ్యక్తం చేయలేకపోయాననీ—అనిపిస్తున్నది.

అదే నిజమైతే ఆపైన నాకు శక్తి లేదు.

కన్నె దశలో యెన్నో వాంఛించి—హృదయంలో భద్రపరచుకుంటూ వచ్చి—తెలీని పారవశ్యంతో వివాహ వేదిక ఎక్కి—తన సర్వస్వం పురుషుడికి అర్పించుకొని—నూతన జీవితం మూన్నాళ్ళ ముచ్చటగా గడిపి—ఆపైన కళ్ళు విప్పి నిజం చూసి—వాస్తవాన్ని అర్థం చేసుకొని—తన ఆశలు తేలితేలి పోతోంటే—నమ్మకాలు పీగిపోతోంటే—హృదయం బద్దలై పోతోంటే—జీవిత సుఖం పూర్తిగా నశించి పోతోంటే—సహించలేక—చేసేది లేక—బ్రతుకుమీద ఆశ చేతనో—చావుమీద భయం చేతనో—బిడ్డల మీద మనుకారం చేతనో—భవిష్యత్తుమీద నమ్మకం చేతనో—ఏదో కారణం చేత—చావలేక బ్రతుకుతూ—జీవచ్ఛవాలై—సంతోషాలన్నీ మరిచి—కన్నీటిని కౌగిలించుకొని—అనుక్షణమూ నిట్టూర్చుతూ—అదీ అయినా స్వేచ్ఛగా చేయ గలిగినందుకు తృప్తిపడి బ్రతుకుతోన్న—మన సమాజంలోని వేలాది భాను మతులకు నేనీ రచనని బలీయమైన కాంక్షతో—నిండు హృదయంతో అంకిత మిస్తున్నాను.

రచయిత్రి.

కొత్త ముందుమాట

(6వ ముద్రణకు రాసినది)

భాను స్వభావంలో పరస్పర వ్యతిరేక లక్షణా లేమీ లేవు. ఆమె అభిప్రాయాలలో అభివృద్ధి నిరోధక భావా లసలే లేవు.

కానీ, భాను కొన్ని విషయాలు ఎలా అర్థం చేసుకోవాలో తెలీక కొంచెం తికమక పడింది. కొన్నిటిని అపార్థం కూడా చేసుకుంది.— ఈ విషయాలు పరిశీలించేముందు ఒక విషయం ప్రస్తావించాలి.

ఒక రచనలో పాత్రల అభిప్రాయాలన్నీ, ప్రవర్తననీ, సంభాషణల్నీ విమర్శించి చూడాలంటే అవసరమయితే ఎంత చిన్న విషయం మీదైనా దృష్టి నిల్పాలి.

కేశవ, భాను పెళ్ళి సందర్భం గురించి తలపోస్తూ—"భానుకి ఖరీదయిన రిస్టువాచీ....బావగారికి మంచి పెన్నూ తీసుకున్నాను"—అంటాడు. (కథ చెప్పేది కేశవే).

చెల్లెలికి ఎంతో ప్రేమతో ఇచ్చిన వొస్తువుని "ఖరీదైన వొస్తువు"గా గుర్తుపెట్టుకోవడం కేశవ ప్రేమని కళంక పరుస్తోంది. ఆడంబరానికో, గొప్పకో, మర్యాదకో అత నా బహుమతి ఇవ్వలేదు. ఎంతో స్నేహంతో, ప్రేమతో ఇచ్చాడు. ఆ వస్తువు కొనేప్పుడు ఎంతో ఖరీదు గలదిగా కొనా లనే అతను ప్రయత్నిస్తాడు. కానీ, ఆ విషయం మళ్ళీ "భానుకి ఖరీదయిన వాచీ ఇచ్చాను"—అనడం అతని స్వభావానికి విరుద్ధం. దాని ఖరీదు మీద దృష్టి ఉండదు. (వుండకూడదు—అలా చిత్రించాలి.)

—కేశవ, భాను కొడుకుని మొట్టమొదట చూసిన సందర్భం గుర్తు చేసుకుంటూ—"రాజాలాంటి అబ్బాయి చూసి మురిసిపోయాను" — అంటాడు. — ఈ "రాజాలాంటి..." అనే మాట ఏవో ఆషా మాషీగా కేశవ ఊహల్లోకి వచ్చింది కాదు. ప్రతీ విషయాన్నీ, ప్రతీ సంగతినీ సమాజంలో గొప్ప స్థానంలో వున్నవాటితోనే పోల్చుకుంటాం. అలాగే మనల్ని మనం జమీందారుల్తో, మహారాజుల్తో పోల్చుకుని గర్వ పడతాం సమాజంలో ఎవరు ఎక్కువ హోదాలో వున్నారో, ఎవరు అధి కృతలో వున్నారో వారికే గొప్ప విలువ ఇస్తాం. వారినే గౌరవిస్తాం. దానికి వ్యతిరేకమైన స్థితిలో వున్నవారిని చాలా హీనదృష్టితో, అవమాన కరమైన దృష్టితో చూస్తాం. సమాజంలో మన ఆర్థిక స్థితిని గానీ, సాంఘిక స్థితి గానీ గొప్పగా లేకపోతే (ధనవంతులం కాకపోతే, ఉన్నత కులస్తులం కాకపోతే) మనల్ని మనం కూడా "తక్కువ"గానే చూసుకుంటాం. (స్త్రీలు, పురుషులకన్నా తమని తక్కువగా చూసుకుంటారు. శూద్రులు, బ్రాహ్మలకన్నా తమని తక్కువగా చూసుకుంటారు. పేదలు, ధనవం తుల కన్నా తమని తక్కువగా చూసుకుంటారు.) ఈ స్వభావం వల్లనే —మనం ప్రతీ నిత్యం కొందర్ని గొప్పచేసి, కొందర్ని గాయపరిచే మాటలు మనకు తెలీకుండానే మాట్లాడుతూ వుంటాం. (గాయపర్చటం అంటే ఆ వ్యక్తిని తిట్టి బాధపెడతాం—అని అర్థంకాదు. అతన్ని హీనపరిచే భావం ఆ మాటల్లో వుంటుంది.)

భాను భర్త, చాకలికి బట్టలు వేస్తూ భానుని తిట్టిన సందర్భంలో కేశవ ఎలా అనుకుంటాడో చూడండి—"ఒక చాకలివాడి ఎదట సభ్య లోకంలోని వొక వ్యక్తి భార్యను హీనంగా, నీచంగా...తిట్టగలడంటే నేను చూసి వుండకపోతే ఎంతమాత్రం నమ్మను" అనుకుంటాడు.

ఈ — "చాకలివాడి ఎదుట..." అనే మాటల్లో వున్న భావం ఏమిటి ? — "చాకలివాడు తక్కువవాడు. అంత తక్కువవాడి ఎదట కూడా అలా ప్రవర్తించటం ఏమిటి?" అనే కదా?

ఇదే 'చాకలి'ని అవమానకరంగా చూసే దృష్టి. అతన్ని గురించి మన ఆలోచనల్లో చాలా తక్కువ భావం స్థిరపడిపోయి వుంటుంది. అదే మాటల్లో బయటపడుతుంది.

కేశవ మాటల అర్థంలో చాకలి తక్కువ వాడవడమే గాక, భాను భర్త "సభ్య లోకం మనిషి" అయ్యాడు!——ఎందుచేత? అతను ఆర్థికంగా, సాంఘికంగా, చాకలికన్నా పై స్థితిలో వున్నాడు గనక.

భాను కూడా కేశవ్‌తో—— "చాకలివాడి ఎదట తన్నులుకూడా తినమంటావా? అందుకే జవాబు చెప్పకుండా (భర్తకి) ఊరుకున్నాను" ——అంటుంది.

కేశవ మాటల్లోనూ, భాను మాటల్లోనూ అర్థం ఒకటే. చాకలి తక్కువ వాడనే అర్థమే. భాను అలా అనడానికి బదులు—— "పరాయి వ్యక్తి ఎదుట తన్నులు కూడా తినమంటావా?——అంటే చాకలిని హీన పరిచే పొరపాటు జరగకుండా వుండేది కదా? అయినా, ఇతరులు చూడకుండా, రహస్యంగా అయితే తన్నులు తినవచ్చునా? దాన్ని అవమానంగానే భావిస్తుంది కదా భాను? అందుచేత, "అతనితో తన్నులు కూడా తినమంటావా?" అంటే చాలు.

భానుకి స్పష్టంగా అర్థంకాని విషయాలు కొన్ని ఆమెకి చాలా అశాంతి కలిగించాయి.

భాను భర్తా, అతని స్నేహితులూ దేవుళ్ళని వెటకారాలు చేస్తే భాను భరించలేకపోతుంది.

దేవుణ్ణి నమ్మడం మూఢ భావం అనే అభిప్రాయం భాను భర్తకే కలిగినప్పుడు (అతను ఎంతో సనాతన భావాల పుట్ట), ఆ భావం భానుకి ఎందుకు కలగలేదు? నిజానికి భానుకి 'నాస్తిక వాదమే' నచ్చాలి. —ఎందుకు నచ్చలేదు? ఎందుకంటే ఆ నాస్తికవాదం చేసే వ్యక్తుల నిజాయితీమీద భానుకేమీ విశ్వాసం లేదు.

ఆమెకి తన భర్త మీదా - అతని స్నేహ బృందంమీదా ఏమీ గౌరవం లేదు. వాళ్ళందరి స్వభావాలూ ఎంత సంకుచితమో ఆమెకు బాగా

తెలుసు. 'స్నేహితులం' అని చెప్పుకుంటూనే వాళ్ళందరూ వొకరిమీద వొకరు గూఢ రి చర్యలు చేసుకుంటూ వుంటారు. అందరూ వ్యసనాల్లో మునిగి తేలుతూ వుంటారు. ఎవరి ప్రవర్తనా ఆమెకు వుత్తమంగా తోచదు.

వాళ్ళ అభిప్రాయాలన్నీ మిడిమిడి జ్ఞానంతో కాలక్షేపానికి, పేకాడుతూ మాట్లాడుకునే మాటలేగానీ, నిజమయిన జిజ్ఞాసతో, అసక్తితో చర్చించుకునే చర్చలు కావు.

"ఆ భారతం ఏమిటీ?—శాపాలూ, దీవెనలూ — చెవుల్లోంచి పిల్లలు పుట్టడాలూ....అంతా వట్టి బూటకం. కుంతీ, ద్రౌపదీ పతివ్రతలెలా అయ్యారు?" అని వాదోపవాదాలు చేస్తారు.

వెంటనే – "ఆ రోజుల్లో ఎంతమంది మొగుళ్ళుంటే అదది అంత పతివ్రత" అని వెటకారంతో కేరింతలు కొడతారు.

'పాత'ని విమర్శిస్తోన్నట్టు మాట్లాడుతోన్న ఈ "నవీనులు"–ఆ పాత సమాజం అవమానించిన దానికన్న అధికంగా స్త్రీలని అవమానిస్తున్నారు. వీరి నవీనత్వం ఎక్కడుంది?

'పాత'ని విమర్శించే వాళ్లెవరయినా అంతకన్నా వుత్తమ మయినదాన్ని చెప్పగలగాలి. లేకపోతే పాతని విమర్శించడాని కేం హక్కు వుంటుంది? చెప్పాలంటే, ఈ మాటలు 'పేకాటరాయుళ్ళ' కబుర్లే గానీ, "విమర్శ" అనదగ్గ మంచి లక్షణాలేమీ లేవు అందులో.

ఈ స్నేహితుల వాదాల్లో (వాగుళ్ళలో) ఇంకో వ్యక్తిని ప్రభావితం చెయ్యగలిగే 'సిద్ధాంత బలం' ఏమీ లేదు. కనీసం ఆలోచింప చెయ్యగలిగే తర్క జ్ఞానం కూడా లేదు.

అందుకే, వాళ్ళ మాటలు భానుకి పరమ 'అసహ్యం కలిగిస్తాయి' పాత అభిప్రాయాల్ని వదలవలసిన అవసరం ఆమె కేమీ కనపడదు.— "మన సంస్కృతిని చులకన చేసి నవ్వుకుంటే వీళ్ళకు వొరిగే దేమిటి?"

—అని బాధ పడుతుంది. అంటే, ఆ సంస్కృతిలో లోపాలూ, మంచి చెడ్డలూ విమర్శించడానికి ఆమె విముఖంగా వుందని అర్థంకాదు. - ఆ భర్తా, అతని స్నేహితులూ చేసే జుగుప్సాకరమైన వాదాలకు మాత్రమే ఆమె విముఖంగా వుంది. వాళ్ళమీద అసహ్యం వల్లనే ఆ 'సంస్కృతి' ఏదో గొప్పగా కనపడింది, ఆమెకి.

భాను నాస్తిక భావాల్ని వ్యతిరేకించిందీ అంటే – దైవభక్తి ఎందుచేత మూఢత్వమో, దాన్ని ఎందుచేత తిరస్కరించాలో - ఆమెకు స్పష్టంగా తెలీక వ్యతిరేకించిందేగానీ, 'హేతువాదం' వేపూ, 'అభివృద్ధి' వేపూ నడచే స్వభావం లేక కాదు. ఆమె స్వభావం ఎప్పుడూ అభివృద్ధి నిరోధకమైంది కాదు. సరైన పద్ధతిలో చెప్తే, ఆమెకి, మూర్ఖ భావాల్ని వదలడం కష్టంకాదు.

"మన సంస్కృతిని చులకన చేసుకోరాదు" అని ఆమె అన్నదంటే—ఆ సంస్కృతిలో ఏమీ లోపాలు లేవని ఆమె గాఢ విశ్వాసం అన్నమాట. అలాంటి విశ్వాసం ఆమె కెలా కలిగింది? ఆ "సంస్కృతి" గురించి స్పష్టంగా తెలిసేనా?—ఎంతమాత్రం కాదు. దేవుడిమీద నమ్మకం ఎలాంటిదో, ఈ 'సంస్కృతి'మీద నమ్మకం కూడా అలాంటిదే. "మన సంస్కృతి చాలా గొప్పది. వున్నతమైంది, పవిత్రమైంది" అని చిన్నతనంనించీ వినడం, చదవడం జరుగుతూ వుంటుంది. ఇక "సంస్కృతి" అనగానే ఏమీ తెలీకుండానే గొప్ప గౌరవాభిమానాలు ఏర్పడతాయి భాను విషయంకూడా అంతే. అందుకే ఆమె "సంస్కృతి"ని అంత గౌరవిస్తోంది. ఆ సంస్కృతిలో ఎన్ని లోపాలున్నాయో ఆమె గ్రహించగలిగినప్పుడు పూర్వంలాగే సంస్కృతి మీద అంత గౌరవం వుంచుకోదు. ఎన్ని లోపాలున్నాసరే మా సంస్కృతి పవిత్ర మనేంత మూర్ఖత్వానికి దిగదు.

• సరోజకు సంబంధించిన పరిస్థితులు కూడా భాను స్పష్టంగా అర్థం చేసుకోలేకపోయింది. "కొందరు స్త్రీలు పేంచ్చని దుర్వినియోగం చేస్తారు" అనే అభిప్రాయం చాలామందికి వుంటుంది. అలాంటి అభిప్రాయమే ఈ రచయిత్రికి కూడా వున్నదన్నమాట. (ఇది రాసే

కాలంలో). ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యటానికే సరోజ పాత్రని సృష్టించడం జరిగినట్టుంది సరోజ, స్వేచ్ఛని ఎలా దుర్వినియోగం చేస్తోందో చెప్పడం కోసం, కొంత అతిశయమయిన వర్ణన జరిగింది. (సరోజ కూర వండమంటే, ఆమె అత్తగారు పులుసు పెట్టింది. సరోజ, భర్తని పులుసు వేసుకోవద్దంది. కాని ఆ భర్త తల్లిమాటలు విని కొంచెం వేసుకున్నాడు. సరోజ కోపం వచ్చి పుట్టింటికి వెళ్ళిపోయింది. — ఇలాంటి విషయాలు అతిశయాలు కావా ? సరోజ 'దుర్మార్గంగా ప్రవర్తించే మనిషి' అన్న సంగతి చెప్పాలంటే, కొంత సహజమైన సంఘటన ఏదో చూపించాలి. తను చెప్పిన కూర అత్త వండలేదు కాబట్టి ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది—అని చెప్పడం చాలా అసహజంగా వుంది. సరోజలో కోపిష్టితనాన్ని చెప్పటానికి 'సరైన కారణం' తీసుకొంటే బాగుండేది) సరే. ఈ అతిశయాన్ని అలా వుంచి, అసలు విషయం ఏమిటని పరిశీలిస్తే— "సరోజ దుర్మార్గంగా ప్రవర్తించే కోడలు" అని తేలుతుంది.

దుర్మార్గం అంటే ఎవరి విషయంలో?

ముఖ్యంగా అత్తగారి విషయంలో.

నిన్న మొన్నటి వరకూ అత్తలు కోడళ్ళతో దుర్మార్గంగా ప్రవర్తించారు. (ఇంకా ప్రవర్తిస్తున్నారు)— తర్వాత కోడళ్ళు, అత్తలతో!

అత్త కోడల్నీ, కోడలు అత్తనో బాధ పెట్టడమే జరుగుతోంది గానీ (ఈ బాధ పెట్టడం అనేక రూపాల్లో, అనేక లక్షణాల్లో వుండవొచ్చును.) అత్తా, కోడలా ఇద్దరూ చాలా ప్రేమతో సామరస్యంగా జీవించే పరిస్థితి ఎందుకు లేదు?— ఇదేదో చిన్న ప్రశ్న కాదు. ఈ పరిస్థితిని కూడా సమాజ పరిస్థితులనించి విడదీసి చూడటానికి వీలులేదు.

అత్తా-కోడళ్ళ వైరం ఈనాటిది కాదు. ఇదికూడా మన సంస్కృతిలో భాగమే. ఈ అత్తాకోడళ్ళిద్దరికీ సంబంధించిన వ్యక్తి— ఆ కొడుకు. —ఈ ముగ్గురి మధ్యా అనేక రూపాలలో సంఘర్షణ జరుగుతూ వుంటుంది. తల్లి, తన కొడుకు ఇంకో వ్యక్తికి దగ్గిరయినందుకు అసూయ పడు

తుంది. 'ఆ కొడుకు తనని నిర్లక్ష్యం చేస్తాడేమో, మర్చిపోతాడేమో, అగౌరవ పరుస్తాడేమో, ఆ భార్యనే ముఖ్యంగా భావిస్తాడేమోనని— రక రకాలుగా (ఆమె స్వభావాన్నిబట్టీ, సంస్కారాన్నిబట్టీ) బాధపడుతూ వుంటుంది— అంటే, అసలు ఈ తల్లీ—కొడుకుల సంబంధంలోనే లోపం వుందన్న మాట! కొడుకు మీద ఈ తల్లికి ఏ విధమయిన నమ్మకమూ లేదన్న మాట! కొడుకుని ఎప్పుడూ తన అధీనంలో పెట్టుకోవాలనే తాపత్రయమేగానీ, అది ఎంత సంకుచితమో ఈ తల్లికి తెలిసే పరిస్థితి లేదు— "నా బిడ్డకి నాతో స్నేహం ఎంత వున్నతమో, భార్యతో స్నేహం కూడా అంత ఉన్నతమైనదే. వాళ్ళిద్దరూ నాకు సమానులే"—అని భావించే పరిస్థితి వుండదు.

అలాగే— భార్య గురించి పరిశీలించినా, ఆమె కూడా అలాగే అత్తగారి విషయంలో విముఖంగానే ప్రవర్తిస్తుంది. భార్య, తన భర్తకి తల్లి అయిన వ్యక్తిని ద్వేషించడం అంటే, ఆ భార్య—భర్తల సంబంధమే అసహ్యకరకంగావుందన్నమాట! సాధారణంగా భార్యాభర్తల సంబంధాలన్నీ కేవలం ఆర్థిక విలువల చేతనో, సాంఘిక ధర్మాల చేతనో కట్టుబడి మాత్రమే వుంటాయి. ఆ సంబంధాల్లో ఎటువంటి స్నేహాలూ, ప్రేమలూ వుండవు. ఒక స్త్రీ అత్తగార్ని ద్వేషిస్తోంది అంటే (అత్తగారిలో ఏమీ దుర్మార్గం లేకపోయినా)— ఆమెకి అత్తగారిమీదే కాదు,— తన భర్త మీద కూడా ఏమీ అనురాగం లేదన్నమాట. ఆ భార్యా భర్తల సంబంధమే స్నేహ పూరితమయింది అయితే, వాళరికి సంబంధించిన వ్యక్తుల్ని వాళరు తప్పకుండా ప్రేమించ గలుగుతారు— (అత్తా కోడళ్ళ వైరాలు, అత్త చెడ్డ తనం వల్లనో, కోడలి చెడ్డతనంవల్లనో మాత్రమే వస్తాయనుకోకూడదు.) వ్యక్తుల చెడ్డతనాలూ కొంత కారణమే. వాళ్ళని ఆ రకం 'సంబంధం'తో వుంచిన పరిస్థితులు కూడా కారణమే.

ఇక కొడుకు పరిస్థితి చూస్తే— అతనికి ఇటు తల్లి సంబంధం లోనూ, అటు భార్య సంబంధంలోనూ కూడా గొప్ప సుఖ శాంతు లేమీ వుండవు. ఆ సంబంధాలు రెండూ చాలా ఆత్మీయంగా తోచడం అనేది జరగదు. ఆ కుటుంబానికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితులనుబట్టి ఆ

వ్యక్తి ఎటో ఒకవేపు మొగ్గ గలుగుతాడు. (స్త్రీయే భర్త దగ్గిరికి రావడం గాకుండా, పురుషుడే అత్తవారింటికి కాపురానికి వెళ్ళే పరిస్థితి వుంటే, తన భర్తకీ, తన తండ్రికీ మధ్య స్త్రీయే ఇటువంటి స్థితిలో వుండేది.)

అత్తా కోడళ్ళు ఇద్దరూ ఆ కొడుకు మీదే ఆధారపడి వుంటారు. (ఆర్థికంగానూ, సాంఘికంగానూ) అందుకే వాళ్ళిద్దరూ ఎప్పుడూ అతని 'దృష్టి' కోసం (అటెన్షన్స్ కోసం) ఆశ పడతారు.

సమాజంలో ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిమీద ఆధారపడి బ్రతక వల సిన (ఎవరి వ్యక్తిత్వం వారికి లేని) పరిస్థితి వల్లనే— ఏ ఇద్దరి మధ్య సంబంధమూ నిజమైన అనురాగంతోగానీ, స్నేహంతోగానీ వుండదు. తల్లీ కొడుకుల మధ్య అయినా అంతే, భార్యా భర్తల మధ్య అయినా అంతే. సమాజ పరిస్థితులే కుటుంబ వ్యవస్థని నడుపుతాయి. కుటుంబ పరిస్థితులే వ్యక్తుల మధ్య సంబంధాలు రూపొందిస్తాయి.

అత్తా—కోడళ్ళ మధ్య వైరం సాగుతోందీ అంటే—అది వారి వ్యక్తి గత విషయం మాత్రమే కాదు. వారు జీవించే పరిస్థితులే ఆ వైరం కల్పి స్తాయి. సమాజ వ్యవస్థే ఆ వైరానికి బీజాలు వేస్తోంది

సరోజ దాంపత్యంకూడా సమాజంలో అన్ని దాంపత్యాల లాంటిదే. భర్త 'కొట్టనంత' మాత్రాన ఆమె దాంపత్యం, భాను దాంపత్యం కంటే వుత్తమమైంది అవదు.

సరోజకున్న డబ్బు వల్లనే ఆమె పరిస్థితి భాను పరిస్థితి కన్నా మెరుగ్గా, వేరుగా వుంది. కానీ అది ఆమెకూ, భర్తకూ ప్రేమ పుట్టించ లేదు. ఆమెకూ, అత్తగారికీ వైరం లేకుండా చెయ్యలేదు —ఆ విషయాలు మాత్రం సాధారణమయిన సాంఘిక పరిస్థితుల ఫలితంగా ఎప్పటిలాగే వుంటాయి.

"సరోజ అత్తగారితో పోట్లాడకుండా మంచిగా వుండవచ్చు గదా?" అనే ప్రశ్న వొస్తుంది. వుండవచ్చు; కానీ, ఆ పరిస్థితుల తేడా వల్ల,

మంచిగా ఎలా వుండ కలుగుతుంది?— ఆమెకి ఆర్థికంగా చాలా బలం వుంది ఆ డబ్బుకి (కట్నానికీ, సారెలకీ, లాంఛనాలకీ) అత్తగారి కుటుంబం విలువ ఇచ్చి లొంగుతుంది. సమాజంలో వొక వ్యక్తికి డబ్బు వల్ల ఎలాంటి ప్రత్యేకమైన హోదాలూ, అధికారాలూ, స్వభావాలూ ఏర్పడతాయో, సరోజకికూడా ఆ రకం స్వభావమే ఏర్పడింది. సరోజ ప్రవర్తన అంత కఠోరంగా వున్నప్పుడు ఆమె భర్త ఆమెని ఎందుకు ధిక్కరించలేదు? ఎందుకు తిరస్కరించలేదు?— ఎందుకంటే, పరువు ప్రతిష్ఠల భయం. (ఇదీ సాంఘిక మర్యాద) రెండోదీ, ఆమె ఆర్థిక బలం. ఈ రెండు పరిస్థితులూ అతన్ని లొంగదీసి వుంచుతున్నాయి. అతని భార్య అంత ఆర్థిక బలంతో లేకపోతే, అతని ప్రవర్తన అంత లొంగుబాటుగా వుండదు.

మనం "గొప్పవి" అనుకుంటూ పాటించే సంఘ ధర్మాలూ, మనం గౌరవించే ఆర్థిక హోదాలూ— ఏ ఇద్దరి వ్యక్తుల మధ్యా నిజమయిన స్నేహానురాగాలు ఏర్పడనివ్వవు.

మనం చాలా "పవిత్రం" అనుకునే భార్యాభర్తల సంబంధాలూ, తండ్రీ కొడుకుల సంబంధాలూ, అత్తా కోడళ్ళ సంబంధాలూ మనం అనుకునేంత పవిత్ర మయినవి కావు. ఎందుకంటే వొక సంబంధంలో వున్న వ్యక్తులిద్దరికీ వొకే న్యాయం వర్తించడం లేదు గనక.

'సమాజం' దృష్టిలో—

భార్యా-భర్తల్లో—భర్త ఎక్కువ - భార్య తక్కువ.

తండ్రీ-కొడుకుల్లో — తండ్రి ఎక్కువ-కొడుకు తక్కువ.

అత్తా-కోడళ్ళలో — అత్త ఎక్కువ-కోడలు తక్కువ.

(కుటుంబంలో వ్యక్తుల మధ్యనే కాదు. సమాజంలో వ్యక్తుల మధ్య కూడా ఈ ఎక్కువ తక్కువల్ని గమనించాలి.)

ఈ రకంగా ఇద్దరి వ్యక్తుల సంబంధం ఎక్కువ తక్కువలతో సాగుతూ వున్నప్పుడు, ఆ ఇద్దరి వ్యక్తుల మధ్యా సామరస్యానికి బదులు

శతృత్వం ఏర్పడమే చాలా సహజం. శతృత్వం ఏర్పడడానికి అవకాశ మిచ్చే ఏ సంబంధమూ పవిత్రమైంది కాదు.

అందుచేత, 'మానవ సంబంధాల'లో సమానత్వం ఏర్పడినప్పుడు మాత్రమే ఆ సంబంధాలు పవిత్రమైనవీ, సహజమైనవీ అవుతాయి.

ఇక - "సరోజ, స్వేచ్ఛని దుర్వినియోగం చేస్తోంది" — —అనే విషయం చూస్తే — సరోజ పరిస్థితి "స్వేచ్ఛ"గా అర్థం చేసుకోవడమే చాల తప్పు.

సరోజ అత్తగారితో దుర్మార్గంగా ప్రవర్తించడం అనేది - అత్తా కోడళ్ళ పై రాలకు సంబంధించిన సమస్యేగానీ, స్వేచ్ఛని దుర్వినియోగం చెయ్యడం కాదు.

భాను భర్త భానుతో చాలా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడు కదా! —"అతను స్వేచ్ఛని దుర్వినియోగం చేస్తున్నాడు" — అంటామా? అతనికి భార్య మీద పెత్తనం చేసే అధికారం ఎందుచేత వొచ్చిందో చూస్తాంగానీ, స్వేచ్ఛని దుర్వినియోగం చేస్తున్నాడు అనం.

అలాగే, సరోజకి అత్తతోనూ, భర్తతోనూ దుర్మార్గంగా ప్రవర్తించే పరిస్థితి ఎలా కలిగిందో చూడాలి. ఆ పరిస్థితిని "స్వేచ్ఛ"గా అర్థం చేసుకోవడం చాలా పొరపాటే.

భాను ఏ సమాజంలో వుందో, సరోజ కూడా ఆ సమాజంలోనే వుంది.

భాను లాగే సరోజ కూడా భర్త దగ్గిరకే కాపరానికి వొచ్చింది. భాను లాగే సరోజ కూడా సాంఘికంగా భర్త అధీనంలోనే వుంది.

భర్తచేత బాధలూ, అవమానాలూ పడని స్త్రీ లందరూ స్వేచ్ఛగా వున్నట్టు అర్థం కాదు.

స్త్రీ పురుషుల్లో — పురుష లందరూ సాంఘికంగా వొకే స్థితిలో వున్నట్టు, స్త్రీ లందరూ సాంఘికంగా ఒకే స్థితిలో వున్నారు.

సాంఘికంగా భానుకి లేని ప్రత్యేక స్వేచ్ఛ ఏమీ సరోజకు లేదు. స్త్రీలకువున్న పరిధిలోనే భాను పరిస్థితికీ, సరోజ పరిస్థితికీ కొంత తేడా

(2)

వుంది. (ఇదంతా, సరోజ దుర్మార్గంగా ప్రవర్తించడం లేదని చెప్పడానికి కాదు. దాన్ని "స్వేచ్ఛగా" అర్థం చేసుకోకూడదని చెప్పడానికే).

• ఒకసారి భాను భర్త భాను విషయంలో చాలా దుర్మార్గంగా ప్రవర్తించడం చూసి, కేశవ భరించలేక భాను భర్తని కొట్టాలనుకుంటాడు. ఆ సంగతి తర్వాత భానుతో చెపుతాడు.

దానికి భాను చాలావ్యతిరేకిస్తుంది.-"పోనీలే! ఎవరి పాపం వాళ్ళదే. భార్య అయినా, భర్త అయినా, తల్లి అయినా, బిడ్డఅయినా ఎవరు చేసింది వాళ్ళే అనుభవిస్తారు. ఆ శిక్ష భగవంతుడే విధించాలిగానీ మనం కాదు...."- అంటుంది.

ఇదే కర్మ సిద్ధాంతం.

తన భర్త ప్రవర్తన 'దుర్మార్గంగా' వుందనే భాను అభిప్రాయ పడుతోంది. ఆ దుర్మార్గానికి తప్పకుండా శిక్ష పడాలని కూడా ఆమె కోరుతోంది. భగవంతుడు తన భర్తని శిక్షించాలనీ, శిక్షిస్తాడనీ కూడా ఆమె నమ్మకం.— అలాంటి నమ్మకం చేతనే భర్త ఎంత దుర్మార్గం చేసినా, బాధ పడి వూరుకుంటుందేగానీ, తనకు చేతనయిన విధంగా ఆ దుర్మార్గాన్ని ఎదిరించాలని అనుకోదు. (భగవంతుడు తప్పకుండా అతన్ని శిక్షిస్తాడు. కాబట్టి, ఇక తను శిక్షించవలసిన అవసరం ఏముంది?)

భానుకి ఈ రకం నమ్మకం వుండడంవల్ల లాభం జరిగేది భాను భర్తకేగాని భానుకి కాదు. — "ఎవరి కర్మ వాళ్ళే అనుభవిస్తారు" — అనే ఈ కర్మ సిద్ధాంతం, బాధలు పడేవాళ్ళని తిరగబడనివ్వకుండా చేస్తుంది. ఎప్పుడూ వొక పక్షానికి ద్రోహం చేసి రెండో పక్షానికి మేలు చేస్తుంది.

భానుకి ఈ కర్మ సిద్ధాంతం మీద నమ్మకం లేకపోతే, ఆ భర్తచేసే అవమానాలకు ఛీత్కరించుకుని, అతన్ని ధిక్కరించే ప్రయత్నాలు చేసేది గదా? (తనకు వీలయినంతవరకూ.)

"బావ నిన్ను తిడుతోంటే నాకు చాలా కోపం వచ్చేసింది. లోపలికి వచ్చి కొట్టేద్దామనుకున్నాను" — అని కేశవ అన్నప్పుడు, భాను

'కర్మ సిద్ధాంతం' వల్లించకూడదు. అలా అని "అవును. అతన్ని పట్టుకు తన్నితే నేను సంతోషించేదాన్ని" అని కూడా అనకూడదు. అదీ ఇంకో రకంగా పొరపాటే.

ఎవరి సమస్యల్ని — వాళ్ళ చైతన్యంతోటే పరిష్కరించుకోవాలి. భాను సమస్యల్ని భాను అన్న పరిష్కరించి పెట్టకూడదు.

భానే తనకు చేతనయిన విధంగా భర్త చేసే అవమానాల్ని వ్యతిరేకించాలి. అలా వ్యతిరేకించే చైతన్యం ఆమెకు కలిగించడానికి మాత్రమే ఆమె అన్న గానీ, ఇతరులుగానీ ఆమెకు తోడ్పడాలి. — ఆమె బానిసత్వాన్ని ఆమే వొదిలించుకోవాలి. తను ఇంకో వ్యక్తి అధీనంలో లొంగి వుండకూడదనే స్వతంత్రేచ్ఛ ఆమెకే కలగాలి. అలా కలగనంత కాలమూ ఆమె ఆ స్థితిలోనే వుంటుంది. — ఆమె కోసం ఎవ్వరూ స్వేచ్ఛ తెచ్చి ఇవ్వలేరు. ఆమెని బాధించే వాళ్ళని, ఇంకెవరో వచ్చి శిక్షించడం కాదు మార్గం. ఆమే అతన్ని "శిక్షించే" విధంగా ప్రవర్తించాలి. తనకు ఏ సందర్భంలో కావలసినా ఇతరుల సహాయం తీసుకోవచ్చు.

అందుచేత భాను అన్నతో - "అతన్ని నువ్వు కొట్టడం నా సమస్యకు పరిష్కారం కాదు, అతను నన్ను ఎన్నో అవమానాలు చెయ్యడం నాకు సంతోషంగా లేకపోయినా, నేనేమీ చెయ్యలేక పోతున్నాను. ఎప్పటి కయినా నేనే ఏదో చెయ్యాలి. చెయ్యలేకపోతే కొక్కురు మనకుండా భరించాలి" అనాలి. (ఈ మాటలు అనాలంటే, ఆమెకు 'సరైన' జ్ఞానం కావాలి. కర్మ సిద్ధాంతం మీద నమ్మకం కూడా పోవాలి. అలా జరగలేదు కాబట్టే భాను తనని తను రక్షించుకునే బాధ్యత దేవుడికి అప్పజెప్పింది.)

* భాను ఆత్మహత్య చేసుకునే ముందు కొడుక్కి రాసిన వుత్తరంలో వొక దుర్మార్గమయిన విషయం రాసింది - "తల్లిగా నీకు నేను వొక ఆజ్ఞ ఇస్తున్నాను. నీకి జన్మ ఇచ్చిన నీ కన్నతండ్రిని ఎన్నడూ

ద్వేషించకు" అని రాసి భాను ఆ చివరి క్షణాలలో చాలా అజ్ఞానంగా, సిగ్గుచేటుగా ప్రవర్తించింది.

అసలు తల్లి కొడుక్కి "అజ్ఞలివ్వడం" అనేదే చాలా తప్పు. తల్లి దండ్రులు బిడ్డల్ని ఆజ్ఞాపించడం, బిడ్డలు తమ ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా, ఆ అజ్ఞలు పాటించవలసి రావడం - అలా పాటించలేక క్షోభ పడడం - అదంతా తల్లిదండ్రుల ఆధిక్యతనీ, పెత్తనానీ -బిడ్డల తక్కువ దనాన్నీ, తల్లి దండ్రులకు అణిగి మణిగి వుండడాన్నీ - రుజువు చేస్తుంది.

భాను తన కొడుకు స్వేచ్ఛని అరికట్టి, కొడుకుని తన అజ్ఞలో బంధించే మూర్ఖపు తల్లి అవుతుందా?

అలా అవడం భానుకి ఎంతమాత్రం ఇష్టం వుండదు. తన మాట లకు అలాంటి అర్థం వొస్తుందని భానుకి తెలిస్తే, చాలా సిగ్గుపడి పోతుంది. అందుచేత ఆమె కొడుకుతో -"నీకు నేను అజ్ఞ ఇస్తున్నాను" - అనకూడదు తను ఏమయినా చెప్పదలిస్తే - "ఇది నా అభిప్రాయం. నువ్వు పాటిస్తే సంతోషిస్తాను" అనాలి.

ఇంతకీ భాను చెప్పిన విషయం ఏమిటి? - "నీ కీ జన్మ ఇచ్చిన నీ కన్నతండ్రిని ఎన్నడూ ద్వేషించకు" - అనేది.

జన్మ ఇవ్వడం అనేది అంత మహోన్నతమయిన విషయమా ? తల్లిదండ్రులు బిడ్డలకు జన్మలిస్తారు కాబట్టి, ఆ బిడ్డలు ఎప్పుడూ తల్లి దండ్రులకు రుణపడి కృతజ్ఞులుగా వుండాలా? — భాను ఎందుకింత అజ్ఞానంగా ఆలోచించింది? ఆమెకు తెలీకుండానే, ఆమె, కొడుక్కి పానిన సాంప్రదాయాలు బోధించింది. కానీ, అదే సాంప్రదాయం తను పాటించ లేదు.

"కొడుకు తండ్రిని ద్వేషించకూడదు" అనే సాంప్రదాయం మీద ఆమెకు అంత గౌరవం వుంటే — "భార్య, భర్తని ద్వేషించ కూడదు" అనే సాంప్రదాయాన్ని కూడా ఆమె గౌరవించాలి. — తన భర్తని తను ఎన్నడూ ద్వేషించకూడదు. మరి అతన్ని అమితంగా

ద్వేషించి, అతనితో జీవించడం ఇష్టంలేక ఆత్మహత్య కెందుకు సిద్ధపడింది?

రేపు, భాను భర్త, కొడుకు విషయంలో కూడా తను తండ్రిననే ఆధిక్యతతో ప్రవర్తిస్తూ వుంటే (ఆ లక్షణం సమాజంలో వున్నదే.) ఆ కొడుకు ఏం చెయ్యాలి?—తండ్రిని ద్వేషించకుండా వూరుకోవాలా?—అలా వూరుకోమని చెప్పడం ఎంత నీచం? తండ్రుల పెత్తనాన్నీ, భర్తల పెత్తనాన్నీ అంగీకరించడమే కదా?

సమాజంలో "దుర్మార్గం" అనేదాన్ని ప్రతీ క్షణం ఎదిరించ వలసిందే. ఆ దుర్మార్గం తల్లిలో వున్నా సరే, తండ్రిలో వున్నా సరే.

ఒక భార్యకి జీవితంమీద విరక్తి కలిగే విధంగా ప్రవర్తించిన భర్తని ఎవరయినా ఎందుకు ద్వేషించకుండా వుండాలి?

"నువ్వు నీ తండ్రిని ద్వేషించకు" అని భాను కొడుక్కి చెప్పడం అంటే—"నువ్వు దుర్మార్గాన్ని ద్వేషించకు" అని చెప్పడమే.

అందుకే భాను కొడుక్కి ఇచ్చిన ఆజ్ఞ, చాలా దుర్మార్గంగా, దుర్మార్గానికే సాయపడే విధంగా-ప్రగతి నిరోధకంగా, సిగ్గుచేటుగా, వుందవడం.

కానీ ఈ విషయం భానుకి స్పష్టంగా తెలీకే ఆ మాటలు రాసింది. ఆమె అభిప్రాయం తన కొడుకుని అజ్ఞల్లో బంధించాలని కాదు. అతను దుర్మార్గాన్ని సమర్థించాలనీ కాదు ఒక అజ్ఞానంలో వుండి అలా రాసింది.

ఈ రచనలో ఆఖరి వాక్యాలు—

"భాను నిజంగా పేకమేడలే కట్టిందా?........

భానుకి పరాజయమే ఎందుకు ఎదురవుతూ వచ్చింది? అన్ని విషయాల లోనూ శోక దేవతే ఎందుకు స్వాగతం పలికింది? భాను కట్టినవన్నీ....అనుభవానికి వీలుకాని పేకమేడలే ఎందుకయ్యాయి? అది ఆమె దౌర్భాగ్యమనీ, కర్మ ఫలమనీ ఎందుకు సమర్థించవలసి వొచ్చింది?

కారణం తోస్తున్నది.

భాను భారతదేశంలో వొక స్త్రీగా పుట్టింది........"

ఇది నిజమే. ఇందులో శంకించ వలసిందేమీ లేదు.

కానీ, ఇక్కడ 'విషయం' ఇంకా స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

భాను భారతదేశంలో కాకుండా ఇంకో దేశంలో పుడితే ఆమె కోరిన జీవితం అనుభవించ గలిగేదా?

ఇతర దేశాల్లో పుట్టిన స్త్రీలు భాను అనుభవించిన పరిస్థితులకన్నా భిన్నమైన, వుత్తమమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారా?

భారతదేశ సమాజంలో ఎటువంటి పరిస్థితులు వున్నాయో, అటువంటి పరిస్థితులే వున్నప్పుడు ఏ దేశంలో పుట్టినా వొకటే. (చాలా దేశాలలో ఇటువంటి పరిస్థితులే వున్నాయి.) ఇటువంటి పరిస్థితులు గల ఏ దేశంలో పుట్టినా భాను ఇటువంటి జీవితమే గడిపేది.

అందుచేత—భాను జీవితం అలా ఎందుకయిందని ఆలోచించి నప్పుడు—

"కారణం తోస్తున్నది.

భాను భారతదేశంలో స్త్రీగా పుట్టింది"—

అనడానికి బదులు

"కారణం తోస్తున్నది.

భాను, వర్గ భేదాలుగల దోపిడీ సమాజంలో స్త్రీగా పుట్టింది."—
పురుషాధిక్యత గల పక్షపాత సమాజంలో స్త్రీగా పుట్టింది "—

అనడం చాలా న్యాయం! నిజం!

ఇది 6వ ముద్రణకు
రాసిన ముందు మాట.

రంగనాయకమ్మ.
12–11–1975

పేకమేడలు

భానుపగలబడి నవ్వుతోంది. ఉలిక్కిపడి లేచాను. ఏదో భయం ముంచుకొచ్చింది. భాను ఏడుస్తూందేమో! ఈ అర్ధరాత్రి! ఒక్కతీ! చాలా సేపు చీకటిలోనే లేచికూర్చున్నాను. ఒకసారి వెళ్ళివద్దామా అనిపించింది. కానీ నేను అంత అర్ధరాత్రి వెళ్తే అతను ఏమైనా అనుకోవచ్చు. అనవచ్చుకూడా. ఆలోచనలోనే మగతగా నిద్రపట్టింది కొంతసేపు. ఎవరో కంగారు కంగారుగా లేపుతున్నారు. త్రుళ్ళిపడ్డాను. అతను, భాను భర్త రాజశేఖరం! మనిషంతా కంపించిపోతున్నాడు. "భాను....లేదు ఈ ఉత్తరాలు...." అంటున్నాడు తడబడుతూ. నేను అదిరిపోయాను. శరీరమంతా గడ్డ కట్టిపోయింది. ఏదో పీడకల జరుగుతున్నట్టు తోచింది. గొంతు పెగుల్చుకున్నాను. కంగారుగా అడిగాను-"భాను ఇంట్లోలేదూ? ఏమైంది?"

అతను అపరాధిలా తల దించుకున్నాడు. జంకుతున్నాడు. "ఏమో! నాకూ తెలీదు. బాబు ఏడుస్తోంటే మెలుకువ వచ్చింది. వాళ్ళమ్మ వస్తుందిలే-అని కాస్సేపు పడుకున్నాను. వాడు వంటగదిముందు కెళ్ళి ఏడుస్తోంటే లేచి వెళ్ళాను. ఎంత పిలిచినా జవాబు లేదు. నా కేదో అనుమానం వచ్చి గబగబా గదిలోకి వచ్చి చూశాను. టేబుల్ మీద ఉత్తరాలు వున్నాయి. నన్ను అడ్రస్ చేసింది పైన ఉంది. తీసిచూస్తే-'మీ జీవితంలోంచి శాశ్వతంగా తప్పుకుంటున్నాననో ఏమిటో రాసింది. నేను పూర్తిగా చదవలేదు. బాబుని పక్కింటి వాళ్ళకి అప్పజెప్పి ఇలా వచ్చేశాను........"ఆగిపోయాడు.

అంతా అర్థమైంది రాత్రి ఏదో గొడవ జరిగింది భాను అన్ని బంధాలూ తెంపుకొని, కన్న ప్రేమని కూడా చంపుకుని, తెగించింది. బలవంతంగా చచ్చిపోవటానికి వెళ్ళిపోయింది. "భానూ?" అంటూ వెర్రిగా

అరిచాను. దుఃఖం ముంచుకొచ్చింది. భరించలేక గోడకు తల బాదుకు న్నాను. "అయ్యో! భానూ....!"

చటుక్కున కర్తవ్యం గుర్తుకొచ్చింది. స్టాండుమీది చొక్కా తగిలించుకున్నాను. భాను రాసిన ఉత్తరాలు చదివే సమయంకాదు. జేబులో తోసేశాను. పక్కగదికి వెళ్ళి స్నేహితుల్ని ఇద్దర్ని లేపి క్లుప్తంగా సంగతి చెప్పాను. క్షణాలలో బీచ్ వైపూ, రైల్వేలైను వైపూ సైకిళ్ళమీద బయ ల్దేరి పోయాం. మూడుగంటలరాత్రి. కన్ను పొడుచుకున్నా కానరావటం లేదు. చీకటి కాటుకలా చిక్కపడింది బీచ్ అంతా గాలించి వేశాను. తడి ఇసుకలో దిగబడిపోయే కాళ్ళను ఈడ్చుకుంటూ, పరుగుగాని పరుగు పెడుతూ, నీళ్ళవారకు టార్చిలైటు వేస్తూ విరిగిపడే కెరటాలలోనికి చూపు పోనిస్తూ "భానూ! భానూ! చెల్లీ!....భానూ!" అని శక్తికొద్దీ అరుస్తూ మూడుగంటలసేపు తిరుగుతూనే ఉండిపోయాను. తెల్లవారింది. ఆశాజ్యోతి ఆరిపోయింది. భాను మాయమైంది అనంతసాగర గర్భంలో నిత్యనూతన ప్రవాహంలో కలిసిపోయింది. శాశ్వతంగా వెళ్ళిపోయింది. "చెల్లీ!" కూలబడిపోయాను. పెద్దపెట్టున ఏడ్చాను...."భాను వెళ్ళి పోయింది. ఇక లేదు. లేదు."...

మరుక్షణంలోనే ఆ దుఃఖం-గుండెల్ని పిండే ఆవేదన-భరించలేని ఆ ఆందోళన-అన్నీ అన్నీ మారిపోయాయి. అతని మీద కసి! క్రోధం! అసహ్యం! ప్రతీకారం! పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పళ్ళు నలుగుతున్నాయి. శ్వాస శగ అయింది. బయల్దేరాను.

వాళ్ళు ముగ్గురూ ఎదురుపడ్డారు. రైలుకట్టంతా వెదికి వచ్చారు. అతను నన్ను చూస్తూనే అన్నాడు-"రాత్రి రైల్వే లైనులో ప్రమాదం ఏమీ జరుగలేదు స్టేషన్‌లో నేను కనుక్కున్నాను." కొంచెం తల దించు కున్నాడు.

"గొప్పపని చేశావు. ఏ ప్రమాదం జరిగినా నీ దగ్గరే జరగాలి. నిజం చెప్పు, రాత్రేం గొడవ జరిగింది?"

అతను తెల్లబోయాడు. చులకనగా మాట్లాడుతున్నానని కాబోలు. మళ్ళీ అడగకుండానే అన్నాడు, "రాత్రి ఏం జరగలేదే?"

"ఏమీ జరగలేదూ? ఏమీ?"

"ఏమీ లేదండీ!"

"అలాగా? ఏమీ జరగకుండా ఉత్త పుణ్యానికే ప్రాణంకన్న మిన్నగా ప్రేమించే పసిబిడ్డని—కన్నకొడుకుని—విడిచి వెళ్ళిపోయిందా? దొంగ రాస్కెల్! నీ పాపం పండింది. నా చెల్లిని నీ ఇష్టం వచ్చినట్టు ఏడిపించి, ఏడిపించి చివరికి ప్రాణాలు తీశావ్! మనిషిని నిలువునా హత్య చేసే నిన్ను....నిన్ను...." ఫెడీ ఫెడీమని లెంపలు పగలగొట్టాను. తన్నాను. పొడిచాను. చంపినంత పనిచేశాను. స్నేహితులు అడ్డబోతే పరుగెత్తాను. ఆ స్థితి వర్ణనాతీతం! అయోమయం! భాను చచ్చిపోయింది. కొడుకును విడిచి చచ్చిపోయింది. వాడి బాధ్యత నాది! నాది!

* * *

బాబు ఒడిలో నిద్రపోతున్నాడు. ఆ పసితనం చూస్తున్న కొద్దీ దుఃఖం పొర్లుకొస్తూంది. కన్నీళ్ళు జారి బాబు బుగ్గలమీద పడుతున్నాయి. తల దించుకుని తడి తుడుస్తున్నాను. రైలు శరవేగంతో పరిగెడుతూంది. రైలుకు వ్యతిరేకంగా నా మనస్సు వెనక్కి........

* * *

స్కూలు ఫైనలు ఫలితాలు వచ్చాయి. సంతోషం ముంచుకొచ్చింది. క్షణాలమీద వెళ్ళి నా సంతోషాన్ని పంచి పెట్టాలనీ, భాను సంతోషాన్ని పంచుకోవాలనీ అనిపించింది. అయినా నాన్న పురమాయింపులతో రెండు రోజులు ఊరు కదలటానికి వీల్లేకపోయింది.

(3)

రైలుదిగి బాబాయిగారి ఇల్లు చేరేసరికి సాయంకాలమైంది. వీధి గుమ్మంలో అడుగు పెడుతూనే పిన్నీ, బాబాయీ, అక్కయ్యలూ అంతా ఎదురుపడి పలకరించారు, మే మిద్దరం పాసైనందుకు సంతోషం వెలిబుచ్చారు. మా ఇంటి క్షేమసమాచారాలు కనుక్కున్నారు. మా ఊరి విశేషాలు తెలుసుకున్నారు. ఉభయ కుశలోపరి. అంతా ఏక సందడి! "కేశవ్ అన్నాయ్ వచ్చాడు." "కేశవ్ మామయ్య వచ్చాడు" అంటూ ఇంట్లో పిల్లలంతా అన్ని వరసలవాళ్ళూ కిలకిల్లాడుతూ ముట్టడించారు. అందరికీ మిఠాయి పంచి పెట్టాను. బూరలూ, ఈలలూ, తీసి ఇచ్చాను. నా చేతుల్లోంచి లాక్కొంటూనే పిల్లలంతా మూక ఉమ్మడిగా చెవులు చిల్లి పోయేటట్టు బూరలు వూదుతూ ఈలలు వేస్తూ సంతగోల చేసేస్తూంటే భాను విసుక్కుంటూ లేచి వెళ్ళిపోయింది. మొదటి సంవత్సరమే పరీక్ష పాసైనందుకు యెంతో సంతోషంగా వుంటుందనీ, నన్ను చూడగానే నవ్వుతూ పలకరించి గలగలా మాట్లాడుతుందనీ—అదేం లేదు. ఎందుకో ఉదాసీనంగా, విచారంగా ఉన్నట్టు కన్పించింది. పిల్లల్ని పోగేసుకొని పిల్లలకన్న మిన్నగా అల్లరిచేసే భాను అంత ముభావంగా ఉండటం ఎన్నడూ చూసిన గుర్తులేదు.

"ఏం భానూ! అలా ఉన్నావ్?" అని నవ్వుతూ పలుకరిస్తే, "ఏం లేదు" అనేసింది పొడిగా. అంతలోనే పిల్ల వెధవల గోలకు చిరాకు పడి వెళ్ళిపోయింది. నాకేం అర్థంకాలేదు. పిన్ని వంటింటికేసి వెళ్తూంటే వెనకే నడుస్తూ, "ఎందుకు పిన్నీ, భాను అదోలా ఉంది?" అన్నాను.

పిన్ని వంటగదిలోకి నడిచి పీట వాల్చింది కూర్చోమని. తను బియ్యం చేట దగ్గరికి తీసుకొని కూర్చుంది. "పరిస్థితులు అర్థంచేసుకోలేక పోతే ఎన్ని చదువులు చదివితే ఏం లాభంరా? కాలేజీ చదువులు చదువు తుందంటా, కూడదన్నామని పొద్దుటినుంచీ పంతంపట్టి అలా ఆకలి కడుపు మాడ్చుకొంటూ కూర్చుంది. చూడు కేశవ్!...." పిన్ని ఏదో

చెప్పబోతూంటే ఆశ్చర్యంకొద్దీ "అయితే భాను కాలేజీలో చేరదూ?" అన్నాను.

"బావుందిరా నువ్వు చెప్పేది! చీమల పుట్టరా గంపంత కుటుంబం, ఇంటినిండా ఆడమూక. పెళ్ళిళ్ళు, పబ్బాలూ, పురుళ్ళు, పుణ్యాలూ—పుట్టే వాళ్ళు పుడుతూంటే, ఎదిగేవాళ్ళు ఎదుగుతూంటే, ఇల్లంతా ఖర్చులమయం అయిపోతూంటే ఎంతకని భరించటం? వందలూ వేలూ వచ్చిపడు తున్నాయా? ఉన్న ఊళ్ళో స్కూలు వుంది కాబట్టి ఇంతవరకూ చదువు కొంది. బాగానేవుంది ఆడపిల్లల్ని పొరుగూళ్ళు పంపి చదివించటం అంటే మనకు శక్తివుందీ? దానికి మాత్రం ఇవన్నీ తెలీవనా చెప్పను?—పిన్ని కాసేపు ఊరుకుంది· నేను అయోమయంగా కళ్ళు పెట్టుకు చూస్తూ కూర్చున్నాను.

"దానికి సరస్వతీ కటాక్షం వుంది. నిజమే, చదివిస్తే వృద్ధిలోకి వస్తుంది. కానీ మనకు తాహతేదీ నాయనా? దాని కోరికలన్నీ తీరే రాత వుంటే నా కడుపున ఎందుకు పుడుతుంది?" పిన్ని గొంతు పూడిపోయింది. కొంగుతో కళ్ళు ఒత్తుకొంటూంటే నా మనసంతా వికలమైపోయింది· పేదరికమంటే ఏమిటో తొలిసారి అర్థమైంది.

నిజమే—బాబాయికి ఆస్తి తక్కువ. సంతతి ఎక్కువ. రాబడి తక్కువ! ఖర్చులెక్కువ! ఒక కూతుర్ని కాలేజీ చదువులు చదివించటం బాబాయికి సాధ్యమయే పనికాదు· పిన్నికి కూతురుమీద ప్రేమ ఉండీ, కూతురి తెలివితేటల మీద విశ్వాసం ఉండీ చెయ్యగలిగిందేమీ లేదు. కాని భాను కోరికని ఇంత తేలిగ్గా తోసివేస్తే భాను ఏమౌతుంది? ఎలా భరి స్తుంది?

భాను....భానుమతి....నాకు పెదనాయనమ్మ మనవరాలు. కిందటి సంవత్సరం వరకూ మాకు బంధువులమనే పరిచయం తప్ప మరేమీలేదు. నేను మొదటి సంవత్సరం స్కూలు ఫైనలు తప్పినప్పుడు అత్తయ్యగారి

టీళ్లో చదువు మానేశాను. నాన్న ఇక్కడ హైస్కూల్లో చేర్చి బాబాయి గారి ఇంట్లో ఉంచాడు భాను పిప్తుఫారం పాసై స్కూలుఫైనలుకి వచ్చింది. ఇద్దరం ఒకే క్లాసు కావటంతో చాలా సంతోషం కలిగింది. ఇంట్లో అందరికన్నా భాను నాకు ఎక్కువ చేరువైంది నేను వచ్చిన మొట్టమొదటి రోజు బిడియంగా వీధిగదిలో కూర్చున్నాను. భానువచ్చి చాలా చనువుగా పలకరించింది. "అన్నయ్యా! అమ్మ భోజనానికి రమ్మంటోంది" అంది. నా శరీరం పులకరించింది. హృదయానికేదో పారవశ్యం కలిగించింది. ఆ 'అన్నయ్యా' అన్న పిలుపు! నా స్వంత చెల్లికూడా అలా ఎన్నడూ పిలిచి ఎరుగదు. ఎందుకో దానికి నన్ను అమ్మ పిలిచినట్టు 'కేశీ!' అని పేరుపెట్టి పిలవటమే అలవాటైపోయింది. చిన్నతనంలో అది తప్పని ఎవరూ చెప్పలేదు. నేను పెద్దవాడి నయ్యాక ఎంత చెప్పినా ఫలితం కన్పించలేదు. "నా ఇష్టం వచ్చినట్లు పిలుస్తా, నీకేం? పలక్కపోతే మాను" అని మొరాయిస్తుంది.

ఈనాడు భాను 'అన్నయ్యా!' అని పిలిచింది. చక్కటి చెల్లి! భాను ముఖంలోకి చూస్తూ ఉండిపోయేను. భాను నవ్వుతూ "ఆకలి వెయ్యటం లేదేమిటి?' అంది. నేను మౌనంగా లేచాను. ఆనాడే భాను నా మనస్సులో సుస్థిరమైన, విశాలమైనచోటు ఆక్రమించుకుంది. అప్పటి నుంచీ నేను ప్రాణ సమానంగా ప్రేమిస్తూ వచ్చిన చెల్లి ఒకే ఒక భాను! భాను నా కన్న రెండు సంవత్సరాలు చిన్నది తెల్లగా, సన్నగా, అందంగా ఉంటుంది. రూపానికి మించిన తెలివితేటలు గలది. నేను రెండో సంవత్సరం చదువుతూ కూడా చాలా విషయాలూ, పాఠాలూ, లెక్కలూ భాను దగ్గర నేర్చుకొనేవాడిని భాను నాకు ఒక విషయం బోధపరుస్తూంటే నాకే గర్వం కలిగేది. భానుకి సైన్సులో, లెక్కల్లో ఎప్పుడూ ఫస్టు మార్కులే వస్తూండేవి. ఇద్దరం కలిసి స్కూలుకి కలిసి వెళ్ళేవాళ్ళం. కలిసి సినిమాలు చూసేవాళ్ళం కలిసి నవలను చదివేవాళ్ళం. స్నేహితుల ఇళ్ళకు తిరిగే

వాళ్ళం. ఏది చేసినా ఇద్దరం చేయాలి. ఎక్కడ వున్నా ఇద్దరం ఉండాలి. ఇద్దరం తరచూ సినిమాలు చూసీ, కథలు చదివి తర్కించుకునే వాళ్ళం. భాను మనస్తత్వాన్ని చురకత్తితో పోల్చితే సరిపోతుందేమో అనిపిస్తుంది. తల్లిఅయినా ఒక్కమాట ఎక్కువ అంటే సహించలేని అభిమానం! మాటకు మాట జవాబు చెప్పే పౌరుషం! "అమ్మ ఏదైనా అంటే మాత్రం కుండ బద్దలు కొట్టినట్లు జవాబుచెప్తావా?" అంటే, "ఏం? నన్ను అనవసరంగా అంటే నేను బాధపడలేదూ?" అంటుంది. మనిషికి వ్యక్తిత్వం కాపాడు కోవటంకన్న ఎక్కువ ఏమీలేదట. అదీ భాను వాదన!

"నువ్వు ఆవేశంగా మాట్లాడతావు భానూ! వ్యక్తిత్వాలు దెబ్బతిన కుండా కాపాడుకోవటానికి అందరికీ, ఎల్లప్పుడూ పరిస్థితులు కలిసివస్తా యంటావా?" అంటే,

"ఎన్నన్నా చెప్పు అన్నయ్యా! నీచంగా, అభిమాన రహితంగా మనిషి బతక్కపోతేనేం?" అనేది.

అవును, తనకు ఏవిలువా లేనిస్థితిలో మనిషి బతక్కపోతేనేం? కాని అటువంటి దౌర్భాగ్యులు ఎందరో ఇరవై నాలుగ్గంటలూ ఊపిరి పీల్చి క్షణ క్షణమూ బతుకుతూనే వున్నారు ఎందుకో నాకు తెలీదు. భానుకీ తెలీదు.

భాను స్నేహం నాకు అపురూపమైనదిగా తోస్తుంది. భాను స్నేహం తోనే నేను కొంత సెన్సిటివ్‌గా తయారయ్యానేమోకూడా. పబ్లిక్ ఎగ్జామి నేషన్సు రాసే రోజుల్లో ఏమాత్రం అవకాశం వచ్చినా భవిష్యత్తును గురించి ముచ్చటించుకోవటం ఒక్కటే ముఖ్యావసరం. "ఏ ఊళ్ళో కాలేజి బావుంటుంది చెప్మా? ఇద్దరం ఒకే గ్రూపు తీసుకోవాలి సుమా! ఎంత చదివినా కలిసే చదవాలి. సరి నీకు డాక్టర్ కావాలని వుందా? లాయరా? ఎంతైనా డాక్టరే హోదాగా ఉంటుంది లెద్దూ! డాక్టర్ కేశవరావ్, డాక్టర్ భానుమతీదేవి!" ఫక్కుమని నవ్వుకుంటూ అంతులేనన్ని కోరికలు కోరు కునే ఆ సమయంలో ఈ అనుమానం ఒక్కళ్ళకైనా రాలేదేం?

భాను చదువు మానేస్తుందనుకొంటే నా కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఇక నాకు భాను స్నేహం దూరమైనట్టే. ఈ విషయం ఎలా మాట్లాడాలో, అసలు భాను ముఖం ఎలా చూడాలో అర్థంకాలేదు. అయినా భానుని నేను ఓదార్చాలి, ధైర్యం చెప్పాలి.

పిన్ని ఏదో పనిలో వుంటే బైటకు వచ్చేశాను.

గదిలో భాను ఉదాసీనంగా కూర్చుని ఉంది నేను నెమ్మదిగా దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను. నోరు పెగుల్చుకొని ఏదో అందామనుకుంటుండగా నా చెయ్యి పట్టుకొంది. నా ముఖంలోకి చూస్తూ అంది. "ఇక మనం విడిపోతున్నాం అన్నయ్యా! నన్ను మరచిపోవు కదూ?"

"భానూ!" నాలో ఏదో బాధ వ్యక్తమైంది.

"నువ్వు అదృష్టవంతుడివి అన్నయ్యా! నువ్వు ఎన్నో డిగ్రీలు సంపాదించాలి వృద్ధిలోకి రావాలి".

నేను భాను దగ్గరే టేబిల్ కి ఆని నిలబడ్డాను. "ఇద్దరం కలిసి చదువుకుందామని ఎన్ని కబుర్లు చెప్పుకున్నాము భానూ! నువ్వు మానేస్తే నేను ఒక్కడినీ.... నేనూ మానేస్తే బావుంటుందేమో అనిపిస్తోంది"— నిజంగా అలాగే అనిపించింది. ఏం? ఎంతో తెలివితేటలుగల భాను చదువే విరమించుకొంటే నేను కాలేజీలో చదివి ఉద్ధరించేదేమిటీ?

భాను నవ్వింది, నేనంటే నీ కెంత అభిమానం అన్నయ్యా! నువ్వు గొప్పవాడివైతే నాకు సంతోషం కాదూ? నేను ఉండగా నిన్ను మాననిస్తాననుకొంటున్నావా? ఏ దిగులూ పెట్టుకోక ఉత్సాహంగా చదువు. నాకు ఉత్తరాలు రాస్తుండు" భాను అప్పగింతలు పెట్టినట్టు చెబుతోంటే సహించలేననిపించింది. నేను ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాను.

భాను కోరిక తీర్చటానికి బాబాయికి శక్తి లేదు నిజమే, కానీ భాను వంటిదాన్ని ఒక్కదాన్ని కాదు, పదిమందిని చదివించగల శక్తి, బాబాయ్‌కి లేని ఆ తాహతూ, నా తండ్రికి ఉన్నాయి. ఆయన కొడుకునైన నా కోసం

తాతయ్య దగ్గరనుంచీ సంపద పోగుపడుతోంది. కానీ నేనేం చెయ్యగలను? ఏమీ చెయ్యలేను. నాన్నకు చెప్పలేను. చెప్పి ఒప్పించలేను. ఆయనకు ఆడపిల్లల చదువు పట్ల సదభిప్రాయం లేదు. అందుకే మా చెల్లి ఐదవ తరగతికూడా పూర్తిచెయ్యకుండా అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఆ అన్యాయానికి ఒక పసి హృదయం బావురుమనీ ఏడ్చిందని నాన్నకు తెలీలేదు. అంతే! ఈనాడు మరో చెల్లి విషయంలో కూడా నేను చెయ్యగలిగింది ఏమీ లేదు! భానువంటి రత్నం మరగునడితే అది దేశానికే నష్టం కాదూ? కావచ్చు- రత్నాలపట్ల, ఆ నష్టపోయే దేశమే మౌనం వహిస్తున్నప్పుడు నావంటి వాళ్ళు చెయ్యగలిగిందేమీ లేదు. బాధే మిగులుతుంది.

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అంది.

"భానూ! ఆస్తి వ్యవహారాలు ఇప్పుడు నా చేతిలో ఉంటే, మనం ఇలా విచారించే అవసరమే వచ్చేదికాదు. కానీ నాన్న.... నీకూ తెలుసు కదా? ఆయనకు చెప్పి లాభం లేదు."

భాను ఆశ్చర్యపడ్డట్టు తదేకంగా చూడసాగింది. "ఈ చెల్లిని ఇంత ప్రేమించే అన్నయ్య ఒకడు ఉన్నాడని నాకు ఈ క్షణంవరకూ తెలీలేదు అన్నయ్యా! నీలో ఈ భావం, ఈ ప్రేమ ఎన్నటికీ— మనం పెద్దవాళ్ళమై చచ్చిపోయేవరకూ—ఇలాగే వుండిపోవాలి. అంతకన్న ఏ సహాయమూ ఎక్కువ కాదు...." భాను కళ్ళు చెమర్చాయి.

నేను భాను చెయ్యి పట్టుకున్నాను. "భానూ! నా మనసులో నీకు వున్నస్థానం శారదకుకూడా లేదంటే అబద్ధంకాదు. శారదకూ నాకూ వున్న అనుబంధం సహోదరత్వం. దాన్ని నేను తేలికగా తీసివెయ్యను. కానీ నీకూ నాకూ వున్నది బలీయమైన మానసిక స్నేహం. దీనికి సాటి వేరొకటి లేదు. ఎప్పుడూ నీ సంతోషం, నీ శ్రేయస్సు కోరే అన్నయ్యను నేను వున్నానని— గుర్తుంచుకో! ఏ దిగులూ పెట్టుకోకుండా మామూలుగా

తిరుగు. నీకు ఏదీ కావాలన్నా నాకు రాయి. నువ్వు ఇవ్వాళ అన్నం తినలేదంటే అమ్మ ఎంత బాధ పడుతుందో గ్రహించావా? మనం పరిస్థితులకు లొంగిపోవాలి. తప్పదు భానూ! అన్ని విషయాలూ నీకు తెలుసు." భానును ఓదార్చుతుంటే నేను ఏదో చెయ్యలేకపోయానని బాధ వేధించింది రేపు నా చేతిలోకి రాబోయే సంపదకు, ఆ వేలాది రూపాయలకూ చిల్లిగవ్వ విలువ లేదు. అవసరాలు తీర్చుకోలేని ధనం వుందనే సంతృప్తి లేదు.

ఆ రాత్రి భాను స్వయంగా ఇద్దరికి అన్నాలు పెట్టింది. భానుకు ఆవేశమే కాదు, వివేకం కూడా వుంది. భాను తలవంచుకొని అన్నం తింటూంటే నాకళ్ళు చెమ్మగిల్లేయి.

* * *

భాను స్నేహం తరిగిపోయిందనుకుంటే మనసు భారమైంది. భవిష్యత్తుమీద ఎన్నో కలలుగని గాలిమేడలు కట్టిన భాను, ఈ భంగపాటు ఎలా భరించింది? కలలు కరిగిపోయినా, ఊహలు చెదిరిపోయినా ఓర్చుకో గలిగేంతటి శక్తికలదా భాను హృదయం?

ఏ కాలేజీలో చేరేదీ, ఏ గ్రూపు తీసుకొనేదీ, ఎక్కడ బసపెట్టేదీ-చదువుకు సంబంధించిన అన్నివిషయాలలోనూ భాను సలహాలుపాటించాను. కాలేజీ గేటులో కాలుమోపిన క్షణంనుంచీ ఎప్పుడేం జరిగేదీ, లెక్చరర్లు ఎలా వచ్చేదీ, అమ్మాయిలు ఎలా వుండేదీ, అబ్బాయిలు ఎలా అల్లరిపెట్టేదీ అక్షరాలా కాలేజీ స్వరూపాన్ని విపులీకరిస్తూ వుత్తరాలు వ్రాశాను. ఏం చూసినా అది భానుకు రాయకపోతే మనసుకు తృప్తిలేదు. భానుకు నవలలు చదవటం మహా ఇష్టం. ఎన్ని ప్రయత్నాలైనా చేసి పేరుపొందిన నవలలు కొని భానుకు పంపితే ఏమిటో ఆనందం! క్లాసు పుస్తకాలనుంచి కొన్ని కొన్ని విషయాలు ఎత్తి రాస్తే భానుతో కలిసి చదువుకొంటున్నట్టు

ఏదో అనుభూతి! భాను హృదయంలో దిగులు పోగొట్టి సంతోషం కలిగించాలనే నా తాపత్రయం! కృతజ్ఞతతో ఆనందంతో భాను రాసే లేఖలు చదువుతూంటే కళ్ళు చెమర్చేవి. భాను నాతోపాటే చదువుకొని ఒకనాటికి గ్రాడ్యుయేట్ అయినా నాకీ అనుభూతి కలిగేది కాదేమో!

క్రమంగా భాను ఉత్తరాలలో విచార రేఖలు మాయమయ్యాయి. హిందీపరీక్షకు చదువుతున్నాననీ, లైబ్రరీ పుస్తకాలు తెచ్చుకుంటున్నాననీ, ఎప్పటిలా తీరిక లేకుండా ఉంటున్నాననీ రాస్తూన్నకొద్దీ నా మనసు కూడా తేలిక పడసాగింది.

* * *

ఇంటర్ పరీక్షలు వ్రాశాను. క్లాసు వచ్చింది. ఆ సంతోష సమయం లోనే మరో శుభవార్త! భాను శుభలేఖ పంపుతూ ఉత్తరం రాసింది. నాకు ఆశ్చర్యం వేసింది. భానుకు ఇంత ఆకస్మికంగా పెళ్ళేమిటి? వరుడు రాజశేఖరం. బి ఏ ట! బాగానేవుంది కాని, ఎందుకో ఎక్కడో నాకు వెలితి అనిపిస్తోంది. భాను డాక్టరు కావాలని కాంక్షించింది. ఫలించలేదు. పోనీ, డాక్టరు భార్య అయితే? ఏమిటో నాకీ భ్రమ! డాక్టర్ ఎంత ఖరీదనీ! ఈనాటి వరుళ్ళూ, కట్నాలూ నాకు తెలియనివి కావుగా? ఒక డాక్టర్ని కొనగలిగే బాబాయి—కూతుర్ని చదివించలేడూ? ఇప్పటికి బి.ఏ.ని బేరం చెయ్యటానికే చాలా ఖర్చుచేసి ఉంటాలి. మరి పెళ్ళి నాలుగురోజులేవుంది. రెండురోజుల క్రిందటే మళ్ళా కాలేజీకి వెళ్ళేందుకు బట్టలకోసం నాన్న మూడు పచ్చనోట్లు ఇచ్చాడు. నేరుగా పట్టణం వెళ్ళి భానుకి ఖరీదైన రిస్టు వాచీ, కాబోయే బావగారికి మంచి పెన్నూ తీసుకున్నాను.

భాను చేతికి స్వయంగా నేను వాచీ కడుతోంటే ఆ అందమైన కనులలో మెరిసిన ఆనందం, ఆశ్చర్యం ప్రత్యేకించి తనమీద నా అభిమానానికి గర్వం—అవి చాలు! వాటికోసమే నేను భానుకు ఏమైనా చేస్తాను.

(4)

"అన్నయ్యా! ఈ బహుమతికి ఒక విలువంటూలేదు. కానీ, నీకు నేనేం ఇవ్వగలను?"

"అప్పుడు నేనే అడుగుతాను, సరేనా?"

పెళ్ళికొడుకుని గురించి వివరాలు తెలుసుకోవాలని మహా ఆత్రుతగా ఉంది నాకు. భానుకి భర్త కాబోతున్న ఆ వ్యక్తి ఎంత గొప్పవాడై ఉండాలి!

"మరి భానూ! పెళ్ళిచూపులు చూశావుకదా, బావగారు ఎలా వున్నారేమిటి? బంగారువన్నె శరీరం, నొక్కు నొక్కుల జుట్టు, విశాలమైన పాలభాగం, బలిష్ఠమైన వక్షస్థలం..."

"భుజకీర్తులూ...పాంకోళ్ళూ...నాలుగు చేతులూ..."

"అలాగా? ఇంకా నేను మనిషేనేమో అనుకొంటున్నాను."

"ఛ, పోరా! నీ గడుసుతనం!" నవ్వేసింది భాను.

"కాదు భానూ! నాకు పిసరంతన్నా చెప్పకుండా మీ ఆయన్ని నిర్ణయించుకున్నందుకే నువ్వు క్షమాపణ చెప్పుకోవాలి. పైగా నేను అడిగినా కూడా చెప్పకపోతే...ఛస్, నాకేం నచ్చలేదు" అలిగి కూర్చున్నాను.

భాను నవ్వి, నా గడ్డం పట్టుకొంది. "బాబ్బాబు! చెప్తాను గానీ, నువ్విలా మూతి బిగించుకుని కూర్చోకు, మాటలు విన్పించవు"

"ఓహో! మీ ఆయనైతే మూతితో వింటాడు, చెవులతో మాట్లాడుతాడు కాబోలు! అందుకే నీకు మహా నచ్చాడు."

"నిజం సుమీ! అన్నయ్యకెలా తెలిసిపోయింది చెప్మా!" వాచీ పెట్టుకున్న చెయ్యి గడ్డంకింద పెట్టుకొని ఆలోచన అభినయించసాగింది. ఇక అలిగి లాభంలేదు. చెయ్యి లాగేసి అన్నాను—"చెప్పు భానూ! నీకు బాగా నచ్చాడా?"

నవ్వి క్షణం మౌనం వహించింది. "బాగా నచ్చటం ఏమిటి? నాన్నావాళ్ళూ భానుకి తగినవాడు అనుకున్నారు. నేనూ చూశాను. ఇష్ట

పడ్డాను. అనుకోకుండా కుదిరింది. అతనికి దూరపు బంధుపు లెవరో తప్ప కావలసిన వాళ్ళెవరూ లేరట. ఆ బంధువులు, అతనికి వున్న కొంచెం ఆస్తితో పెంచి పెద్దచేసి వదిలేశారు. ఆస్తి హరించింది. డిగ్రీ దక్కింది. ఇప్పుడు ఉద్యోగం ఒక్కటే ఆధారం. అమ్మ అందుకే కొంచెం వెనకాడింది. మనిషికి మనిషే విలువగానీ ఆస్తిపాస్తుల దేముంది అన్నయ్యా?" అంది.

"నిజం భానూ! మంచిపని చేశావు. అదీ మంచిదేలే. వెనక అంత బాదరబందీ లేకుండా వుంటే స్వేచ్ఛగా, హాయిగా బతకటానికి వీలౌతుంది. ఇక మమ్మల్ని మరచిపోతావు కాబోలు?"

"మరి మరిచిపోనూ? పెద్ద సిటీకి వెళ్ళిపోతున్నాను. బీచ్-షికార్లూ, సినిమాలూ, పిక్నిక్‌లూ, పార్టీలూ—అంతా, ఒక పేమిటి—సిటీ మనదే!"

"తిరుగుదూ! ఇక్కడెవరూ అసూయపడటం లేదుగాని, మరి అతకాడి అందచందాలు వర్ణించావు కావు. మన్మధుడా? నలకూబరుడా?"

"రాజకుమారుడు?"

"అహా! అంత అందగాడా?"

"హుఁ! ఒత్త అందగాడా! అతిలోకసుందరుడు! జగదేకవీరుడు!" ఫక్కుమని నవ్వుకొన్నాం. నవ్వుతోంటే పిన్ని వచ్చింది. "చూడు పిన్నీ భాను ఎంత అడిగినా మొగుణ్ణి గురించి సరిగా చెప్పటంలేదు" ఫిర్యాదు చేశాను.

"నీ మొహం! అదేం చెబుతుందిరా? మనిషేమో చక్కగానే వుంటాడు. వెనక చిల్లిగవ్వ ఆస్తిలేదు. ఇంట్లో కాస్త కష్టానికి సుఖానికి ఆతసాయమూ లేదు. అదే నాకు ఆలోచనగా వుంది."

"ఇంకా ఇప్పుడు ఆలోచిస్తూ కూర్చున్నావేమిటి? మరేం ఫర్వాలేదు పిన్నీ! భాను మాత్రం తెగ మురిసిపోతోంది. షికార్లూ, సినిమాలూ, పిక్

నికోలా, హాగ్రీలా, ఝుయ్‌మని సిటీ అంతా...బాబోయ్! కంఠ పిక్కి వచ్చేలా గిల్లేసింది. "అయిందా?" అంటూ కొరకొరా చూసింది. నోరు మూసేసుకున్నాను. పిన్ని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

పెళ్ళినాటి సాయంకాలం మగ పెళ్ళివారు వచ్చేసి విడిదిలో దిగారని తెలిగానే పందిరికి పూలబుట్టలు కడుతూన్నవాణ్ణి ఎక్కడి వక్కడ వదిలేసి కిందికి దూకి పరిగెత్తాను. ఆ అతిలోక సుందరుణ్ణీ, జగదేకవీరుణ్ణీ చూడకపోతే ఇక నా ప్రాణాలు నిలువవు. విడిదిలో అంతా హడావిడిగా తిరుగుతున్నారు పెళ్ళికొడుకైన రాజకుమారుడి కోసం వెతుక్కుంటూ బయల్దేరాను! అప్పుడు ఆ గదిలోంచి ఐదారుగురు సూటువాలాలు విలవిల్లాడుతూ బయటికి పోయారు. బహుశా వాళ్ళంతా రాకుమారుడి చెలికాండ్రు కాబోలు! గదిలో అడుగు పెట్టాను అతను ఒక్కడే బట్టలు మార్చుకొని కూర్చున్నాడు. గ్లాస్కో లుంగీ' తెల్లటి చొక్కాతో ఉన్నాడు. ఉన్న రెండు కళ్ళూ విప్పార్చుకొని మరీ చూస్తూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను—"నమస్తే!"

"నమస్తే! రండి."

"నేను భానుమతికి అన్నయ్యను. పేరు కేశవరావు. మిమ్మల్ని చూడాలని..."

"కూర్చోండి!"

నేను మరొక కుర్చీలో కూర్చున్నాను. అతను సిగరెట్ అందించబోయాడు. "నో, థాంక్స్! అలవాటు లేదు" అన్నాను నవ్వి.

"ఈ రోజుల్లో విచిత్రమే!" తను సిగరెట్ వెలిగించి కాలుమీద కాలు వేసుకొని వెనక్కివాలి దర్జాగా పొగ విడుస్తున్నాడు. ఎర్రగా, సన్నగా, అందంగానే ఉన్నాడు జుట్టుకి నొక్కులు నొక్కులేం లేవు. విశాలమైన ఫాలభాగమేగాని విరిస్తపైన వక్షస్థలం కాను ముజకీర్తులా, పాంకోళ్ళు గట్రా ఏంలేవు. మరి మొత్తానికి అందగాడు భానుకి తగినవాడు. విచ్చలవిడిగా మాట్లాడలేమ. పెళ్ళికొడుకు దర్జా కాబోలు కొంత

ప్రదర్శిస్తున్నాడు. "మిమ్మల్ని చూడాలని ఎంతో అనుకుంటున్నాను. మా చెల్లిని అడిగితే అతిలోక సుందరుడూ—జగదేకవీరుడూ అని చెప్పింది."

"జానపద చిత్రాలు బాగా చూస్తుంది కాబోలు. మరి మీరేమను కుంటున్నారో!" అన్నాడు నవ్వుతూ.

"చంపారే! నేను ఆడపిల్లని కాదు కదండీ! ఏమనుకొన్నా చెప్పెయ్యటానికి" అన్నాను. అలా సంభాషణ సరదాగా సాగింది. అతను తెలివిగా చురుగ్గా మాట్లాడాడు. ఓ అరగంట కూర్చుని వచ్చేశాను. పెళ్ళి కూతురై కూర్చున్న భాను దగ్గరచేరి అంతా చెప్పాను. "భుజకీర్తులా, పాంకోళ్ళూ లేవు భానూ! అతన్ని అడిగాను కూడాను. దాచేసుకున్నాడంటా వేమిటి?"

భాను కోపంతో మూతి బిగించింది. బుగ్గమీద దిష్టిచుక్క మరీ స్ఫుటంగా కన్పిస్తోంది.

"మీరిద్దరూ బాగానే ఉన్నారు. మధ్య నామీదేమిటి నీ కోపం?" అన్నా మూతి ముడుస్తూ.

భాను కళ్లు దించుకు నవ్వింది. నిండు హృదయంతో కల్యాణానికి సిద్ధమయ్యే కన్య అంత సజీవంగా నవ్వగలదు కాబోలు! ఆ నవ్వులో వేయి ఊహలు! కోటి కోరికలు!

భాను మెడలో-అతను- పెళ్ళికొడుకు-మాంగల్యం ముడివేస్తోంటే నాకు కావలసిన వారెవరో దూరమౌతున్నట్టూ, శాశ్వతంగా దేనినో కోల్పో తోన్నట్టూ బాధ కలిగింది. ఇప్పుడు భాను నా చెల్లెలు కాదు. రాజశేఖరం భార్య! ఇక అన్నయ్యతో గంటల తరబడి మాట్లాడటానికీ, విరగబడి నవ్వుకోటానికీ అవకాశంఏదీ? అందరితోపాటు చేతిలో అక్షింతలు విసిరి నిశ్శబ్దంగా కళ్ళు ఒత్తుకున్నాను. అంతరాత్మ భానుని దీవించింది—నా చెల్లి వెయ్యేళ్ళు చల్లగా ఉండాలి, మాతృమూర్తిగా! సౌభాగ్యవతిగా!

పెళ్ళికొడుకు కాస్తా బావగారై కూర్చున్నాడు. అల్లుడు వెళ్ళేంత వరకూ నన్ను ఉండి పొమ్మంది పిన్ని. ఆ నాలుగు రోజులూ హాస్యాలతో వేళాకోళాలతో చాలా సరదాగా గడిచింది. ఓసారి "మీరు చాలా అదృష్ట వంతులు బావగారూ! మా చెల్లివంటి భార్య మీకు దొరికింది" అన్నాను నవ్వుతూ.

"అబ్బే! మీ చెల్లాయే అదృష్టవంతురాలు నావంటి భర్త దొరికాడు."

"స్వంత డబ్బా వాయించుకుంటున్నారా?" అన్నాను.

"మరి ఎవరూ లేకపోతే ఏం చేస్తారు చెప్పు?" అంది భాను. ముగ్గురం నవ్వుకున్నాం.

అంత కొత్తలోనే బావగారు భానుని దువ్వెన అందించమనో—చొక్కా చేతులు మడతలు పెట్టమనో—బూట్లు తుడవమనో—ఏదో ఒక పని పురమాయిస్తూండేవాడు. భాను అవన్నీ అక్షరాలా పాటించడానికి సిగ్గు పడేది. ఏ మాత్రం లోటు జరిగినా, ఆలస్యమైనా అతను విసుక్కునేవాడు. కళకళలాడే భాను మొహం చిన్నబోయేది అది అతను అర్థం చేసుకునే వాడో లేదో కనీసం గమనించినట్టు కూడా కనిపించే వాడు కాదు. నా కేమిటో కష్టం వేసేది. భాను పరాధీన అయిపోయిందా? అన్ని విధాల భానును శాసించగల వ్యక్తి అవతరించాడా? సున్నితమైన భాను మనస్సు నొప్పించకూడదనీ, భానుని అపురూపంగా చూసుకోవాలనీ అతనికి తెలిస్తే ఎంత బావుండును!

నేను వెళ్ళిపోయేముందు భానుని ఒంటరిగా కలుసుకున్నాను. "భానూ! నీ భవిష్యత్తు నిర్ణయమైపోయింది. అది అన్ని విధాలా సుఖ మయం చేసుకోవటం నీ చేతుల్లోనే వుంది. బావగారికి కొంచెం కోపం ఎక్కువ కదూ? దానికి నువ్వు కాస్త శాంతం వహించాలి. అమ్మమీద చిరాకు పడినట్టే అయితే బావుండదు సుమా! అన్ని విధాలా నీకు తగిన భర్తతో జాగ్రత్తగా, తెలివిగా...." మరి నాకు మాటలు పెగల్లేదు భాను తలమీద బరువైన బాధ్యతలు పెడుతున్నట్టూ—ఆడుతూ పాడుతూ తిరిగే భానుని ఎవరికో అప్పగించేస్తున్నట్టూ అనిపించింది.

"అన్నయ్యా!" అంది భాను. కొన్ని క్షణాలు వరకూ ఏమీ మాట్లాడలేక పోయింది.

"నాకు బావగారి గురించి ఏ శంకా లేదు అన్నయ్యా! నిజానికి నా మనసు చాలా సంతోషంగా ఉంది" అంది నేల చూపులు చూస్తూ. భాను మనసు విప్పి చెప్పితే ఇంతవరకూ అది ఒక్క నాకే.

"నిజమే భానూ! నీ శుభలేఖ చూచినప్పుడు రాజశేఖరం అంటే ఏమిటో అనిపించింది గానీ, ఇప్పుడు నాకూ సంతోషంగానే ఉంది" అన్నాను తర్వాత నా చదువు విషయం వచ్చింది. మెడిసన్ చదవమంది భాను. "ఇప్పుడు నాకా కోరిక లేదు భానూ! బి.ఏ.కి వెళ్తాను. నీ కిష్టమే కదూ!"—భాను మరేమీ వాదించకుండా సరే అంది.

భాను మూడో నెలలో బావగారి దగ్గరికి వెళ్ళిపోయింది. తమ కొత్త కాపురం గురించీ, బావగారి కోపతాపాల గురించీ, తను నేర్చుకొంటూన్న పని పాటల గురించీ విపులంగా ఉత్తరాలు రాసేది. రోజులు హాయిగా గడుస్తున్నాయట బావగారికి మాత్రం కోపం తగ్గటంలేదట. చీకటితో లేచి పనిలో జొరబడాలంటే చికాకు వేస్తూందట. ఒక్కొక్కసారి ఈ బాదర బందీ అంతా ఏమిటా అని ఎక్కడలేని విసుగూ వచ్చేస్తోందట. మరుక్షణంలోనే ఎందుకో అమితమైన ఓర్పు వచ్చిపడుతోందట. అన్నిటికన్నా ముఖ్య విషయం తనకు నేనే ఎప్పుడూ గుర్తు వస్తున్నానట. నవ్వుకుని, కొత్త సంసారంలో అనుభవంలేని చెల్లాయికి నాకు తోచిన ధైర్యం చెప్పుతూ జవాబులు రాసేవాడిని.

* * *

సంవత్సరం తిరిగేసరికి భాను తల్లికూడా అయింది. రాజా వంటి అల్లుణ్ణిచూసి మురిసిపోయాను. తల్లిదండ్రుల్లో వున్న అందచందాలన్నీ వాడికి వచ్చాయి. తెల్లగా సన్నగా సూర్యకిరణంలా ప్రకాశిస్తూ వాడు ఏడాది

లోపునే గునగునా నడిచేస్తోంటే చూడటానికి వేయికళ్లు కావాలనిపించేది. భాను అదృష్టవంతురాలు! అన్ని సౌఖ్యాలూ పొందగలుగుతోంది. ఆ రెండు సంవత్సరాల్లో భాను చాలా మారిపోయింది. ఓర్పు, శాంతం, నెమ్మదీ అన్నీ అలవడ్డాయి.

"నువ్వు చాలా మారిపోయావు భానూ! మనం స్కూల్లో చదువు కున్నప్పటిలా ఎందుకు లేవూ? ఇంకెప్పుడూ అలా వుండవా?" అన్నాను విక్కముఖం వేసుకొని.

భాను అదోరకంగా నవ్వింది. "నేను మళ్ళా అలాగే ఉండాలంటే ప్రేమించే అన్నయ్య ఒక్కడే చాలడు."

నా కేమిటో అర్థం కాలేదు. "ఏమిటి భానూ?" అన్నాను.

"అబ్బ! ఏం లేదు పోరా!" అనేసింది.

"నువ్వు మహా అరిందా అయిపోయినట్టు నన్ను మరీ పిల్లకాయిలా తీసేస్తున్నావు. అసలు నువ్వే నాకన్నా చిన్నదానివి" అన్నాను కోపంగా. భాను నవ్వింది. ఆ నవ్వులో ఏదో తక్కువైంది. ఆ నవ్వటంలో ఏమిటో లోటువుంది.

పరీక్ష ఫలితాలు తెలిశాక భానుకి సంతోషంతో ఉత్తరం రాశాను. "భానూ! ఎం.ఎ—మీ సిటీలో చదవాలనుకొంటున్నాను. ఈ టౌన్ మార్చె య్యాలని బుద్ధి పుడుతోంది. మళ్ళా నీకు దగ్గరగా వస్తున్నందుకు ఎంతో సంతోషంగా వుంది." కానీ నాకో అనుమానం వచ్చిపడింది. భాను నన్ను వాళ్ళ ఇంట్లోనే వుండి చదువుకోమని బలవంత పెడుతుందో ఏమో! ఏం చెయ్యాలి? వాళ్ళు ఏ అడ్డూ ఆపూ లేకుండా స్వేచ్ఛగా ఉంటున్న దంపతులయ్యే! వాళ్ళ ఆనందానికి నేను అడ్డు. సరిగదా నా చదువుకూడా భాను కబుర్లతో సరిగ్గా సాగదు. భాను ఎంత నిష్ఠూరపెట్టినా ఒప్పుకోకూడదు అనుకొన్నాను. భాను రాసిన జవాబులో ఆ ప్రసక్తే

లేదు నా రాకకోసం పుట్టెడు ఆశతో ఎదురు చూస్తూందట. నా ఒళ్ళో తల పెట్టుకుని తనివితీరా ఏడవాలని ఉందట-రాసింది "పిచ్చి ఖాను!"

* * *

యూనివర్శిటీ ఫీజుకట్టి హాస్టల్లో చేరి సామానంతా గదిలో సర్ది కొంతసేపు పడుకున్నాను. సాయంత్రం లేచి అమ్మ నా కోసం చేసి ఇచ్చిన మినపసున్ని డబ్బా సంచిలో వేసుకొని బయలుదేరాను. అప్పటికి ఖానుని చూసి కొన్ని నెలలైంది. ఖాను చాలా చిక్కినట్టు కనిపించింది. నన్ను చూస్తూనే నవ్వు ముఖంతో ఏదో పెన్నిధి దొరికినట్టే చేయి పట్టుకొంది,

"బావున్నావా? నిన్ననే వస్తావనుకున్నాను. అసలు నీ ఉత్తరమే ఆలస్యంగా అందింది. పెద్దమ్మా వాళ్ళంతాకులాసా? అబ్బ, చాలా పొడుగై పోయావే!" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది. జవాబులు వినకుండానే "ఒరేయ్ నానీ!మావయ్య వచ్చాడురా! మావయ్య! నీకేం తెచ్చాడో అడుగు" అంటూ నడబండితో ఆడుకొంటూన్న వాణ్ణి లాక్కొచ్చింది.

వాడు చకచకా నడిచి దగ్గరకొస్తోంటే బుగ్గ గిల్లి "నీకేం తేలేదురా అల్లుడా!" అన్నాను.

"అల్లుడంటే అంత అలుసను కొంటున్నావేమిటి? ఓ బిస్కట్టు ముక్కయినా తేకపోతే, అది గుర్తుంచుకుంటాడు సుమా!" అంది ఖాను నవ్వి.

"అయితే నీ కొడుక్కి బిస్కట్ల కట్నం చాలంటావా?" అన్నాను టిన్ను అందిస్తూ.

"ఇప్పటికి చాలు!" అంది గొప్పగా. మగవాడి తల్లి మరి! నానిగాడు బిస్కట్లు ఎన్నికచేస్తూంటే మే మిద్దరం కబుర్లలో కొట్టుకుపోయాం. అన్నిటిమధ్యా నా పెళ్ళి విషయం కూడా ఎత్తింది ఖాను. నేను పెళ్ళాడ బోయే ఆడది ఎవరో గాని అదృష్టవంతురాలట! ఆ అదృష్టం సుశీలకే

దక్కనివ్వాలట! సుశీల నాకు మేనమామ కూతురు. భానుకి ప్రాణ స్నేహితురాలు. సుశీల పుట్టినప్పటి నుంచీ కేశవ్ పెళ్ళాంగానే చలామణీ అవుతోంది. కానీ అది నిజమోకాదో మా నాన్నకూ, దేవుడంటూ ఉంటే వాడికీ తెలియాలి. నాన్న ఎప్పుడూ పైకి తేలడు. దేవుడు కనిపించను కూడా, కనిపించడు. మరి తెలిసేదీ ఎలా? నా వుద్దేశ్యం చెప్పమంటే మాత్రం నాకేం అభ్యంతరం లేదు. పైగా సంతోషం కూడా. అయినా నేను నా పెళ్ళి గురించి ఏనాడూ ఆలోచించలేదు. చెప్తే భాను నమ్మదు-ఖర్మ!

"నువ్వుదొంగవి. నీకే ఇష్టంలేక పెదనాన్నమీదకు నెంటుతున్నావు. నువ్వు పంతం పట్టి కూర్చుంటే ఎందుకు కాదు? ఎవ్వరేం చేస్తారు?" అంది.

నేను నవ్వాను. "నేను పంతం ఎందుకు పట్టాలి? నీ సుశీల తప్పితే లోకం గొడ్డుపోయిందనా?"

"లోకం ఎప్పుడూ గొడ్డుపోదు రావుగారూ!" అంది వెటకారంగా. అంతలోనే సీరియస్‌గా ప్రారంభించింది. "సుశీల దృష్టిలో నీకున్న విలువ అపారమైనది. అది మరే అమ్మాయి మనసుతోటీ పోల్చటానికి వీలులేదు. తనకు ఊహ తెలిసిన క్షణం నుంచీ నిన్నే అభిమానిస్తూ...."

"నీకెంత ఫీజు ఇస్తానందేమిటి?"

భాను క్షణం ఆగి నా కళ్ళలోకి చూసి నవ్వుతూఅంది. "నీ గుణం దాని అందం కలిసిన కొడల్ని ఇస్తానని మాట ఇచ్చింది"- భాను కళ్ళతో నవ్వుతుంటే సిగ్గుపడిపోయాను. అదేమిటో భాను అరిందాలా అన్ని విషయాలలోనూ సిగ్గులేకుండా మాట్లాడేస్తోంది.

"ఎవర్ని అడిగి నీ కామాట ఇచ్చిందేమిటి? అన్నాను కోపం నటిస్తూ.

"అదేమో! దాన్నే అడుగు" అనేసింది,

కొంత సేపయ్యాక "బావగారింకా రాలేదేం?" అన్నాను.

"టైం ఎనిమిదీ కావస్తూంది. వస్తారు...." అంది.

"బావ కబుర్లేమైనా చెప్పు భానూ!" అన్నాను.

"రేపటినుంచీ నువ్వే చూద్దువుగానిలే!" అంది నవ్వుతూ. తొమ్మిది కూడా దాటింది. ఎన్నిసార్లు అన్నానికి లేవమన్నా "బావని రానీ!" అంటూ కూర్చున్నాను. ఆయన వచ్చేసరికి మరో అరగంటైంది. రోజూ ఆయన వచ్చేవేళ అదేనట. ఈపాడు ఉద్యోగాలకి, పెళ్ళాం బిడ్డలకి పొత్తుకుదరదు కాబోలు అనుకున్నాను.

"బావున్నారా! అప్పుడే హాస్టల్లో దిగకపోతే నాలుగు రోజులు ఇక్కడ ఉండి వెళ్ళకపోయారా?" అంటూ పలకరించాడు.

"స్టేషన్ నుంచి నేరుగా వెళ్ళిపోయాను బావా! సామానదీ ఇటూ అటూ త్రిప్పడం శ్రమకదా? మీరు కులాసాగా? పది గంటలవరకూ ఏం చాకిరీ అండీ? ఇంతవరకూ ఆడవాళ్ళు ఒంటరిగా ఉండాల్సిందే!" అన్నాను.

"ఏం? మీ చెల్లి ధైర్యస్థురాలే కదూ, స్నానంచేసి వస్తానండీ!" అంటూ దొడ్లోకి వెళ్ళాడు.

భోజనాలవగానే నిద్ర ముంచుకొచ్చింది. 'భాను సుఖంగా బ్రతుకుతూంది! అంతే చాలు' అనుకుంటూ నిద్రలోకి జారిపోయాను.

వారానికోసారైనా ఏదైనా కొనుక్కువచ్చి భానునీ అల్లుణ్ణీ చూసి, ఒక్క పూట భోంచేసి వెళ్ళటం అలవాటులాగే అయింది. ఎప్పుడో కాని బావగార్ని చూడటం తటస్థపడేది కాదు. ఆయన ఇంట్లో ఉండేకాలం తక్కువ. భాను ఒక్కతీ ఏదోచదువుకుంటూనో, కుట్టుకుంటూనో, కొడుకుతో ఆడుకొంటూనో ఉండేది. నన్ను చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టు చేయి పట్టుకుని మరీ పలకరించేది. "అబ్బ! ఇంత ఒంటరితనం ఎలా భరిస్తున్నావు భానూ?" అంటే "ఏం చెయ్యమంటావు?" అనేది దిగులుగా.

* * *

రెండు మూడు నెలల్లోనే నేను గ్రహించిన దేమిటంటే, భాను అశాంతిగా గడుపుతోంది. దుఃఖంతో క్రుంగిపోతోంది. సుఖానికి దూరమైన దానిలా భారంగా రోజులు దొర్లిస్తోంది. పిడుగుదెబ్బ తిన్నట్టు అదిరిపడ్డాను. భాను అశాంతితో బాధపడటమా? దుఃఖంతో క్రుంగిపోవటమా? కారణం? ఎంత ఆలోచించినా ఏమీ తోచలేదు. భాను మాత్రం చాలా మారిపోయింది. ముభావంగా, ఉదాసీనంగా, ఏదీ తనకు పట్టనట్టు ప్రవర్తిస్తోంది. బావ ఏవో అడుగుతాడు, అందిస్తుంది లేదా పొడిగా జవాబు చెబుతుంది—అంతే. భార్యాభర్తలిద్దరూ కలిసి చనువుగా ఎక్కువగా మాట్లాడుకోవటం అరుదు. వచ్చీ రాని మాటలు చెపుతూ ఇల్లంతా బొంగరంలా తిరిగే కొడుకుని ఇద్దరూ కలిసి ఆడించటంగానీ, వాణ్ణి గురించి ముచ్చటించుకోవటంగానీ నేను చూడలేదు మరి. అసలు కొడుకుని తండ్రి ఎప్పుడూ ఎత్తుకు తిరిగినట్టే ఉండదు. వాళ్ళ దాంపత్యంలో అనురాగాలుగానీ, అభిమానాలుగానీ నాకేం కనపడలేదు.

ఛ! వాళ్ళని నేను అపార్థం చేసుకుంటున్నానేమో! వాళ్ళ సంసారంలో నేను ఊహించే భయాలు మచ్చుకైనా లేవేమో! వాళ్ళు నిర్మలంగా ప్రశాంతంగా బ్రతుకుతున్నారేమో! అయితే ఇల్లాలి ముఖంమీద ఒక్క చిరునవ్వు రేఖ కూడా గోచరించదేం? కాంతిగా మెరిసే ఆ కనుల్లో దీనత్వమేదో గూడుకడుతోందేం? ఆటపాటలతో మునిగి తేలవలసిన ఇల్లు నిశ్శబ్దంతో తాండవిస్తూందేం?

భానుని అడిగితే....? ఏమనీ?

నా అనుమానం అనుమానమే అయితే?

భాను ఏమైనా అనుకొని బాధపడితే?

* * *

శనివారం సాయంత్రం నేను వెళ్ళేసరికి బావగారు ఇంట్లోనే ఉన్నారు. ఇద్దరూ ఏదో సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. ఎన్నడూ లేనట్టు చూస్తూ నిలబడ్డాను.

"అదేమిటండీ రావుగారూ! చోద్యం చూస్తున్నట్టు నిలబడి పోయారు?"

"ఆఁ అదే, అదే మిమ్మల్నే!" నవ్వాను. ఆ రోజు ఎందుకో ఆయన తీరిగ్గా కూర్చున్నాడు. సందడిగా కబుర్లు చెబుతున్నాడు. "మీరు సమస్త విద్యలూ నేర్చుకొని గానీ పెళ్ళి చేసుకోరేమిటండీ? మా చెల్లాయి ఎవరితో గాని సుఖపడిపోతుంది. మీ పెళ్ళికొచ్చి ఓ పదిరోజులపాటు జల్సా చేద్దామంటే ఏమిటండీ మీరూ........"

"దానికేం భాగ్యం! ఓ వంద రూపాయలు మనవి కాదనుకొంటే విసుగెత్తేవరకూ హోటల్‌వాడు విందులు చేస్తాడు. అంతేకదూ అన్నయ్యా!" అంది భాను.

"అన్నయ్యా కాదు, అక్కా అని పిలు. నీ అన్న కూడా ఒక మగవాదే అనుకొంటున్నావేమిటి?"

"మీరు మీ జాతిని బాగా పోల్చగలరు నుమండీ!"

"చమత్కారమంతా మీ అన్నాచెల్లెళ్ళ స్వంతం కాదుగానీ, నీ అన్నగారికున్న డబ్బు నాకే వుంటేనా చూస్కో మేడలో కాలు కారు లోనే........"

"కారులో కాలు కల్లబ్బులోనే!"

"లేకపోతే నీఅన్నలాగా ఆడపిల్లలాగ కబుర్లాడుకొంటూ కూర్చొంటా ననుకున్నావేమిటి?" వాదనలతో ఓ గంట గడిచింది. "రేపైనా పిక్నిక్ వెళ్దామా!" అన్నాడు.

భాను మొహంలో సంతోషం నాకు స్పష్టంగా కన్పించింది. వెంటనే నేను ఒప్పేసుకున్నాను. ఎక్కడికెళ్ళేదీ, ఎన్ని గంటలకు బయల్దేరేదీ, ఏమేమిటి తీసుకెళ్ళేదీ, ఎప్పటికి తిరిగివచ్చేదీ అన్నీ కూలంకషంగా చర్చించి పారేశాం. బావగారికి పులిహోర కావాలట! నేను బొబ్బట్లు చెయ్యమన్నాను. భానుకు కొబ్బరి హల్వా మహాప్రాణం! మూడూ కొంచెం

కొంచెం చెయ్యాలని నిర్ణయించాం. పక్కమీదికి చేరేవరకూ మాటలు పెరుగుతూనే ఉన్నాయి. నేను ఆలోచిస్తూ పడుకున్నాను. అదేమిటో వాళ్ళు హాయిగా నిర్మలంగా అన్యోన్యంగా బ్రతుకుతున్నారంటే ఎంతైనా నా మనసు ఒప్పుకోలేదు.

భాను తెల్లవారుఝామున మూడు గంటలకే లేచింది కాబోలు. పొయ్యి అంటించి ఏమిటేమిటో చేస్తోంది. లైటువేసి నా మంచం పక్కనించి తిరుగుతూ అలమరలోంచి సామానులేవో పట్టికెడుతోంది.

"ఎప్పుడు లేచావు భానూ?" అన్నాను.

"నీకు మెలకువ వచ్చేసిం దేవిట్రా? ఇక రామలే, పడుకో" అని లైటు తీసేసి వెళ్ళిపోయింది. ముసుగు బిగించాను. నిద్రరాలేదు. మరి పడుకోబుద్ధి కాలేదు. పాపం భాను చీకటి నెత్తిన వేసుకొని ఒక్కతీ లేచి పని చేసుకుంటోంది. కాస్త ఏదైనా సాయంచేస్తే బావుంటుంది. నాకే పనీ రాదుకదా ఖర్మ! లేచి వెళ్ళి పీట వాల్చుకుని కూర్చున్నాను.

"అప్పుడే లేచావేం?" అంది బియ్యం కడుగుతూ.

"నిద్రపట్టటంలేదు. నీకు జత కూర్చుందామని వచ్చేశాను."

"మంచివాడివి గానీ కొబ్బరి చిప్పలు కోరుకాలేమిటి?" అంది. ఆ కటిక చీకట్లోనే కడిగీ కడగనట్టు ముఖం కడిగేశాను. లేకపోతే అంత రాత్మ అరుస్తుంది కదా! కొబ్బరి నీళ్ళు ఒక్కణ్ణే తాగేశాను. భాను ఏవో పనులు చేసుకుంటూనే కబుర్లు చెపుతూంది. "కొబ్బరి కోరటం ఇంకా కాలేదూ? ఈ ఏలకులు మెత్తగా పొడుం చెయ్యి. ఇవిగో పీటమీద పెడుతున్నాను, తర్వాత జీడిపప్పు ఒలిచిపెట్టు. మరితొందరగా కానివ్వరా!" అంటూ హడావిడి పడుతోంది.

"బావుందేవ్! తెల్లారేసరికి వంటంతా నేర్చేపేలా వున్నావ్!" అన్నాను తాపీగా కొబ్బరి కోదుతూ.

"మంచిదేకదూ? నీ పెళ్ళాం సుఖపడుతుంది" అంది.

"దాని సుఖంకోసం నన్ను కష్టపెడతావేమిటి?"

"రేపు నీ సుఖంకోసం అది కష్టపడదూ?"

"ఎలాగైనా నిన్నటినుంచీ నువ్వు ఎక్కువ మాట్లాడుతున్నావు."

"సరేగాని అన్నయ్యా! ఏడాదికోనాడైనా మొగుడూ పెళ్ళాం వంటింట్లోకూర్చుని కబుర్లాడుకుంటూ పనిచేసుకుంటే సరదాగా వుండదూ?"

"వేరే అడగాలా? అయితే వెంటనే వెళ్ళి బావగార్ని లేపుకు రమ్మంటావా?"

"వెళ్ళు వెళ్ళు—నీ పళ్ళెం ఎక్కువయ్యాయేమో."

"బాపురే! శ్రీవారికి గుర్రం లక్షణాలుకూడా ఉన్నాయేమిటి!" అన్నాను అంతలో చటుక్కున గుర్తువచ్చి "భానూ! ఇన్ని పనులు ఎప్పుడు నేర్చేసుకున్నావు? కాఫీ పెట్టటం కూడా తెలిసేదికాదు. ఏడు గంటలవరకూ ముసుగు బిగించేదానివి. ఇప్పుడు...."

"ఇన్నాళ్ళకు నన్ను మెచ్చుకున్నవాడివి నువ్వు కనపడ్డావు. ఇదో పునర్జన్మ!"

"ఏమిటి భానూ! అలా మాట్లాడుతావు?"

దానికి జవాబు చెప్పకుండా "సరేగానీ ఏలకులు పొడుంచేశావూ? జీడిపప్పు ఒలిచావూ? అయ్యయ్యో! ఏం పనిరా! గొప్పగా చేస్తావని నీకు చెప్పాను. అన్నీ పెచ్చులు పెచ్చులే గిలి పోశావు. తొక్కలన్నీ చూర్ణం చేశావు" అంటూ నాలుగు తిట్టి తను మళ్ళా బాగుచేసుకోసాగింది. నేను అలిగి కూర్చున్నాను.

ఆరుగంటలయ్యేసరికి కారియర్లు రెండూ కట్టిపెట్టింది. నాకు వేన్నీళ్లు తోడి అంతలో నానిగాడు లేస్తే వాడికి నీళ్ళుపోసింది. తను స్నానంచేసి, అన్నీ సర్దిపెట్టి లేత నీలం జరీచీర కట్టుకుని ముస్తాబైంది.

బావగారు లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంటూ వస్తే టూత్‌బ్రష్ అందించింది. ఆయన స్నానంచేసి టిఫిన్ అదీ కానిచ్చి వీధి అరుగుమీదికెళ్ళేసరికి, ఎవడో ఒకాయన గుండెలు కవిలేలా పరుగెత్తుకుంటూ వచ్చి

వచ్చాడు. "రాజూ! రాత్రి మెయిల్లో రామం వచ్చాడోయ్! ఇవ్వాళ అదీ వారం కదా? నిన్ను కాఫీ అదీ అవగానే రమ్మని చెప్పమన్నాడు."

అదేం వార్తోగానీ వింటూనే బావగారి మొహం విద్యుద్దీపంలా వెలిగింది. "రామం వచ్చేశాడా? ఏం న్యూసు చెప్పావయ్యా! పద, పద-నీ వెనకే వస్తున్నాను. అలా మూర్తినికూడా పిలిచి వెళ్ళు" అనేసి లోపలికొస్తూ "భానూ! ఓ జతబట్టలు తీసిపెట్టు. బహుశా నేను మధ్యాహ్నం భోజనానికి రానేమో! అన్నట్టు సాక్సు మాసినట్టున్నాయి, మార్చిపెట్టు" అంటూ ఏవేవో ఆర్డర్సు చేసేస్తోంటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అదేమిటి? రాత్రి పిక్నిక్‌కి వెళదామనుకొన్న సంగతి మరచిపోయాడా?

భాను నసుగుతూనే అంది "ఇవ్వాళ తోటకి వెళదాం అనుకున్నాం కదూ? క్యారియర్లు కూడా సర్ది పెట్టేశాను."

"గొప్పపని చేశావ్! తోట ఎక్కడికీ పారిపోదులెద్దూ! మళ్ళీ వారం వెళదాం. ఏమండీ రావుగారూ! హాయిగా హోటల్నించి తెప్పుకున్నట్టు కారియర్లు విప్పుకొని అన్నా చెల్లెళ్ళిద్దరూ తినికూర్చోండి. ఏమంటారు?" అన్నాడు నవ్వుతూ నిజానికి నాకు చిరాకు వేసింది. కాని నవ్వి ఊరుకున్నాను. బట్టలు వేసుకొని వెళ్ళిపోయాడు. ఐదు నిమిషాల్లో జరిగిపోయిన ఈ హఠాత్సంఘటనకు నా మతిపోయినట్టే అయింది. నిట్టూర్చి తల తిప్పి చూస్తే భాను గుమ్మానికి తల ఆన్చి నిలబడి వుంది. కళ్ళల్లో నీళ్ళు నిలిచి వున్నాయి.

"ఛ! ఇంత మాత్రానికే ఏడుస్తున్నావేమిటి? ఫరవాలేదానివి. ఊరునించి స్నేహితుడొస్తే ఎవరికైనా సంతోషంకదూ? పిక్నిక్ కేముంది? మరోసారి వెళదాం. బావ అన్నట్టు కూర్చుని కబుర్లు చెప్పుకుందాం" అన్నాను ఓదార్పుగా.

భాను కళ్ళు ఒత్తుకుంటూ అంది—"నీకు తెలీదన్నయ్యా! ఆయన వెళ్ళింది స్నేహితుణ్ణి మాట్టానికి కాదు. ఈ పేకాట మూలాన్న నా సంసారంలో ఎన్ని సుఖాలు మాసిపోతున్నాయో నీకు తెలీదు."

నేను త్రుళ్ళిపడ్డాను. "భానూ!"

"అవునన్నయ్యా! నీకు ఎలా చెప్పను?"

తనకు తానై పిక్నిక్ కార్యక్రమం వేసి, అర్ధరాత్రి లేచి భార్యఅన్నీ చేస్తే....తీరా అంతా అధ్వాన్నం చేసిపోయింది, పేకాటకా? నా ఆశ్చర్యానికి అంతులేదు. అతను పేకాడుతున్నందుకు కాదు, భాను పేకాటని—సహిస్తున్నందుకు! పేకాడే వ్యక్తిని భరిస్తున్నందుకు! భాను ఏవగించుకునే విషయాల్లో పేకాట ఒకటి. "మగవాడు జూదరి అయితే అది సహించగలిగేశక్తి ఏ ఆడదానికీ ఉండకూడదు" అంది ఒకసారి చిన్నప్పుడు.

"భానూ! అంత తీవ్రంగా నిర్ణయం చేసుకోకు. ఈ రోజుల్లో పేకాట అనేది తిండికన్నా ముఖ్యావసరంగా మారిపోయింది. అలాంటి విషయాల్లో అంత అసహ్యం పెంచుకోవటం మంచిదికాదు" అంటే అదో రకంగా చూస్తూ—"అన్నయ్యా! నువ్వు నిజంగానే చెపుతున్నావా?" అంది. "అయితే మీ ఆయనకి పేకాట బాగా ఇష్టమనుకో. నువ్వేం చేస్తావు?" అన్నాను.

"ఏం చేస్తానా? మాన్పిస్తాను." ఎంత ధీమా!

"అతను వినకపోతే?"

"ఏమిటీ నువ్విలా మాట్లాడుతావు? భార్యాభర్తలు ఒకరు చెప్పింది ఒకరు వినకపోతే ఆ బంధమే నిరర్థకమనుకుంటాను."

నాకు ఏదో చెప్పాలని అనిపించింది. కానీ అంతకన్న ఎలా చెప్పాలో అర్థంకాలేదు. అదే భాను.... ఈనాడు! మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది నా శరీరం కంపించింది. ఆ సంసారం అంతా అర్థమైపోయినట్టు అనిపించింది. భాను ఏడవడం నేనెన్నడూ చూడనిది,

చూసినా సహించనిదీ. నెమ్మదిగా తలదగ్గిర కూర్చుని జుట్టు మీద చెయ్యి వేశాను. "ఎందుకు భానూ, ఏడుస్తావు?" అన్నాను.

కొంతసేపటికి కళ్ళు తుడుచుకొంది. "ఇదే నాకు మిగిలింది. ఏడిస్తే కొంత తేలిగ్గా ఉంటుంది."

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. భాను, సంసారంలో సుఖం, సంతోషం లేవు. నేను ఊహించిన భయాలేవో నిజమౌతున్నాయి.

"భానూ!" అన్నాను అప్రయత్నంగా. "నీ తెలివి తేటలతో బావని మార్చలేకపోయావా?"

"నీ చాతుర్యంతో రాయిని మనిషిని చేస్తావా? మనుషుల్లో రాళ్ళు కూడా ఉంటాయని నా కెప్పుడూ తెలీలేదు."

"భానూ! తొందరపడుతున్నావు సుమా! ఒక మనిషిని పాషాణం అవటానికి కారణాలు చాలా కావాలి. పేకాడటం అనేది అతి స్వల్ప విషయం."

భాను మాట్లాడలేదు. నేనే అన్నాను- "అసలు నీ ప్రయత్నాలు నువ్వు చేసి చూశావా భానూ?"

భాను కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నేను పూర్తిగా ఓడి పోయా నన్నయ్యా? ఈనాడు నా గర్వం అంతా మాసి పోయింది. ఈ రెండు సంవత్సరాలలో ఎన్నో నిజాలు తెలుసుకున్నాను" కళ్ళు ఒత్తుకుంది. "ఈ క్షణం వరకూ నా కష్టం, సుఖం ఎవ్వరికీ చెప్పుకోలేదు. ఆఖరికి అమ్మకి, సుశీలకికూడా తెలీనివ్వలేదు. మనసు కలత బారినప్పుడల్లా ఏనాటికైనా ఒక్క నీకు మాత్రం చెప్పుకోవాలనిపిస్తూ వుంటుంది. నువ్వు తప్ప నాకు ఎవ్వరూ లేరు. నీకు ఏం చెప్పను? ఎలా చెప్పను? నేను ఎంతో హాయిగా, సుఖంగా బ్రతుకుతున్నానని కలలుకంటున్న నీ కి

నిజాలు ఎలా చెప్పనన్నయ్యా?" తలగడమీదికి వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. భాను ఎందుకింత పిచ్చిగా తయారైంది? చూస్తోన్న కొద్దీ ఆశ్చర్యం ఎక్కువ అవుతూంది.

"బావ తరచూ పేకాడుతుంటాడా?" అన్నాను నెమ్మదిగా.

భాను కళ్ళెత్తి చూచింది. "తరుచనా? తరుచూ ఏం ఖర్మ? ప్రతి రోజూ! ప్రతిగంటా! ప్రతినిమిషం, క్లబ్బే యిల్లూ, వాకిలీ! పేకాటే సంసారం, పేకాట స్నేహితులే భార్యా బిడ్డలు. ఆయనకు మరేమీ వద్దు. ఇల్లు నరకం! భార్య రాక్షసి. కొడుకు శత్రువు, మరేం చేస్తారు?"

నేను కొంతసేపు ఆలోచించాను. "భానూ, నీకు కష్టంగానే వుంటుంది. కానీ ఎదుటివాళ్ళ పరిస్థితులు కూడా కొంచెం అర్థం చేసుకోవాలి చూడూ, ఈ ఆధునిక యుగాన్ని నువ్వూ ఆమోదిస్తావు. ఇష్టపడతావు. దేశకాల పరిస్థితుల్నిబట్టి మారే విషయాల్ని కొంతవరకైనా మనం అలవాటు చేసుకోవాలి సిగరెట్లూ, షికార్లూ, పేకాటలూ, క్లబ్బులూ, సినిమాలూ, జల్సాలూ, ఇవన్నీ మనం కోరుకునే నవనాగరికత ప్రభావమే, ఒక స్నేహితుడు సిగరెట్ ఇస్తే థాంక్స్ చెప్పి అందుకోకపోతే అసభ్యత. పదిమంది కలిసి పేకాడాలన్నప్పుడు వెనుకంజవేస్తే పిరికితనం! రోడ్డుమీద కలిసినవాళ్ళయినా హోటల్‌కి తీసికెళ్ళి కాఫీ పోయించకపోతే అమర్యాద! తనకు సినిమామీద బుద్ధి పుడితే స్నేహితుల నాహ్వానించకుండా ఒక్కడూ వెళ్ళవస్తే సిగ్గుచేటు, మంచో చెడో కొన్ని పనులు అనివార్యంలా తయారౌతున్నాయి. ఈనాడు అన్నిటినీ మంచిగానే ఆమోదిస్తున్న మగవాళ్ళు దేనికీ వెనుకంజ వెయ్యరు. కాల ప్రభావాన్ని బట్టి మంచిగానీ, చెడ్డగానీ అలవాటు చేసుకోవాలి భానూ."

"పిడిదిలో బావగారు నీకు సిగరెట్ ఇవ్వబోతే తిరస్కరించావన్నావు, గుర్తుందా?"

"దానికి దీనికి ముడిపెట్టకు భానూ, ఇద్దరు వ్యక్తులు ఒకే విధంగా ఎలా ప్రవర్తిస్తారు? నిన్న బావగారు నన్ను ఆడపిల్లనని ఎలా హాస్యం చేశారో చూశావా? నేను సిగరెట్లు కాల్చననీ, పేకాడననీ, నాకే సరదాలూ లేవనీ కదా ఆయన ఉద్దేశ్యం? చెడ్డ అలవాట్లకి దూరంగా వుండేవాడు లోకం దృష్టిలో అసమర్థుడు! పిరికివాడు! అందుకే చాలామంది ఏదో గొప్పకోసం జల్సాలన్నీ అలవాటు చేసుకుంటారు. అది వారివారి మనస్తత్వాల్ని బట్టి వుంటుందనుకో నేను అనేదేమిటంటే, కాలంతోపాటు వచ్చిపడే ఇటువంటి విషయాల్ని సరదాలుగానే తీసుకోవాలిగానీ, పెడ్డగా మనసుకు పట్టించుకో కూడదు. మాన మర్యాదలలోనూ, కట్టూబొట్టూ తీరులోనూ అసహ్యంగా ప్రవర్తిస్తూన్న అమ్మాయిలు ఎంతమందిలేరు భానూ! ఆ నైలాన్ చీరెలూ, ఒంటినిండా రకరకాల రంగులూ, జుట్టు కత్తిరింపులూ, ప్రతి మగవాడి తోటీ రాసుకు తిరగటాలూ-అవన్నీ చూస్తే వాళ్ళనెంత నీచంగా చూడా లంటావు? కానీ నిజానికి అలా చూస్తున్నామా? కాలం మారింది. వేష భాషల్లోకూడా మార్పులొచ్చాయి. వాళ్ళవాళ్ళ సరదాకొద్దీ ఏదో అలంక రించుకుంటున్నారు- అనుకుని సమర్థించుకోవటంలేదా? అలాగే మగవాడి అలవాట్లలోకూడానూ. అయినా ఈ వ్యసనాలకు మగవాళ్ళే అలవాటు పడ్తారని అనుకుంటున్నావు గానీ, సిగరెట్లు కాలుస్తూ, మగవాళ్ళని మించి పేకాడే 'సొసైటీ లేడీస్'ని ఎంతమందిని చూపించమంటావు?

"అక్కర్లేదు. లేరని నేనెప్పుడూ అనలేదు. నేను స్త్రీ జాత్యాభి మానంతో మాట్లాడటంలేదు తప్పు అనేది ఎవరు చేసినా తప్పే? అమ్మా యిల విషయంలో నువ్వు ఎత్తిచూపిన అవలక్షణాలేమీ నాకు లేవనే అనుకుంటున్నాను; ఆ సంగతి నీకూ తెలుసు. బావగారు నాకు పెళ్ళి బట్టల్లో ఒక నైలాన్ చీరకూడా తీసుకొచ్చారు. అది కట్టుకోవటం నాకు నచ్చదు: అయినా బావగారికోసం నాలుగైదుసార్లు కట్టుకున్నాను. ఇప్పటికీ అలాగే వుంది. నేను ఫాషన్‌గా టాయిలెట్ చేసుకోననీ, నిరాడంబరంగా

ఉంటాననీ బావగారికి నచ్చదు. విపరీతమైన బావగారి వ్యసనాలు నాకు నచ్చవు. నువ్వు అన్నట్టు చెడ్డవైనా కొంతవరకూ అయితే భరించవచ్చు. ఏవి చేసినా మితిమీరనంతవరకూ సరదాలూ, మీరితే వ్యసనాలూ! కాదంటావా? పండుగరోజు ఒక్కపూట భర్తతో గడపాలనే అతిసామాన్యమైన కోరిక తీర్చుకోలేని దౌర్భాగ్యపు స్థితిని ఎలా సమర్థించుకోను? అర్థంలేని ఈ నాగరికతనీ, ఈ సభ్యతలనీ ఎలా భరించను?" భాను క్షణం ఆగింది. "ఒక విషయం విను అన్నయ్యా! నీకు పరిస్థితి తెలుస్తుంది. మొన్న సంక్రాంతికి అమ్మ ఉత్తరం రాయించినా నేను వెళ్ళలేదు. అప్పటికి ఒక్క పండుగకూడా ఇక్కడ చేసుకోలేదు. సంక్రాంతి ఇక్కడే చేసుకోవాలని ఉండిపోయాను. పండుగ పది రోజు లుందనగానే ఎన్నో ఆలోచించుకున్నాను. ఎన్నో నిర్ణయించుకున్నాను, ఆ నాలుగు రోజులూ నేనేం చీరలు కట్టుకునేదీ, బాబుకి ఏయే చొక్కాలు తొడిగేదీ, ఏమేమి టిఫిన్లు చేసేదీ, ఏమేమి వంటలు వండేదీ, ఒకటేమిటి? అన్నిటికీ పట్టీరాసి పెట్టుకున్నాను. అన్నీ బావగారికి చెప్పేను. పండగ నాలుగురోజులూ కొత్త కొత్త టిఫిన్లు చేసుకు తిని కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం. సాయంత్రాలు ఎక్కడైనా వెళ్ళివద్దాం. ఈ పండగ సంతోషంగా జరుపుకోవాలని ఉంది. ఎప్పుడూ మిమ్మల్ని ఏమీ అడగలేదు ఆ నాలుగు రోజులూ ఇంట్లో ఉండాలి మీరు. ఈ ఒక్కసారైనా కనీసం నాకోసం'.... అన్నాను. ఎంత సిగ్గువిడిచి అడిగానో గ్రహించగలవా? అలా అడిగే అడగవలసినఅవసరమే రాకూడదు. గృహస్థులకే ఆ లక్షణం ఉండాలి! ఆయన ఏమీ చెప్పలేదు. నవ్వి ఊరుకున్నారు. నా కోరికని తోసివెయ్యరని గర్వపడ్డాను. భోగి ఉదయం ఎంతో సంతోషంగా పనులు ప్రారంభించాను. తలంట్లు అయ్యాయి. టిఫిన్ తిని ఆయన పేపరు చదువుకుంటూ కూర్చుంచే నేను వంటగదిలో పని చేసుకుంటున్నాను. ఒక్క అరగంట కాబోలు గడిచింది. ఆయన పంటింటి గుమ్మం ముందుకొస్తూ 'ఏం పూసుపోవటంలేదు భానూ' అన్నారు.

"ఒక్క పావుగంట కూర్చోండి, వచ్చేస్తాను" అన్నాను.

"అబ్బా! ఇలా చేతులు ముడుచుకొని ఇంట్లో కూర్చుంటే చిరాగ్గా ఉంది అలా కాస్సేపు బయిటికి వెళ్ళొస్తాను."

నేను ఆశ్చర్యంగా తలఎత్తి చూశాను. "ఇప్పుడు బయటికి వెళ్తే మీరు వచ్చినట్టేనా? కనీసం ఈ పండగ రోజులైనా...."

"ఏమిటో నీ సోది. పండుగ కాబట్టే పదిమందీ చేరతారు. ఇలా ఇంట్లో కూర్చుని ఏం చెయ్యమంటావ్?"

ఇంట్లో కూర్చుని ఏం చెయ్యమంటావట! ఇళ్ళల్లోనే ఉండే వ్యక్తులంతా ఏం చేస్తున్నారు? చెప్పిందంతా ఏ గంగలో కలిసిపోయింది? కోపం వస్తూన్నా నెమ్మదిగా అన్నాను. "మనం ఇద్దరం ఉంటేనే మీకు తోచదంటున్నారు కదా? మీరు వెళ్ళిపోయి నేను ఒక్కదాన్నీ ఉంటే నాకెలా తోస్తుంది, చెప్పండి?"

"అందుకని నీకు నన్ను కాపలా కాయమంటావేమిటి? ఏ పక్కవాళ్ళింటికో వెళ్ళు"

నా కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి. "ఇంట్లో మనిషి, మీరు ఇల్లు విడిచి తిరుగుతూంటే, నేను వాళ్ళనీ వీళ్ళనీ దేవిరిస్తూ వెళ్ళనా? పండగ పూట మన ఇంటి తలుపులు మూసుకొని ఎవరింటికైనా వెళ్ళి కూర్చుంటే బావుంటుందా? అందరి మగవాళ్ళూ ఇళ్ళల్లో ఉండటంలేదా? మనిమిద్దరం కలిసి పండుగ చేసుకోవాలనే సరదా నాకేప్పుడు తీరేది?"

"నీ ప్రశ్నలకి నువ్వే మురిసిపోవాలి. ఎక్కడికీ వెళ్ళకపోతే బాబుని పెట్టుకుని ఇంట్లో కూర్చో. నేను మాత్రం ఆడదానిలా కూర్చోలేను."

నేనేం మాట్లాడలేదు. కూరముక్కలు తరుగుతూ తలదించుకున్నాను. కళ్ళలోంచి నీళ్లు జలజలా రాలిపడ్డాయి. తనకోసం ప్రాధేయపడే భార్యబిడ్డల్ని నిర్లక్ష్యంచేసి, బయట పదిమందికోసం పాకులాడే ఆ సంసా

రికి అంతకన్నా ఏం చెప్పను? కనీసం ఆ నాలుగు రోజులూ ఆయన్ని ఇంటిపట్టున ఉంచుకోవాలని కోరటం తప్పా? నా వాళ్ళతో నేను పండగ సంతోషంగా జరుపుకోవాలని తపించటం అన్యాయమా? అంత సామాన్య మైన కోరిక యెందుకు తీర్చుకోలేకపోయాను?

నిండూతున్న కళ్ళని మాటిమాటికీ తుడుచుకుంటూ బాబుని దగ్గర పెట్టుకుని కూర్చున్నాను. పది... పన్నెండు... మూడు... ఐదు... ఎనిమిది వదకొండు! అర్ధరాత్రి పదకొండు గంటలకి తిరిగి రాక! లేచి అన్నం వడ్డించాను. ఉదయం చేసిన పులిహోర. సగ్గుజావ అలాగే ఉన్నాయి. నేను రుచి కూడా చూడలేదు. ఇంటికి వచ్చారన్న సంతోషం నిమిషమైనా నిలవ కుండా, అన్నం తిన్న చేతి తడైనా ఆరకుండా, తిరిగి బట్టలేసు కొంటూంటే....ఆ పరిస్థితి ఎలా చెప్పను? నా ఒళ్ళు కోపంతో, దుఃఖంతో కంపించిపోతోంది. అకస్మాత్తుగా తల బద్దలై ఆ వ్యక్తి కళ్ళ ఎదుట నేను చచ్చిపోతే? ఏదైనా అజ్ఞాత శక్తి ఆయన్ని ఆపితే? అశరీరవాణి దూషిస్తే? ఏమౌతుంది? వెళ్ళబోతూన్న మనిషి చెయ్యి నేనే పట్టుకున్నాను. "ఇంతరాత్రి....ఒక్కదాన్ని....బాబుతో....మళ్ళీ వెళతారా?" అంతకన్నా కంఠం పెగలలేదు?

"ఛీ! ఎందు కీమాత్రానికే శోకాలు పెడతావ్? నేనేం దేశాలు తెగించి పోతున్నానా? స్వాతంత్ర్యం, సమానత్వం కావాలని లెక్చర్లు దంచు తారే! ఒక్కరాత్రి ఒంటరిగా ఉండలేవూ? మరేం పర్వాలేదు. తలుపేసుకు పడుకో."

నేను పౌరుషపడి సంభాషణ విరమించుకోవచ్చు. కానీ, ఆ మనిషిని మార్చుకోవలసిన అవసరం, బాధ్యతా నా మీద ఉన్నాయి. ఎంతో సాత్వి కంగా అన్నాను. "పగలంతా అక్కడే ఉన్నారు. రాత్రికూడా ఏమిటి చెప్పండి? ఇరవై నాలుగ్గంటలూ ఇల్లు పడిచి ఏమిటీ సరదాలు?"

"అంతమాత్రం నాకూ తెలుసుగానీ నువ్వు నోరు మూసుకుందూ! ఎప్పుడూ ఇల్లూ వాకిలీ, పెళ్ళాం, కొడుకూ, దొడ్డీ, నుయ్యీ, చీపురు కట్టలూ, అన్నంకంచాలూ వెదవసొద! ఉత్త రోజుల్లో ఎలాగూ ఆ ఆఫీసులోపడి కొట్టు కుంటూనే ఉంటాం. వంటగదిలో పడి తన్నుకొనే నీకేం తెలుస్తాయి మగవాడి సరదాలు? మహా అడగొచ్చావ్?"

"సరదాలనేవి మగవాటి స్వంతంకావు. ఆడదానికీ ఉంటాయి. అవి తీర్చాలనే ధ్యాసే మీకు లేదు. ఆ వంట గదిలోపడి తన్నుకో లేకకదూ మీకోసం దేవిరించటం?"

"అక్కర్లేదు. అది నీకు అలవాటే!"

ఆ రాత్రి ఎంత ఏడిచానో ఆ తిరస్కారం ఎలా భరించానో ఎవరికి తెలుసు? నేను ఏడిస్తే ఎవరు బాధపడాలి? నేను అలిగితే ఎవరు బ్రతిమిలాడాలి! ఆయన చేసే తప్పులు నేను ఎత్తి చెపుతాననీ, విమర్శిస్తాననీ నా మీద ఆయన కోపం. నేనంటే ఇష్టపడకపోవటానికి అదే కారణం! ఆయనకి మంచి అలవాట్లు తక్కువ. ఆయన్ని మార్చటానికి ప్రయత్నించ కూడదు. వాదించకూడదు. విమర్శించ కూడదు. ఆమోదించాలి. ప్రోత్సహించాలి. ఎలా చెయ్యగలను?

ఆ పగలు నేను అన్నం తినలేదు. ఆ రాత్రి కూడా ఆకలి వెయ్యలేదు. కానీ బాబుకోసం.... తల్లిని! బాబుని పస్తు ఉంచగలనా? అన్నం తిని బాబు పక్కలో పడుకున్నాను. ఎవరు నిద్రపోక పోయినా తెల్లవారుతుంది ఆ రోజు పెద్దపండుగ. సంక్రాంతి! నేను ఎర్ర జరీచీరె కట్టుకుని బాబుకి తెల్ల సిల్కు బుష్‌కోటు తొడగాల్సిన రోజు! కోవా చేసుకుని తిని, కొత్త సినిమా చూడాల్సిన రోజు! కానీ కన్నీళ్ళతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలకలేకపోయాను. సాధారణంగా వంట కానిచ్చి బాబుకి మాత్రం కొత్తబట్టలు తొడిగి కూర్చున్నాను. మధ్యాహ్నం పన్నెండుకి కాబోలు వచ్చారు. అన్నం వడ్డించాను పచ్చడితో, చారుతో,

"ఇవ్వాళేం చెయ్యలేదా?"

"లేదు."

"ఏం""

"ఎవరికోసం?"

"నేను చచ్చాననుకొన్నావా?"

"...............?"

"పండుగపూట అంతా హాయిగా వండుకు తింటారు. ఏమిటీ దౌర్భాగ్యం? ఏం నేను భోజనానికి రావటం లేదా? లేకపోతే రావద్దనా నీ ఉద్దేశ్యం?"

"మిమ్మల్ని ఇంటికి రమ్మనో, పొమ్మనో నా ఉద్దేశ్యం ఏమిటో మీకు తెలుసు. మీరు ఇంట్లో లేకుంటా నాకేం చెయ్యా లనిపించలేదు."

"ఓహో! నేను ఇంటికి రాకపోతే వంటా గింటా మానేసి పడు కుంటావన్నమాట. ఎన్నాళ్ళు పంతం పడతావో నేనూ చూస్తాను. నీకు అనిపించటం అనిపించకపోవటం నా కవసరంలేదు. పండుగరోజుల్లో ఏదో ఒకటి చెయ్యాల్సిందే—నీ పంతం సాగించుకో మరి చూస్తాను."

"పంతం! ఒక ఆడది పంతంపట్టి గెలుస్తుందని మీరు అనుకోవటం భ్రమ! పంతానికిపోయి నేను వంటమానలేదు."

"కాకపోతే గర్వం! నిర్లక్ష్యం! అంతేనా?"

"............"

"మాట్లాడవేం? ఏ ఉద్దేశ్యంతో మానేసినట్టు?

నాకు దుఃఖం పొర్లి పొర్లి వచ్చింది. పిచ్చిదానిలా వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాను.

"ఛీ! ఇంటి కొచ్చేసరికి ఏడుపు ముఖం! పండుగాలేదూ పాడూ లేదూ. ఎప్పుడూ ఏడుపు ఏడుపు! ఇక నీ బ్రతుకింతే. చచ్చేటప్పుడు కూడా ఏడుస్తూనే ఉంటావు."

అన్నం కెలికేసి గదిలోకి వెళ్ళి పడుకున్నారు. నేను ఎంతోసేపు అలాగే కూర్చున్నాను. ఒక మనిషిని మరో మనిషి న్యాయాన్యాయ విచక్షణ లేకుండా నిలబెట్టి దండించటానికీ, నోటికి వచ్చినట్టు తిట్టటానికీ ఎక్కడిదా శక్తి? అది అందరికీ ఎందుకు లేకపోతోంది? పండుగపూట అంతా పిండివంటలు వండుకు తింటారుగానీ, భార్యా బిడ్డలతో కాలం గడపరూ? అది అడిగే సాహతు నాకులేదు. భగవాన్! నీ దృష్టిలో ఇంత పక్షపాతమా? ఒక మనిషి మరో మనిషికి బానిసా? కనీసం నా ఉద్దేశ్యాలు చెప్పుకోటానికి వీలైనా నన్నీ మూగబాధ వేధించకపోవునే!

మధ్యాహ్నం ఇంటిలోనే ఉంటారనుకుని అప్పటికప్పుడు పొయ్యి అంటించి రవ్వ లడ్డూలు చేశాను. స్నానంచేసి వచ్చేసరికి పక్కమీద మనిషి లేరు. స్టాండున బట్టలు లేవు. వరండాలో జోళ్ళులేవు. ఆశ్చర్యపోవటానికి గానీ, దుఃఖపడటానికి గానీ నాకు శక్తిలేదు. ఆయన ఏం చేస్తున్నా పట్టించుకోకుండా ఊరుకోవాలి. ఏ రాత్రి వచ్చినా నవ్వుముఖంతో హాజరవ్వాలి. మనసెంత వికలమైనా లక్షణంగా లాంఛనాలు జరపాలి. అదే నాకు చేతకాదు. నాకు అభిమానం లేదూ? నా మనసు బాధపడదూ? అరదానినైనా నాకు అన్నిలక్షణాలూ ఉన్నందుకే ఈ శిక్ష. చాలదూ?

తీరని వేదన ప్రసాదించి సంక్రాంతి లక్ష్మి వెళ్ళిపోయింది. అమ్మ కోరిక మన్నించి పుట్టింటికి వెళ్ళివుంటే అక్కయ్యలతో, చెల్లెళ్ళతో, పదిమంది చుట్టాలతో, అమ్మ ప్రేమాభిమానాలతో....అన్నిటినీ తిరస్కరించి నేనేం కోరుకున్నాను? ఏం జరిగింది?

పండుగ వెళ్ళగానే అమ్మ ఉత్తరం రాయమంది. అమ్మ సంతోషం కోసం అబద్ధాలు కల్పించి రాయాలి. నాలుగవనాటి తెల్లవారుఝామున ఉత్తరం రాస్తూ కూర్చున్నాను.

అమ్మా!

ఇక్కడ మేమంతా కులాసా. మీరంతా క్షేమమని తలుస్తాను. బాబు ఆరోగ్యంగా ఉన్నాడు. మేము పండుగ చాలా సరదాగా చేసుకున్నాము.

భోగినాడు తెల్ల జరీచీర, పెద్దపండుగనాడు చిన్నక్కయ్య పెట్టిన ఎఱ్ఱ జరీ చీర కట్టుకున్నాను. నాలుగురోజులూ నాకు చేతనైన టిఫెన్లు చేశాను. ఎంతైనా మన వూరు వచ్చేస్తే ఇంకా చక్కగా ఉండేది సుమా"-కళ్ళల్లోంచి నీటి బొట్లు అక్షరాలమీద పడ్డాయి. పైటకొంగుతో మెత్తగా ఒత్తుకున్నాను.

తలుపు చప్పుడైంది. వెళ్ళితీశాను. ఎఱ్ఱగా జేవురించిన కళ్ళతో గబగబా నడుస్తూ వచ్చి మంచంమీద కూర్చుండిపోయారు. "పేకాటో పేకాటో అని గోల పెట్టావుగానీ, దానివల్ల ఎంత సంపాదించానో తెలుసా? నూటముప్ఫై రూపాయలు! నాలుగు రోజుల్లో, నువ్వన్నట్టు ఇంట్లో చేతులు ముడుచుక్కూర్చుంటే ఈ డబ్బు ఎలా వచ్చేది? ఏభై రూపాయలు తీసుకుని నీకు కావలసిన చీరేదైనా కొనుక్కో!"

నేను నవ్వాను. ఆ నవ్వులో ఎన్ని అర్థాలు ఉన్నాయో ఆయన వంటివాళ్ళు ఎప్పుడూ తెలుసుకోలేరు. "అన్యాయమైన డబ్బుకోసం దేవిరించే దుర్మార్గుడా! నీలాగే మనుషులంతా మానవత్వం మరిచిపోయారా? గాయపడిన ఎదుటి హృదయాన్ని నీ డబ్బుతో ఆనందపరచగలవా? నీ కోసం నీ భార్యా బిడ్డ లెంత విలపించారో, నీ తిరస్కృతికి ఎంత క్రుంగిపోయారో - అది ఏనాటికైనా నీకు అర్థమౌతుందా? నీచమైన డబ్బుకోసం నీ వాళ్ళని ఏడిపించే నువ్వు, భార్య కన్నీటికైనా కరిగిపోని నువ్వు, మనసే లేని నువ్వూ ఓ మనిషివా? ఈ సత్యం నీకు ఏనాటికైనా తెలిసి వస్తుందా!" అని నిలదీసి అడగాలనీ, కసిదీరా తిట్టాలనీ పరవళ్ళు తొక్కే మనసుని మందలించి నవ్వాను. "నా శరీరానికి గుడ్డలులేని గతేవొస్తే అగ్ని ముట్టించుకుని మస్సై మానం కాపాడుకుంటానుగానీ అటువంటి పాపిష్టి డబ్బుతో........"

'హ్హాహ్హాహ్హా!' అంటూ ఫకాళించి నవ్వటం ప్రారంభించారు. "ఆహా! ఆదర్శవాదీ! ప్రతి ఆడదీ ఇటువంటి గొప్ప చచ్చు ఆదర్శాలు పెట్టుక్కూర్చుంటే........"

"ఏనాడో బాగుపడేది."

'కాదు, కాదు— మగమహారాజులంతా ముక్కు మూసుకుని సన్యాసం స్వీకరించవలసిందే మరి. ఏ స్నేహితుడింట్లో పేకాట పెట్టినా ఆడవాళ్ళు కాఫీలు చేసి మరీ ఇస్తారు."

"దౌర్భాగ్యులు చెయ్యగలిగిం దేముంది మరి? బానిసలు!"

'అది వాళ్ళ దౌర్భాగ్యం కాదు. నీదీ! సరే, నీఖర్మ! హాయిగా నేనే ఉలెన్ పాంటు కుట్టించుకుంటాను."

"భగవంతుడా! నీకు కోటి నమస్కారాలు!" తేలిగ్గా గాలి వదిలాను. పంతానికి తనే చీర తెచ్చి కట్టుకోవాలని అంతపెడితే తిరస్కరించగల శక్తి ఉందా? ఉత్తరం రాస్తూ కూర్చున్నాను.—

"ఏమిటి రాస్తున్నావ్?"

చటుక్కున ఏదో స్ఫురించింది "కథ!"

"ఏం కథ?" ఆశ్చర్యంగా.

"మొగుడు పేకాట కెడితే పెళ్ళాం ఏడిచే కథ!"

"ఎందుకూ? తనని కూడా తీసికెళ్ళలేదనా? వెధవ చమత్కారం! ఇంటికి వచ్చేసరికి ఏదో తగూ! పేకాటాడటం తప్పని ఏ వెధవ అంటాడో రమ్మను చెప్తాను. నేనేం తాగి తందనాలాడుతున్నావా? అడ్డమైన కొంపలకి పారా కాస్తున్నానా? ఏమిటీ నీ ఉద్దేశ్యం?"

"తాగినా, తందనాలాడినా, దొంగతనం చేసినా, ఖూనీలు చేసినా ఎవడు చేసేపనిని వాడు సమర్థించుకుంటూనే ఉంటాడు. అవి తప్పులని మీరు విమర్శించడం."

అభిమానంకోసం కన్నీరు జారకుండా చెంప పట్టుకొని దొడ్డి వేపుకు నడుస్తోంటే "దర్టీ రాస్కెల్! నిద్ర పోదామని వచ్చేసరికి లైట్లు వేసుక్కూచుని కథలు రాస్తోందట, కథలు! మహారచయిత్రి మరుగున పడిపోయింది మరి! మాటకు మాట ఎంత గర్వం!" మాటలు వినిపించాయి.

"న్యాయం కానీ, అన్యాయం కానీ అధికారానికి అలవాటుపడ్డ మగవాడు ఆడది నోరెత్తి జవాబు చెప్తే సహించలేడు. తననే నమ్మి బ్రతుకుతూన్న భార్యాబిడ్డల్ని సుఖపెట్టలేని పరోపకారి, బురఖా స్నేహితుల కోసం సర్వస్వం ధారపోయగలడు. వీధి దీపమైనా వెలిగించి 'దుబారా' చేయని పొదుపరి, విలాసాలకోసం వందలికి వందలే ఖర్చు చేయగలడు! తను కోరిందే కోరిక! తను జరిపేదే సరదా! తను చెప్పిందే న్యాయం. తను పెట్టిందే ఆంక్ష! ఇప్పుడు చెప్పు. ఏ అవసరాలు చూసి ఎదటివాళ్ళ పరిస్థితులు అర్థం చేసుకోవాలంటావు?"

ఒకే ధ్యానగా వింటూన్న నేను; భాను దాంపత్యంలో అనురాగం, మమకారం తప్ప మరో భావం ఉంటుందని ఊహించలేని నేను; కొంత నిజం తెలుసుకున్న ఆ సమయంలో ఏం చెప్పను? ఏమీ మాట్లాడలేక మూగగా ఉండిపోయాను. భాను హృదయంలో భర్తమీద, మగవాడి మీద ఇంత కసి! ద్వేషం!

నేను అన్నాను—"భానూ! నువ్వు చెప్పేది నేను అర్థం చేసుకోకపోలేదు. ఒక విషయం వింటావా? మన ఆశలూ, ఆశయాలూ, కోరికలూ, అభిరుచులూ ఒక్క నిమిషం అలా వుంచు. బావ చిన్నతనం నుంచీ ఆలనా, పాలనా లేక, ఎవరి భయభక్తులూ లేకుండా ఇష్టానుసారం తిరిగి పెరిగిన వ్యక్తి అతను ఏది అనుకొంటే అదే జరిగితీరాలనే పట్టుదల! అది మూర్ఖత్వమైనా, పెంకితనమైనా ఏదైనా ఒకటే. అర్థంలేని స్వేచ్ఛ మనిషిని ఎన్ని దుర్వ్యసనాలపాలు చేస్తుందో గ్రహించలేవా?...."

"ఆగు! పెళ్ళికి ముందు బావని గురించి చెప్పావే, అప్పుడు నీకీ అనుమానం రాలేదా? అలా గాలివాలుకి పెరిగిన వ్యక్తిలో వ్యసనాలు వుంటాయని అప్పుడు నువ్వు నాకు చెప్పివుంటే. అన్నయ్యా...."

"భానూ! ఎంత పిచ్చిగా మాట్లాడుతున్నావు! ఇప్పుడతని ప్రవర్తనని బట్టి ఇలా నమర్థించుకోవా లంటున్నాను. జరిగిపోయినదానికి విచారిస్తామా?

పాతిక సంవత్సరాల పెరుగుదలలో ఒక్కసారిగా మార్పు రావాలంటే సాధ్యంకాదు భానూ! ఓర్పు వహించాలి. ఆవేశపడకు."

"అన్నయ్యా! పండగపూట ఒక్కరోజు ఇంట్లో వుండమని ప్రార్థించిన భార్యని తోసిపుచ్చిన వ్యక్తికి ఎన్ని తరాలకు మార్పు వస్తుందంటావు? నా ఓర్పుకి ప్రయోజనం ఏమిటంటావు?"

"తొందరపడకు భానూ! నేను బావని సమర్థించటం లేదు. నువ్వు శాంతం వహించడంకంటే మరో మార్గం వుందా చెప్పు? అతనికి పేకాట పిచ్చి తప్పితే, నీ మీ దేమైనా ద్వేషమంటావా? నువ్వే ఆలోచించు."

భాను నిట్టూర్చింది, "నీకు తెలిసింది చాలా తక్కువే అన్నయ్యా! నువ్వు ఇక్కడికి చదువుకొస్తానని రాస్తే నాకు భయం వేసింది, నా సంసారం నీకు అర్థమైపోతుందని. కాని ఈనాడు నాకై నేను అంతా బయట పెట్టుకుంటున్నాను. నేనేంచెప్తే ఈ బాధ నీ కర్థమౌతుంది? ఎంత దిగులుతో క్రుంగిపోతున్నానో నీ కెలా బోధపడుతుంది? అది నీకు నువ్వే తెలుసుకోవాలి. అంతే"

నేను వింటూ ఊరుకున్నాను. ఏదో అడగాలని వుంది. కానీ ఇది సమయంకాదు. భాను స్వతహాగా ఆవేశం కలది. భర్త ప్రవర్తన అనుచితంగా తోస్తే, తన ఆశలు దెబ్బతింటే, బాధే కలుగుతుంది మరి. బావను మించిన జూదగాళ్ళను వందల మందిని చూస్తూన్న నేనుకూడా తొందర పడటంలో అర్థంలేదు. ఆ వెర్రిలో వాళ్ళు ఏం చేసినా ఆశ్చర్యపడాల్సింది లేదు.

నెమ్మదిగా సంభాషణ మార్చాను. స్కూలు జీవితం గుర్తుచేశాను. ఆనాటి స్నేహితులందర్నీ జ్ఞాపకం చేశాను. యూనివర్శిటీ కబుర్లు చెప్పకొచ్చాను.

పన్నెండు దాటింది. "ఆకలేస్తోంది ఖానూ!" అన్నాను.

ఖాను చటుక్కున లేచి - "మాటల్లోపడి కూర్చుండిపోయానురా, వెళదాం!" అంది. మౌనంగా క్యారియర్లు విప్పి వడ్డించింది.

ఏ క్షణాని కేం జరుగుతుందో తెలీదంటారు ఇదే కాబోలు, తోటలో చెరువుగట్టున మర్రిచెట్టు క్రింద కూర్చుని తినాలనుకున్న సరదా ఏమైందనీ!

"నువ్వు వున్నావు కానీ, లేకపోతే ఈ పూట ఇవి ఇలాగే ఉంటాయి" అంది ఖాను.

"అదే పొరపాటు! నువ్వు చెయ్యాల్సింది ఉపవాసాలూ, ఫలాహారాలూ కాదు. కనీసం నువ్వు అన్నం తినలేదని తెలుసుకొనేవాళ్ళయినా లేరుకదా? ఆకలి తీరటానికి, కడుపుకోసం ఇంత తిండి తినటానికి అభిమానం ఎందుకూ?"

"ఏమో అన్నయ్యా! ఈ ఇంట్లో అనుకున్నది చేస్తామో లేదో, వండుకున్నది తింటామో లేదో తెలీదు దానికి కారణం ఆయన ఒక్కరే అని నేనూ అనను. నేమా ఏదో పొరపాట్లు చేస్తూనే వుంటాను. టిఫిన్ పెట్టినదాన్ని మంచినీళ్ళివ్వటం మరిచిపోతాను. ఒక్కోసారి పంచదార వేయకుండానే కాఫీ కలిపి ఇచ్చేస్తాను. మజ్జిగ గిన్నెలో ఉప్పురవ్వ వడె య్యాలని గుర్తే రాదు. అవి కేవలం మతిమరుపు వల్ల జరిగే పొరపాట్లే కావచ్చు. కాని వాటి పర్యవసానం చాలా తీవ్రంగా వుంటుంది. నేను తనని నిర్లక్ష్యం చేస్తున్నాననీ, తన పనులంటే ఇష్టంతో చెయ్యటంలేదనీ, తన మీద నాకు ఏమాత్రం గౌరవం వున్నా అలా అలక్ష్యంగా ప్రవర్తించననీ నా మీద కోపం-వాటికి నేనేమీ సమాధానాలు చెప్పుకోలేను. చెప్పినా ప్రయోజనం లేదు."

"నువ్వేం చెప్పినా నాకవసరంలేదు. మరిచిపోయే చెయ్యలేదో, జ్ఞాపకం వుండే చెయ్యలేదో నేను ఆలోచించను. నా కంటికి కనిపించిందే

నిజం. నా మీద నీకు ఏ మాత్రం గౌరవం వున్నా శ్రద్ధగా అన్నీ చేసే దానివి. అది లేకపోబట్టే మరుపు వస్తుంది." అదీ తర్కం.

"నేను చేసింది పొరపాటు. అంతవరకే. ఆ పొరపాటు చెయ్యటంలో నా ఉద్దేశాలు మాత్రం ఆయన ఊహించేవి కావు. ఆయన్ని నిర్లక్ష్యంచేసి అగౌరవ పరచడం వల్ల నాకు ఒరిగిందేమీలేదు. అలాచెయ్యటానికి నా అంతరాత్మ ఒప్పదుకూడా. పంచదారలేని కాఫీ ఇచ్చినప్పుడు 'భానూ! కాఫీలో పంచదార వెయ్యటం మరిచిపోయావు. తీసుకురా! అంటే ఎంత చక్కగా ఉంటుంది! ఆ పొరపాటులో పెడర్థాలు తీసి తిట్టిపోస్తే ఏం గొప్పగా ఉంటుంది? నేను చేసే తప్పులు క్షమించరానివీ, సమర్థించుకోలేనివీ కావు. అంతమాత్రపు సమర్థన భార్యాభర్తల్లో ఉండనవసరంలేదా? అనే ఆయనకు లేదు. తీవ్రమైన అభిప్రాయాలు వెల్లడించటం, ఆ తినేదో, ఆ తాగేదో వదిలి లేచిపోవటం!

ఒక్కొక్కసారి ఇంట్లో నిలవగా ఏదో చిరుతండి చేసిపెడతాననుకో, అస్తమానూ నేను 'మీకు కావాలా? తెమ్మంటారా?' అని అడుగుతూ ఉండాలి? తనకై తను అడగకూడదట. తనకి కావాలేమో నేను కనిపెట్టి తిరుగుతూ ఉండాలట. మీకు కావాల్సినప్పుడు తీసుకు తినండి. లేకపోతే తెమ్మని నాకు చెప్పండి. అంతేగాని చుట్టాలకు మర్యాదలు జరిపినట్టు ఎల్లకాలం మనకు మనం మర్యాదలు జరుపుకోవాలంటే ఎలా వీలవుతుంది?' అంటే—

"చుట్టాలకు మర్యాదలు చేస్తావుగానీ, కట్టుకున్నవాడికి చెయ్యలేవా? నా మీద నీకు శ్రద్ధే ఉంటే నువ్వే చేస్తావు. ఆ బాధ్యత అడదానివి నీకు ఉండితీరాలి"—అదీ జవాబు! కొందరి తత్వాలూ, ఉద్దేశ్యాలూ సహజత్వానికి భిన్నంగా ఉంటాయి. ఎల్లకాలం ఒకరు చెయ్యాలి. ఒకరు చేయించుకోవాలి. మాటమాటకూ అపార్థాలు ఎంచాలి. ఎంతకని భరించగలను? నేను ఎంత శ్రద్ధగా పనులు చేసుకొంటున్నా ఇంటి బాధ్యతలే నాకు తెలీటం లేదంటారు. చెయ్యిజారి ఒక కప్పు పగిలిపోయిందనుకో, కిందపడి అద్దం

బద్దలైందనుకో, వాటిగురించి పెద్దగా నేను బాధపడను. విచారించను. మనం కావాలని విసిరివేసుకోము. ఏదో పొరపాటువల్ల జరిగిపోతాయి. వాటికి బెంగపడి మంచంపడితే ఏమిటి ప్రయోజనం? ఈసారి జాగ్రత్తగా ఉంటే సరి అనిపిస్తుంది. కానీ అదే ఆయన దృష్టిలో ఘోర అపరాధం! "ఆడ వాళ్ళంతా కొత్త కొత్త సామాన్లు సంపాదించుకుంటూ పొదుపుగా సంసా రాలు చేసుకుంటారు. నీకు ఆడ లక్షణాలే లేవు; మొగరాయుడిలా చేతి కందింది తోసేస్తూ, కాలి కందింది తన్నేస్తూ గర్వంగా తిరుగుతావు. జాగ్రత్తగా పట్టుకుంటే కప్పు ఎందుకు జారుతుంది? పిల్లవాడికి అందేలా అద్దం ఎందుకు పెట్టాలి? నీకు శ్రద్ధ ఎప్పుడొస్తుంది?" అదీ ధోరణి! నాకు తెలీక అడుగుతానూ—ఏ ఇంటిలోనూ కప్పులు బద్దలవటం లేదూ? పిల్లలు వస్తువులు పాడుచెయ్యటం లేదూ? ఈ అఘాయిత్యాలన్నీ నే నొక్కదాన్నే చేస్తున్నానా? పెధవ కప్పు పగిలిందానికి ఇంత రాద్ధాంతమా? ఖర్మకాలి జరిగిన పనికి నిలువునా వణికిపోతూ ఈ క్షణమో, మరో క్షణమో జరగ బోయే యుద్ధానికి సిద్ధంకాలేక, ఆ తిట్లు తినలేక ఏడుస్తూ—ఛీ! ఒక మని షిలా బతుకుతున్నానా నేను? పంచదారకి చీమలు పట్టాయనీ, ఉప్పు జాడీ మీద మూతలేదనీ, ఆవకాయ పెట్టటం లేదనీ, కాఫీగ్లాసు కిటికీలో ఉండి పోయిందనీ, నానిగాడు చీపురు ఊడదీస్తున్నాడనీ—ఛీ! ఛీ! నేను చూసు కోను, హాయిగా తినేసి పండుకుంటాను, ఇక నాకు మాట్పురాదు. నన్ను చేసుకోవటం తన ఖర్మ! అనుభవించాల్సిందే! ప్రతిరోజూ ఈ సాధింపు ఏ ఆడదీ భరించగలదు? వంటగదిలోకి వచ్చి మంచినీళ్ళు తాగటానికే పౌరుషపడే మగతనం ఇంత చిన్న చిన్న ఆడవాళ్ళ విషయాల్లో కలుగ జేసుకుని తిట్టడానికి ఎలా అంగీకరిస్తుంది? ఏమిటో ఇలా తల్చుకుంటూ కూర్చుంటే పిచ్చే ఎక్కుతుంది" భాను తిరిగి అన్నం కలుపుకోసాగింది.

నేను అన్నీ విన్నాను. భానుని అర్థంచేసుకున్నాను. అయినా "భానూ! నువ్వు అన్నీ తర్కించుకుంటూ కూర్చోకు. బావకి ఇష్టమైనట్టే ప్రవర్తిస్తే పోదూ?" అన్నాను.

చటుక్కున తల ఎత్తి నా మొహంలోకి దీర్ఘంగా చూడసాగింది.

"నీకు కోపం వస్తోంది కదూ?" అన్నాను.

అడ్డంగా తలతిప్పింది. "లేదు! ఏ మగవాడైనా ఆడదాని మనసు అర్థంచేసుకుంటాడా అని ఆలోచిస్తున్నాను."

"అక్కర్లేదు. అర్థం చేసుకోవటానికి ప్రయత్నం కూడా చెయ్యడు. కారణం తను మగవాడు గనుక."

"అవును. గడ్డిపోచకన్నా, దూదిపింజకన్నా, తేలికైన ఆడదానికి ఒక మనసూ, అందులో ఏదో వుండటమూనా? దాన్ని అర్థంచేసుకోవటానికేముంది? అంతేకదూ!"

"పిచ్చి భానూ! నువ్వు ఎంత పొరబడుతున్నావో తెలుస్తోందా? నీ స్వంత అనుభవాలతో ఉమ్మడి నిర్ణయాలు చేస్తానంటే కుదురుతుందా?"

"పొరబడేది నేనుకాదు. ఒక విషయం చెబితే స్త్రీని సమర్థించేది తక్కువ. మగవాడికి ప్రత్యేకత వుంది. రెక్కలు విప్పుకు ఎగిరే స్వేచ్ఛ ఉంది. అవి ఇప్పుడూ ఉన్నాయి. ఎప్పటికీ ఉంటాయి. ఇంకా చెప్పబోతే నాకు అసూయే అనుకోవచ్చుకూడా. అయితే నువ్వూ అంతేనంటావా?"

"ఏం? నేను మగవాడిని కాదా?"

"కావచ్చు. కానీ నీలో ఏదో విశిష్టత ఉంది. నిన్ను నమ్మినవాళ్ళని నువ్వెన్నడూ అన్యాయం చెయ్యవు. నిన్ను ప్రేమించేవాళ్ళని నువ్వు ఎప్పుడూ ద్వేషించవు. నిన్ను కోరే వాళ్ళని నువ్వు ఎన్నడూ త్రోసి పుచ్చవు."

"అది నీ భ్రమ! కాలం ఎవరి నెలా మారుస్తుందో ఎవరికీ తెలీదు. నువ్వు చెప్పిన ఈ మాటలు రేపు నా భార్య నోటినుంచి రావాలి. ఈ ఉద్దేశ్యాలన్నీ ఆవిడ హృదయంలో నాటివుండాలి. అప్పుడు నేను నీ ఊహలకు తగినవాణ్ణని అంగీకరిస్తాను."

"తప్పకుండా అది జరుగుతుంది. కాలం అందర్నీ మార్చలేదు, సుమా! కాలాతీత వ్యక్తులు కూడా కొందరుంటారు."

భోజనాలు ముగిశాయి. పైకి గంభీరంగా మాట్లాడుతున్నాను గానీ, మనసంతా చేదు చరిత్ర విన్నట్టు కలతబారిపోయింది. అప్పుడే నిద్రనించి లేచిన 'అల్లుణ్ణి' ఒళ్ళోకి తీసుకుని వాడిచేత కొత్త కొత్త మాటలనిపిస్తూ కూర్చున్నాను.

"ఒరే నానీ! నీకివ్వాళ అంకెలు చెప్తాను. నేర్చుకుంటావా?"

వాడు నిద్రమత్తు వదిలించుకొని తల ఊపాడు.

"అయితే నేను చెప్పినట్టే అను, ఒకటి"

"ఒకతి!"

"ఒకతి కాదు, ఒకటి!"

"ఒకతి!"

"మళ్ళీ అదేనా? ఒకతి అంటావేం?

"నేను అలాగే అంతాను."

"అలాగే అంటే నేను తంతాను."

"ఎందుకు తంతావు?"

"నోరు ముయ్యవోయ్! వెధవాయ్. చెప్పినట్టు వినక ఎదురు మాట్టాడతావేం? వేలెడు లేవు వెధవన్నా!"

"నన్నెందుకు తిల్తావు?"

నేను చిత్రంగా వాడి ముఖంలోకి చూస్తున్నాను. భాను ఎప్పు డొచ్చిందో దగ్గర చెయ్యి పెట్టుకుని నించుంది. నాకేసి చూస్తూ అంది "చూశావా నా కొడుకు?"

"నిజంగానే నీ కొడుకు" అన్నాను. భాను వాణ్ణి ముద్దుల్తో ముంచె త్తింది.

"భానూ! నీ కొడుకు డాక్టరా? ఏక్టరా? లాయరా? ఎవరే?" అన్నాను నవ్వి.

"గొప్ప గొప్ప ఆశలు పెట్టుకుని ఒకసారి భంగపడ్డా బుద్ధి రాలేదంటావా? ఇప్పుడా ఆశలూలేవు. ఆ తాహతూలేదు. కూటికీ, గుడ్డకీ లోటులేకుండా నీతిగా బ్రతకగలిగితేచాలు" నిట్టూర్చి నా పక్కన కూర్చుంది. అంతలోనే సంతోషం మరిచి నా మనస్సు చివుక్కుమంది. "ఎందుకమ్మా అంత ఉదాసీనంగా మాట్లాడతావు? నేను ఉన్నంతవరకూ నీకూ, నీ పిల్లలకూ ఏలోటూ రాదు. నీ కొడుకుని గొప్ప డాక్టర్ చేసి చూపిస్తాను. నా కిచ్చేస్తావా?"

"తీసుకెళ్ళు, వాళ్ళ నాన్నకి సగం భారం తగ్గుతుంది. ఆ మిగిలిన సగం తగ్గేది కాదనుకో!"

నాకు నిజంగా కోపం వచ్చింది. "భానూ! అలా మాట్లాడొద్దని ఎంతసేపటినుంచి చెప్తున్నాను? నీ ధోరణి నీదేనా? ప్రతి విషయాన్ని ఎందుకింత సీరియస్‌గా తీసుకుంటావు? కొడుకుని భారం అనుకునే తండ్రి వుంటాడని నువ్వు చెప్తేనే వినటం. లేనిపోని నిందలు మోపటం నీకు మాత్రం భావ్యం కాదోలు."

భాను క్షణం నాకేసి చూసింది. "అవును మంచి మనసుకు చెడ్డ చెపితే అంటదు. మనుషులంతా నీలా ప్రేమనే పంచిపెడతారనుకుంటే పొరపాటే తల్లిగానీ, తండ్రిగానీ, భార్యగానీ, కొడుకుగానీ—మమకార హృదయానికి అంతా ఒకటే! బావ ఒక్కసారైనా కొడుకుని ఎత్తుకు తిరగటం నీ కళ్ళతో నువ్వు చూశావా? వీధిలో పొయ్యేవాళ్ళు కూడా ఆడుకొంటున్నవాణ్ణి ముద్దుపెట్టుకు వెళ్తారే! అంతమాత్రపు అభిమానం కన్నతండ్రికి ఏదీ?"

"బావుంది. ఈ మాత్రానికే...."

"కాదు అన్నయ్యా! కొడుకుని తండ్రి ఎత్తుకోకపోవటం అనేది ఈ మాత్రపు విషయంగా నేను తీసివెయ్యలేను నిద్రమంచం మీద లేస్తూనే ఆ పసివాడిమీద విసుక్కుంటారు. నేను ఐదుగంటలకే లేచి దొడ్డివేపు వెళ్ళిపోతాను. వీడు ఒక్కోసారి లేచి తిన్నగా నా దగ్గరికి వచ్చేస్తాడు. ఒక్కోసారి ఏడుస్తూ కూర్చుంటాడు. ఆయనగారికి నిద్రాభంగమైపోతుంది. మండిపడుతూ లేచి "ఛీ! వెధవా! లేస్తూనే ఏడుపూ నువ్వూ! వెధవ పోలిక" వాడి రెక్కపట్టుకుని గది బయట పారేసి తలుపులు బిగాయించు కుంటారు—ఎనిమిది గంటలవరకూ. వాడు భయంతో ఏడుస్తోంటే నా కడుపు తరుక్కుపోతుంది. ఎన్ని పనులున్నా మాని వాణ్ణి దగ్గిర పెట్టుకుని కూర్చుంటాను. కళ్ళనిండీ నీళ్ళొచ్చిపోతాయి. కొడుకులంతా తండ్రుల గుండెలమీదే నిద్రపోతా రంటారు. ఆ అదృష్టం దౌర్భాగ్యులకి ఎలా దక్కుతుంది? అందుకే చాలాసార్లు నేను లేచి వస్తున్నప్పుడే వాణ్ణి భుజం మీద వేసుకు తీసుకువచ్చి వంటింటి గడపలో చాపపరచి పడుకోబెడతాను. చంటిబిడ్డ ఏడుపుకి నిద్రాభంగమయ్యే సుకుమారులు పేకాటలకోసం రాత్రిం బవళ్ళు జాగారాలు చెయ్యగలరుసుమా! అది ఎదటివాళ్ళు అడగకపోయినా వాళ్ళ అంతరాత్మలు నిద్రపోతాయంటావా? ఇక ఆయన అన్నంగానీ, టిఫిన్‌గానీ తింటూంటే వాడు ఆ పరిసరాల్లో తిరగటానికి వీల్లేదు. వాడే అఘాయిత్యం చేస్తాడో ఏమో! ఎందుకని వాణ్ణి ఆయన అన్నంవేళ దొడ్డిలో తిప్పాలి. నేను మళ్ళీ వడ్డన జరపటానికి దగ్గిరే వుండాలి. వాడు నా వెనకే వచ్చేస్తే, 'వెధవకి కాళ్ళు విరిగి కుంటివాడై కూర్చుంటే బావుంది పోను' అంటూ మండిపడతారు. నన్ను ఎన్ని అన్నా భరిస్తాను. కాని వాడినంటేమాత్రం సహించలేను. అప్పుడు నేనేదైనా జవాబు చెప్తే అన్నం దగ్గర్నించి లేచిపోతారని తెలుసు. అయినా నేను ఊరుకోను. "షికార్లు తిరగటానికి కాకపోయినా వాడిపొట్ట వాడు నింపుకోవటానికైనా కాళ్ళు ఉండాలి. వాడి భారం మీరేం మొయ్యటంలేదు. వాడి విషయంలో నోటికి ఎంతవస్తే అంత మాట్లాడకండి." అంటాను.

"ఏం చేస్తావేం?"

"ఏమీ చెయ్యను. కానీ అలా మాట్లాడకుండ దంటున్నాను."

"ఈనాటికి నువ్వా నాకు చెప్పేది? నువ్వు అనటం, నేను వినటం, అది ఈ జన్మకిలేదు. అర్థమయిందా?"

ఒక్కోసారి నాకు అసహ్యం హద్దులు మీరిపోయేది.

"బావ అంత మూర్ఖంగా మాట్లాడతాడా." అంటాను.

"నమ్మేదీ మానేదీ నీ ఇష్టం. ఇంతా విను. ఆయన ఇంట్లో ఉన్నంతసేపూ వాడు ఏడవకూడదు. అల్లరి చెయ్యకూడదు. బొమ్మలూ అవీ విసురుతూ, శబ్దాలు చేస్తూ ఆడుకోకూడదు. తండ్రిమీదికి ఎగబాక కూడదు ఏ మాత్రమూ అల్లరి జరగకూడదు. వాడు నిద్రపోవాలి. నిశ్శబ్దంగా కూర్చోవాలి. అల్లరి లేకుండా ఆడుకోవాలి. ఇల్లు ప్రశాంతంగా ఉండాలి. అదీ క్రమశిక్షణ. అందుకు భిన్నంగా వాడు అల్లరిచేస్తే, కేకలు పెడుతూ ఆడుకుంటే, ఆకలేసి గోలపెడితే, నిద్రవచ్చి ఏడిస్తే ఆ అపరాధాలన్నీ నావి! నేను ఒక్కదాన్నే కొడుకుని కన్నట్టు మహామురిసి పోతున్నాను వెధవ గారాబం మప్పి పాడు చేస్తున్నాను క్రమశిక్షణ నేర్పకుండా పెంచుతున్నాను మాటిమాటికీ ఏడవటం అలవాటు చేస్తున్నాను. మొత్తానికి ఇల్లు నంత చేస్తున్నాను. నిజమే కదూ?" నన్ను అడిగింది. వింటోంటే నాకు ఒంటినిండా చీమలు పాకుతున్నట్టే ఉంది.

"సరేలే చెప్పు."

"ఒక్కసారి వాడికి అజీర్తి చేసింది. విరోచనాలవుతోంటే రెండు మూడు రోజులు ఆ మందూ, ఈ మందూ వాడాను, తగ్గలేదు. ఎక్కువై పోయాయి. ఇక లాభంలేదని డాక్టర్‌కి చూపించమన్నాను. ఏమన్నారో తెలుసా? 'తుమ్ము' తుమ్మితే డాక్టర్ దగ్గరికి పరిగెత్తమంటావ్. వాడికా

దక్షిణ కాస్తా సమర్పించుకుంటేగానీ నీకు తృప్తి వుండదు. బామ్మ గారి నడిగి ఏ అల్లం రసమో పట్టకూడదూ? నాకు ఆఫీసుకు టైమైపోయింది. అంత ఎక్కువైతే రేపు చూద్దాంలే."

నాకు ఒళ్ళు మండిపోయింది.

"రెండు రోజుల్నుంచీ ఆ రసాలు వాడుతూనే ఉన్నాను. ఏమీ గుణం కన్పించటం లేదు. బాబు కళ్ళు కూడా విప్పలేక పోతున్నాడు. ఇంకా ఎక్కువవ్వటం అంటే ఏం జరగాలి?"

"అబ్బబ్బ! ప్రతి విషయానికీ ఎందుకలా వాదిస్తావ్? రెండు రోజుల్నుంచీ ఉన్నవాడు ఇవ్వాళ ఏమీ అయిపోడులే. సాయంత్రం చూద్దాం."

"చూద్దాం! వాడి ప్రాణాలు గాలిలో కలిసిపోతే చూద్దాం! అది జరగదు. జరగనివ్వను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" వెంటనే బాబును ఎత్తుకుని రిక్షాలో బయలుదేరాను. ఒక షాపులో నా ఉంగరం ఒకటి అతి చౌకగా అమ్మేసి డాక్టర్ దగ్గరకి వెళ్ళాను బాబుకి ఇంజక్షన్ చేయించి మందువేసి పడుకోబెడితే నాకు ఎంతో ధైర్యం వచ్చింది. గర్వం కలిగింది బాబుకి తల్లి ఉంది.

నేను పీధులెక్కి తిరుగుతున్నాననీ తనని అగౌరవం చేస్తున్నాననీ, తర్వాత చాలా రాద్ధాంతం అయిందనుకో! అది వేరే సంగతి. ఇప్పుడు చెప్పు. ప్రతి తండ్రీ బిడ్డల్ని ప్రేమిస్తాడని చెప్పు."

ఎలా చెప్పను! ఆ సంగతులు వినటానికే చాలా ఘోరంగా ఉన్నాయి కన్నబిడ్డని గుండెలకి హత్తుకోలేని తండ్రి తండ్రా? పసిపాప అల్లరిలో ఆనందం పొందలేని మనిషి మనిషా? సౌఖ్యం కోసం పాకులాడే మనిషి సంసారం ఎందుకేర్పరచుకున్నట్టు? ఏడాది బిడ్డకి క్రమశిక్షణ నేర్పే పెద్దమనిషి ఇరవై నాలుగ్గంటలూ ఇల్లువిడిచి ఎందుకు తిరుగుతున్నట్టు? డబ్బుకి కక్కుర్తిపడి కన్నబిడ్డని కూడా నిర్లక్ష్యం చెయ్యగలిగే వ్యక్తి,

వందలకు వందలు ఎక్కడ తగలేస్తున్నట్టు? అర్థంలేని ఈ విషయాలకి నే నేమని అర్థాలు కల్పించను? తను చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయిన భావనైనా కొడుకుని ప్రేమించటానికి కారణం కావచ్చునే! జీవితంలో ఆ మనిషి మరెవర్ని ప్రేమిస్తాడు?

"ఏమిటన్నయ్యా మాట్లాడావ్?"

"మాట్లాడటానికేముంది భానూ? తల్లివి నువ్వు చూసుకొంటావు గదా అని అతను పట్టించుకోకుండా తిరుగుతాడు కానీ కన్నబిడ్డని ద్వేషిస్తాడా చెప్పు?"

భానుకి కోపం వచ్చింది. "పెళ్ళిచేసుకుని కుటుంబాన్ని ఏర్పరచుకుని బాధ్యతలు నిర్వర్తించుకోవలసిన సమయానికి కూడా ఆమనిషి మారవలసిన అవసరం లేదంటావ్. అంతేనా?" క్షణం ఆగింది "అన్నయ్యా! శారదే నా స్థితిలో ఉంటే నువ్వు ఇంత శాంతంగా మాట్లాడవు. ఇన్నాళ్ళు నా కష్టసుఖాలువిని అర్థం చేసుకోగలిగే అన్నయ్య ఒక్కడైనా ఉన్నాడనీ వాడికి చెప్పుకొని కనీసం సానుభూతైనా పొందుతాననీ పుట్టెడాశతో ఉన్నాను. కనీసం నన్ను అర్థం చేసుకున్నానని చెప్పినా నాకు తృప్తికలిగేది. ఇక నాకు ఎవ్వరూ లేరు, ఎవరూలేరు," భాను మోకాళ్ళలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంటే నాకు మతిపోయింది. నా కళ్ళు కూడా నిండిపోయాయి. భానుచెయ్యి గట్టిగా పట్టుకున్నాను.

"భానూ! నన్నెంత అపార్థం చేసుకున్నావు భానూ!"

భాను తలయెత్తి చూసింది.

"నువ్వు ఏదో అశాంతిగా వున్నావని నేను ఎప్పుడో గ్రహించాను కాని నిన్ను అడగటానికి ధైర్యం చాలలేదు. ఇవాళ నువ్వు చెప్పిందంతా వింటే నా మనసు ఎంత వికలమైపోయిందో నీకు తెలిసిందా? నీకంటి వెంట నీరు కారితే అది నన్నెంత రంపపు కోత కోస్తుందో నువ్వు

గ్రహించగలవా? భానూ! నిన్ను నేను అర్థం చేసుకో లేదనుకుంటున్నావా? కాని నా భావాలన్నీ పైకి చెప్పి నిన్ను మరీ నిరాశపాలుచేస్తే ఫలితం ఏమిటి? సున్నితమైన నీ మనసు చెదిరిపోతే, నీ భర్తమీద నువ్వు అయిష్టం పెంచుకుంటే? అద్దం పగిలితే అతుక్కుంటుందా? నీ మనసు పాడు చెయ్యటానికే నన్ను సాయం చెయ్యమంటావా? ఇన్నాళ్ళ స్నేహాన్ని ఎంత తేలిగ్గా తోసేశావు భానూ!"

"అన్నయ్యా!" భాను తడికళ్ళతో తదేకంగా చూస్తూ వుండి పోయింది.

"భానూ! శారద నా స్వంతచెల్లే! కానీ ఏ విధంగానూ శారదకి ఈ అన్నయ్య సహాయం అవసరంలేదు. కావలసినన్ని చీరెలూ, నగలూ, వస్తువులూ అమ్మా నాన్నా అందిస్తూ వుంటారు. శారద మనసు నీ మనసులా సున్నితమైందికాదు. అటువంటి వాళ్ళకి మానసికమైన బాధలే ఉండవు. అన్నయ్యగా నేను ఏదోవిధంగా సహాయపడగలిగితే అది నీకే."

"నన్ను క్షమించు అన్నయ్యా! నేను ఆవేశపడతానని నువ్వే అంటావుకదూ? నాకు ఎవరూ లేరు అనుకున్నాను గానీ—అది నిజం కాదు. నాకు నువ్వు ఉన్నావు. నువ్వు తప్ప నన్ను ప్రేమించేవాళ్లెవరూ లేరు" అంది తన చేతితో నా కళ్ళు తుడుస్తూ.

ఆ చెయ్యి పట్టుకున్నాను. "తప్పు భానూ! బావ తర్వాతే నేను. ఒక వ్యక్తిని అంత తొందరగా విసర్జించకూడదు. నీ మంచి చెడ్డలూ—నీ కష్టసుఖాలూ చూడవలసింది బావే."

భాను బాధగా నవ్వింది. "నా మంచిచెడ్డలూ కష్టసుఖాలూ! ఆ దాంపత్య ధర్మం ఈ సంసారంలో మాత్రం లేదన్నయ్యా!"

నేనేమీ మాట్లాడలేదు.

"నేనేది చెప్పినా సోదిలా వుంటుందేమో!" అంది కొంతసేపటికి.

చెప్పమన్నట్టు చూశాను. ఏం వింటానో అని భయం వేసింది.

"బాబు కడుపులో ఉన్నప్పుడు ఒకసారి జ్వరం వచ్చింది. రాత్రి ఆయన వచ్చేవేళకు పడుకుని ఉన్నాను. పడుకున్నావేమని అడిగితే, జ్వరం తగిలినట్టు ఉంది. తల నొప్పి పెడుతుంటే పడుకున్నాను" అన్నాను.

"ఈ రాత్రికి అన్నం మానెయ్! రేపొద్దుటికి అదే పోతుంది." అన్నారు కనీసం ఒంటిమీద చెయ్యికూడా వేసి చూడలేదు. చలి వేస్తోంటే దుప్పటి కప్పుకున్నాను.

ఎప్పుడో మెలకువ వచ్చేసరికి దీపం పెద్దగా వెలుగుతోంది. పక్కమీద ఆయన లేరు. వీధి తలుపులు దగ్గరకి వేసి ఉన్నాయి. అది అలవాటే అయినా భయంతో గుండెలు కొట్టుకొన్నాయి. తొందరగా లేచివెళ్ళి తలుపులు వేసివస్తూ తూలిపడ్డాను. చెమటలు పోస్తున్నాయి. విపరీతంగా దాహం వేస్తోంది. అప్పుడు వేడినీళ్ళు కాచుకోలేక చన్నీళ్ళు తాగి పడుకున్నాను. ఎంతకీ నిద్రపట్టదు. పన్నెండు కావస్తూంది. అప్పుడు వస్తే తలుపులు తీశాను. "తొందరగా వచ్చేద్దామని వెళ్తే ఆలస్యమైపోయింది భానూ! జ్వరం ఎలా వుంది?' అంటూ మంచంమీద కూర్చున్నారు.

"ఆలాగే వుంది."

"మరేం ఫర్వాలేదు. రేప్రొద్దుటికి తగ్గిపోతుంది."

తగ్గకపోతే మాత్రం ఫర్వాలేదు ఎవరికి? ధైర్యం చెప్పమని ఎవడు దేవిరించాడు? ఉదయానికి జ్వరం ఎక్కువైంది. అది ఆయనకు తెలీదు.

"వంట చెయ్యలేవా?

"చెయ్యలేను."

"పోనీ నేను హోటల్లో భోంచేస్తాను. నీకేమైనా కావాలా?"

"అక్కర్లేదు."

"సరే!"

జ్వరం తగ్గకపోతే డాక్టర్ని తీసుకురావాలనీ, జ్వరంతో ఉన్నవాళ్ళ కయినా ఏ రొట్టో, కాఫీయో ఏదో ఒకటి తెచ్చి ఇవ్వాలనీ తెలీదా? నా కళ్ళు నిండిపోయాయి. కడుపుతో ఉన్నవాళ్ళు పస్తులు ఉండకూడదంటారు. కడుపులో పాపకోసమైనా ఏదో తినాలి, ఏం తినను? ఎవరు తెస్తారు? పది గంటలవరకూ అలాగే పడుకున్నాను. వీధిలో సోడా కేక విన్పించింది. లేచి సోడాలమ్మే పిల్లవాణ్ణి పిలిచాను. లోపలికి వచ్చి డబ్బులకోసం డ్రాయరు సొరుగులూ, అలమరా, బల్లలూ, పాంటుజేబులూ, పెట్టె మూలలూ అన్నీ వెదికాను. ఎక్కడా ఒక చిల్లికానీ కన్పించలేదు, నెలలు నిండి పుట్టెడు జ్వరంతో, తినటానికేమీ లేకపోగా సోడానీళ్ళు తాగాలని బుద్ధిపుడితే అర్ధణా....ఒక్క అర్ధణా నా దగ్గర లేకపోయింది! చూశావా, నా భర్త సంపాదన నేను ఎంత సుఖంగా అనుభవిస్తున్నానో! ఇంటి ఇల్లాలిగా ఎంత స్వాతంత్ర్యం సంపాదించుకున్నానో! కళ్ళు తుడుచుకుని వీధిలోకొచ్చి "వెళ్ళిపో అబ్బాయ్! డబ్బులు దొరకలేదు" అన్నాను.

"ఫర్వాలేదమ్మా, రేపు ఇవ్వండి" అన్నాడు వాడు.

"వద్దు వెళ్ళు" అనేసి లోపలికొచ్చాను. ఏడుపు ఆపుకోవటానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఉధృతం తగ్గేవరకూ ఏడ్చాను. ఐదు నిమిషాలైనా వీధిలోనే అరుస్తున్నాడు వాడు. లేచివెళ్ళి మళ్ళా పిలిచాను. "చూడు బాబూ! రేపుకూడా నా దగ్గర డబ్బులుండవు, జ్వరం వచ్చింది. నిన్నటి నించీ ఏమీ తినలేదు. దాహం వేస్తోంది. ఒక్క సోడా....ఊరికే ఇస్తావా?"

వాడు తెల్లబోయాడు.

"నిజం తమ్ముడూ! నాకు సోడా తాగాలని ఉంది. నా దగ్గర డబ్బులున్నప్పుడు తప్పకుండా ఇచ్చేస్తాను. ఒక్క సోడా ఇవ్వవూ?"

వాడు తేరుకొని, 'ఇస్తానండి?' అంటూ పరుగెత్తాడు బండి దగ్గరికి. ఆనాడు ఆ సోడాకి ఉన్న విలువ ఏ అమృతానికీ లేదు, ఆ తమ్ముడు చూపిన దయ జీవితంలో మళ్ళీ పొందలేను. ఖాళీ సీసా ఇచ్చేస్తూ, 'నాకు

పుట్టే పాప నీ అంత మంచిది కావాలి' అన్నాను. వాడు నవ్వి వెళ్ళిపో యాడు దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు అంటారు. ప్రేమతో ఇచ్చిన ఆ సోడా మందులా పని చేసింది కాబోలు. సాయంత్రానికి జ్వరం తగ్గింది వంట చేశాను." భాను ఆగింది నేను భాను మొహం కేసి చూస్తూ ఆవేశంతో వింటున్నాను.

"బావ నీ కెప్పుడూ డబ్బులివ్వరా?"

"అది వేరే అడగాలా?"

"పోనీ నువ్వెప్పుడైనా అడిగి చూశావా?"

"లక్షసార్లు. నాకేదైనా అవసరం ఉంటుందనీ, చీటికీ మాటికీ అడ టానికి వీలుండదనీ, అప్పుడప్పుడూ పావలా, అర్ధా ఇస్తూ వుండమనీ ఎన్నోవిధాల అర్థమయ్యేలా చెప్పాను. సిగ్గు విడిచి కావలసినప్పుడల్లా అడుగుతూ వచ్చాను. నాకు ఒక అణా ఇస్తే అదేం చేశానో ఖర్చు చెప్పాలి. అలా చెప్పటం నా కిష్టంలేదు. అడగటం మానేశాను. మన వూరు వెళ్ళి నప్పుడు. ఐదో పదో అమ్మ ఇస్తుంది. అవే జాగ్రత్తగా వాడుకుంటాను. డబ్బు అనేది ఎంత జాగ్రత్తగా వాడినా తరుగుతుందే కాని పెరగదుగదా? ఆయన సంపాదన విషయంలో, ఈ సంసారపు ఖర్చుల్లో, నేను వీసమెత్తు కూడా జోక్యం కలిగించుకోకూడదు. స్వతంత్రించి ఒక వస్తువు కొన గూడదు. ఒకసారి షాప్సి సామానులు వీధిలోకి అమ్మొచ్చాయి. ఇరుగు పొరుగు వాళ్ళంతా గుమిగూడి సామాను చూస్తున్నారు నేనూ వీధి గుమ్మంలో నిలబడ్డాను. అంతా ఎవరికి నచ్చింది వాళ్ళు కొనుక్కుంటు న్నారు. పక్కింటి బామ్మగారు నన్నుకూడా బలవంతపెట్టింది. అగర వత్తులు వెలిగించే పింగాణీ చెట్టు తీసుకున్నాను. అది చాలా అందంగా చక్కగా ఉంది. లావుపాటి మొదలుమీద విరబోసిన కొమ్మల్లో పువ్వులు విరిసి ఉన్నాయి వాటిలో అగరవత్తులు గుచ్చుతారు బామ్మగారు రూపాయి బదులిచ్చింది. తీరా అది చూపించి డబ్బులడిగితే, 'ఎవరు కొనమన్నారు?' అని ప్రశ్న! నిర్ఘాంత పోయాను. ఎవరు కొనమనాలి? ఇంటికోసం నాకు నచ్చిన వస్తువు నేందుకు కొనకూడదు? ఇంత చిన్న విషయానికి గృహి

టిగా నాకు చొరవ లేదా? తనని అడగకుండా నా ఇష్టం చెలాయించాను. కాబట్టి, ఆ రూపాయి ఇవ్వవలసిన అవసరం తనకు లేదు. అదీ తీర్పు. ఏం చెయ్యను? ఆ అప్పు ఎలా తీర్చను? బామ్మగారు తీసుకుంటుందేమో అని అడిగితే, ఆవిడ కోడలికి వెండిదే ఉందట. వద్దనేసింది. ఇంకెవరికైనా అమ్మజూపితే ఏమనుకొంటారు? తమాయించుకోలేని దుఃఖం వచ్చింది. ఏదో స్ఫురించినట్టు చటుక్కున లేచి పెళ్ళి బియ్యం ఇచ్చి అప్పుతీర్చుకున్నాను.

తరాంత "ఆ రూపాయి ఇచ్చేశావా?" అని అడిగారు.

"ఇచ్చాను, నా దగ్గర ఉంది. ముందు మీరు ఇస్తారేమో అని అడిగాను." అన్నాను.

ఘన విజయం పొందినట్టే నవ్వారు. "సంసార బాధ్యత నీకూ కావాలంటావుగా!"

"అవును. ఒక్కడబ్బు ఖర్చుపెట్టే విషయంలోనే నాకు సంసార బాధ్యత ఇవ్వండి!"

సరే నా బాధ్యతలూ, నా స్వతంత్రాలూ అలా ఉంచు! నెలకి నూట యాభై రూపాయల జీతం వస్తోందంటే కనీసం నెలకో పది రూపాయలన్నా నిలవ చేసుకోకపోతే, ముందు ముందు వచ్చే అవసరాలు ఎలా తీరాలి? పెళ్ళికి కొనుక్కున్న బట్టలే ఇంతవరకూ సరిపోతున్నాయి. రేపటి నుంచి ఏ ఖర్చు చూసినా పెరుగుతుందే కాని తరగదుకదా? ఇప్పుడే మనం అప్పులపాలై పోతే పిల్లవాడు ఎదిగి చదువుకొచ్చేసరికి ఏం కావాలి? ఇటువంటి విషయాలన్నీ ఎన్నిసార్లు బోధపరిచాననుకుంటావు? ఏమి ప్రయోజనం కన్పించిందంటావు? నాకు డబ్బు విషయమై ఏమీ చెప్పరు. ఎంత వస్తోంది, ఎంత ఖర్చవుతోంది, ఎంత మిగులుతోంది, లేదా ఎంత అప్పవుతోంది, అసలు మన తాహతేమిటి? మనం ఎంతలో ఉన్నాం:-

ఈనాడు నా సంసారం ఏమిటో నాకు తెలీదు. నాకు ఐరీచీర కొనుక్కో-వాలని ఉంది. ఆ తాహతు నాకు ఉందో లేదో తెలీదు. నేను ఏ కోరిక కోరుకోవాలో, ఏ కోరిక తీర్చుకోగలనో అర్థంకాదు. "డబ్బు విషయం నీ కనవసరం. నీ నుంచి ఒక్క కాని సంపాదన లేనప్పుడు, నువ్వు ఒక్క కానీ ఇవ్వలేనప్పుడు, తగులుతోందో మిగులుతోందో నీ కెందుకు? ఆ చికాకులేవో నేను పడుతున్నాను. నువ్వు సుఖంగా కూర్చో" చూశావా, నేనెంత సుఖపడుతున్నానో? డబ్బు విషయం తెలుసుకోకుండా కూర్చుంటే అంతా సుఖమే కాబోలు! ఒకరి పరిస్థితులు ఒకరు తెలుసుకోవాలంటారు. ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకోవాలంటారు. అది ఈ సంసారంలో ఎలా సాధ్యమవుతుంది? నాకుచెప్తే ఇంత ఖర్చెందుకవుతుందని అడగనూ? ఈ ఖర్చు అనవసరమని ఎత్తి చెప్పనూ! అందుకే నేనా చికాకులో జొర బడకుండా హాయిగా వుండాలి!

చూడు, మన ఊరు వెళ్తే అక్కయ్యలూ వాళ్ళూ ఎన్నో రవికెల గుడ్డలిస్తారు. ఎన్నో వస్తువులు కొంటారు. అవన్నీ తీసుకోవటమే అవు తోంది గానీ, ఎవరికీ ఏమీ ఇవ్వలేక పోతున్నాను. అక్కయ్య పాపలకన్నా ఏమైనా కొని తీసికెళ్దామంటే నాకు డబ్బు ఎలా వస్తుంది?

మీ బావ ఒకసారి నేను మన ఊళ్లో ఉండగా వచ్చారు. ఉన్న వారం రోజుల్లోనూ ఊరంతా తిరిగి జల్సాలుచేసి పర్సుకాస్తా తగలేసు కున్నారు. చూస్తే తిరిగివెళ్ళటానికి రైలు ఖర్చు లేదు. అప్పుడు నా దగ్గిరా ఏమీలేదు. ఆయన రైలు ఖర్చుకోసం అమ్మనైనా తేమాత్రం ఎలా అడగను? ఎవరి బతుకులు వాళ్ల బతుకుతున్నప్పుడు ఎవరి అభిమానం వాళ్ళది గానీ అన్నివిషయాల్లోనూ తల్లీ బిడ్డల సంబంధం చూడగలమా? ఎవర్ని అడగ టానికీ నాకు మనస్కరించలేదు. నా మెడలో మంగళసూత్రాల మధ్య వ్రతం చేసి కట్టుకున్న వరలక్ష్మి రూపువుంటే తీసి ఇచ్చేశాను. అది ఎక్కడో పడి పోయినట్టు నటించాను. ఇంట్లో అటువంటి నీచమైన పరిస్థితి ఎందుకు

రావాలి? నేను భార్యనే కావచ్చు. అంత మాత్రాన అతి చిన్న విషయాలకు సిగ్గు విడిచి నన్ను అడిగే అవసరం ఎందుకు తెచ్చుకోవాలి? ఆ మగతన మంతా ఏమైపోయింది? ఈ సంసారగాథ ఇలా ఎన్ని గంటలు చెప్తే వింటూ కూర్చుంటావు?" అంది చటుక్కున సంభాషణ మార్చి నవ్వుతూ.

నేను నిట్టూర్చి అన్నాను. "చెప్పు భానూ! నీ మనసులో ఉన్న బాధంతా నాకు చెప్పు. నేను నీకే విధంగానూ సహాయం చెయ్యలేక పోయినా, కనీసం నీ బాధ నేనూ పంచుకుంటాను. ఇంతవరకూ వచ్చాక ఏదీ మరుగుపరచకు"

"అన్నయ్యా! నాకు భవిష్యత్తు ఎలా జరుగుతుందోనని భయం వేస్తోంది. ప్రతి ఆడదీ భర్తనుంచి ఏ ప్రేమ అనుభవిస్తుందో అదే నాకు లేదు. నేనంటే ఆయనకు ఏవిధమైన అభిమానమూ లేదు. బాబు కడుపులో ఉన్నప్పుడు ఒంట్లో బావుండక పనిపిల్లను పెడితే విసుక్కున్నారు. "ఇంతోటి రాచకార్యాలకూ దాసీజనం ఒకటీ. కడుపుతో వున్నవాళ్ళు స్వయంగా పనులు చేసుకుంటే ఆరోగ్యంగా వుంటారని డాక్టర్లు చెప్పరూ? తిని కూర్చున్న దగ్గరనుంచీ ఉద్యోగాలేమైనా చేస్తున్నావేమిటి? మహా రాణిలా కూర్చోటానికి నీ బాబుగారి సంపాదనేమీ వచ్చిపడటంలేదు" అన్నారు నిజమే! పనిపిల్లకిచ్చే రూపాయిన్నరా ఒకరోజు సిగరెట్లకి రాదూ? పుట్టింటినుంచి ఆస్తిపాస్తులు తెచ్చుకోని దానికి పనిమనుషు లెలా వస్తారు? ఆ మర్నాటినుంచే ఆ పిల్లని రావద్దని చెప్పేశాను. నెలలు నిండుతోన్న కొద్దీ ఎంత చిన్న పని చేసినా ఆయాసం వచ్చేది. నాలుగుసార్లు నూతికి ఇంటికీ తిరిగితే కాళ్ళు పీకేవి. అంట్లు తోముతోంటే చేతులు తిమ్మెర్లు పట్టేవి. ఒకసారి అభిమానం చంపుకుని, "కట్టెలతో వంటచేస్తే మసి గిన్నెలు తోముకోవటం కష్టంగావుంది. ఈ నెలలో బొగ్గులు వేయించ కూడదూ?" అని అడిగాను.

ఎంత చెత్త కోరిక! అనవసరం! ముఖం చిట్లించుకున్నారు. "కాసీతో అయ్యేపనికి అణా తగలేస్తానంటావు. బొగ్గులకి బదులు కట్టెలు రెండింతలు వస్తాయి. అసలు డబ్బు అంటే ఏ చెట్టునో కాస్తోంది అనుకుంటున్నావు."

నాకు ఆపుకోలేని కోపం వచ్చింది. "అవును నా సుఖంమాట వచ్చేసరికి ఈ ఆలోచనలన్నీ! జల్సాలకీ, సర్దాలకీ, పేకాటకీ, సిగరెట్లకీ ఈ పొదుపు వుద్యమాలూ, డబ్బు విలువలూ అవసరంలేదు. గుర్తేరావు. కడుపుతో వున్నవాళ్ళు స్వయంగా పనిచేసుకొంటే ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు చెప్పారుగానీ, సిగరెట్లు కాలిస్తే గుండెలు చెడి జబ్బులు వస్తాయని చెప్పలేదు."

"నోర్మయ్! వాడెవడు మధ్య చెప్పటానికి? నా కష్టార్జితం నా ఇష్టమయినట్టు చేసుకుంటాను. ఈ ఇంట్లో నీ నుంచి చిల్లిగవ్వ వచ్చి పడటంలేదు."

"మీ ఉద్దేశ్యం అదే అయితే విశదంగా చెప్పండి, నాకు చేతనైంది నేనూ చూస్తాను!"

"ఓహో! ఇక తమరు ఉద్యోగాలు చలాయించటం ఒక్కటే తక్కువయింది, ఏ డాక్టర్నో, యాక్టర్నో పెళ్ళాడి ఉంటే నీ సుఖాలూ, దర్జాలూ...."

ఛీ! అసలు నాది బుద్ధితక్కువ. నిండు నెలలతోవున్న ఒక ఆడదానిమీద కనీసం జాలికూడా లేని వ్యక్తిని మనిషిగా ఎంచి మాట్లాడే.... నేను పశువుని!

నెలలు నిండేవరకూ నేను ఇక్కడ చాకిరీ చెయ్యటానికే ఉండిపోవలసి వచ్చింది.

బాబుని చూచుకున్న సమయంలో నా మనసు ఎంత ఆనందంతో పొర్లిపోయిందో, ఎంత ధైర్యం వచ్చిపడిందో ఎలా చెప్పను? నాకు కొడుకు పుట్టాడు! వాణ్ణి చూస్తే ఆయన తప్పక మారిపోతారు. నా కష్ట సుఖాలు అర్థం చేసుకుంటారు. ఆశాసౌధాలలో తేలిపోతూ మూడు నెలల బాబుని ఎత్తుకొచ్చాను.

కొడుకుని చూసి తండ్రి సంతోషపడినమాట నిజమే! కానీ అది నాకు సంతృప్తి నిచ్చేంత సంతోషంకాదు. నా భవిష్యత్తు మారిపోతుందని నమ్మేంత ఆనందంకాదు. నా యాతనలన్నీ ఎక్కువయ్యాయి గానీ పీస మెత్తు తగ్గలేదు. ఆయనకు కొత్త చిరాకు ఒకటి వచ్చిపడింది. "అస్తమానం పిల్లవాడు ఏడుస్తున్నాడు. ఇంట్లోకి రావటమే అసహ్యంగా ఉంటోంది" అనేవారు. రాత్రిళ్ళు వాడి పక్కబట్టలు మార్చవలసివస్తే అది నేను ఒక్కదాన్నే చేసుకోవాలి. వాణ్ణి తుడిచి వేరే పడుకోబెట్టి పక్కబట్టలు మార్చేలోపుగా వాడు ఏడుస్తాడు.

"ఛీ! ఛీ! ఇది సత్రంలా ఉందిగానీ ఇల్లులా లేదు. పగలంతా దర్జాగా పడుకుని అర్ధరాత్రిళ్ళు లేచి మేళం పెట్టుకు కూర్చుంటావు. రాత్రిళ్ళ నిద్రపోనివ్వటంలేదు. నన్ను ఉండమంటావా? పొమ్మంటావా? ఏమిటి నీ ఉద్దేశ్యం?"

మూర్ఖుడికి ఎందుకు జవాబు చెప్పాలి? ఇదే నా ఉద్దేశ్యం. ఎన్ని తిట్టినాసరే, వింటూ పసిబాబుని గుండెలకు హత్తుకుని పడుకుంటే ఏమిటో తృప్తి! హాయి! చాలు—వాడికోసం ఏదైనా భరిస్తాను."

భాను అదే ధోరణిలో జ్ఞాపకం వచ్చిన సంఘటనలన్నీ చెప్పుకు పోతోంది. వింటోన్నకొద్దీ నామతి పోతోంది. భాను దాంపత్యం ఇంత అధ్వాన్నంగా సాగుతోందా? భాను ఇంత వేదన భరిస్తోందా?

"అన్నయ్యా! నా కష్టసుఖాలకు నా భర్త వున్నాడనే నమ్మకం ఏనాడో పోయింది. కాని ఆయనకి బాబుమీద ప్రేమవున్నా, నాకు తృప్తిగా వుండేది."

"భానూ!" చెమర్చిన ఆ కళ్ళలోకి తదేకంగా చూడసాగాను. భాను మాట్లాడలేదు.

"నువ్వు చాలా మారిపోయావు భానూ!"

భాను అదోరకంగా నవ్వింది. "మారటంకాదు. ఆ భాను ఇక లేదు. ఆ అతిశయాలూ, ఆ గర్వాలూ, మొండి నమ్మకాలూ, పట్టుదలలూ ఏమీ లేవు."

నిజమేనని కాబోలు గడియారం రెండుసార్లు పలికింది.

"పోనీ కొంత ఊరటగా ఉంటుంది, ఏదైనా సినిమాకి వెళ్దామా?"

భాను కొంతసేపు ఊరుకుని అంది: "నేను సినిమాలు చూడటం మానేశాను. ఎనిమిది నెలలైంది."

దీనికి ఏదో పూర్వకథ లేదుకదా?

"ఎందుకనీ?" అన్నట్టు చూశాను ఆశ్చర్యపడి.

"నేను, బావతో వెళ్ళి ఆయన్ని సిగ్గుపరచటం ఇష్టంలేక మానేశాను."

"ఏమైంది భానూ?"

"అనటానికేం లేదనుకో! ఆ మధ్య ఏదో ఇంగ్లీషు సినిమా వచ్చింది. చాలా గొప్పగా వుందని చదివాను. 'వెళ్దామా?' అన్నాను. ఆ నవల నేను చదవటంచేత సినిమా చూడాలనిపించింది.

ఆయన తేలిగ్గా నవ్వేస్తూ. "నీ మొహం! ఇంగ్లీషు సినిమా అంటే మజాకా అనుకున్నావేమిటి? మా వంటి వాళ్ళకే తాతలు దిగివస్తారు" అన్నారు.

"పోనీ నా కర్థం కానిచోట మీరు చెప్పకూడదా?"

"ఇక బాగానే ఉంటుంది. నీలాంటి అమ్మమ్మని తీసికెళ్ళి చెపుతూ కూర్చుంటే నాకు సిగ్గుచేటు."

సిగ్గుతో నా తల వాలిపోయిందంటే నమ్ము! తర్వాత నేను ఏ సినిమాకి వెళ్ళలేదు. వెళ్ళినా ఇద్దరం కలిసి వెళ్ళటం చాలా అరుదు. ఆయన ఎప్పుడూ స్నేహితులతోనే చూస్తూంటారు. నేను ఏ పక్కింటి వాళ్ళ

గారితోనే వెళ్ళాలి. అంత మాత్రానికి ఆ సినిమాలు చూడకపోతే నష్టమే మొచ్చింది? ఎవరికి కావాలి? మానేశాను."

"నీకు ఇంగ్లీషు వచ్చని బావకి తెలీదా?"

"నాకు తెలిసింది చాలా తక్కువే అనుకో. అయినా ఆ మాత్రం కూడా ఆయనకి తెలీదు. ఆ సంగతి తెలిస్తే నిద్రపట్టదు. ఎప్పుడైనా ఇంగ్లీషు ముక్క మాటల్లో దొర్లితే, అబ్బో! లండన్‌లో పుట్టి ఇండియాకి వచ్చినట్టే ఉంది సుమండీ! ఏ కాన్వెంటులోనండి మీరు చదివింది?" అంటూ హాస్యాలు. కొత్తలో నేను గ్రహించలేకపోయినా క్రమంగా ఆ వ్యంగ్యం అర్థం చేసుకున్నాను. ఆయన కళ్ళముందు ఎప్పుడూ ఇంగ్లీషు పుస్తకం చదవలేదు. ఇక్కడి కొచ్చిన కొత్తలో ఎన్నో ఇంగ్లీషు పుస్తకాలు చదవాలనీ, ఇంగ్లీషు సినిమాలు చూడాలనీ, ఆ భాష అభివృద్ధి చేసుకోవాలనీ, అన్నిటికీ ఆయన ప్రోత్సాహం ఉంటుందనీ....ఎంత పిచ్చిదాన్నో ఇప్పుడు తెలుస్తోంది.

ఆయన స్నేహితులు ఎవరైనా అప్పుడప్పుడూ వస్తూంటారనుకో— ఏదో కబుర్లు వస్తాయి. వాటిమధ్య కలగచేసుకొని నా ఉద్దేశ్యాలేమైనా చెప్పాను అంటే, భంగపడవలసిందే!

ఎక్కువగా వాళ్ళంతా మాట్లాడుకునే దేమిటంటావు? "భగవంతు డున్నాడా? లేడా? లేడు. ఎలా చెప్పగలవు? కంటికి కన్పించడం లేదు కాబట్టి- గాలి కన్పించకపోయినా శరీరానికి తగులుతోంది. వాసన ముక్కుకి తెలుస్తోంది. ఏ విధంగానూ అనుభవం లేని ఆ దేవుడికి లక్షలకు లక్షలు తగల బెట్టకపోతే మరో విధంగా ప్రజలు సుఖపడకూడదూ?" ఇదీ వరస! నిజమే, ఊరికి మరో నాలుగు క్లబ్బులు కట్టించకూడదూ? సిగరెట్లు ఉచితంగా సరఫరా చెయ్యకూడదూ? ఉద్యోగాలు లేకుండా జీతాలివ్వకూడదూ? సినిమా తారలతో ఇంటర్వ్యూలు ఏర్పాటు చెయ్యకూడదూ? ఇంకా విను— 'పిచ్చి గవర్నమెంటోయి మనదీ. ఈ నెహ్రూ పోయి ఏ హిట్లర్‌లాంటి వాడో వస్తేగానీ....'

ఈ జిల్సారాయిళ్ళ గతి తెలిసేది మరి!

దేవుడిమీదినుంచీ పురాణాలమీదికి మళ్ళుతుంది.

"అ భారతం ఏమిటయ్యా? మాట మాట్లాడితే శాపాలూ, దీవెనలూ—చెవుల్లోంచి పిల్లలు పుట్టడాలూ! అంతా వట్టి బూటకం! ద్రౌపది మాత్రం అదృష్టవంతురాలయ్యా!"

"అసలు కుంతీ, ద్రౌపతీ పతివ్రత లెలా అయ్యారంటావు?"

"ఆ రోజుల్లో ఎంతమంది మొగుళ్ళుంటే ఆడది అంత పతివ్రతయ్యా!"

"అహ్హాహ్హాహ్హా" బ్రహ్మాండంగా కేరింతలు!

శివశివా! మనలాంటివాళ్ళు చెవులు మూసుకోవటం తప్పితే గత్యంతరం లేదు. ఎంత తుచ్ఛమైన వ్యక్తులున్నారు! మన సంస్కృతినీ, ఇంతింత చులకనచేసి నవ్వుకుంటే వీళ్ళకి ఒరిగేదేమిటి?

తర్వాత సినిమాలు—

వాళ్ళ సంభాషణ ఎంత అధ్వాన్నంగా సాగుతుందో వినేవాళ్ళకే అర్థమౌతుంది. తీరా చూస్తే అంతా గ్రాడ్యుయేట్లూ, పోస్టు గ్రాడ్యుయేట్లూనూ! డిగ్రీలకీ, సంస్కారానికీ సంబంధం లేదని నిర్ణయించుకోవాలి మరి.

"మీరంతా చదువుకున్నవాళ్ళు గదా! ప్రతి విషయాన్నీ అంత తప్పుగా ఎందుకు విమర్శిస్తారు?" అంటే,

"నీ అమూల్యాభిప్రాయా లెవడూ అడగలేదు గానీ వెళ్ళు" అనేశాడు ఒకసారి. నేను వాళ్ళందరికీ కాఫీ లవీ ఇస్తాను కొంత పరిచయం ఉంది కనుక ఎప్పుడైనా చనువుగా మాట్లాడతాను. అందుకే ఏదైనా కలగజేసుకొని నా ఉద్దేశ్యాలు చెప్తే అంతమందిలోనూ తేలిగ్గా తీసిపారేస్తారు ఒకటి రెండుసార్లు అలా అయ్యాక నా జాగ్రత్తలో నేను ఉన్నాను.

"అసలు ఆ స్నేహితులమీద ఆయనకే సదభిప్రాయం లేదు. వాళ్ళతో నేను మాట్లాడకూడదు. వాళ్ళు నన్ను పలకరిస్తారు. ఏదో జవాబు చెప్పి రెండుమాటలు మాట్లాడకపోతే బావుంటుందా?"

"అసలు వాళ్ళనెందుకు తీసుకురావాలి తను?"

"గొప్పకి! ఒక్కొక్కసారి వాళ్ళకై వాళ్ళే వచ్చి కూర్చుంటారు. మరి ఎవరి స్నేహితులు? వీళ్ళంతా ఒకటి కాదా?"

"బావ ఎవరింటికీ వెళ్ళరా? అక్కడ ఆడవాళ్ళతో మాట్లాడరా?"

"నువ్వు పరాయి ఆడవాళ్ళని నవ్వుతూ పలకరించవచ్చు. కావలసినంతసేపు కబుర్లు చెప్పవచ్చు. కారణం నువ్వు నిప్పు కణికవు! మరి నీ భార్యని పొరపాటుగ కూడా స్పర్శించకూడదు. పరపురుషుడు కన్నెత్తి చూడకూడదు. ఏమో-ఎవడు ఎలాంటి వాడో! ఇంతకీ నీ భార్యమీదా నువ్వు తపించిపోయే ఆ స్నేహితులమీదా నమ్మకం ఏదీ? నీ భార్యకి వ్యక్తిత్వం ఉందనే జ్ఞానం ఏదీ? నిన్నూ, నీ స్నేహితులు అసహ్యించుకుంటారనే అనుమానమేదీ!"

"అయితే ఏ ప్రత్యేకతా చూడనప్పుడు చదువుకున్న భార్య కావాలని పెళ్ళి చేసుకున్న దెందుకూ?"

"గొప్పకి! పదిమందిలోనూ తనకి ఒక కారూ, ఒక అల్సేషియన్ కుక్కా ఉన్నాయని చెప్పుకున్నట్టు, చదువుకున్న భార్య ఉందని చెప్పుకోటానికి! పెళ్ళికి ముందు చదువుకున్న అమ్మాయిలమీద అదో మోజు. ఉపన్యాసాలలో స్త్రీకి స్వాతంత్ర్యం ఇచ్చేయటం, స్త్రీ జాతిమీద సానుభూతి కురిపించటం — అన్నీ ఆ వేడిలోనే జరిగిపోతాయి. పెళ్ళి అయి సంసారం పెట్టేసరికి ఆవేశాలూ, ఉద్రేకాలూ, వీరకంకణాలూ అన్నీ అఖరు! భార్యాభర్తా, ఆడా మగా మిగులు! ఇక ఆ భేదాలు అలా సాగవలసిందే!

ఒక అమ్మాయి తనకు భార్య అయ్యాక ఆ వ్యక్తికి ఎంతవరకూ న్యాయం చేస్తున్నారో ఆలోచించేది ఎంతమంది? ఆవిడకు అభిప్రాయా

లుంటాయి, కోరికలుంటాయి, నిర్ణయాలుంటాయి, అన్నిటినీ మించి మనసు ఉంటుంది. అవన్నీ అంగీకరించేది ఎంతమంది? చదువుకున్న భార్యకావాలి. కాని, భార్య అయ్యాక ఆ చదువుమీద చిన్నచూపు! ఒక్కోచోట అసూయ కూడా. ఆడది స్వతంత్రంగా ఆలోచిస్తే, భర్త చేసిన తప్పు ఎత్తిచెప్తే, మాటకుతగ్గ జవాబు ఇస్తే, అటువంటివన్నీ చదువువల్లే పట్టుబడిన గర్వాలు. తర్కిస్తుంది, వాదానికి దిగుతుంది. మగవాడి విలువే మరిచిపోతుంది!

అమ్మాయిలేమో చూపులకోసం నవనాగరికంగా చక్కగా సినిమా తారలను మరిపించేటట్లూ, స్వర్గాల్లో తేలించేటట్లూ తయారుకావాలి. కానీ మనోభావాలూ, అలవాట్లూ, పనిపాటలూ, సదవడికలూ పురాణ స్త్రీలతో పోటీ చెయ్యాలి. ఆనాటి అమ్మమ్మలా కొప్పుపెట్టుకొని గోచీపోసి చీర కట్టు కొంటే ఏ మగవాడు ఇష్టపడతాడు? వేషభాషల్లో నాగరికత కోరే వ్యక్తి, ఆడదాన్ని మానసికంగా కూడా ఎందుకు పెరగనివ్వడు? అమ్మమ్మ లక్ష ణాలు లేని కాలంలో అమ్మమ్మ భావాలూ వుండవు. అది ఎందుకు అంగీక రించదు?"

"భానూ! కొంతమంది చేసే నేరాన్ని మొత్తం జాతికి అంటకడ తావా?"

"నేను ఎప్పుడూ అలా దారితప్పి మాట్లాడను. కానీ ఆ కొంత మంది మాటా ఏమిటి?"

"అంత సంకుచితమైన దృక్పథం కలవాళ్ళు ఉంటారని నేను అనుకోను."

"ఉన్నారు. నీ జాత్యాభిమానం విడిచి చూడు. ఆడదాన్ని తలతో సమానంగా భావించడంలేదు. ఆడది ఏదో తక్కువ. పురుషుడే శాసించాలి. నేను పుస్తకాలు చదవకూడదు. ఇంగ్లీషు సినిమాలు చూడకూడదు. వీధి గుమ్మంలో నిలబడకూడదు. పరాయి మగవాళ్ళతో మాటాడకూడదు. మాట్లాడినా ఆ సమయాలలో నవ్వకూడదు. చాలా? నన్ను ఒక వస్తువులా

జాగ్రత్త పరచాలనే తాపత్రయం కాకపోతే ఇదంతా ఏమిటి? నేనూ కొన్ని మంచిచెడ్డలు తెలుసుకోగలనని నన్ను నమ్మి నా బాధ్యతలు నా కెందుకు వదలకూడదు?"

నేనేమీ మాట్లాడలేదు.

"ఒక రచయిత పుస్తకాలు చదువుతాం. అతని ధోరణి నచ్చకపోతే మానేస్తాం. కొన్ని రకాల సినిమాలు చూస్తాం. నచ్చినవాటికి మరోసారి ప్రయత్నించం. కొంతమంది మగవాళ్ళతో మాటాడతాం. వాళ్ళని అర్థం చేసుకుని మన జాగ్రత్తలో మనం ఉంటాం. నేను చెప్పే ఆ కొంతమందీ చాలా పెరగాలి. ఎప్పుడో—సరేలే....ఇటువంటి కబుర్లు వింటూ కూర్చుంటే నీకు పైముదరంగా!" అంది నవ్వుతూ చటుక్కున.

"భానూ, నువ్వు చాలా సిల్లీగా మాట్లాడటం నేర్చుకున్నావు."

"నిజమే అది అవసరమవుతోంది." అంటూ లేచి వెళ్ళింది. కాఫీ చేసి తెచ్చింది. తను వంట చేస్తూంటే నేను పుస్తకం తెరుచుకు కూర్చు న్నాను. నా కళ్ళకు అక్షరాలేమీ కన్పించటంలేదు. పుస్తకంలో అక్షరాలన్నీ చకచకా మారి భాను మాట్లాడిన మాటలన్నీ పేరుకొంటున్నాయి. వెక్కి వెక్కి ఏడుస్తూన్న భాను మొహమే ప్రతి పేజీమీదా సాక్షాత్కరిస్తూంది. అన్నీ నాకుచెప్పి హృదయభారం తగ్గించుకుని కాబోలు తేలిగ్గా తిరుగు తూంది. కానీ ప్రతిరోజూ ప్రతిగంటా అనుభవిస్తూన్న ఈ నరకం ఎప్ప టికి అంతం కావాలి! చదువు సంధ్యలూ, అందచందాలూ, తెలివితేటలూ— అన్నీ వున్న భాను భర్తకి ఎందుకు అయిష్ట మవుతోంది? సుఖశాంతులతో తులతూగవలసిన సంసారాన్ని ఎందుకతను దుఃఖమయం చేసుకుంటు న్నాడు? భాను దాంపత్యం ఆనందప్రదం కావాలంటే నేనేం చెయ్యాలి? అన్నీ ప్రశ్నలే! జవాబులు లేవు-నా ప్రియమైన చెల్లి, ప్రాణస్నేహితు రాలు భాను ఇంత నికృష్టమైన జీవితం గడుపుతోందనుకుంటే ఆ బాధ వెల్లడించే శక్తి నాకులేదు.

పుస్తకం మూసి పచార్లు ప్రారంభించాను.

చటుక్కున ఆగి, "ఖానూ! అగరువత్తుల చెట్టుకొన్నానన్నావ్?" ఏదీ! ఎక్కడా కనిపించదేం!" అన్నాను.

"అయ్యో! అది ఇన్నాళ్ళు ఉందా? ఎప్పుడో నామీద కోపంవచ్చింది. అది ముక్కముక్కలైంది. ఎలాంటి వస్తువుగానీ నేలకేసి కొట్టటమే! నా చేతినుంచి కప్పు జారిపడితేనే ఒక యుద్ధం జరుగుతుంది. మరి తనకై తాను కావాలని బద్దలు కొడితే అది అడిగేవాళ్ళు లేరు. అయినా సంపాదన పరులు ఏది పగలగొట్టినా తిరిగి కొనగలరు. నేను పాడుచేస్తే ఎలా తేగలను?"

ఖానుకి ఈ మానసిక బాధవల్ల కొంత దాదస్తంగా మాట్లాడటం కూడా అలవాటైనట్టుంది.

రాత్రి తొమ్మిది గంటలయింది బావ వచ్చేసరికి. ఆ ముఖంలో ఎన్నడూ లేని దౌర్జన్యం, కాఠిన్యం కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నట్టు అని పించింది నాకు.

"ఏమిటండీ! అలా చూస్తున్నారు? భోజనాలయ్యాయా?" అని పలకరించేసరికి తేరుకొని, "ఆఁ ఆఁ—నేను భోంచేశాను. ఖాను మీకోసం కాటోలు ఉండిపోయింది" అన్నాను.

"ఓహో! పతివ్రతా లక్షణం కాబోలు!" అంటూ నవ్వి తువ్వాలు అందుకొని వెళ్ళిపోయాడు. అతను నోరు విప్పితేనే వ్యంగ్యం ధ్వనిస్తుందేమో అనిపించింది. కొందరి లక్షణమే అంత. వీధి అరుగుమీద కెళ్ళి వించున్నాను.

బావ ఒక విపరీతమైన వ్యక్తి.కానీ నాకు ఎక్కడో ఏదో నమ్మకం ఉంది. అతనిలో ఒకనాటికి పరివర్తన వస్తుంది. తన తప్పిదాలను తను

తెలుసుకుంటాడు ఆ కాఠిన్యం, దౌర్జన్యం అన్నీ పోతాయి. మనిషి మనిషిగా మిగులుతాడు అది మాత్రం నిజం. దానికి వ్యవధి కావాలి. ఓర్పు కావాలి. అదే మార్గం!

మర్నాడునేను వెళ్ళిపోయేముందు ఖానుఏదోచెప్పాలనుకొంటున్నట్టు తటపటాయించింది. "అన్నయ్యా!........" అని ఆగిపోయింది. ఏమిటం న్నట్టు చూశాను.

"అన్నయ్యా! ఇప్పుడు నీ ఎదుట నిలబడాలంటే నాకు సిగ్గేస్తూంది. నా ఇంట్లోనే నాకు గౌరవం లేదని తెలిస్తే ఎవరైనా నన్ను గౌరవిస్తారా? తీగ కదిలితే డొంకంతా కదిలినట్టు నిన్న ఎందుకో అలా సోదెలా చెప్పుకు పోయాను అన్నీ మరచిపో అన్నయ్యా! నీ దృష్టిలో మా ఇద్దర్నీచులకన కానివ్వకు ...." దాదాపు ఖానుకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. గొంతు రుద్ధమైంది. అదో మాదిరిగా నవ్వుతూనే ఉంది.

ఖాను భుజంమీద చెయ్యివేశాను "అయిందా నీ ఉపన్యాసం.... పిచ్చి ఖానూ! అన్నయ్యని ఇంత గొప్పగా అర్థం చేసుకున్నావన్నమాట! నువ్వు ఎన్ని చెప్పినా బావని నేను అపార్థం చేసుకోలేదు.. ఒక విధంగా ఆలోచిస్తే బావని క్షమించాలి. ఎన్ని తిట్లు తిట్టి, ఎంత కోపంతో వెళ్ళిపోయినా ఇంటికి వచ్చేసరికి అన్నీ మరచిపోయి తనంతట తను పలకరిస్తాడు." అవునా?—

"అవును, నాకు కోపం వచ్చినప్పుడు నా అంతట నేను ఎప్పుడూ మాట్లాడను. ఏదోవిధంగా బావే మాట్లాడిస్తాడు."

"బావలో మంచితనం కూడా లేకపోలేదు ఖానూ! అది గ్రహించావా?"

"కుండెడు విషంలో ఎంత అమృతం కలిపినా అది వృథా కావటం తప్పితే లాభం లేదన్నయ్యా! బావలో ఏదో మంచితనం వుంటే వుండ

వచ్చు. అది నా అనుభవానికి మాత్రం రావటంలేదు. ఎదటివ్యక్తి నుంచి మంచి పొందుదామనీ, సుఖపడదామనేగదా ప్రయత్నిస్తాం? అదే జరగటం లేనప్పుడు ఏం చూసుకొని నన్ను సంతోషపడమంటావు? ఇవ్వాళ ఏదో కారణంగా ఒకగంట సంతోషంగా ఉన్నానంటే....తర్వాత కొన్నిరోజులకు మరేదో కారణంగా ఈ సంతోషానికి శిక్ష అనుభవిస్తాను."

"బావ అవివేకంగా ఉన్నాడు భానూ! నువ్వు మాత్రం ప్రతి విషయం ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు అతను కోపంలో అనే ప్రతి మాటా నిజమని బాధపడకు. ఒకనాటికి బావపూర్తిగా మారిపోతాడుభానూ!"

భాను మాట్లాడలేదు. నేను తిరిగి అన్నాను—"బావ పెరిగిన పరిస్థితులే అంత కఠినంగా, ఒంటెత్తు మనిషిగా తయారు చేశాయి. నువ్వు వచ్చేవరకూ అతను ఏ విధంగానూ స్త్రీ ప్రేమ ఎరగడు. తల్లిఅనురాగంతో, అక్కచెల్లెళ్ళ అభిమానాల మధ్య పెరిగితే ఆడవాళ్ళ కష్టసుఖాలు అర్థమయ్యేవి. కానీ అతనికి మంచిచెడ్డలు చెప్పేవాళ్లు లేరు. చేసిన తప్పుకి దండించేవాళ్ళు లేరు. గాలి వాలుకి తిరిగి పెరిగిన వ్యక్తికి మంచి అలవాట్లు ఎలా వస్తాయి చెప్పు? మనం ఒక మనిషిని తొందరపడి విసర్జించకూడదు. ఏదో విధంగా అతన్ని మార్చటానికే ప్రయత్నం చెయ్యాలి. అదే చెయ్యటం లేదు నువ్వు. ఒక తప్పుపని చేశాడని విమర్శించటం, ఒకమాట అంటే బాధపడటం, అక్కడితో పంతంపట్టి కూర్చోటం—ఇదంతా ఏమిటి చెప్పు? నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు, నేను చెప్పింది సబబు కాదంటావా? ఆలోచించు భానూ!"

"అన్నయ్యా! నామీద నీకు ఏమాత్రం నమ్మకం ఉన్నా, నేను చెబుతున్నది నిజమని నమ్ముతావు. బావను మార్చటానికి నేను ప్రయత్నమే చెయ్యలేదంటున్నావు. అది మాత్రం నిజంకాదు. నేను ఎన్నో ఆశలుపెట్టుకొని కాపురానికి వచ్చాను. కొన్నాళ్ళు—నేనేమీ తెలుసుకోలే నన్నాళ్ళు సుఖంగా గడిచింది. కానీ క్రమంగా బావ అంటే ఏమిటో అర్థం కాసాగింది. రోజుకి అయిదు ప్యాకెట్ల సిగరెట్లు కాలుస్తుంటే, అర్థరాత్రిళ్ళుదాటి ఇంటికి వస్తూంటే, సెలవు రోజులు పూర్తిగా జాడ లేకుండాతిరుగుతూంటే,

ఏమాత్రం మావల్ల పొరపాటు జరిగినా నిర్మొహమాటంగా కేకలేస్తూంటే, కొత్తలో ఏం జరిగినా ఆశ్చర్యపడేదాన్ని. అప్పుడు నాకు నిజంగా బాధని పించేది కాదు. నెమ్మదిగా చెప్తే ఆయనే వింటారు, సంసార బాధ్యతలు ఆయనకి లేవా? అనుకున్నాను. మొట్టమొదట్లో ఆయన చేసిన ఏ పెద్ద పని తోనూ నేను గట్టిగా కలగజేసుకోలేదు. ఎన్నో విధాలా, ఎంతో నెమ్మదిగా అడుగుతూ వచ్చాను."

"మీకు సిగరెట్లు చాలా యిష్టంలా ఉంది." అనేదాన్ని.

"ఉత్త ఇష్టం కాదు, ప్రాణం!"

"నెలకి మీ ప్రాణానికి ఎంత అవుతుందో?"

"ముప్పై పైన...."

"అంత డబ్బు—కాల్చిపారేసినట్టు అయిపోవటం లేదూ?"

"నీకు తెలీదు భానూ! అవి లేకపోతే వుండలేను"

"ఇప్పుడు మీ ఖర్చులు పెరిగాయి తెలుసా? మరి నేను కూడా ఉన్నాను."

"అయితే...."

"పొగ అంతగా పీల్చటం ఆరోగ్యానికి కూడా మంచిది కాదంటారు. మీరు క్రమంగా తగ్గించుకుంటే బావుంటుంది కదూ?"

"ఆఁ చూద్దాం లెద్దూ?"

"అంతే! ఆ చూద్దా—చూద్దాంలాగే ఉంది—తర్వాత మరోసారి అడి గితే ఏదో చెప్పారు. మరోసారి హెచ్చరిస్తే కోపం వచ్చింది. కొన్నాళ్ళు పోనిచ్చి మళ్ళా అడిగితే మండిపడ్డారు. అది నాకు అవసరమన్నారు. ఆ మాట నేను ఎత్తటానికే వీల్లేదన్నారు. ఏం చెయ్యను? మిగిలిన వాటిలోనూ ఇలాగే అయింది. నా శాంతం, నమ్మకం అన్నీ వృథా అయ్యాయి. ఏమీ చెయ్యలేని పరిస్థితిలోకి వచ్చాను. అప్పటి నుంచీ ఆయన పనుల్ని విమ ర్శించటం, మాటకు మాట జవాబివ్వటం, కోపం వస్తే మాట్లాడటం మానె

య్యటం ప్రారంభించారు నా సంసారాన్ని తీర్చి దిద్దుకుందామనీ, నాభర్తతో సంతోషం అనుభవిద్దామనే నేను కోరుకున్నాను. అది దురాశో ఏమో అర్థం కాదు. అయినా నా ప్రయత్నంలో లోటు వుందని నువ్వు అంటున్నావు. ఐతే ఇకనుంచీ నా శక్తికొద్దీ ప్రయత్నిస్తాను. నమ్ముతావా?"

"భానూ! ఏదో విధంగా నీ దాంపత్యం సరిచెయ్యాలనే భావంతప్పితే నాకు మరో ఉద్దేశ్యం ఉందంటావా?"

భాను నవ్వింది. "అన్నయ్యా! నేను ఇప్పుడు కర్మలనీ, పూర్వ జన్మలనీ, చేసుకున్న సుకృతాలనీ అన్నిటినీ నమ్ముతున్నాను"

"అవి నిజమే కావచ్చు. కానీ కనిపించని ఆ నిజాల్ని నమ్మి అనుభవిస్తున్న జీవితాన్ని నిర్లక్ష్యం చేసుకుంటామా? నీకు మళ్ళీ చెబుతున్నాను. నావ తప్పుచేస్తే క్షమించు. భర్త సుగుణాలు అనుభవించవలసింది భార్య అయినప్పుడు, దుర్గుణాలు కూడా అనుభవించవలసింది భార్యే అవుతుంది. నన్ను అపార్థం చేసుకోకపోతే ఒక్కమాట! నువ్వు ఆడదానివి. ఆ భావం పురుషుడిలో ఎప్పుడూ ఉంటుంది. అరిటాకూ, ముల్లూ సామెత నీకు తెలుసుగా?"

"అవు నన్నయ్యా! ఇల్లు నిలుపుకోటానికి ఆడదీ ఒక్కతే ప్రయత్నం చెయ్యాలి పవిత్ర భారతదేశంలో నేను పాటించవలసిన సలహాలు ఇవే మరి!"

నేను పర్సులోంచి పదియాభై రూపాయల నోటు తీసి ఇస్తూ "ఉంచు భానూ! నీకేమైనా అవసరం ఉంటుంది" అన్నాను.

"మంచివాడివే! నాకేం ఖర్చులుంటాయి?" అన్నదీ నవ్వి.

"నీకేం ఖర్చులుంటాయో నాకు తెలుసుగానీ, ముందు తీసుకో! మరి నాకు కోపం వస్తుంది."

"బావుంది, నీకు కోపంవస్తే రానీ!"

"అయితే ఇక నేను మీ ఇంటికి రానవసరం లేదన్నమాట!"

"దానికీ, దీనికీ, ముడిపెట్టకన్నయ్యా!" అని —"సరే, తీసుకుంటాను" అంటూ తీసుకుంది నా చేతిలో నోటు. నీ దగ్గర డబ్బు తీసుకున్నందుకు కాదు, ఈ పరిస్థితి వచ్చినందుకు సిగ్గుపడుతున్నాను" అన్నది ఆ అభిమానవతి.

"దానికేం గానీ, మరేమీ అనుకోకు భానూ! నీకు చీరలున్నాయా?" అలా అడగటానికి నాకే సిగ్గు వేసింది. భాను ఆశ్చర్యంగా చూసింది. "ఏం....?"

"చెప్పు భానూ!"

"ఉన్నాయి"

"నిజం చెప్పు"

"నిజమే అన్నయ్యా! అమ్మ కొంటూంది కదూ!"

ఉంటే సరే! కానీ నన్ను నమ్ము భానూ! నాకు ప్రాణం అంటూ ఉంటే అది నువ్వే! నువ్వు బాధపడితే నాకు సుఖం వుండదు. నీకేది కావలసినా నాకు చెప్పు. అన్నయ్య దగ్గర నీకు సిగ్గెందుకు?"

"ఇక నాకు ఏది కావలసినా నిన్నే అడుగుతాను."

"అలా ఉండాలి. భాను మంచిది! మరి నే వెళ్ళనా?"

"ఒక్క అనుమానం రావుగారూ! నేనే మీ ప్రాణం అంటున్నారు కదా! అది ఎప్పటివరకండీ?" అని భాను నవ్వింది. భాను అంతరార్థం నాకు తెలుసు. నేనూ నవ్వి అన్నాను "సుశీల వచ్చేవరకండీ!"

"ఆ తర్వాత....?"

"ఏమోనండీ!"

చటుక్కున భాను ముఖం వివర్ణమైంది. దీర్ఘంగా నా ముఖంలోకి చూడసాగింది. "నిజంగా అలా మారిపోతావా"

"భానూ! అది నీ అంతరాత్మని అడుగు, జవాబు వస్తుంది."

భాను నవ్వింది. భాను చెయ్యి పట్టుకొని విడిచి, అల్లుణ్ణి ఎత్తుకుని దించి వీధిలోకి నడిచాను.

* * *

భాను ఆలోచనలే నన్ను పట్టి సదా వేధిస్తున్నాయి. భానుకైతే ధైర్యం చెప్పానుగానీ, నిజానికి నేను నమ్మింది జరుగుతుందా? ఏనాటికైనా భర్త అనురాగం పొంది భాను సుఖిస్తుందా? ఎలా నమ్మటం? భాను సుఖపడాలంటే నేనేం చెయ్యాలి? క్రమంగా బావతో స్నేహంచేసి ప్రాణానికి ప్రాణంలా తయారై అతని తప్పొప్పులు విప్పిచెప్పితే....? అప్పుడు అతడే నాకు నూరిపొయ్యడు కదా? నా ఆలోచనలకు ఒక దారి లేదు. భానును ఎప్పుడు చూడాలనిపించినా చూసి వస్తున్నాను. ఒకసారి భాను అడిగింది. "లైబ్రరీ పుస్తకాలు తెచ్చిపెట్టటానికి నీకు వీలుంటుందా అన్నయ్యా?"అని. నేను భాను కళ్ళల్లోకి చూశాను. ఆ కళ్ళు నాకు ఎంతో చరిత్ర చెప్పాయి. భానుకి చదవాలనే కాంక్ష అత్యధికం. మనం తెలుసుకోవలసింది ఎంతో ఉంది. అది తెలియకుండా ఉండిపోవటం దురదృష్టం. కనీసం తెలుసుకోవటానికి ప్రయత్నమైనా చెయ్యకపోవటం అవివేకం! భాను అభిరుచుల్ని బట్టి చూస్తే ఒకనాటికి భాను పెద్ద రచయిత్రి అవుతుందేమో అనుకుంటూ వుండేవాడిని నేను. భానుకి అవకాశం కల్పించి ప్రోత్సహిస్తే ఫలితం ఉంటుంది.

"ఇక్కడికి వచ్చిన దగ్గర్నించీ, ఎన్నో పుస్తకాలు చదువుదామనుకున్నాను. మన వూళ్ళో లైబ్రరీలో చాలా పుస్తకాలు లేవు. కానీ ఎవరు తెచ్చిపెడతారు?"

"పోనిద్దూ! ఇకనుంచి నేను తెస్తాను. సరేనా? నీ ఓపిక అంచనా వేసుకో. చూస్తాను. ఎన్ని చదువుతావో!"

భాను నన్ను ఒక సహాయం కోరినదంటే ఎంతో సంతోషంగా ఉంది. ఉత్తి కబుర్లుగాక అన్నయ్యగా క్రియా రూపంలో నేను భానుకి

ఉపయోగపడాలి. ఆ మర్నాడే సెంట్రల్ లైబ్రరీలో రెండు సభ్యత్వాలు తీసుకున్నాను. ఒక్కసారే నాలుగేసి పుస్తకాలు తీసుకోనవచ్చు. మొట్ట మొదట చలం "స్త్రీ" ఒక్కటే తీసుకువెళ్ళాను. అది చూసి భాను అంది— "ఇది నా దగ్గిర ఉందిగా! దీన్ని గురించే మా యిద్దరికీ ఘర్షణ జరిగింది" అని.

"పుస్తకం గురించి ఘర్షణేమిటి?"

"మరేమిటనుకున్నావు? ఈ ఇంట్లో తగువు పెట్టగలిగే శక్తి చీపురు పుల్లకి కూడా ఉంది. అదిగాని నానిగాడు ఏ గదిలోకో తెచ్చి పడేస్తే ఆ రోజు ఓ చిన్న యుద్ధం! సరే, పుస్తకం అంటావా? ఈ 'స్త్రీ' నేను చదవటం చూసి బావగారు మండిపడ్డారు. 'చలం పుస్తకాలు నువ్వు చదవటానికి వీల్లేదు?' అన్నారు.

"ఎందుకని?" అన్నాను.

"అవి ఉత్త చెత్త! వాటిల్లో ఏమీలేదు."

"ఆ సంగతి చదివితేకదా మీకు తెలిసింది?"

"అక్కర్లేదు. నేను చెబుతున్నాను. ఆ పుస్తకాలన్నీ చెత్త!"

"కావచ్చు! ఆ సంగతి నన్నే తెలిసికోనిస్తే మంచిది."

"నోర్ముయ్! నేను చెప్తూంటే వాదించకు. నువ్వు మనిషివా పశువ్వా?"

"మనుషులకు మనిషినీ! పశువులకు పశువునీ!"

"ఈ చెంపలు బిందబారిపోవటానికికారణం అటువంటిసంఘటనల్లూ, అటువంటి సంభాషణలే! కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ నా చేతిలో పుస్తకం లాక్కొని ముక్కలు ముక్కలుగా చించి పారేశారు. నా హృదయం భగ్గుమంది. నేను మన వూరు వెళ్ళినప్పుడు పట్టుదలగా చలం పుస్తకాలన్నీ

దొరికినంతవరకూ కొని దాచాను. తప్పంటావా? అధికారంతో ఎవరైనా ఎవరినైనా మార్చగలిగినట్టు విన్నావా?"

నాకు చాలా విచిత్రమనిపించింది. అతను మగవాడే కావచ్చు; భర్తే కావచ్చు. అంతమాత్రాన ఒక పుస్తకం చదివే విషయంలో తన అధికారం చెలాయిస్తే? ఒక వ్యక్తికి, తనకు కావలసిన పుస్తకం చదువుకునే స్వేచ్ఛ లేకపోతే....? "ఛీ! ఏమిటింత మూర్ఖత్వం?" అన్నాను.

"మూర్ఖత్వమేమీ కాదు. ముందుచూపు! చలం పుస్తకాలు చదివితే స్త్రీకి నిజం తెలుస్తుంది తిరుగుబాటు తత్వం అలవడుతుంది. అది జరిగినా, మానినా పురుషుడికి ఆ భయం ఉంటుంది."

నేను కొంతసేపు మౌనంగా ఉండి అడిగాను—"చలంమీద నీ అభిప్రాయం?"

"చలం వాదం న్యాయమైనది. అంతవరకే – అనుసరించటానికి వీలైంది కాదు."

"న్యాయాన్ని ఎందుకు అనుసరించకూడదు?"

"ఈనాడు న్యాయాన్ని అనుసరించి బ్రతుకులు సాగటం లేదు గనుక. ఆ న్యాయం పదిమందీ ఆమోదించరు గనుక....ఒక పుస్తకం చదవటానికి కూడా స్వేచ్ఛ లేకపోతే ఎలా?— అంటున్నావుగానీ దానిలో స్వార్థమో, మరొకటో కొంత అర్థమైనా ఉంది. మా అమ్మకి నేను ఉత్తరం రాసుకోటానికి కూడా ఆ వ్యక్తి ఆజ్ఞ కావాలంటే నమ్ముతావా? ఒకసారి ఈయన మన ఊరు పండక్కి వస్తే వాళ్ళు మర్యాద చాలలేదట. మరోసారి ఈయన లంకణాలు పడిలేస్తే వాళ్ళు చూడటానికి రాలేదట. వాళ్ళకి ఉత్తరాలు రాయటానికి వీల్లేదని ఆజ్ఞాపించారు. నిజమే, ఏదో కారణంగా ఆయనకి కష్టం తోస్తే తోచవచ్చు. మధ్య నన్ను ఉపయోగించుకోవటం ఏమిటి అని నా ప్రశ్న."

"నీ ప్రశ్నలకి, మీ ఆయనకి తలో నమస్కారంగానీ, నువ్వు విశ్రాంతిగా కూర్చో! మర్యాదలు చెయ్యకపోవటానికి వాళ్ళేం పిచ్చివాళ్ళా? వందలమైళ్ళు ప్రయాణం చేసి చీటికీ మాటికీ రావాలంటే మాటలా?"

"మే మిద్దరం పండుగకి వెళ్తున్నప్పుడు స్టేషన్ కెవరూ రాలేదురా! అదీ గొడవ. ఇంటికివెళ్తూనే అలిగి పడుకున్నారు. పదిమందిలో నా పరువు తియ్యొద్దని కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలాను. వినలేదు. చేసేదిలేక అమ్మతో అన్నాను. అమ్మ తప్పు ఒప్పుకొని ప్రాధేయపడితే లేచి టిఫిన్లు ఆరగించారు."

"ఎక్కడి కక్కడ ఇలా తప్పు లెంచుతూంటే...."

దొడ్డి తలుపు చప్పుడైతే భాను లేచి వెళ్ళింది. ఐదు నిమిషాల్లో తిరిగివస్తూ "నీ దగ్గర రెండు రూపాయలున్నాయా?" అంది.

"ఐదు రూపాయల నోటు ఉన్నట్టుంది. చిల్లర లేదు. ఎందుకు?"

"చెప్తానుగానీ అదే ఇవ్వు!"

పర్స్ తీసి ఒక నోటు ఇస్తే దొడ్డివేపుకు తీసుకువెళ్ళింది. ఎవరో పక్కింటావిడ వచ్చినట్టుంది. కొంచెం మాటలు వినిపించాయి, "ఐదు రూపాయ లెందుకమ్మా! తీసుకోగానే సరా? ఒక్క రూపాయిన్నర ..."

"ఫర్వాలేదు తీసుకోండి బామ్మగారూ! మీరు తీర్చనూవద్దు, ఏమీ వద్దు. ఓ పదిరోజుల్లో వచ్చేసెయ్యండి. ఎప్పుడూ ఉండే గొడవలే కదా?"

"అమ్మా! నీకు తెలియంది ఏమీలేదు. బ్రతుకు ఎంత నవ్వుల పాల యిందో చూశావా? నా మాటకేంగానీ నువ్వు జాగ్రత్త! చీటికీ మాటికీ బెంగ పెట్టుకోకు! పిల్లాణ్ణి జాగ్రత్తగా చూసుకో. అన్నట్టు రాజుని కాస్త కనిపెట్టి వుండు తల్లీ! మీ అన్నయ్యకి డబ్బు ఇవ్వకపోతే...." ఆవిడ గొంతు భారంగా వుంది.

"మరేం ఫర్వాలేదండీ! వాడి డబ్బూ, నా డబ్బూ వేరు వేరు కాదు."

"మరి వెళతాను."

"మంచిది బామ్మగారూ! మళ్ళా మీరు వచ్చేవరకూ నాకు ఏదో వెల్తిగా ఉంటుంది."

ఖాను లోపలికి వచ్చింది నిట్టూరుస్తూ. పక్కన కూర్చుంది.

"ఏమిటో అన్నయ్యా! ఈ మనుషుల్నీ, ఈ జీవితాల్నీ తలచుకుంటే ప్రశ్నలే మిగుల్తాయి. పాపం బామ్మగారు కూతురింటికి వెళ్ళిపోతున్నది. అదంతా కోడలి ప్రయోజకత్వం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆవిడ ఆ ఇంటికి నియంత! భర్తనీ, అత్తగార్నీ కోపంవస్తే ఎండలో కూడా నిలబెట్ట గలిగే శక్తిమంతురాలు. అత్తగారిమీద ఏ క్షణం దయతప్పితే ఆ క్షణంలోనే ఇంట్లోనించి తరిమివెయ్యగలిగే సాహసవంతురాలు! ఇంకా చెప్పేదేముంది? ఆ వున్న ఒక్క ఆడబిడ్డనీ ఏడాదికోసారికూడా ఇంటికి పిలిపించదు. ఇంకా స్కూల్లో చదువుతున్న మరిది ఒకడున్నాడు. అతనే రాజు. అతను ఆ ఇంటి నౌకరు! ఆవిడ అపురూపంగా చూసుకొనే కన్నపిల్లలు ఇద్దరున్నారు. వాళ్ళ సంరక్షణంతా బామ్మగారే చూస్తుంది. వంటపని చేస్తుంది. వెట్టిచాకిరీ అంతా చేస్తుంది. రాజు నూతి నీళ్ళన్నీ తోడిపోస్తాడు. బజారుపనులు చూస్తాడు. పిల్లలిద్దర్నీ తిప్పుతాడు."

"ఇక రాణీగారేం చేస్తుంది?"

"ఏమరా! రాణీగారు మొగుడుగారితో పేకాడుతుంది. సినిమాలు చూస్తుంది. షికార్లు చేస్తుంది. పిక్నిక్‌లకు వెళ్తుంది. పరిచితులను, మిత్రులను కలుసుకుంటుంది. మహిళా సమాజాలకు, లేడీస్ క్లబ్బులకూ తిరుగుతుంది. ఈ డ్యూటీలన్నీ చాలవూ? ఎంత బిజీగా ఉంటుందని! ఇంకా ఖాళీ మిగిలిపోతే అత్తగారితో దెబ్బలాడుతుంది. మరిదిని తిట్టిపోస్తుంది. మొగుణ్ణి బెదిరిస్తుంది. అక్కడితో అలిసిపోతుంది, ఆవిడ కలవారి కూతురు. చాలా సంపద తెచ్చుకుందట. అగ్గిపెట్టెతో సహా వెండిదేను. అందుకే మిడిసిపాటు. మంచి చెడ్డలు విస్మరించింది. ఒకసారి ఆవిడ ఏదో కూర వండమని హుకుం చేస్తే బామ్మగారు కూరలు ముదిరి

పోయాయి కదా అవి పులుసు పెట్టిందట. తీరా రాణీగారు భోజనానికి వచ్చే సరికి నానా భాగోతం అయింది. అత్తగారిని నానామాటలంది. ఆ పులుసు ముట్టుకోటానికైనా వీల్లేదని మొగుడుగార్ని ఆజ్ఞాపించింది. అతను తల దించుకొని మరోకూరతో అన్నం తినేస్తున్నాడు. బామ్మగారికి దుఃఖం వచ్చింది. "నాయనా! నేను చేసింది తప్పవనట్రా? అంతమాత్రానికి అది నన్ను నానామాటలంటే నువ్వు వింటూకూడా...."

"పోనీ అమ్మా! దాని మాటలకేంగానీ—అది చెప్పినట్టు చేస్తే పోయేదికదా?" అన్నాడట. చూశావా? ఎంత చిత్రమైన విషయమో!

"చిన్నవాళ్ళ ఇష్టప్రకారం పెద్దవాళ్ళు నడిచే రోజులు వచ్చాయి. తల్లికి ఆ ఇంట్లో విలువ లేనేలేదన్నమాట. కనీసం ఆవిడ వయస్సుకైనా ప్రాముఖ్యం ఇవ్వాలి కదా? 'నేనే నా భార్య చెప్పినట్టు వింటున్నాను. ఇక నీ గతేమిటి?' అని కాబోలు అతని ఉద్దేశ్యం! "పోనీ నాయనా! ఇకనుంచీ మీ ఇష్టప్రకారమే చేస్తాను. ఈసారికి మాత్రం కోపాలు పెట్టుకోకండి. ఒక్క గరిటెడు పులుసు వేసుకో. నువ్వు తింటేగానీ నాకు తృప్తివుండదు" అంటూ బామ్మగారు ప్రాధేయపడిందట కొడుకుని. తల్లి హోదా నిలుపుకోవాలని ఆ హృదయం తహతహలాడుతున్నది మరి. అతను ఏమీ అనలేక "సరే వెయ్యి" అన్నాడట. అతను అన్నంతిని లేచేసరికి కోడలు సూట్‌కేస్ సర్దేసుకుంది. అత్తగారిమీద యుద్ధం ప్రకటించింది "నా భర్తనీ, నన్నూ విడదీయటానికే నువ్వు ప్రయత్నిస్తున్నావు. నేను వద్దని చెప్పిన పని ఆయన్ని మభ్యపెట్టే కబుర్లు చెప్పి ఎందుకు చేయించాలి?" అంటూ తిట్టిపోసింది. తర్వాత భర్తతో "నా మాటకి పీసమెత్తు విలువలేని ఈ ఇంట్లో నేను ఉండనవసరంలేదు. మీ అమ్మగారితోనే ఊరేగండి. వెళ్తున్నాను. ఇక రానేరాను!" అని నిర్ణయం చెప్పేసి బయలు దేరింది. "సరూ! సరూ!" అని వెనకబడితే రైలు ఎక్కించి రావటం తప్పితే ఫలితం లేకపోయింది. ఆ సరూ ఏం చదువుకుందో తెలుసా?

"నా ముఖం! ఏమీ చదివి వుండదు. చదివితే అలా ఎన్నడూ ప్రవర్తించదు"

"అదే నీ పొరపాటు! ఆవిడ సరోజాదేవి బి. ఎ. క్లాసు తెచ్చుకుంది."

"నిజం?" నాకు ఆశ్చర్యం వేసింది.

"అక్షరాలా, చిత్రంగా ఉంది కదూ?"

"మరి ఆవిడ భర్త....? ఏం పని?"

"కాలేజీ లెక్చరర్! అతను ఉత్తదేవుడు—అంటే అంత మంచి వాడనికాదు, దేవుడిలా నోరు విప్పి మాట్లాడలేనివాడు! ఎవరిమీద కరుణ వస్తే వాళ్ళనే అందలం ఎక్కించగలవాడు! ఆ సరోజ సంగతి ఆలోచిస్తేనే నాకు బాధగా వుంటుంది. ఆవిడకు ఒక స్త్రీ వాంఛించే సర్వసుఖాలూ వున్నాయి. స్వేచ్ఛ వుంది. ఆవిడ మాటకు ప్రాధాన్యం వుంది. భర్త ఆదరాభిమానా లున్నాయి. ఒక వ్యక్తిగా బ్రతకగలిగే అదృష్టమూ వుంది. అంతకన్నా కావలసిందేమిటి? కానీ అన్నిటినీ దుర్వినియోగ పరచుకొంటున్నది. భర్త తన మాట వింటాడు కదా అని తల్లినీ, కొడుకునీ వేరు చేస్తుందా? తనకి అధికారం వుందని అత్తగారిమీద పెత్తనం చెలాయిస్తుందా? తనకు లభిస్తూన్న సదవకాశాలను అనుభవించలేక దుర్వినియోగ పరుస్తున్నారనే కదూ ఈ చదువుకున్న ఆడవాళ్ళ మీద లోకానికి ఉన్న చూపు? తన ఇంటిని సంతచేసి మహిళా సంఘాలకు మెంబరై ఏవో హక్కులు కావాలని నినాదాలుచేస్తే నలుగురూ నవ్వుకోరూ? ఎటువంటి ప్రగతీ చూడలేని నాలాంటివాళ్ళు అంధులుగానే పడివున్నారు. అవకాశాలు వున్నవాళ్ళు కూడా వాటిని నాశనం చేసుకొంటున్నారు. అసలు లోపం ఎక్కడ వుందంటావు?"

"నా వుద్దేశ్యం-ఈ విషయం తీసుకొంటే బామ్మగారి కొడుకులోనే...."

"అదే నా వుద్దేశ్యంకూడా! ఈ మగవాళ్ళలో వున్నది రెండే రకాలు! తల్లి తండ్రుల్నీ, అక్క చెల్లెళ్ళనీ అపారంగా అభిమానిస్తూ తనకి ఒక భార్య వుందనీ, ఆవిడ కష్టసుఖాలు తనమీదే వున్నాయనీ గుర్తు అయినా తెచ్చుకోనివారూ: మూడు ముళ్ళూ వేసింది మొదలూ భార్యామణి కొంగుకి దాసులై, కీలుబొమ్మలై సర్వ ప్రపంచాన్నీ విస్మరించేవారూ! వీళ్ళకి వున్నది ఒకే కన్ను! దానితో వాళ్ళు ఒక్కభాగాన్నే చూడగలరు. లోకం అలాగే గడిచిపోతున్నది."

"సరోజాదేవికీ, నీకూ స్నేహం లేదేమిటి?"

"ఆవిడకి నేను నచ్చను. అయినా బామ్మగారితో నేను మాట్లాడతా నని ఆవిడకు కోపం. పాపం బామ్మగారు చాలా మంచిది అన్నయ్యా! తన గొడవలేవో చెప్పి నన్ను ఓదార్చుతూ ఉంటుంది 'అయినా ఆడదంటే అంత చులక నెందుకండీ?' అని నేనంటే 'అయ్యో పిచ్చి తల్లీ! ఇంకా ఈ రోజుల్లో ఏముందీ? ఎక్కడో నీ మొగుడులాంటి వాళ్ళుతప్ప అంతా పెళ్ళాలని నెత్తిమీదే పెట్టుకుంటారు. మా కాలంలో చూడాలి. ఒకసారి నేను సరదాపడి సినిమా చూడటానికి వెళ్ళానమ్మా! అప్పుడే సినిమాలు కొత్తగా వచ్చిన రోజులు. సినిమాకి వెళ్ళటం అంటే ఆ రోజుల్లో తప్పు పనిగా ఉండేది మీ తాతగారికి అసలు గిట్టేదికాదు. ఒక రోజున ఆయన పొరుగూరు వెళ్ళారుకదా అని నలుగురితోపాటు నేనూ బయల్దేరాను. తీరా పట్టుమని పది బొమ్మలు చూడలేదు. ఆయన ఊరునుంచి వచ్చి నాకోసం సినిమా దేరా దగ్గరికి వచ్చేశారు. నువ్వు నిజంగా నమ్మవుగానీ ఈ జుట్టు ముడిపట్టుకుని పదిమందిలోంచీ ఈడ్చుకొచ్చి 'భోగం ఆటలు చూస్తావుటే ముండా!' అంటూ వీధి పొడగునా తన్నుకుంటూ తీసుకొచ్చారు. ఇంట్లో పెట్టి స్పృహ తప్పేవరకు కొట్టారు. ఆ భయంతో నేను పెద్ద కాయలా పడ్డాను'—అని బామ్మగారు అతి సునాయాసంగా చెప్పుతూ ఉంటే నా ఒళ్ళు జలదరించింది.

"బామ్మగారూ! అంత అవమానం ఎలా భరించారు?"

"అవమానానికేముంది? మొగుడు పెళ్ళాన్ని కాకపోతే ఎవర్ని కొడతాడూ?"

"ఎవళ్ళనో ఒకళ్ళని కొట్టితీరాలా ఏమిటండీ?"

"కాదనుకో—నేను ఏదో తప్పుచేశాను. ఆయనకి గిట్టదని తెలిసి కూడా వెళ్ళాను. కోపం కొద్దీ నాలుగు వేశారు. పోనిద్దూ! ఏం పోయిందీ?" అనేసింది బామ్మగారు. చూశావా? ఆనాటి స్త్రీనీ, ఆ భావాలనీ!

"బామ్మగారూ! మీరు చేసింది తప్పుకాదండీ!" అంటే ఆవిడ నమ్మదు. భర్త కిష్టంలేని పని చేశాననీ, అది తప్పేననీ వాదిస్తుంది. బామ్మగారికీ, నాకూ కొన్ని వందల రెట్ల తేడాఉంది. మీ బావకి చలం పుస్తకాలు ఇష్టంలేదు. నన్ను కూడా చదవకూడదని శాసిస్తారు. నేను వినను. ఎదురుగా చదివే ధైర్యం లేకపోతే రహస్యంగా చదువుతాను. ఇప్పుడు వచ్చిన చిక్కేమిటంటే, ఆడది ఆలోచించడం నేర్చుకొంది. కొన్ని స్వంత అభిప్రాయాలు ఏర్పరుచుకుంటున్నది. నిరంకుశంగా పాలించే తాతగారి వంటి మగవాళ్ళు ఇంకా వున్నారుగానీ, ఆ పరిపాలనని ఆమోదించే బామ్మగారి వంటి ఆడవాళ్ళు మిగిలిలేరు. అందుకే ఈనాటి కాపురాలు సనాతన పద్ధతుల తోనూ గడవటంలేదు, అధునాతన భావాలతోనూ జరగటంలేదు."

"అభిప్రాయాలు కలియని వ్యక్తులు జతపడ్డప్పుడే సమస్య వస్తుంది. సాధ్యమైనంతవరకూ ఇద్దరూ ఏకీభవించటానికి ప్రయత్నించాలి. అదే జరగటంలేదు, మీ సంసారంలో—"

"నాలో పొరపాటు ఉంటే సరిదిద్దుకోవటానికే ప్రయత్నిస్తాను."

"ఇంతకీ ఆ సరోజాదేవి మళ్ళా వచ్చిందా?"

"నాలుగోనాడే భర్తగారు వెళ్ళి తీసుకు వచ్చారు. ప్రాణం లేకుండా శరీరం ఉంటుందా?"

"అయితే ఇప్పుడు బామ్మగారు వెళ్ళిపోవటం దేనికి?"

"బావుంది, ఈవిడ కదలకపోతే ఓ గంట చూసి ఆవిడ సూట్ కేసు సర్దుకోదూ? చదువులకీ, సంస్కారానికి సంబంధం లేదనేది జగమెరిగిన సత్యం."

* * *

ప్రతి ఆదివారం మంచి మంచి పుస్తకాలు తీసుకెళ్ళి ఇచ్చి భానుని చూసి వస్తున్నాను. ఎప్పటికప్పుడు విశేషాలన్నీ తెలుసుకొంటున్నాను. ఒకసారి నేను ముందుగదిలో కూర్చుని అల్లుడికి రంగుబొమ్మల పుస్తకం చూపిస్తున్నాను. భాను, బావకి అన్నం వడ్డిస్తున్నది. రెండు నిమిషాల్లోనే అతనేదో కేకలేస్తున్నట్టు వినిపించింది. నేను త్రుళ్ళిపడ్డాను. "నీ ధ్యాస అసలు ఇంటిపనులమీద ఉంటోందా? నీకు బాధ్యత లనేవి ఏమైనా వంట పడుతున్నాయా? ఇంత ఉడకేసి గుప్పెళ్ళకొద్దీ ఉప్పూ కారం పులిమేసి నా ముఖాన తగలేస్తున్నావు! హోటల్ వాడు నయం! కమ్మగా కడుపు నిండా పెడతాడు. ఒక్కపూట నువ్వు తృప్తిగా వంట చేశావూ? నీకు సిగ్గు వెయ్యటంలేదూ? కట్టుకున్నవాడికి కడుపునిండా అన్నం పెట్టకపోతే ఎందుకే నువ్వికక్కడున్నది? సుష్టుగా తిని దొర్లటానికా? దర్జాగా పుస్తకాలు చదువుకోటానికా? అయినా నీ సరదాలు వేరే వుండే ఇల్లు నీకు కావాలా? నువ్వు డాక్టరుగిరీ వెలగబెట్టాలిగానీ వెధవ వంటపని చేస్తావా? నన్నిలా ఎందుకేడిపిస్తున్నావు? ఇక్కడ ఉండాలని లేకపోతే వెళ్ళిపో! నీ ఇష్టమైన వాడితో వెళ్ళిపో!" దర్టీ రోగ్! నువ్వు ఆడదానివా? నాకు వెర్రిగాని ఆడదానికి ఉండవలసిన వినయం, విధేయతా, అణకువా, పాడూ మచ్చుకైనా నీలో...."

నేను నిర్ఘాంతపోయాను. భాను చెప్పటం తప్ప అతను తిట్టటం స్వయంగా నే నంతవరకూ ఎరుగను. ఏం జరిగింది? భాను ఏమైనా చేసిందా? అతను బట్టలు వేసుకొని విసురుగా వెళ్ళిపోయాడు. నేను నాని గాడ్ని భుజాన వేసుకొని లోపలికి నడిచాను. పీటముందు కంచంలో పెట్టిన అన్నం కెలికి వదిలేసినట్లు ఉంది. భాను ఎదురుగా తల వంచుకొని కూర్చుంది.

"ఏమైంది భానూ........? అన్నాను.

భాను తల ఎత్తి చూసింది. జలజలా కన్నీళ్ళు రాలిపడ్డాయి. ఏవో చెప్పాలనుకొని చెప్పలేకపోయింది.

"అసలు ఏమైంది? కూర సరిగా వండలేదా?

"ఉప్పు ఎక్కువైంది: బాగానే ఏరాను మరి, అన్నంలో రాయి వచ్చింది" చెప్పింది నెమ్మదిగా.

నాకు ఆశ్చర్యం వేసింది. "అయితే మాత్రం, దానికే అన్ని తిట్లు తిట్టాలా? రాయితీసి అవతలపారేసి ఏ ఆవకాయో వేసుకుంటే పోయె! ఎంత నేర్పుగా చేస్తేమాత్రం లోటుపాట్లు జరగకుండా వుంటాయా? ప్రతి చిన్న విషయానికి మనసుని బాధించే మాటలంటే........"

కొంత సేపటికి భాను అంది— "కొత్తలో నా వంటమీద ఆయనకి చెడ్డ అభిప్రాయం పడిపోయింది. నిజానికి అప్పుడు నాకు ఏపనీ చేతనయ్యేది కాదు. ఆకలికూడా తీర్చుకోలేనంత ఘోరంగా ఉండేది వంట! నాలుగైదు నెల లయ్యేసరికి అన్నీ నేర్చుకున్నాననుకో—ఇప్పుడు ఏదైనా చెయ్య గలుగుతున్నాను. అయినా ఆయన అభిప్రాయం మారలేదు. నేనేమీ చేత కానిదాన్ననీ. తనకి సుఖం లేకుండా పోయిందనీ, ఆయన ఉద్దేశ్యం! ఇప్పుడు ఏనాడైనా నా పనుల్లో పొరపాటు జరిగితే ఆ పాత అభిప్రాయాలే బయటికి వస్తాయి. ఇష్టంవచ్చినట్లు తిడతారు. నేనేం చెయ్యను చెప్పు?"

నా ముఖం! నేనేం చెప్పను? ఏమీ మాట్లాడలేదు.

"ఇవాళ ఇలా జరగడానికి కారణం కూరలో ఉప్పు ఎక్కువవటం కాదులే - అది పైకి చూపించేది.....నువ్వు నాకు పుస్తకాలు తెచ్చిపెడుతున్నావనీ, నేను సుఖంగా చదువుకొంటున్నాననీ "

నేను ఆశ్చర్యంగా చూశాను.

"ఏం, ఆ తిట్లు నువ్వూ విన్నావుకదా, అర్థం కాలేదా?, ఐనా ఆ గూడార్థాలు తెలుసుకోవాలంటే చాలా అనుభవం కావాలి."

"అందుకేనా ఈమధ్య నాతో సరిగా మాట్లాడటంలేదు?"

భాను మాట్లాళ్ళేదు. నేను ఆలోచించాను. "అయితే భానూ! బావకి ఇష్టంలేని పనిచేస్తే బావుంటుందా నేను? ఇంకా పుస్తకాలు తెస్తూవుంటే........నువ్వే ఆలోచించు...."

"అన్నయ్యా! నేను కడుపునిండా తిండి తినటం కూడా ఆయనకు ఇష్టంలేదు. సుష్టుగాతిని, హాయిగా నిద్రపోతానని ఎన్నోసార్లు తిడుతూనే వుంటారు. అయితే నన్ను తిండీ, నిద్రా మానెయ్యమంటావా? మనం చెయ్యకూడని పనిచేస్తున్నామా? పుస్తకాలు చదవటంకూడా అన్నం తిన్నట్టు సామాన్యమైన విషయమే పుస్తకాలు చదువుకొంటూ కూర్చుంటే నాకు శాంతిగా, హాయిగా ఉంటుంది....తేవటం మానేస్తే సరే....నీ ఇష్టం!-

"సరేలే, నేను తెస్తూంటానుగానీ నువ్వు కొంచెం రహస్యంగా ఉంచు, బావ కళ్ళ పడనివ్వకు, అంతే!"

భాను బాధగా నవ్వింది. "ఎంత దొంగబ్రతుకు!"

"డాక్టర్ గిరీ చెలాయించటం అంటాడేమిటి?" అన్నాను గుర్తువచ్చి.

"ఆ మనిషి ఎత్తిపొడుపుల కన్నిటికీ నేనేం అర్థాలు చెప్పను?" ఒకసారి ఏదో మామూలుగా ఉన్నప్పుడు నోరుజారి అన్నాను. ఖర్మ! 'నేను కాలేజీలో జేరి ఉంటే ఈ సరికి డాక్టర్ అయ్యేదాన్ని' అని! మాటి మాటికీ దెప్పటం సరదాగా అనుకునే మాటలని ఎత్తి సాధిస్తే మనసువిప్పి మాట్లాడగలమా?" చాలాసేపు ఇద్దరం దిగులుగా కూర్చున్నాం.

నేనేం మాట్లాడలేదు. కాస్సేపటికి భాను లేచి పళ్ళెం తీసింది. ఇంతలోనే చటుక్కున జ్ఞాపకం వచ్చినట్టు "నీకు చెప్పానా? బామ్మగారి కూతురు చచ్చిపోయింది!" అంది.

"చచ్చిపోయిందా?" అన్నాను ఆశ్చర్యపడి.

"అవును, బామ్మగారి ముఖం చూడలేకపోయాను. ఆవిడకు ఆ ఆధారంకూడా పోయింది పదిరోజులైంది."

"ఏం జబ్బు చేసింది.?"

"జబ్బాలేదూ. ఏమీలేదు. ఆవిడకి నెలలు నిండుతూ ఉంటే కడుపులో నొప్పి వస్తుందట- అలాగే బాధపడి ముగ్గురు పిల్లల్ని కన్నది. ఆవిడకి గర్భం వస్తే చాలా ప్రమాదమౌతుందని డాక్టర్ ఖచ్చితంగా చెప్పాడట. అయినా ఆ మహానుభావుడు ఆపరేషన్ చేయించుకోలేదు. పోయేవి తన ప్రాణాలు కావుగా? ఆవిడకు మళ్ళీ కడుపు వచ్చింది. చావూ వచ్చింది. పోనిద్దూ! అతనికి ఎంచక్కా కొత్త పెళ్ళాం వస్తుంది!"

"ఛ! బొత్తిగా అంత ఇదిగా మాట్లాడకు భానూ! అతను నిర్లక్ష్యం చేసి ఉంటాడు, ఇంతలో ఇలా జరుగుతుందని...."

"అదే అతని ప్రాణాలకు ముప్పు జరుగుతుందంటే ఆ నిర్లక్ష్యం చేస్తాడా అని?"

"అటువంటి మూర్ఖుడు చేస్తే చేస్తాడు కూడానూ. చాలమంది చేతులు కాలిపోయాక ఆకులు పట్టుకుంటారు."

"నీ సమర్థన నేను ఒప్పుకోను. అతనికి భార్య చచ్చిపోతుందేమో నన్న భయంలేదు. ఏమాత్రం జంకూ ఉన్నా అంత నిర్లక్ష్యంగా ఉండలేడు. ఆవిడ్ని ఏదోవిధంగా కాపాడుకోటానికి ప్రయత్నిస్తాడు."

ఆలోచిస్తే అది నిజమే అనిపించింది. "తనని నమ్మి తన వాళ్ళందర్నీ విడిచివచ్చి సర్వస్వం అర్పించుకొనే భార్య ప్రాణాలు అతి తేలిగ్గా చూడగలిగే మగవాళ్ళు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. భర్తకు విషం పెట్టి

చంపిన భార్యలూ వున్నారు ఒక కథలో కాబోలు భర్తపేర వేలాది రూపాయలకు ఇన్స్యూర్ చేసి తర్వాత అతన్ని చంపటానికి ప్రయత్నిస్తుంది. ఇటువంటి కేసులు చాలా అరుదనుకో- అయినా మనం నిర్ణయించలేం భానూ! చెడ్డతనం అనేది ఒక జాతికే పరిమితం కాదు."

"పెళ్ళి చేసినప్పుడు వాళ్ళు చేశారా లేదా అనేదికాదు ప్రశ్న. భర్తని నిర్లక్ష్యం చేసిన భార్యకి లోకంలో ఎంత సత్కారం లభిస్తుందో తెలుసా? అదే తప్పు చేసిన మగవాడికి ఆ శిక్ష లేదే! దైవేచ్ఛ! లేకపోతే దాని ఖర్మ అంతే! వాడు పదిమందిలో మహారాజులా తిరుగుతాడు. అపరాధి ఎవరైనా కానీ, ఒకే శిక్ష అనుభవిస్తే అది న్యాయమౌతుంది."

"అబ్బ! నీతో మాట్లాడుతూ కూర్చోటానికి చాలా ఓపిక ఉండాలి. నేను ఒకటి చెప్తున్నాను, విను. నువ్వు లోకాన్ని తీర్చి దిద్దలేవు. నీ సంసారాన్నే నువ్వు దిద్దుకోలేవు. తామరాకుమీద మిలమిలలాడే నీటిబొట్టు మనకో పాఠం చెబుతుంది. దేన్నీ మనం పట్టించుకోకూడదు. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే సుఖం ఉండదు. అన్నీ సమస్యలే! అన్నీ ప్రశ్నలే! దానివల్ల మనం చేయగలిగింది ఏమీలేదు. మధ్య మన బుర్రలెందుకు పగలకొట్టుకోవాలి? లోకం ఎలా పోతుందో పోనీ! దానితోపాటే నువ్వూ వెళ్ళు—నేనూ వస్తాను అంతేగానీ మనవెనుక లోకం రాదు."

భాను నవ్వింది? "ఎప్పుడండీ మీరింత గొప్ప వేదాంతులయ్యారు?"

"ఆహ, ఇప్పుడిప్పుడేనండీ! మీరు మా శిష్యురాలిగా చేరుతారా?" అన్నాను నేను నవ్వుతూ.

"అవశ్యం! అంతకన్నానా? ఈ ఆలోచన లేవీ రాకుండా ఈ బుర్రని మార్చిపెట్టండి."

"శివోహం! ఏవీ, ఓ డజను అరటిపళ్ళు....హారతి కర్పూరం.... కొబ్బరికాయలూ...."

తర్వాత నాలుగైదు వారాలవరకూ ఏమీ జరిగినట్టు లేదు. చిన్న చిన్న విషయాలు ఉన్నా అవి అనుభవించటానికే గానీ ఎత్తి చెప్పుకోవటం సిగ్గుచేటు. భాను అభిమానం కొన్నిటిని మరుగు పరుస్తుంది కూడా. నేను అప్పుడప్పుడూ బావ పైఖరి గమనిస్తూనే ఉన్నాను. అతను నా విషయంలో కొంత మునుభావంగా ఉంటున్నాడు. ఎక్కువగా మాట్లాడటం లేదు. మొత్తానికి కాలం ప్రశాంతంగా సాగిపోతున్నట్లు ఉంది. ఈ ప్రశాంతత ప్రళయానికి కాదుకదా అనిపించింది. భాను పెన్ను పాళీ విరిగిందట. కొత్తది వేయించమని ఇచ్చింది ఒకసారి. వారంరోజులు బద్ధకించినా మంచి పాళీ వేయించాను. భానుకి ఖర్జూరం చాలా ఇష్టం. రెండు వీశెల ఖర్జూరం, ఓ వంద చామంతులూ—సరే, అల్లుడికి బిస్కట్ల కట్నం ఉండనే ఉంది. అన్నీ కొత్తసంచిలో సర్ది బయల్దేరాను హుషారుగా, కొత్తగా కొన్న సైకిలు మీద.

వీధి తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. నా కెందుకో గుండెలు కొట్టుకున్నాయి. బావగారి గొంతు తారాస్థాయిలో వినిపిస్తున్నది. ఏవో కేకలు వేస్తున్నాడు. "అయినా నీకీ మధ్య గర్వం ఎక్కువైందిలే! నాకు తెలుసు, నీ మిడిసిపాటు, నువ్వూ. నీకు ఇల్లూ, సంసారం, మొగుడూ, మొద్దులూ ఏం కావాలి?"

సైకిల్ స్టాండ్ [illegible]సి వీధి [illegible]టిగుమీద నిలబడ్డాను.

"నీ అవస[illegible]లు తీర్చే వాళ్ళూ, [illegible]కు కావలసి[illegible]వి సప్లయి చేసేవాళ్ళూ వేరే ఉంటే మొగుడనే వెధవని ఖాతరు చెయ్యమని ఎక్కడ వుంది ముండా!"

త్రుళ్ళిపడ్డాను, ఎంత మోటుగా తిడుతున్నాడు! అది పూర్తిగా నామీద కోపం. ఇక నేను రాకుండా ఉండనా?....

"కాస్త ఒళ్ళు దగ్గిర పెట్టుకుని తిరగమనీ, నీ డాక్టర్ గొప్పలు వెలగబెట్టవద్దనీ ఎన్నిసార్లు నీకు చెప్పింది? ఎప్పుడు నీకు తెలిసేది? నీ

కళ్ళెం కన్పించకుండా పోయాయా! బిద్దకం బలిసిపోతోందా? నీకు సంసారి కుండవలసిన లక్షణాలు ఏమనిటున్నాయని? నిన్ను చేసుకొని నేనేం సుఖ పడుతున్నాను? నీకసలు పెళ్ళెందుకు చేశాడో నీ బాబుకే తెలియాలి.''

కోపంతో నాకు క్రింది పెదవి పళ్ళకింద నలిగిపోతున్నది. ఈనాడు ఒక హీనుడుకూడా పెళ్ళాన్ని తిట్టని తిట్లు తిడుతున్నాడు.

"నీకు సరైన ఈడులో పెళ్ళిచేస్తే నలుగురు పిల్లల్ని కనేదానివి. గాడిదలా పెంచి నాకు అంటగట్టారు. నేనో గుడ్డివెధవని కాకపోతే నిన్నెలా కట్టుకుంటాను! నా ఖర్మ కాలింది అంతే! అదముండవని ఆలో చిస్తున్నకొద్దీ నెత్తి కెక్కుతున్నావ్, నాలుగు తన్ని వీధిలోకి ఈడ్చేస్తే నీ బాబే అడ్డొస్తాడో, నీ అన్నే అడ్డొస్తాడో...."

"బద్మాష్!" నా శరీరం కంపిస్తున్నది. పిడికెళ్ళు బిగుసుకొంటు న్నాయి. పళ్ళు పటపట నలిగిపోతున్నాయి. "రాడి రాస్కెల్! ఆ తన్ను లేవో ఇప్పుడు నీకు తినిపిస్తే నీ బాబెవడు అడ్డువస్తాడో నేను చూస్తాను." రైలు పొగలా ఊపిరి వస్తున్నది. కాళ్ళు ముందుకు తీసుకు వెళుతున్నాయి. ఒక్క నిమిషంలో....

"ఆగు...." గర్జించింది హృదయం.

"ఆవేశపడకు" హెచ్చరించింది తిరిగి....

అవును—నిట్టూర్చాను. తొందరపడి అతనితో ఘర్షణ పడితే ప్రయో జనంలేదు. నా కోపతాపాలకు ఇది సమయంకాదు. భానును ఇప్పట్లో బయ టికి తీసుకువెళ్ళి ఏమీ చెయ్యలేను. ఈచెర దానికి తప్పదు.

నన్ను నేను నిగ్రహించుకున్నాను. ఒక్క క్షణం వించున్నాను. వెళ్ళిపోదామనిపించింది. కానీ భాను ఎంత బాధపడుతున్నదో! ఒక్కసారి ఓదార్చి వెళ్ళితే....

తలుపులు తెరుచుకున్నాయి. భుజంమీద బట్టల మూటతో చాకలి కాటోలు బయటికి వచ్చాడు. నిర్ఘాంతపోయాను. వాడు నాకేసి చూసి తల

దించుకొని వెళ్ళిపోయాడు. చాకలివాడి ఎదుట సభ్యలోకంలోని ఒక వ్యక్తి భార్యని హీనంగా, నీచంగా ఊహించలేని విధంగా తిట్టగలడనే విష యాన్ని నేను చూసి వుండకపోతే ఎంతమాత్రమూ నమ్మను. అసది ఎంత అభిమానవతికానీ, నోరెత్తి జవాబు చెప్పకుండా సహించవలసి వచ్చింది. ఏమిటీ దౌర్భాగ్యం?

ఆ క్షణంలో ఒక్క విషయానికే బాధపడ్డాను. భగవంతుణ్ణి తిట్టాను. నేనూ, భానూ ఒకే తల్లి కడుపున పుట్టనందుకు, భానుకి అన్నయ్య లేనందుకు. నేనే భానుకి స్వంత అన్నయ్యనైతే అప్పటి నా హోదా వేరు. నా శక్తి వేరు. నా హక్కు వేరు. వాడి మాట మాటకూ లెంపలు వగల గొట్టి ఒళ్ళు హూనంచేసి, చెల్లిని తీసుకువెళ్ళి అమ్మకు అప్పగించేవాణ్ణి. అది ఆ నరకంలో ఎన్ని దౌర్జన్యాలు అనుభవిస్తున్నదో ఏకరువు పెట్టే వాణ్ణి. కానీ....కానీ....నేను భాను అన్నయ్యని కాదు. ఏ విధంగానూ భానుని నేను అడ్డుకోలేను. నేను దూరంగానే ఉండాలి.

మళ్ళా వెనక్కి వెళ్ళిపోవాలనిపించింది. కానీ నెమ్మదిగా లోపల అడుగుపెట్టాను. బావ....ఛీ! బావ అని పిలవటానికి నా మనసు అంగీక రించటంలేదు. అతను అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు. గిరుక్కున వెనక్కి తిరిగి నన్ను చూస్తూనే చలించినట్టు తమాయించు కున్నాడు.

"వచ్చారా? మీ చెల్లెలు చాలా తెలివైందని కాబోలు ఏం నిర్వాకం చేసిందో చూశారా?"

నాకు కోపం ముంచుకువచ్చింది. ఇంటికి వచ్చీ రాగానే నా చెల్లెలి మీద నాకు ఫిర్యాదు చేస్తాడా?

చాలా క్లుప్తంగా అన్నాను—"ఏం చేసింది?"

"చాలా చాలా ఘనకార్యం చేసిందిలెండి! అది మీరు విని మెచ్చు కోవటం ఒక్కటే తరువాయి!"

అతని ధోరణికి నాకు అసహ్యం వేసింది.

"దీనికి తన్నుపోతే ఆ వాతలి వెధవకి పోయ్యాయా! గుడ్డి వెధవలు! నిన్న సాయంత్రమేనండి, పార్టీకి వేసుకున్నాను సరికొత్త పేంటు. రాగానే విప్పి స్టాండుమీద పడేశాను. మధ్యాహ్నం నిద్రలేచి చూసేసరికి మాసిన బట్టలతో పాటు అదీ మూట కట్టేస్తున్నాడు వాడు. ఎదురుగా నిలబడిచోద్యం చూస్తున్నది ఈవిడ! మల్లెపువ్వులా తెల్లగా మడత నలగని పేంటు కళ్ళకి కన్పించలేదూ?"

నేను విస్తుపోయాను. ఏమిటీ మనిషి! ఇంత చిన్న విషయానికి....!

"ఏం రావుగారూ! మాట్లాడరే?"

"ఎందుకు మాట్లాడనూ! అసలు మీరా తెల్లటి పేంటు హేంగర్‌కి తగిలించక స్టాండుమీదెందుకు వేశారు?"

"ఓహో! 'రా' మాట్లాడి మరీ చెల్లెల్ని గెలిపించుకోవాలనుకుంటు న్నారేమిటి? అలా మాత్రం ఎన్నటూ ప్రయత్నించకండి. నేను నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను. అది తన ఇష్టం వచ్చినట్టూ చేస్తుందా?"

"బావగారూ! మీరు ప్రతి విషయానికి అపార్థాలు తియ్యకండి. ఇందులో ఇష్టం వచ్చినట్టు చేసింది ఏముంది? సాధారణంగా మీ ఇంట్లో మాసినబట్టలు స్టాండుమీదే ఉంటాయి. అక్కడే పేంటువుంచే అన్నీ కలిపివేసేసి ఉంటుంది. ఏమాత్రం శ్రద్ధగా చూసినా అది మాసిందికాదని తెలియనే తెలిసేది.

"అవును, దానికి శ్రద్ధ పట్టవలసిన అవసర మేముంది?"

"అవసరం ఎందుకులేదు? లేకకాదు. పొరపాటు జరిగింది. ఒక వారం రోజుల్లో తిరిగి ఇస్త్రీలో వస్తుంది. ఓ. బేడ ఎక్కువౌతుంది, అంతే? ఇంత చిన్న విషయానికి చాకలివాడి ఎదుట అంత మోటుగా, నీచంగా తిడతారా? అదీఎవరికి చిన్నతనమో గ్రహించారా?"

అతను కొంచెం అదిరాడు-ఆ తిట్లన్నీ నేను విన్నానని కాబోలు! నేను మళ్లా అన్నాను "తెల్లటిబట్ట పొరపాటున చాకలికి వేయటమనేది క్షమించలేని నేరమంటారా?"

అతను మొహం చిట్లించాడు. "పొరపాట్లూ, క్షమాపణలూ అంటే నాకు అసహ్యం. ఇంత చిన్నపని సక్రమంగా చేయలేక పోయినందుకు సిగ్గుపడాలి."

"కావచ్చు! కానీ మందలించడంలో కూడా అందం ఉంది."

"ఓహో! మీరు తిడితే సున్నితంగా, నైస్‌గా, ఆనందంగా ఉంటుంది కాబోలు!"

"తిట్లు ఎప్పుడూ ఆనందాన్ని కలిగించవు కాని ఎదటవారి అభిమానం దెబ్బతినేంత తీవ్రంగా మాత్రం ఉండకూడదు బావగారూ! మీరు నోటికి వచ్చినట్టు తిడుతూవుంటే భాను ఎంత బాధపడుతుందో ఒక్కసారి ఆలోచించారా?"

"అవసరంలేదు. మీరంతటి అభిమాన ధనులైనపుడు మీ చెల్లాయికి పెళ్ళి, పెటాకులూ లేకుండా అట్టే పెట్టుకోవలసింది."

"అంటే మీ ఉద్దేశ్యం? పెళ్ళి చేసుకున్న ఆడది వ్యక్తిత్వం నిలుపుకోదనా?"

అతను నవ్వటం ప్రారంభించాడు. నేను తెల్లబోయాను.

"హుఁ! వ్యక్తిత్వం! కడుపుకూటికి ఒకడిమీద ఆధారపడి బ్రతికే ఆడదానికి ఓ వ్యక్తిత్వం! ఏం గొప్పగా మాట్లాడుతున్నారండీ! ఆకలివేస్తే అన్నం సంపాదించుకోలేని ఆడదానికి వ్యక్తిత్వం, స్వతంత్రం, ఆశయాలూ, ఆదర్శాలూ...."

నేను మ్రాన్పడిపోయాను. అతను చెప్పుకుపోతున్నాడు. "ఆడదాన్ని పోషించవలసింది మగవాడు ఆడదాన్ని రక్షించవలసింది మగవాడు! ఆడదాన్ని పాలించవలసిందీ మగవాడు! ఈ పనులన్నీ మగవాడి

పట్ల ఆదరి చెయ్యగలదేమో చెప్పండి! ప్రకృతేఆడదాన్ని అణిచిపెట్టిందే. ఇక ఎవరిచ్చే స్వతంత్రం ఏమిటయ్యా? ఈ ఆడవాళ్ళ స్వతంత్రాలా, వ్యక్తిత్వాలా, అభ్యుదయాలా-అన్నీ ఉపన్యాసా లిచ్చేందుకే సరిపోతాయి గానీ, ఆచరణలో పెట్టాలంటే ఎవరికి సాధ్యం? మగవాడికి ప్రాముఖ్యం లేనప్పుడిక ఆడా మగా భేదమెక్కడ? సరే, మీరేమాత్రం పెళ్ళాన్ని మందలించకుండా వ్యక్తిత్వాలు నిలబెడతారో నేనూ చూడక పోతానా?"

ఆశ్చర్యంతో నేను అలాగే నిలబడ్డాను. అతనేమిటో పూర్తిగా అర్థమయ్యాడు. భానువంటి అభ్యుదయ భావాలుగల మనిషికి ఇటువంటి సనాతన పురుషుడికీ జతపడింది. ఎంత విచిత్రం! భాను సున్నితహృదయం ఈ కర్కశత్వానికి విరిగి ముక్క చెక్కలై పోతున్నది! పరిష్కారం లేని దారుణం!

అతనితో ఏవో వాదించాలనీ, ఏవోఒప్పించాలనీ ఆవేశం పొంగులెత్తు తున్నది. కానీ ఒక మూర్ఖుడిని మార్చగలిగేంతటిశక్తి నాలోలేదు. మూర్ఖుడు ఒక్కడే మూర్ఖుడు కాడు. వాడితో వాదించే వాళ్ళంతా మూర్ఖులే.

అతను వెళ్ళిపోయాడు.

నేను వీధి తలుపులు వేసి లోపలికి నడిచాను. వంటగదిలో గడపలో మోకాళ్ళమీద తల పెట్టుకొని కూర్చుంది భాను. నిశ్శబ్దంగా దగ్గర కూర్చుని తలమీద చెయ్యి వేశాను. తల ఎత్తి చూచింది. కళ్ళు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. చటుక్కున ముఖానికి చేతులు అడ్డంపెట్టుకొన్నది. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎప్పటిలా ఏడవవద్దని ఓదార్చలేకపోయాను. శాంతం వహించమని నీతులు చెప్పలేకపోయాను. నీ సంసారం మారుతుందని జోస్యం చదవలేకపోయాను. మౌనంగా కూర్చున్నాను. ఉన్నట్టుండి అన్నాను—"నువ్వు మరీ నోరు మూసుకుంటావేం? ఆ మాత్రం జవాబు చెప్పలేకపోయావా?" కోపం కొద్దీ—"మోటు మనుషులతో సున్నితంగా ప్రవర్తించి ప్రయోజనం లేదు" అన్నాను.

భాను కళ్ళు తుడుచుకొంది. "చాకలివాడి ఎదట తన్నులు కూడా తినాలంటావా?" అంది.

నిజమే! తన వీరత్వానికి ఒక ఆడది అడ్డుపడితే ఆ మనిషి ఎంత నైచ్యానికైనా దిగిపోతాడు

"నేను మాటకు మాట జవాబు చెప్తే ఈ స్థితిలో ఉండగలిగేదాన్ని కాదు" అంది.

"కానీ, భానూ! చిన్న చిన్న విషయాలకు ఎందుకంతమూర్ఖంగా ప్రవర్తిస్తాడు?" అన్నాను కొంత సేపయ్యాక.

భాను కొంతసేపు మాట్లాడలేదు. "ఇది చిన్న విషయమే. గానీ దానికి పూర్వరంగమంతా పొద్దుటే జరిగింది. నిన్న సాయంత్రం ఆయన పెన్ను పార్టీలో జారిపోయిందట. అది మాత్రం నేను నమ్మను. ఏ ప్రాణస్నేహితుడో చెక్కేసి వుంటాడు. యాభై రూపాయల పెన్ను!"

"అది పోయిందా? నిజం?"

"నువ్వు పెళ్ళిలో ప్రెజెంట్ చేసిందే పోయింది, పొద్దుట ఆఫీసుకి వెళ్ళేముందు నా పెన్ను అడిగితే పాళీ వేయించటానికి నీ కిచ్చిన సంగతి చెప్పాను. దాన్ని గురించి వచ్చింది తగువు. నిన్నూ, నన్నూ ఇష్టం వచ్చినట్టు తిట్టారు. నాకు అద్దె అన్నగారొకడు దొరికాడట. వాణ్ణి చూసుకుని మురిసిపోతూ మొగుణ్ణి లెక్కచేయకుండా తిరుగుతున్నానట. 'ఆ పెన్ను మాట నా కెందుకు చెప్పలేదు? నేను పాళీ వేయించనా? నాకన్నా నీకు వాడెక్కువా? మీరిద్దరూ కలిసి నన్ను వెర్రివాణ్ణి చెయ్యాలని చూస్తున్నారా? నా అవసరం లేకుండా అన్నిపనులూ వాడితో జరిపించుకుంటావా? వాడే నిన్ను పోషిస్తాడా?" ఇదీ ధోరణి! చూడు, నేను పెన్ను మాట తనకు చెప్పలేదని నా మీద అభియోగం. తప్పు అని నిర్ణయిస్తే తప్పే! కాని నేను అలా ఎందుకు చేశానో నేనే చెప్పాను. "నేను ఏది అడిగినా మీరు వినిపించుకోలేదు. లైబ్రరీనించి పుస్తకాలు తెచ్చిపెట్టమన్నాను. వినలేదు. రంగు దారాలు కొనివ్వమన్నాను. కొనలేదు. ఉత్తరం రాసుకోటానికి కార్డు ముక్కయినా ఇంట్లో లేదంటే చెవిన పెట్టలేదు. నేను ఎప్పుడేది అడిగినా జరగలేదు. ఇక ఏ నమ్మకంతో పెన్ను

సంగతి మీకు చెప్పాలంటారు? మీరు చెయ్యరని తెలిసినప్పుడు మా అన్నయ్యకి ఇస్తే తప్పేమిటి?"

'నోర్మయ్....! రాస్కెల్! ముందమోపి స్కూలు చదువు వెలగ బెట్టి చమత్కారం గుమ్మరిస్తున్నావ్! నాకు వీలుంటే చేస్తాను. లేకపోతే లేదు. నువ్వు పౌరుషం వెలగబెట్టుకొంటావా? నీకు సలాంలు కొడుతూ చెప్పిందల్లా చెయ్యటానికి నువ్వేం మహారాణివా?"

చూశావా నేను మహారాణి నేనెలా అవుతాను? మహారాణినైతే ఇలా నీ ముందు ఎందుకు తలదించుకుంటాను? మహారాణి నీ భార్యకన్నా ఎక్కువా నీకు?

"నువ్వు మహారాజువైతే, నేను మహారాణి నయ్యేదాన్ని అనవల సింది" అన్నాను నేను కోపంగా.

"నేనలా మాటకుమాట పెంచను. అసహ్యంగా తోచిన విషయాలకు జవాబే చెప్పను. నాకు ఏమీ మాట్లాడటానికి ఇష్టంలేక తలదించుకు కూర్చు న్నాను".

"నువ్వు ఆడదానివని గుర్తుపెట్టుకో! మగవాడిని నేను నీకు మొగుణ్ణేగానీ నౌకర్నిగాను. తెలిసిందా భానుమతీదేవీ?"- భగవాన్! అడు గడుగునా ఈ వెటకారాలూ, ఈ అపహాస్యాలూ, దౌర్జన్యం, నరకం, నేను....భరించలేను అంటూ ఏడ్చాను. ఆడుకొని వచ్చిన బాబు నా మెడ చుట్టూ చేతులువేసి మీదపడేవరకూ ఏడుస్తూ కూర్చున్నాను. బాబు చిట్టి చేతులతో నా కళ్ళు తుడుచుకుంటే...."

"బావుంది భానూ! ఇక నేను నా రాకపోకలు విరమించుకోవటం మంచిదనుకుంటాను."

"అన్నయ్యా! నువ్వు రాకపోతే బాబూ, నేనూ...."

"నీకు సానుభూతి చూపించే పరిస్థితి కూడా నాకు లేకుండా పోతు న్నది భానూ!" నాకు ఎంతో దిగులు ముంచుకు వచ్చింది.

చాలాసేపు మౌనంగా కూర్చుండి పోయాము.

"సరే. లేచి ముఖం కడుక్కు రా భానూ!" అన్నాను. భాను వెంటనే లేచి వెళ్ళింది. సంచి బోర్లించి అన్నీ పీటమీద ఎత్తి పెట్టాను. నానిగాడు బిస్కట్ల పొట్లం వచ్చేవరకూ కాచుకూర్చుని అదికాస్తా పట్టుకుని పరుగెత్తాడు, వీధిలోకి.

"ఒరేయ్! ఒరేయ్!" అంటూంటే, "మళ్లీ వత్తాను మామయ్యా!" అంటూ మాయమయ్యాడు.

"వెధవకి మాటలొస్తున్నాయి" అంది భాను, అన్నం పెట్టుకుంటూ. నేను దగ్గర కూర్చున్నాను. "భానూ...."

తల ఎత్తి చూసింది.

"నువ్వేమీ అనుకోకు గానీ ఇందాక ఆ తిట్లన్నీ వింటే బావమీద నాకు ఎంత కోపం వచ్చేసిందో తెలుసా? నేనెప్పుడూ అంత తొందర పడ లేదు. ఆ క్షణంలో వచ్చేసి ఎడాపెడా కొట్టేద్దామనుకున్నాను. ఎందుకో ఆగిపోయాను."

భాను ఆశ్చర్యంగా చూసింది. "ఎంత తొందరపడ్డావు! నువ్వే ఆయన్ని చెయ్యెత్తి ఒక్క దెబ్బవేస్తే ఇంకేమైనా ఉందా? ఎంత అపహాస్యంగా ఉంటుంది! జీవితాంతం వరకూ గుర్తుండిపోయే పనులు. ఇంకెప్పుడూ అలా ఆలోచించకు సుమా! అది నాకు మాత్రం సిగ్గుచేటు కాదా! పోనీ ఎవరి పాపం వాళ్ళదే! భార్య అయినా, భర్త అయినా, తల్లి అయినా, బిడ్డ అయినా, ఎవరు చేసినదానికి వాళ్ళే అనుభవిస్తారు. ఆ శిక్ష భగవంతుడే విధించాలిగానీ మనంకాదు. తనమీద నీకు అసహ్యం వేసింది కదూ?"

"లేదు భానూ! కోపం వచ్చినమాట నిజమే—కానీ....ఏమీ అనుకోకు!" అన్నాను సిగ్గుపడి.

భాను అన్నం తినటం చూస్తే నా కేమిటో బాధ కలిగింది. భార్యకు అన్నం పెడుతున్నానని గర్వపడే భర్తదగ్గిరే అనుక్షణమూ జీవిస్తూన్న

భాను, అప్రయత్నంగా నా కళ్ళలోకి చూసింది. నేను కళ్ళు మరల్చుకోటానికి ప్రయత్నించలేదు.

భాను అంది-"నన్ను ఒకరు పోషిస్తున్నారనే ఈ కృతజ్ఞతాభావం ఎన్నాళ్ళు కాపరం చేయనిస్తుందంటావు?"

నేను మాట్లాడలేదు.

"ప్రొద్దుటినుంచీ అన్నం తినబుద్ధిగాక ఊరుకున్నాను. ఇప్పుడూ సహించటంలేదు." అంటూ నీళ్ళగ్లాసు చేతిలోకి తీసుకుంది.

"భానూ....ఏమిటది?" అనేసరికే చేతిమీద నీళ్ళు పోసేసుకున్నది. "చాల్లే అన్నయ్యా! రేపు లేచి పనిచెయ్యటానికి ఈ తిన్నది చాలు."

కాసేపు మౌనంగా గడిచింది.

"అన్నయ్యా! లక్ష్మి అత్తయ్య గురించి నీవు ఎరుగుదువా?" అంది భాను, నన్ను మాటల్లో పెట్టటానికి.

"నాకు అంతగా తెలీదుగానీ ఏదో మొక్కుకుని చచ్చిపోయిందంటారు. ఆ అత్తయ్యే కదూ!"

"అవును, భగవంతుణ్ణి ప్రార్థించి కోరి జబ్బు తెచ్చుకుని చచ్చిపోయిన అత్తయ్య అదృష్టవంతురాలు!"

"రాత్రిళ్ళు వాకిట్లో పడుకున్నప్పుడు అత్తయ్య గురించి నాయనమ్మ చెపుతూంటే ఏరోజు కారోజు కొత్తగా వుండేది. వింటూన్నకొద్దీ ఏమిటో తెలీని ఆవేశం ముంచుకొచ్చేది."

"అత్తయ్య విషయాలు నీకు బాగా తెలుసనుకుంటాను. అత్తవారింట్లో చాలా యాతనలు పడిందట కదూ?"

అత్తయ్య పడింది యాతనకాదు, నరకం! నాయనమ్మ చెపుతూ చెపుతూ ఆపుకోలేకుండా ఏడిచేది. అప్పుడు నేనెంతో పెద్దదాన్నయినట్టు నాయనమ్మ కళ్ళు తుడిచి ఓదార్చబోయేదాన్ని. నేనంటే నాయనమ్మకి

ప్రాణం. అత్తయ్య పోలికలు నాకు వచ్చాయనేది. నన్ను చూస్తుంటే అత్తయ్య గుర్తు వస్తోందనేది.

ఒక్కగా నొక్క కూతురని అల్లారు ముద్దుగా పెంచి దగ్గర ఊళ్ళో మంచి ఆస్తిపరుల్ని చూసి పెళ్ళి చేశారు. అత్తయ్య అందం గురించి నాయనమ్మ చెపుతూంటే అతిశయోక్తేమో అనిపించేది. ఏది అబద్ధమైనా అత్తయ్య అందం అబద్ధంకాదు. శిరస్సునుంచి కాలి చిటికెన వేలివరకూ మేలిమి బంగారు ఛాయతో, తీర్చిదిద్దిన అంగ సౌష్ఠవంతో పోతపోసిన విగ్రహంలా మెరిసిపోయేదట. కారు నలుపుగా, దట్టంగా వుండే జుట్టు జడ వేసుకోలేక ముడిపెట్టుకొంటే ఆ ముడి వెనుక భాగమంతా ఆవరించి చంద్రబింబాన్ని కప్పిపెట్టే కారు మేఘాలను జ్ఞప్తికి తెచ్చేదట. అతి విశాలమైన కన్నులువిప్పి చూస్తే పద్మాలు పూర్తిగా వికసించినట్టే భ్రాంతి కొల్పేదట సహజమైన ఎర్రని పెదవులు పైన తమలపాకుల వర్ణం అంటిందోలేదో అర్థమయ్యేది కాదట. కాలిగోరు కూడా తామర రేకులా మృదువుగా పరిశుభ్రంగా ప్రకాశించేదట. అత్తయ్య మంచినీళ్ళు తాగితే కంఠంలో కన్పించేవట. ఎదుటివాళ్ళ రూపులన్నీ చెక్కిళ్ళలో ప్రతిబింబించేవట. ఆ సోయగం చూసి చంద్రుడు చిన్నబోయేవాడట. అత్తయ్య అపురూప సౌందర్య ఖని! బంగారువన్నె శరీరానికి ముదురు వర్ణం చీర గోచి పోసి కట్టి, ముడిలో పూలు ధరించి, హారతి పళ్ళెం చేత పట్టుకొని, ప్రతి ఉదయం గుడికివెళ్ళి పూజచేసి వస్తూండేదట. సంధ్యాసమయాలలో మధురమైన కంఠం ఎత్తి పురాణగ్రంథాలు పఠిస్తుంటే వినేవారికి మైమరపు కలిగేదట

అత్తయ్య దేవతా స్త్రీ! కానీ శాపగ్రస్తురాలు!

అపురూప సౌందర్యవతి! అతి దౌర్భాగ్యురాలు!

అత్తయ్యని భర్త కన్నెత్తి చూడలేదు. అత్తయ్య సౌఖ్యం అంతా వివాహంతో హరించిపోయింది. పెళ్ళి కూతురై నరలోకంలో కాలుపెట్టింది.

మామయ్య లక్షణాలు వేరు. కోరికలు వేరు. వ్యసనాలు వేరు. ఆ విషయం తాతయ్యకు ముందే తెలీదా అంటే, తెలుసు, పూర్తిగా తెలుసు, కానీ ఆ కాలం వేరు ఆ మనుషులు వేరు. మగవాడికి నిషేధమనేది లేదు. మగవాడికి అపవిత్రత అంటదు. అందుకే అత్తయ్య ఒక నీతిలేని వాడికి భార్య అయింది.

కానీ మామయ్య వ్యసనంలో ఏకాగ్రత వుంది. అత్తయ్య సౌంద ర్యం శక్తిహీనమై పోయింది.

మామయ్య రాత్రి పదేసరికి ఇస్త్రీ మల్లుపంచె కట్టి, అల్పాకా కోటు పైన జరీ కండువాసర్ది, వాసననూనె రాసిన గిరజాలు నున్నగా దువ్వి, బుగ్గన సుగంధభరిత తాంబూలం బిగించి, పదివేళ్ళ ఉంగరాలు నక్షత్రాల్లా మెరిసిపోతూంటే, ధగధగలాడే వెండి బెత్తం ఊగించుకుంటూ, ఇంగ్లీషు చెప్పుల టకటకలమీద రాజఠీవితో నడిచి వెళ్తూండేవాడట. ఎక్కడికి? సాని వీధికి? మితిమీరిన మోజుతో తన సర్వస్వం అర్పించుకొని సానుల సన్నిధికి. ఏ తెల్లవారుజామునకో అలంకారాలన్నీ చెదరిపోగా, సానివాళ్ళ చేతులకు కట్టిన పూలమాలలు నలిగిపోగా, వివిధరకాలైన సువాసనలతో గుబాళిస్తూ, ఇంటికిచేరి ఆరుబైట పరుపు వేయించుకొని నిద్రపోయేవాడట.

ఈ దౌర్భాగ్యానికి అత్తయ్య బాధపడిందో లేదో, అసలేమైనా అను కుందో లేదో నాయనమ్మకి కూడా అంతుచిక్కలేదు. ఏ క్షణమూ అత్తయ్య వదనంమీద చెదరిపోని ఆ చిరునవ్వు ఎన్ని వ్యధలనైనా కప్పివేస్తుంది. అత్తయ్య ఏనాడైనా సాహసించి భర్త గదిలోకి వెడితే తిరిగి వచ్చేసరికి మృదువైన చెక్కిళ్ళపైన ఏర్పడే నల్లని చారలు జరిగిన సంఘటన చెప్పక చెప్పేవి. శరీరంలో ప్రవహించే రక్తమంతా కోపగించి బుగ్గలమీద చారలలో గడ్డకట్టి రోజుల తరబడి నిలిచిపోయేది. అదీ దాంపత్య సౌఖ్యం!

ఇక సంసార విషయం — సామాన్యంగా అనాడు అత్త ఎదుట కోడలు—పులిముందు మేకపిల్ల! కర్కశత్వానికీ, దౌర్జన్యానికీ రూపకల్పన అత్తయ్య అత్తగారే! ఏపూటా అత్తయ్యకి అకలితీరా అన్నంలేదు. పక్షం రోజులకైనా జుట్టుకు గోరెదు నూనెలేదు. అత్తయ్యకి వూహ తెలిసిననాటి నుంచి ప్రాణప్రదమైన దైవప్రార్థనా, గ్రంథ పఠనమూ మరి ముందుకు సాగలేదు. రోజంతా చాకిరీ! అత్తగారు కల్పించి అజ్ఞాపించే అర్థంలేని వెట్టి చాకిరీ! కొడుకు ఇంటికి వచ్చేసరికి కోడలిమీద ఏదో అభియోగం. ఫలితం దండన! అత్తయ్య బయట చేరిననాడు ఆ పస్తైదన్నానికి కూడా నోచుకోదు. 'ఊళ్ళో కోడళ్ళంతా ముచ్చటగా బిడ్డల్ని కంటూంటే నువ్వు తిని కూర్చుంటావుటే? గొడ్డుముండకి కూడెందుకే!' అని తిట్టిపోసి, ఆ రోజు పూర్తిగా పస్తు ఉంచేదట అత్తగారు. ఇంటినిండా ఎన్ని మంచాలున్నా, అత్తయ్య ఎప్పుడూ పడుకోవలసింది నేలమీదే. ఎంతలేసి పాలు పెరుగులున్నా అత్తయ్య తాగవలసింది గంజినీళ్ళే!

అత్తయ్యకి ఎవరి ఆదరణాలేదు. ఎవరి ఆప్యాయతా లేదు. అయినా తన కష్టసుఖాలు ఎన్నడూ కన్నతల్లితో కూడా చెప్పుకోలేదు. ఎవరిద్వారానైనా కూతురి విషయాలు తెలిసినప్పుడు నాయనమ్మ సహించలేక ఏడ్చేదట. అత్తయ్యని చూడాలని వాళ్ళవూరు వెళ్తే బండి దిగీదిగగానే వియ్యపురాలు రుసరుసలాడుతూ ఎదురుపడి, 'ఏఁవమ్మా! కూతుర్ని కష్టాలు పెడుతున్నామని చూడటానికి వచ్చావా?' అని నిలదీసి అడిగేదట. నాయనమ్మకు కోపం ముంచుకొచ్చినా ఓర్చుకొని, 'అదేమిటి వదినా! దానికి కష్టాలేం ఉంటాయి? ఏదో బిడ్డని చూడాలని మనసైతే'....అని చెప్పబోతూంటే, 'చాల్లే వూరుకోవమ్మా! నువ్వొక్కదానవే కూతుర్ని కన్నావు. అదేం పాలుతాగుతోందా? మాటిమాటికి పరుగెత్తుకొస్తావు?' అని కసిరికొట్టేదట.

నాయనమ్మ ఏమీ జవాబు చెప్పేదికాదు. చెప్తే సంవత్సరానికోసారైనా కూతుర్ని చూచుకునే అవకాశం వుండదు. నాయనమ్మ వున్నంతసేపూ

వియ్యపురాలు ఆ పరిసరాల్లోనే తారట్లాడేదట. ఇక నాయనమ్మకి ఏమీ మాట్లాడటానికీ వీలయ్యేది కాదు. కూతుర్ని కొంతసేపు కళ్ళతో మాత్రం చూసి వెంటనే బండి కట్టించుకొని వచ్చేసేదట. వియ్యపురాలు భోజనాలకి కూడా ఏర్పాటు చేసేదికాదట.

ఏడాదికోసారి ఏ పండుగ సాకుతోనో అత్తయ్యని పుట్టింటికి తీసుకొస్తే తాతయ్యకీ, నాయనమ్మకీ ఆరోజు మహా పర్వదినం.

ఒకనాటి సాయంకాలం తాతయ్య పొలాల మధ్య నడుస్తూండగా కూతుర్ని చూడాలని బుద్ధి పుట్టిందట. వెంటనే కండువా దులిపి భుజాన వేసుకొని పొన్నుగర్ర తాటిస్తూ అల్లుడిగారి ఊరివైపు బయల్దేరాడు.

ఇంటిముందుకు వెళ్ళేసరికి బాగా చీకటిపడింది. అల్లుడుగారు కచేరీ గదిలో మిత్రబృందంతో ఇష్టాగోష్ఠి జరుపుతున్నాడు. వీధి వాకిట్లో నిలబడి వున్న మామగార్ని చూసి కూడా పలకరించలేదు. తాతయ్య తల తీసినంత పనైంది. అయినా సంబాళించుకుని అల్లుణ్ణి పేరుపెట్టి పిలిచారు. ఆతను బయటికి రాకుండానే—"ఎవరు నువ్వు?" అన్నాడట. తాతయ్యకి పౌరుషం ముంచుకొచ్చింది. "నన్ను ఎరగనట్టు నటిస్తున్నావటయ్యా? నేను అగ్రహారం రామయ్యని."

"ఓహో! అగ్రహారంలో సిటోటి రామయ్యలు లక్షమంది ఉంటారే! అందర్నీ నేను ఎరిగి వుండాలంటావా?" అంటూ మిత్రులతో కలిసి విరగబడి నవ్వటం ప్రారంభించాడట. తాతయ్య కోపం కట్టలు తెంచుకొంది: హూంకరించి పొన్నుకర్ర తిరగ వేసేంతలో వియ్యపురాలు వీధి గుమ్మంలోకి తొంగిచూసి అంది, "ఎవరయ్యా నువ్వు?"

తాతయ్య తాత్కాలికంగా శాంతించాడు. "నేనమ్మా చెల్లీ! లక్ష్మి తండ్రిని."

"ఏ లక్ష్మి?"

నిర్ఘాంతపోయిన తాతయ్య మరుక్షణంలో చటుక్కున వెనుదిరిగాడు. తాతయ్య తీరని అవమానం అనుభవించాడు. ఆనాటినుంచీ ఆ ఇంటిగడప మరి తొక్కలేదు. నాయనమ్మని కూడా శాసించాడు కూతురు చచ్చిపోయిందనే అనుకోమని, ఆ ఇంటిమాట ఎత్తవద్దని ఆజ్ఞాపించాడు. నాయనమ్మ వలవలా వేడ్చింది. తాతయ్య పాదాలమీద పడి ప్రాధేయపడింది. దయామయుడు తాతయ్య కళ్ళు తుడుచుకొని నాయనమ్మని ఓదార్చాడు. పండుగకీ కూతుర్నీ, అల్లుణ్ణీ తీసుకురమ్మని పంపించాడు కానీ అల్లుడు ససేమిరా రానని పంతం పట్టి కూర్చున్నాడు. "నామాట కాదనకు బాబూ. నీ తల్లి వంటి దాన్ని, పండుగనాడు మా ఇంట విస్తరిముందు కూర్చుని లేస్తే నా కడుపు చల్లబడుతుంది నాయనా!" నాయనమ్మ అల్లుణ్ణి బతిమాలుతుంటే వియ్యపురాలు మండిపడి—"పండుగపూట నీ ఇంట విస్తరెందుకెయ్యాలి? ఆ మాత్రం తిండి మేము తినటం లేదా? కన్నతల్లి ప్రేమ ఒలకబోస్తావా! కట్నాలూ, కానుకలూ గుమ్మరిస్తావా?" అందట.

ఆవిడ ఇంగితం గ్రహించిన నాయనమ్మ ఏదో కట్నం ఇస్తానని మాటయిచ్చి అల్లుణ్ణి తరలించుకొచ్చేది. పండుగరోజు అల్లుణ్ణీ, కూతుర్నీ కలిసి ఉంచటానికే ఈ ప్రయత్నమంతా. కానీ మామయ్య విందు భోజనం చేసి తాంబూలంలోని రూపాయలు జేబులో వేసుకొని బయలుదేరి వెళ్ళిపోయేవాడు. నాయనమ్మ దుఃఖిస్తూంటే అత్తయ్య ఓదార్చేదట. "అమ్మా! ఎందుకంత బాధపడతావు? మనకు పురాణకథలు తెలిసినవికావా? సీతాదేవిని త్యజించిన శ్రీరామచంద్రుడు తిరిగి పరిగ్రహించలేదా? అడివిలో దమయంతిని విడిచిపోయిన నలచక్రవర్తి తిరిగి చేరుకోలేదా? సావిత్రిని ఏకాకిని చేసి మరణించిన సత్యవంతుడు పునర్జీవి కాలేదా? ధర్మానికి అపజయం కలిగినట్లు ఎక్కడైనా విన్నామా? ఎందుకమ్మా, అన్నీ తెలిసి దిగులు పడతావు?" అనేదట.

అత్తయ్య అదే ధైర్యంతో, భవిష్యత్తుమీద ఏదో ఆశతో నాలుగు సంవత్సరాలు కాపురం చేసింది. ఆనాడు ఊరూవాడా అత్తయ్య సహన సద్గుణాలకీ, అందచందాలకీ పేరుపడింది.

మామయ్య ప్రియురాలైన మోహనాంగికి అత్తయ్య సౌందర్యం తిలకించాలనీ, అత్తయ్య సౌశీల్యం పరీక్షించాలనీ బుద్ధి పుట్టింది. మామయ్యని రెచ్చగొట్టింది. 'మీ దర్జా, మీ ఠీవీ మా దగ్గరేకదూ? మీ భార్య ముందు నాతో కలిసి మీరు నిలబడగలిగితే మీ ప్రజ్ఞ తెలిసేది, అవునంటారా'? అని అపహాస్యం చేస్తూ కవ్వించిందట—అప్పుడు మామయ్య మోహనాంగిని వోరగా చూస్తూ అతి తేలిగ్గా, గర్వంగా నవ్వి ఉంటాడేమో!

ఆ మరునటి రోజే మామయ్య మోహనాంగిని సవారీలో ఇంటికి తీసుకొచ్చారు. మేనా దిగగానే అత్తయ్యచేత మోహనాంగి కాళ్ళు కడిగించాడు. అది 'అపూర్వమైన' విషయం! సామాన్యమైన ఆడది విని సహించలేని విషయం!కానీ అత్తయ్య ఆ పని చిరునవ్వుతో చేసింది! మోహనాంగి పాదాలమీద తడి ఒత్తింది! చేయిపట్టి తీసుకొచ్చి పరుపుమీద కూర్చోబెట్టింది. రకరకాల ఫలహారాల పళ్లేలూ, పాలగ్లాసులూ అందిస్తూ దాసీలా పక్కన నిలబడింది! మోహనాంగి కొరికింది మామయ్య తినటం, మామయ్య తాగింది మోహనాంగి తాగటం, ఇద్దరూ చమత్కరించుకొంటూ, ఎంగిళ్ళు కలుపుకొంటూ, సరస సల్లాపాలు జరుపుతూంటే అత్తయ్య ముఖమండలంలో ఒక్క విచార రేఖగానీ, కోపచిహ్నంగానీ, అసహ్య భావంగానీ, ఏ లక్షణమూ పొడచూపలేదట. క్రీగంట అత్తయ్యని క్షణ క్షణమూ శల్యపరీక్ష చేస్తూన్న మోహనాంగి నిర్ఘాంతపోయింది. గోచీపోసిన చీరెకట్టుతో, అతి సుందరమైన హాసకళతో, ఇహలోక విషయాలకు అతీతురాలై తిరిగే అత్తయ్య ఎదుట మోహనాంగి సిగ్గుపడి తలదించింది. తనే ఒక జగదేకసుందరినని గర్వించే మోహనాంగి భంగపడి పరాజితురాలైంది. వీడ్కోలు ముందు అత్తయ్య ఆసీస్సుతో పూర్తిగా పరివర్తన చెందింది. దుఃఖించే హృదయంతో మోహనాంగి చేతులెత్తి అత్తయ్యకి నమస్కరించి తన భవంతికి వెళ్ళిపోయింది.

ఆ రోజే మోహనాంగి ప్రియుడి రాకని తిరస్కరించింది. పైగా మారిన మనసుతో అంధుడికి జ్ఞానజ్యోతి చూపించ ప్రయత్నించింది. "స్వామీ, సాక్షాత్తు లక్ష్మీదేవికి భర్తలై వున్న మీరు నా గడప ఎక్కరావటం తీరని అపచారం. ఇక సహించలేను. రతీదేవిని భార్యగా ఇంట ఉంచుకొని, పై పై అలంకారాలతో గాజుపెంకు అందచందాలతో నీచాతి నీచంగా బ్రతికే మాపైన ఈ మోజుకి అర్థమేమిటి? ఆమె సౌందర్యం, ఆమె సౌశీల్యం శాశ్వతాలు కావా? మీరు దేవిరించే ఈ రూపం ఏ క్షణాన మాసిపోతుందో. ఈ యౌవనం ఏ ఘడియలో జారిపోతుందో ఆలోచించారా? జరిగినదానికి బాధపడి ప్రయోజనం లేదు. ఈ పైన ఆ దేవతా మూర్తికి అన్యాయం జరగకూడదు. నేను వ్యభిచారిణినైనా నాకు ఆత్మతృప్తి కావాలి. ఇక నా జీవితంలో అడుగుపెట్టరాదు మీరు. మీకు జ్ఞానోదమై మీ అపరాధం తెలుసుకోగలిగితే ఆ దేవత ఈ నిర్భాగ్యురాలిని క్షమించగలిగితే" అంటూ మోహనాంగి జలజలా కన్నీళ్ళు కార్చింది. మామయ్య నిర్ఘాంతపోయి, 'మోహినీ!' అని దాపుకు వెళ్ళబోతే ఆమె చరచరా పడకటింటిలోనికి నడిచి తలుపులు బంధించుకొంది. మరి మామయ్యకోసం ఆ తలుపులు తెరుచుకోలేదు. మామయ్య మనోవ్యధతో మంచం పట్టాడు. విపరీతంగా కలవరించటం, దుఃఖించటం, పిచ్చిగా లేచి తిరగటం ఆ లక్షణాలు అధికమవుతున్నాయి. ఔషధాలు విఫలమౌతున్నాయి.

మామయ్య వేదన అత్తయ్యకి తెలుసు. స్వయంగా మోహనాంగి భవంతికి బయలుదేరింది. కానీ మోహనాంగి ఆ క్రిందటిరాత్రే ఊరువిడిచి వెళ్ళిపోయింది. అత్తయ్య హతాశురాలై వెనక్కి మళ్ళింది. ఇక మామయ్య మనోవ్యధకి మందులేదు. వైద్యంలేదు. రోజులు గడుస్తున్నాయి. పరిస్థితి విషమిస్తోంది. నిద్రహారాలు మాని అత్తయ్య చేసిన సేవ వ్యర్థమౌతోంది. మామయ్య మృత్యుముఖంలో, మరణ ఘడియలలో స్పృహతప్పి పడి వున్నాడు. శోకదేవతమాదిరి కూర్చున్న అత్తయ్య ఏదో స్ఫురించినట్టు

లేచింది. భగవంతుని ధ్యానిస్తూ మామయ్య పడక చుట్టూ ప్రదక్షిణలు చేసింది. 'ప్రభూ శ్రీరామా! నా ఆయుష్షు నా భర్తకు ప్రసాదించి ఈ దీను రాలిని నీ దరికి చేర్చుకో తండ్రీ! సౌభాగ్యవతిగా ఈ జీవి సమాప్తి చెందాలి రామా! ఇదే నా కోరిక!' అని ప్రార్థించి ఉంటుంది.

భక్తులను వేరొక విధంగా సంతోషపెట్టలేక తన దరికి తీసుకుపోవ టానికి సిద్ధమౌతాడు కాబోలు ఆ భగవానుడు! పవిత్రమూర్తియైన అత్తయ్య ప్రార్థన ఫలించింది. మామయ్యకు స్వస్థత చిక్కింది. అత్తయ్య జబ్బుపడింది. అప్పుడు నాయనమ్మ నిండు గర్భవతి. కూతురు జబ్బు సంగతి తెలిసి పుట్టెడుదుఃఖంతో వచ్చింది. వైద్యంచేయించబోతే అత్తయ్య వారించింది. 'అమ్మా! నా భర్తగారి ఆరోగ్యం కోసం నా ప్రాణం దానం చేశాను. ఈ మొక్కు చెల్లకుండా నేను బ్రతకాలని కోరితే అది మహాప రాధం కాదా? నన్ను మరచిపో అమ్మా! నేను భగవంతుడి దగ్గరకి వెళ్ళి పోతాను" అందట.

అత్తయ్యకి విషమించిన రోజునే తాతయ్య కోపం మరిచి, పంతం విడిచి అల్లుడియింట కాలుపెట్టాడు. అత్తయ్య వాదన త్రోసిపుచ్చి వైద్యం చేయించాడు.

మరో దౌర్భాగ్యం! అత్తయ్య బహిష్టు అయింది. ఒంటిమీద వడ్ల గింజ వేస్తే పేలిపోయే ఆ జ్వరంలో కోడలిచేత తలస్నానం చేయించి తీరా లని పట్టుపట్టింది అత్తగారు. నరరూప రాక్షసి! మేలు మరచిన కృతఘ్ను రాలు! నాయనమ్మ ఎంత ఏడ్చినా వినిపించుకోలేదు. అనాచారపు పనులు తన కొంపలో ఎంతమాత్రం జరగరాదంది. తాతయ్య దిగ్గున లేచి బండి సిద్ధం చేయించటానికి బయటకి వెళ్ళారు. అంతలోనే ఆ రాక్షసి బిందెడు నీళ్లు తెచ్చి కోడలి మీద గుమ్మరించింది.

ఆ రాత్రి అత్తయ్యకి స్పృహతప్పింది. సూర్యుడు ఉదయించాడు. అత్తయ్య అస్తమించింది. సౌందర్యరాశీ, పవిత్రతామూర్తిగా సౌభాగ్య వతిగా తనువు చాలించింది. నిండు గర్భవతి నాయనమ్మ ఆ గర్భశోకం ఎలా భరించిందో, ఎలా బ్రతికివుందో అర్థం కాదు.

మరో విచిత్రం! అత్తయ్య దేహం అగ్నిజ్వాలల్లో లీనమైపోయిన సమయాన నాయనమ్మ ప్రసవించింది, కోరికోరి ఒక్కగానొక్క మగ బిడ్డని! ఏమిటీ ప్రకృతి! ఎన్ని చిత్రాలు సృష్టించగలదు!

అప్పుడప్పుడు భగవానుడు మనుషుల్ని బొమ్మలుగా పెట్టుకొని ఆట లాడుకుంటాడు కాబోలు!

ఒక బిడ్డ మరణం! మరో బిడ్డ జననం! ఆ మాతృ హృదయం శోకిస్తుందా? సంతోషిస్తుందా? ఎలా అనుభూతి చెందుతుంది? నాయనమ్మ కూడా సరిగా జవాబు చెప్పలేకపోయింది. ఆ పసిపాపే మా నాన్న!

నాన్న పెద్దవాడై నాన్నకి నేను పుట్టి కొంత పెరిగాక, నాయనమ్మ నాకీ గాథ చెపుతూంటే ఆ అనుభూతి ఎలా వర్ణించను?

• • •

భాను ఆగింది. నేను భారంగా నిట్టూర్చాను. "ఎంత చిత్రమైన కథ చెప్పావు భానూ! అత్తయ్య పోలికలు నీకు వచ్చాయని చెప్పిందా నాయనమ్మ?"

"అవును! ఒక్క రూపంలోనే కాదు. 'రాత'లోకూడా వున్నాయని ఇప్పుడనిపిస్తూంది. అత్తయ్య చరిత్ర విని ఆనాడు నే నేమనుకున్నానో తెలుసా? అత్తయ్యకి ఎంత అందం ఉన్నా, ఎన్ని సుగుణాలు ఉన్నా భర్తని పాదాక్రాంతం చేసుకోగలిగే ఆ తెలివితేటలేవో, ఆ శక్తి సామర్థ్యాలేవో లేవనీ, అత్తయ్య అమాయకతే అత్తయ్యని బలి తీసుకొందనీ, అత్తయ్య స్థానంలో నేనే వుంటే అటువంటి కష్టాలకు గురికాననీ.... అన్నయ్యా! ఇప్పుడు నాకు నవ్వొస్తూంది.

ఆనాడు—పెళ్ళికి ముందు—నా ఆలోచన లేమిటో వింటావా? ఆ రోజులు వేరు. ఆ మనుషులు వేరు. ఆనాడు స్త్రీకి భార్యగాగానీ కోడలిగా

గానీ ఎటువంటి స్థానమూ లేదు. కన్నబిడ్డ అత్తింట నరకం అనుభవి స్తూంటే తల్లిదండ్రులు కళ్ళు పెట్టుకు చూడటానికి తప్ప దేనికీ సమర్థులు కారు. సాంఘిక నియమాలను మీరగలిగే సాహసవంతులు కారు.

కాని ఈనాడు అత్తయ్య మళ్ళా పుడితే అంత అన్యాయంగా బలై పోయే అవసరం రాదు. ఈనాటి పురుషుడు సత్యవాది! దయామయుడు! న్యాయపాలకుడు! స్త్రీ విలువ గ్రహించాడు. స్త్రీని అర్థం చేసుకున్నాడు. స్త్రీని గౌరవిస్తాడు. ప్రేమిస్తాడు. ఆదరిస్తాడు. ఆరాధిస్తాడు. క్రమక్రమంగా స్త్రీ అన్ని విధాలా పురుషుడి స్థాయి అందుకోగలుగుతూంది. ఆ అవకాశం పురుషుడే కల్పిస్తాడు. అట్టి స్త్రీ పురుషుల మధ్య కలహాలకుగానీ, విముఖత లకు గానీ తావేలేదు. విద్యావంతులై జ్ఞానసంపన్నులైన ఈనాటి మనుషులు పూర్వపు వ్యక్తుల మాదిరి సనాతనంగా, అనాగరికంగా బ్రతుకులు సాగిస్తా రనుకుంటే సిగ్గుచేటు.

అత్తయ్యకూ, నాకూ అంతులేని అంతరం ఉంది. అత్తయ్య సాధించలేని అభ్యుదయం నేను సాధించగలను. అత్తయ్య శాసించలేని పురుషుణ్ణి నేను శాసించగలను. అత్తయ్య పొందలేని గౌరవ మర్యాదలు నేను పొందగలను. అత్తయ్య అందలేని స్వర్గసీమలు నేను అందుకో గలను. ఈ ప్రగతీ, ఈ అభ్యుదయం, ఈ పరివర్తనా అంతా అత్తయ్య చూస్తే ...? ఇంకా ఎన్ని వూహించేదాన్ని!

అన్నయ్యా! ఈ క్షణంలో నా శిరస్సు సిగ్గుతో వంగిపోదేం? ఈ మనసు విరిగి ముక్కలు ముక్కలై పోదేం!

నేను ఊహించినదంతా ఊహ....కల్ల? నాటికి నేటికీ ఎటువంటి పరివర్తనా జరగలేదు. స్త్రీ జీవితంలో అభ్యుదయ మేదీ అవతరించలేదు. పురుషలోకంలో మానసికమైన ప్రగతి పొడచూపలేదు. స్త్రీకి ఈ సమా

నత్వం, ఈ హక్కులూ, ఈ చట్టాలూ అంతా దగా! మోసం! లాంఛన ప్రాయం! ఉపన్యాసాలకే పరిమితం! కాగితాలకే అంకితం! అనుభవంలో కాదు. నిజజీవితంలో కాదు. నేను అత్తయ్యకన్నా అంగుళం కూడా పురోగమించలేదు."

భాను కొంతసేపు ఆగి తిరిగి మాట్లాడ సాగింది "మామయ్య సాని కొంపలవెంట తిరిగితే అత్తయ్య తెలివితేటలు లేక ఊరుకుందనీ, బాబాయి పేకాడుతూనే బ్రతికితే పిన్ని సిగ్గులేక సహించిందనీ, మొగుడు హోటల్లో కాపురం పెడితే పెళ్ళాం ప్రేమలేక వదిలేసిందనీ, ఆనాడు భార్యలే మూర్ఖంగా భర్తల్ని చెడగొట్టారనీ, వ్యసనాలకు ప్రోత్సహించారనీ—క్షమ, సహనం, పాతివ్రత్యాల పేరిట అర్థంలేని పరిస్థితులు అనుభవించారనీ ఎన్ని అనుకున్నానినీ!

అలా వాళ్ళెందుకు చేశారో, చెయ్యకపోతే దారి ఏమిటో ఒక్క సారైనా ఆలోచించానా? స్త్రీకి ఎన్ని ఆశలుండనీ, ఎన్ని ఆశయాలుండనీ, ఎంత అభిమానం వుండనీ, నీచాతినీచంగా నిలబడే ఘడియ ఎప్పుడో ఒక సారి వచ్చి తీరుతుంది. లోకంచేత గౌరవింపబడే ఆడది భర్తకి గడ్డిపరక కన్నా తేలికౌతుంది."

భాను చాలా గట్టి నిర్ణయాలు చేసుకుంది. భాను ఆలోచనలు, నాకు సమంజస మనిపించలేదు. "భానూ! నేను ఒక పురుషుడిగా మాట్లాడు తున్నాను. నీ దాంపత్యం అనేక దాంపత్యాలకన్నా భిన్నమైంది. నీ భర్తలో పొరపాట్లు ఉన్నాయి. అవి నీకు అంతులేని బాధ కలిగిస్తాయి. కానీ ప్రత్యేక మైన నీ అనుభవంతో పురుష జాతిమీదే ఒక ద్వేషాన్ని పెంచుకోకు. జాతి కంతకూ ఒక అభియోగాన్ని అంటగట్టకు. నువ్వు కోరిన ప్రగతి నూటికి నూరుపాళ్ళు జరగకపోయినా చాలావరకు మాత్రం నిజం! దానికి నిద ర్శనం నీకు ఇన్ని విషయాలు అర్థం కావటమే! అన్నయ్యనైనా ఒక పురుషుడితో నువ్వు వాదించగలగటమే. పూర్వం ఆడది ఇన్ని విషయాలు మాట్లాడ గలిగిందా?

నువ్వు అన్నట్టు ఇంకా పూర్తిగా మాత్రం మన మనసులు వికసించ లేదు. భానూ! కొన్ని వందల సంవత్సరాల నుంచ పాయితున్న ఈ సనాతన రక్తం ఎప్పటికి అంతరించిపోవాలి? దానికీ కొన్ని తరాలు కావాలి. అభివృద్ధి కాంక్షిస్తున్న స్త్రీ వేగంగా పోతుతోంది. అదే వేగంతో అధికారం వదులుకోవలసిన పురుషుడు మారలేకపోతున్నాడు. అందుకే ఈ మానసిక సంక్షోభం!"

"అన్నయ్యా కసికొద్దీ కొంత అతిశయోక్తిగా మాట్లాడాను గానీ, న్యాయం అంగీకరించడానికి పురుషుడు ఎందుకింత మూర్ఖం చేస్తాడు? వివాహమనే కార్యానికి అసలు అర్థమేమిటంటావు? ఈ సృష్టిని ముందు తరాలకు పెంచుతూ తమ స్థానంలో కొన్ని జీవులను పృథ్వికి అందించి తాము రాలిపోయే పవిత్ర నిర్వహణకేనా కళ్యాణం? ఈ ప్రకృతి ధర్మ నిర్వహణలో స్త్రీ పురుష భేదాభిప్రాయాలు లేకుండా మనుగడ జరుగదా? వివాహంతో స్త్రీ, పురుషుడికి అమ్ముడైపోతుందా? ఒక మనిషిమీద మరో మనిషికి సర్వహక్కులూ లభిస్తున్నాయా?

పురుషుడు స్త్రీని సంపాదించుకున్నానని గర్వపడటంలో విర్రవీగటంలో అర్థం వుందా? ఈ ఆలోచనలే నన్ను బాధిస్తాయి. మనశ్శాంతిని దూరం చేస్తాయి.

నేను ఎప్పుడూ ఆలోచించకూడదు. దుఃఖించకూడదు. నాకు సంతోషం కావాలి....ఎలా?

నాకు తెలుసు? నాలో పరివర్తన కలిగిననాడు, నేను నేనుగా లేకుండా పోయిననాడు, సంతోషంగా, సుఖంగా ఉండగలను.

నేనూ ఒక వ్యక్తినని పూర్తిగా మరచిపోగలిగిననాడు, స్త్రీపైన సదభిప్రాయమేలేని పురుషుడితో బ్రతకగలిగిననాడు, పురుషుని ప్రాపకం లేనిదే స్త్రీకి మనుగడలేదని నమ్మగలిగిననాడు, తిండికన్నా అభిమానం ఎక్కువకాదని మనసు చంపుకొన్ననాడు—ఆనాడు ఏ దిగులూ లేదు. అంతా

సౌఖ్యమే! సంతోషమే! కానీ నాలో ఆ మార్పు వస్తుందంటావా? రావాలంటావా?" భాను కళ్ళవెంట నీటిబొట్లు జలజలా రాలిపడ్డాయి. నేను విస్తుపోయి భాను ఆవేదనను చూస్తున్నాను. భాను మాటల్లో ఆవేశం కట్టలు తెంచుకొంటోంది. భాను పడే మానసిక వేదన మితిమీరుతోంది.

"భానూ! నీ ప్రశ్నలకు సమాధానాలేమిటో నాకు బోధపడటంలేదు. చెప్పాలనుకున్నా ఇప్పుడు పురుషుడిగా నాకా అర్హతలేదు.

"ఇక నేను దేన్నిగురించీ మాట్లాడనుగానీ, నాకొక కోరిక ఉంది. నా కొడుకు పెరిగి పెద్దవాడై వృద్ధిలోకి రావాలి. ఆదర్శప్రాయుడైన వ్యక్తి కావాలి. పురుషలోకంలో, ఈ చీకటి సమాజంలో, మాణిక్యమై వెలగాలి; అన్యాయాలు చూసి అసహ్యించుకొనే, అక్రమాలు చూసి ఆవేశపడే, దౌర్భాగ్యుల్ని చూసి కన్నీరుగార్చే పవిత్రమూర్తి కావాలి. ఆరోజు.... ఆరోజు....ఎప్పుడు? చెప్పు అన్నయ్యా?"

"వస్తుంది భానూ! తప్పక వస్తుంది. నీ వంటి మాతృమూర్తి పెంపకంలో నీ కొడుకు ఉదయుడు పూర్ణ పురుషుడుగా రూపొందుతాడు."

భాను బాధగా నవ్వింది. "కానీ....అన్నయ్యా! ఏనాటికైనా ఆ పెంపకానికి లోటువస్తే....?"

"భానూ! ఏఁవిటా మాటలు?"

"ఎందుకన్నయ్యా అంత భయం? నువ్వు వున్నావుగా? నేను నీకు తెలుసు, నా కోరిక నీకు తెలుసు."

"భానూ! నువ్వు ఇలా మాట్లాడితే బావుండదు. భానూ! అన్నయ్య నీకు ఏ కష్టానికైనా, సుఖానికైనా తోడు వుంటాడు. అంతమాత్రాన ఇటువంటి బరువైన బాధ్యతలు నా మీద మోపుతావా? ఆరోజు ఎప్పుడూ రాదు. నువ్వు తల్లివి. ఆ బాధ్యత నువ్వే వహించాలి. భామా! నీకు ఏమైనా జరిగితే అన్నయ్య ఏమౌతాడో ఆలోచించు. నా కన్నీటికికూడా కొంతవిలువ ఇచ్చి నువ్వు బ్రతికి వుండాలి. ఎవరికోసమో కాదు, నీ కోసమూ కాదు,

నీ బిడ్డకోసం! నువ్వు కాంక్షించే అభ్యుదయంకోసం! నీవంటివాళ్ళు అన్నింటినీ ఓర్చి బ్రతికివుండి కొంతమంది పాపలను పెంచితేనేకదా, ఏనాటికైనా ఈ అన్యాయం మాసిపోతుంది? అదే నీ ధ్యేయంగా పెట్టుకో భానూ! ఎప్పుడూ పిచ్చిపిచ్చిగా ఆలోచించకు."

"లేదులే అన్నయ్యా! ఎంత దుఃఖాన్నైనా సహించి నా బాబుని నేను చేతులారా పెంచి పెద్దచేస్తాను" అంటూ భాను కొడుకు ముఖాన్ని చెక్కిలికి చేర్చుకొంది.

భాను ఎటువంటి పరిస్థితులు రానీ—బ్రతికి ఉంటుంది. కొడుకుమీద భానుకు అపారమైన అనురాగం! ప్రతి తల్లీ, ప్రతి బిడ్డనీ అంత గాఢంగా ప్రేమిస్తుందనేది నిజం కాకపోవచ్చు. భాను, కొడుకుని మాతృహృదయంతోనే కాదు, ముందు తరాలకు జ్యోతిని చూపించి నడిపించే ఒక ఆదర్శమూర్తిని రూపొందించాలనే నారీ హృదయంతో విశేషంగా అభిమానిస్తోంది. అంత గొప్ప సంకల్పం ఏర్పరచుకున్న భాను ఏనాడూ ఏ అఘాయిత్యమూ చెయ్యదు. అదే నా విశ్వాసం!

ఒకరకంగా ఆలోచిస్తే భాను మానసికంగా అనారోగ్యానికి గురి అయింది. ముక్కుకు సూటిగా ఆలోచిస్తుంది. నూటికి నూరుపాళ్ళు న్యాయం, అన్యాయం. రెండే ఉండాలంటుంది. కానీ ఆ ఆలోచనలు బెడిసికొడితే, ఆ నిర్ణయాలు విఫలమైపోతే, క్రుంగిపోతుంది. ధైర్యం కోల్పోతుంది. తీవ్రమైన అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది పరిస్థితులు ప్రతికూలిస్తే ఓర్చుకోలేకపోవటం బలహీనత కాదా? కాదంటుంది. వ్యక్తిత్వం బలంగా ఉండాలి, ఎటువంటి పరిస్థితులు రానీ....వ్యక్తి నైచ్యాన్ని అనుభవిస్తూ బ్రతకకూడదు. అక్కడితో అంతమైపోయి వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలి అంటుంది. భాను పరిస్థితులకు తలవంచలేని దౌర్భాగ్యురాలు.

భాను నాకు ఒక సమస్యే అయింది. అది ఎలా పరిష్కారమౌతుందో నా ఊహకేమీ అందేదికాదు. ఏదో ఆలోచిస్తూంటే ఒకసారి అనిపించింది. భానుని సుఖపడటంలేని ఆ సంసారంనుంచి తీసుకువచ్చి-

ఏ ట్రైనింగైనా చదివిస్తే! ఎక్కడైనా ఉద్యోగంలో చేర్పిస్తే? మారని మనుషులకోసం ఎంతకాలం జీవితాలు నరకం చేసుకొంటాము?

మరి నాలుగు నెలలు ఓపికపడితే నా చదువు పూర్తి అవుతుంది. ఉద్యోగం వస్తుంది—అప్పుడు భాను దేనికి ఇష్టపడితే అది చేయవచ్చు. ఆ ఊహ నాకు చాలా మనశ్శాంతి కలుగచేసింది.

* * *

భానుని చూసి నెలరోజులు దాటింది. ఎన్నోసార్లు వెళదామని బయలుదేరి ఆగిపోయాను. వెళ్ళబుద్ధి కాలేదు వెళ్తే ఏదో కొత్త విషయం వినాలి. ఈ నెలరోజుల్లో ఏమి జరిగి ఉండదంటే, భాను సంసారం ఓ నెలపాటు ప్రశాంతంగా గడుస్తుందంటే, సూర్యుడు పడమట ఉదయించే టంత నిజం. కానీ భానుకి దూరంగా ఉండటానికి నా మనసు అంగీకరించ లేదు. భాను బాధపడుతుంది. భాను దగ్గిర ఉన్న పుస్తకాలు లైబ్రరీకి ఇచ్చే తేదీకూడా దాటిపోయింది బట్టలు వేసుకొని బయలుదేరాను.

"నెల్లాళ్ళకు గుర్తు వచ్చానన్నమాట!" అంది నవ్వి భాను.

"నిజంగా తీరికలేదు భానూ! పరీక్షలు దగ్గిరికొస్తున్నాయి కదా! అల్లుడు బావున్నాడా? ఎక్కడికి వెళ్ళాడు?" అన్నాను కూర్చుంటూ.

"పక్కవాళ్ళింట్లో ఆడుకుంటున్నాడు!"

"ఈ మధ్య విశేషాలేమిటి? బావ బావున్నారా?"

"ఇద్దరం బాగానే ఉన్నాం. మాటలే లేవు."

"బావుంది, ఎప్పటినుంచీ?"

"ఆ మధ్య నాన్న ఉత్తరం రాశారు."

"ఏమిటి సంగతులు?"

"ఓ పెద్ద విశేషం! నాయనమ్మ బ్రతికి వున్నప్పుడు ఎవరికో ఓ వెయ్యి రూపాయలు వడ్డీకి ఇచ్చిందట. పోయేముందు అవి వసూలుచేసి

నా కిమ్మని చెప్పింది. అప్పుడు నాకూ తెలుసు. నేను పిప్తుపారం చదువు తున్నప్పుడు నాయనమ్మపోయింది. పదిహేనేళ్ళదాన్ని. నాకు వెయ్యిరూపా యలెందుకా అనుకున్నాను. అక్కయ్యలూ, వాళ్ళు అంతా తెగ వేళా కోళాలు చేసేవారు. ఆ విషయం నేను పూర్తిగా మరిచిపోయాను. అప్పటి నుంచీ ఈ ఎనిమిదేళ్ళుగా చెల్లుబడిపెట్టి తిరిగి నోట్లు రాస్తూ వచ్చారట అతను. ఓ వారంరోజుల కిందట మొత్తం ఇచ్చేశాడట. వడ్డీకో కలిపి రెండువేల రూపాయలు అయ్యాయి. ఏం చెయ్యమంటావని నాన్నరాశారు. ఇప్పుడు నా దగ్గర రెండు వేల రూపాయలు ఉన్నాయి. బావగారు చాలా చాలా మారిపోయారు."

"నిజంగానా?"

"నిజమో, కాదో నాకేం తెలుసు? ఆ ఉత్తరం చూసీ చూడగానే అకస్మాత్తుగా ఆయన ప్రవర్తనలో పరివర్తన వచ్చేసింది. చేసిన తప్పులు తెలుసుకున్నారు. పశ్చాత్తాపంతో 'వెధవ' పేకాట త్యజించారు. వరసగా వారంరోజులు రాత్రింబవళ్ళు ఇంట్లోనే కూర్చున్నారు. అంతులేని శాంతం, మంచితనం నేర్చుకున్నారు. నానిగాడితో ఆటలాడుకున్నారు. ఇక పరివర్తన చాలనుకొని ఒకనాటి సాయంకాలం తీరిగ్గా నన్ను దగ్గర కూర్చోబెట్టుకొని ఎంత ప్రేమగా మాట్లాడారనుకొన్నావు! అది ప్రేమ చరిత్రకే ఒక సరి కొత్త ఘట్టం! భానూ? నేను పూర్తిగా మారిపోయాను, నువ్వు నమ్ము తావా? అన్నారు.

"ఆ నమ్మకం ఏర్పడటానికి ఈ టైం చాలదే!" అన్నాను.

"భానూ! నేను తొందర మనిషినని నీకు తెలీదా? నా తప్పులు నువ్వే క్షమించకపోతే నేనే మవ్వాలి?" అంటూ ప్రారంభించి- "నేనొక సంగతి చెప్తాను. నన్ను అపార్థం చేసుకోకు భానూ! నా కష్టసుఖాల్లో

నువ్వు గాకపోతే ఎవరు తోడుపడతారు? ఈ సంసార బాధ్యత నీకుమాత్రం లేదా? నిజానికి నేను కొంత డబ్బు వృధా చేశాననుకో—జరిగిందేదో జరిగి పోయింది. ఇప్పుడు పన్నెండు వందల వరకూ అప్పు ఉంది ఎలా తీర్చను ఖానూ!"

"పన్నెండు వందలేనా? అని నాకు ఆశ్చర్యం వేసింది. ఒక గుమాస్తా క్లబ్బులోనే కాపురం పెట్టాడంటే తాహ తెక్కడి దనుకొన్నావు? అయినా ఆయన ఎన్నిఊళ్ళు తిరిగారనుకొన్నావు? అవసరం లేకపోయినా ఇంటర్వ్యూలకు దరఖాస్తులు పెట్టటం—వాళ్ళు టి.ఎ. ఇస్తారని మరో యాభై, వందా అప్పు చేసుకొని బయల్దేరటం!"

"ఎందుకిలా అప్పులపాలై ఊళ్ళు తిరగటం? ఈ అప్పులు తీర్చే తాహతు మనకు ఉందా?" అంటే "ఇలా కాకపోతే జీవితంలో మరో విధంగా దేశం చూడలేను. అప్పులు అవే తీరుతాయ్!" అనేవారు.

ఆ దేశం చూడాలనే కోరిక నాకు లేదూ? నీ స్వార్థం నువ్వు చూచు కొంటే నాకు దిక్కు ఏదీ? పది ఊళ్ళు నువ్వు ఒక్కడివే చూడకపోతే ముఖ్యమైన రెండు మూడు స్థలాలకు ఇద్దరం కలిసి వెళ్ళకూడదూ?

"సిమ్లాలో ఇంటర్వ్యూ వచ్చినప్పుడు రెండు వందలు అప్పుచేసి బయలుదేరారు. నిజానికి నాకూ కాశ్మీర్ చూడాలనిపించింది. తాజ్‌మహల్‌ని జీవితంలో ఒక్కసారైనా చూడాలంటారు. కనీసం ఒక్కచోటికైనా నన్ను తీసుకువెళ్తే....నాకు నా భర్త కాకపోతే ఎవరు చూపిస్తారు? నాకోసం ప్రత్యేకంగా బయలుదేరమనలేదే! ఎలాగూ ఆయన వెళ్తున్నారు కదా అని అడిగాను. దానికేం జవాబు వచ్చిందో చెప్పటం అనవసర మనుకో-పన్నెండు వందలు అప్పు అయిందా అని నువ్వు ఆశ్చర్యపడితే చెప్తున్నాను."

"సరే, ఏమైంది? నిన్ను డబ్బు అడిగాడా?"

"పూర్తిగా విను! 'నాకేమీ పాలుపోవటంలేదు. భానూ! తల్చు కుంటే గుండెలు బద్దలౌతున్నాయి. ఈ బెంగతో నా ఆరోగ్యం కూడా పాడైపోయేలా వుంది. ఏం చెయ్యమంటావు చెప్పు?' అదీ లౌక్యం!"

ఎంత విచిత్రమైన పరివర్తన! డబ్బుకోసం మానవుడు ఎంత హీన స్థితికి దిగజారగలడు! ఎంత నైచ్యానికి పాల్పడతాడు! అన్నిటినీ మించి ఎదుటి వ్యక్తిని ఊదితే ఎగిరిపోయే గడ్డిపరకలా భావించటం మరీవిచిత్రం కాదూ?

"ఏమిటి ఆలోచిస్తున్నావు? నన్నేం చెయ్యమంటావో చెప్పు భానూ!"

"అది నన్ను అడగటం అనవసరం. మీరు అప్పుచేసిన ఏ ఒక్క రూపాయికీ నన్ను సలహా అడగలేదు. అది తీర్చుకోవలసిననాడు కూడా నా అవసరం లేదు."

"అలా అనకు భానూ! ఇప్పుడు ఎంత వాదించినా అప్పు తీర్చాలి కదా! నా దగ్గర ఉందా చెప్పు?"

"మీ దగ్గిర డబ్బు ఎప్పుడు ఉంటుందని, ఎలా తీర్చగలరని అప్పు చేశారు?"

"అప్పుడంత ఆలోచించలేని వెర్రివాణ్ణి అయ్యాను."

"అసలు ఇంట్లో భరించలేని ఖర్చులేం వున్నాయని అంత అప్పు అయింది? ఇప్పటివరకూ నాకు మావాళ్ళే బట్టలు కొంటున్నారు. పని మనిషైనా లేకుండా పనులు చేసుకుంటున్నాను. సినిమాలూ, షికార్లూ ఏనాడో మానుకున్నాను. నెల నెలా నూటయాభై రూపాయలు వస్తోంటే....?"

"అవన్నీ ఆరాలు తియ్యకు భానూ! ఇప్పుడు నువ్వు ఎన్ని అంటే ఏం లాభం? నా కష్టసుఖాలు నీకు అవసరం లేదా? ఈ సంసార బాధ్యతలు నీకు మాత్రం లేవా?"

నేను—ఎన్నో విషయాలు ఒక్కసారిగా గుర్తువచ్చి బాధగా— "కష్ట సుఖాలు! నిండు నెలలతో-పుట్టెడు జ్వరంతో, సోడా తాగాలంటే ఒక్క అర్ధణా లేక ఏడిచానే! మీకు తెలుసా? కాలు బెణికి స్నానానికి నీళ్ళు పెట్ట లేనంటే చెంపలు పగలగొట్టారే! గుర్తువుందా? నేను సరదాపడి అగరవత్తుల చెట్టు కొంటే ఆ హక్కు ఎవరిచ్చారని అడిగారు. మరిచిపోయారా? బామ్మ గారికి అరిటాకు కొని ఇచ్చానని కుళ్ళి కుళ్ళి ఏడ్చేలా తిట్టారు. జ్ఞాపకం లేదా? ఇలా ఎన్ని ఏకరువు పెట్టమంటారు? ఈ సంసారంలో నే నెంత సుఖం అనుభవిస్తున్నానో నాకు తెలీదా? ఏనాడూ నాకులేని కష్టసుఖాలూ, సంసార బాధ్యతలూ ఈనాడు ఎలా వచ్చాయి? ఎందుకొచ్చాయి? ఎంతకాలం ఉంటాయి?ఏది చెప్పినా తోసిపుచ్చి ఏనాడూ అంటనివ్వకుండా చేసి, పేడ పురుగుకన్నా హీనంగా చూశారు. మరిచిపోయానా? మీరు ఎన్నైనా చెప్పండి అసలు చెప్పడం మానండి-అనవసరం, కంఠశోష! నా దగ్గరనించి చిల్లి గవ్వరాదు. నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ డబ్బు మీకు ఇవ్వను. నా తర్వాత కూడా మీకు దక్కనివ్వను. ఇంతే నేను చెప్పేది!"

ఆయన చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. "భానూ! నిజంగా నేను చాలా పొరపాట్లు చేశాను. ఇప్పుడు ఆలోచిస్తూంటే నిజం అనిపి పిస్తూంది. నన్ను క్షమించలేవా?"

"పొరపాట్లూ, క్షమాపణలూ అంటే నాకూ అసహ్యమే!"

"భానూ, నీ ఇష్టం వచ్చినట్టే చెయ్యి—కాని నన్ను క్షమించు! నేను కోపంలో అన్న మాటలన్నీ మరిచిపో. నాకోసం...."

"ఇంత తొందరగా వచ్చిన పరివర్తన ఇంత తొందరగానూ పోతుంది. దేనికైనా పునాదిబలం అవసరం."

'మారిపోయినా నమ్మనంటావ్. నీ మీద నాకు ప్రేమ లేదని అను కుంటున్నావు కదూ? అదంతా నీ భ్రమ భానూ?'

"భ్రమించేది నేను కాదు, మీరు! ఇంకా నన్ను నమ్మించగలనని భ్రమపడుతూన్న మీరు!"

'భానూ! ఒకటి చెప్పు-నిన్ను నేను స్వయంగా చూసి ఇష్టపడి పెళ్ళి చేసుకున్నానా? ఎవరి బలవంతం మీదనైనా చేసుకున్నానా?'

"పెళ్ళాం అంటూ ఒక ఆడది కావాలి కాబట్టి, కంటికి నచ్చగానే అంగీకరించారు. కాని పెళ్ళిళ్ళు చేసుకున్న వాళ్ళంతా తోటి వ్యక్తుల్ని ప్రేమిస్తారనే హామీలేదు."

"ఏమో భానూ! ఇదివరకు నువ్వు చాలా మంచిదానివిగా ఉండే దానివి. ఎందుకో చాలా మారిపోతున్నావు."

'అదే అవసరమవుతోంది మీరు చెప్పినదంతా నిజమనీ, చేసిన దంతా మంచి అనీ నమ్మినన్నాళ్ళూ, కళ్లు తెరిచి చూడనన్నాళ్ళూ అను మానించటమే తెలీనన్నాళ్ళూ మంచిగా, చాలా మంచిగా ఉన్నాను. కానీ... ఇక మీరు చేయగలిగిందేమీలేదు. నన్ను సుఖపెట్టనూ లేరు దుఃఖపెట్టనూ లేరు. నేను దేనికైనా సిద్ధంగా ఉన్నాను. అద్దం పగిలితే అతుకోకుదు! అద్దంకన్న సున్నితమైన మనసు విరిగితే బాగుపడదు.'

కొన్ని క్షణాల మౌనం "సరే. భానూ! సిద్ధమే!నేనేమీ చెయ్యలేను. ఎప్పటికైనా నీ మనసు నేను బాగుచెయ్యగలిగితే అదృష్టవంతుణ్ణి." అది ఆఖరి అస్త్రం!

నాకు చిరాకు వేసింది. ఎటువంటి పరిస్థితులైనా రానీ, ఒక వ్యక్తి తనను తనే ఖూనీ చేసుకోవటమా?

"మీరు దయచేసి అంత దిగజారిపోకండి. ఆడదాన్ని పోషించి, ఆడదాన్ని రక్షించి, ఆడదాన్ని పాలించే పురుషుడు ఒక ఆడదాన్ని ఇంత దేవిరించటమా? నేను భార్యనే కావచ్చు, ఆడదాన్ని! మీ వ్యక్తిత్వం మీరు కాపాడుకోవాలనే నా కోరిక!"

ఆయన ముఖకవళికలు క్రమంగా మారిపోయాయి. అణిచిపెట్టుకున్న కోపం, అభినయించిన శాంతం, భంగపడిన అభిమానం, పొంగులెత్తిన ఆవేశం— అన్నీ కలగలుపుగా ప్రస్ఫుటమయ్యాయి.

గంభీరంగా అన్నారు "ఆ డబ్బు ఏం చేస్తావు?"

"ఏదో చేస్తాను. ఏమీ చెయ్యలేనప్పుడు తగలవెడతాను. మీకు మాత్రం...."

నా చెంపలు అదిరిపోయాయి. కళ్ళు చీకట్లు కమ్మాయి. తూలి పడిపోయాను.

"డర్టీ క్రీచర్! ఎంత పొగరు! కట్టుకున్న మొగుడు కాళ్ళా వేళ్ళా పడి దేవిరిస్తే నీతులు వల్లిస్తావా? డబ్బు తగలబెడతావా? నువ్వూ తగలబడతావా? చూస్తాను! ఆ డబ్బు నా చేతికి ఎలా రాదో నేనూ చూస్తాను."

"ఇదేనా మీలో వచ్చిన పరివర్తన?"

"నోర్ముయ్! నువ్వు నన్ను శాసిస్తావా?"

"లేదు, మీరు చాలా మారిపోయారనీ, నన్ను ప్రేమిస్తున్నాననీ చెపితే అవునో కాదో తేల్చుకుంటున్నాను."

"అవసరంలేదు, ఆ అవకాశం నువ్వు పోగొట్టుకున్నావు. నేను అన్ని విధాల మారిపోదామనుకున్నాను. కానీ వీసమెత్తు విలువ లేకుండా చేశావు. నీకు ఇప్పుడు బుద్ధిరాదు. నేను ఇంకా ఇంకా నాశనమై తాగి, తందనాలాడి దేన్నో వెంటవేసుకుని కొంపకొస్తే అప్పుడు...."

"ఎంత అర్థంలేకుండా మాట్లాడుతున్నారు! నా మీద కోపంతో మిమ్మల్ని మీరు నాశనం చేసుకుంటారా? అజ్ఞానించి క్షమ సంపాదిస్తారా? ఒక వ్యక్తి సుగుణాలు కలిగి ఉండడం ఇతరుల కోసమా?"

"ఛీ! నీతో నాకు మాటలేమిటి? నువ్వు సంసారివా? కట్టుకున్న వెధవ అప్పులపాలై కుళ్ళిచస్తే నగలు సింగారించుకుని ఊరేగుతావా? అప్పుల వాళ్ళంతా కలిసి నీ మొగుణ్ని జైల్లోకి తోయిస్తే నువ్వు రూపా

యలపక్క బదుముకుని పవ్వళిస్తావా? నీకు ఇప్పుడు బుద్ధిరాదు. ఆ రోజు... ఒకనాడు...."

చెప్పేదేముంది? అసలే కోతి! కల్లు తాగింది! నిప్పు తొక్కింది? తేలు కుట్టింది! గంతులెయ్యదూ?

నాన్నకు జవాబు రాశాను— "డబ్బు బ్యాంకులో వెయ్యండి. బాబు చదువుకి పనికివస్తుంది."—అని. కానీ ఉత్తరం రాసి ఎంత ఏడ్చానో తెలుసా?

ఆ డబ్బుకంటే నా భర్త విలువ చాలా చాలా తక్కువ. ఆ వ్యక్తి అప్పులపాలై ఉన్నా, సిగ్గు విడిచి అడుక్కున్నా— ఆ కోరిక తీర్చలేక పోయానంటే, ఆ డబ్బుకోసం అతన్ని తిరస్కరించానంటే, కారణం ఎంత బలమైనదై ఉంటాలి? ఈ సంసారం క్రమంగా సాగిననాడు ఆ డబ్బుని నేను కన్నెత్తి చూడగలనా? ఈ కాపురంలో అనురాగబంధమే ఉన్ననాడు ఎవరి కష్టసుఖాలు వారివే అవుతాయా? తండ్రి సమర్థుడైతే కొడుకు చదువుకోసం తల్లి తాపత్రయ పడవలసి వస్తుందా? భగవంతుడా? ఈ వేదనకు అంతులేదా? ఈ కన్నీటికి విలువలేదా?" అంటూ ఏడ్చాను. అదీ ఈ మధ్య జరిగిన విషయం. బావ నాతో మూడు రోజులనుంచీ మాట్లాడటంలేదు" అంది భాను.

"బావుంది. ఏవో గొడవలు వినాల్సి వస్తుందనే నేనిక్కడికి రావాలంటే భయం. పోనీ బావ మారిపోయా నన్నప్పుడు నువ్వు అప్పెందుకు తీర్చకూడదూ?" అన్నాను.

"నీకేం మతిపోయిందేవిటి? డబ్బుకోసం మారే మనిషిని నమ్మమంటావా? ఆయనకు యీ సమయంలో డబ్బు ఇవ్వటం యింకా ప్రోత్సహించట మన్నమాట. తన ప్రవర్తనలో లోటుపాట్లేమిటో ఆయనకు తెలిసి రావాలి. ఆయన మనసా పశ్చాత్తాపపడాలి. ఆనాడు ఏ సహాయం చెయ్యటానికైనా నేను సిద్ధమే!"

నాకూ అది నిజమనిపించింది.

భాను అంది—"కొన్నాళ్ళు పోయాక ఒక రేడియో కొనాలి. అది నాకు తీరని కోరికగా ఉండిపోయింది."

"ఇన్నాళ్ళూ నాకు నువ్వెందుకు చెప్పలేదు!"

"లేదు నన్ను ప్రేమించే నువ్వు, నా కోసం ఏదైనా తెచ్చి ఇవ్వగలిగే నువ్వు ఉన్నావని నాకు తెలుసు కానీ ఆ ప్రేమని నేను అన్నిటికీ వినియోగించను. అది మహోన్నతమైనది. ఏ సోదరికీ లభించనిది— దాని విలువ దానికి ఉంది."

"భానూ! నీతో మాట్లాడటం భయంగా ఉంది. నా ఊహాకి అందకుండా పోతున్నావు."

భాను నవ్వింది. "మరో కొత్త విషయం వింటావా? ఈ మధ్య ఒక రచయిత్రి ఎక్కువగా కథలు రాస్తోంది. నీకూ తెలిసే ఉంటుంది. ఆవిడ రచనలన్నీ ఊహలు! పాత్రలన్నీ దేవతలు! కథా వస్తువులన్నీ దాంపత్య బంధాలు! అన్నీ సుఖాంతాలు! ఆవిడ రచన ఏదైనా తీసుకో-స్త్రీ పురుషుల మధ్య ప్రేమలూ, మమతలూ, అనురాగాలూ, అభిమానాలూ జీవనదుల్లా ప్రవహిస్తూ ఉంటాయి. భార్య కాలికి ముల్లు గుచ్చుకొంటే భర్త మూర్ఛపోతాడు. భర్తకి తలనొప్పివస్తే భార్యకి స్పృహ తప్పుతుంది. వాళ్ళు రాత్రింబవళ్ళూ విహరించేది స్వర్గసీమల్లోనే! పవ్వళించేది పూల పరుపుల పైనే! ఆ పూలుకూడా ఘుమఘుమలాడే మల్లెలానులే కాని వాసన లేని బంతిపూలుకూడా కావు. వాస్తవికతను మరుగుపరచే ఇటువంటి రచనలు చేయటంగానీ, చదవటంగానీ ఆరోగ్యప్రదం కాదు. నాకు ఆమె రచనలమీద ఏమాత్రం నమ్మకంలేదు. అయినా ఆలోచించాను. నా ఊహాలే పొరపాటు కాకూడదా! భార్యా భర్తలలో అనురాగభావమే కరువయిందా? ఆమె అనుభవిస్తూన్న విషయాలే రాయటం లేదుకదా? అందుకే ఆవిడకు ఉత్తరం రాశాను. 'మీ రచనలు నేను చాలా చదివాను. ఎందులో చూచినా అపారమైన అనురాగం, అంతులేని సంతోషం నిండి ఉంటాయి. ఇవి

మీరు వాస్తవికతను ఆధారం చేసుకొనే రాస్తున్నారా? లేక కేవలం దాంపత్య జీవితాలను ఊహించి చిత్రిస్తున్నారా? మీ రచనలోని అందాలన్నీ మీరు నూటికి నూరుపాళ్ళూ అనుభవిస్తున్నారా? లేక అలా అనుభవిస్తూన్న జంటలని చూస్తున్నారా? దయచేసి మనస్ఫూర్తిగా జవాబు ఇవ్వండి' అని-జవాబు వచ్చింది. అది చూస్తే నాకు నవ్వు వచ్చింది. 'నేను చాలవరకూ ఊహలనే ఆధారం చేసుకొని రాస్తున్నాను. కొంతవరకూ చుట్టూ ఉన్న సంసారాలను చూస్తున్నాను. ఎక్కడా నా ఊహలకు వ్యతిరేకమైన వాస్తవికత కన్పించలేదు. ఉంటుందని కూడా అనుకోను. ఈనాటి మనుషులంతా అతి సున్నితమైనవారు. వారి ప్రవర్తనలో ఎన్నడూ కాఠిన్యం గోచరించదు. ఏది ఏమైనా నా రచనలలో అందాలని నేను అనుభవించి మాత్రం రాయటంలేదు. ఇంకా నేను అవివాహితను."

ఆ జవాబు నాకు ఎంతో హాయినిచ్చింది నాకు ఆమె మీద జాలి కూడా వేసింది. తిరిగి ఉత్తరం రాశాను.

'అనుభవంలేని రచయిత్రీ! చెల్లీ !

జీవితంలో అడుగుపెట్టని నీకు, ఆ జీవితానుభవాన్ని ఒక సోదరిగా శ్రేయోభిలాషిగా బోధపరచాలని నా కోరిక! ఇకనుంచి అయినా కళ్ళు తెరిచి ఊహాలోకాలు విడిచి వాస్తవ జీవితాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. వాస్తవికతను మరుగుపరిచే నీ రచనలతో ఇంకా జీవితంలో అడుగు పెట్టని అమాయకుల్ని భ్రమపెట్టటం, భవిష్యత్తులో వారి ఊహలు దెబ్బ తిన్నప్పుడు ఎటువంటి సంజాయిషీ ఇచ్చుకోలేకపోవటం తప్ప మరో ప్రయోజనంలేదు. నీ ఊహలు ఊహలేననీ, నీ కలలు కల్లలనీ, నీ ఆశలు నిరాశలనీ, నువ్వు ఒట్టి అబద్ధమనీ తెలుసుకున్ననాడు-నీ వేదన వర్ణనాతీతం సుమా! జీవితంలో పరాజితనైన నేను చెప్పే ఈ మాటలు ఒకనాడు నీకు గుర్తు వస్తాయి. వాటి అవసరమూ వస్తుంది. కారణం నువ్వు స్త్రీవి! రచయిత్రిగా పవిత్రమైన స్థానంలో ఉన్న నీపై బరువైన బాధ్యత ఉంది.

ఎన్నడూ వాస్తవికతను దాచకు. పాఠకులకు భ్రమలు కల్పించకు. ఈనాటి నుంచి నువ్వు నిజాలు తెలుసుకునివుంటే, రేపు ఎదుర్కొనే పరిస్థితులు నిన్ను ఏమీ చెయ్యలేవు. ఇది అనుభవ పూరితమైన సలహా సోదరీ!" అని రాశాను.

"ఎలా ఉంది?" అంది భాను నవ్వుతూ.

"గొప్పగా లేదు—మనం అనుభవించనివన్నీ అసంభవాలనుకోవటం పొరపాటు. సంసార జీవితంలో సౌఖ్యం లోపించిననాడు వివాహాలే జరగవు. మనం అనగా ఎంత? మనం చూసిన లోకమెంత? భానుమతి ఇంటిపక్కనే సరోజాదేవి కాపురం చేస్తూంది. మానవుల్లో వైవిధ్యం ఎప్పుడూ ఉంటుంది."

భాను మాట్లాడలేదు-నవ్వింది.

"అది సరేగాని స్నానం చేయాలి భానూ! తుండు తెచ్చిపెట్టు తర్వాత మాట్లాడుకోవచ్చు" అంటూ లేచాను.

స్నానంచేసి వచ్చేసరికి బావ వచ్చాడు.

చూస్తూనే పలకరించాను-"బావున్నారా బావగారూ?"

"ఊఁ" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు. నాకు చాలా సిగ్గువేసింది. బాత్‌రూంలోంచి తువాలు కోసం కేక పెట్టాడు. భాను నా దగ్గర తువ్వాలు తీసికెళ్ళి అందించింది. అందుకొంటూనే దాన్ని విసిరికొట్టాడు. "తడిగుడ్డ పడేస్తే ఎలా తుడుచుకుంటానని నీ గర్వం? అడ్డమైన వెధవలూ చేరి.... సిగ్గులేని వెధవలు!"

నేను నిర్ఘాంతపోయాను. సిగ్గుతో చితికి పోయాను. అభిమానంతో కుంచించుకుపోయాను. అతడు సూటిగా నన్నే తిడుతున్నాడు. నేను ఇంకా అతని గుమ్మంలో నిలబడి ఉన్నానంటే సిగ్గులేనివాణ్ణికానూ? గబగబా బట్టలు వేసుకున్నాను. అతని గది ముందుకువెళ్ళి "క్షమించండి బావగారూ! ఇన్నాళ్ళూ నా రాకపోకలతో మిమ్మల్ని కష్టపెట్టాను. అయినా ఎదుటి

వ్యక్తిచేత అవమానింపబడాల్సినంత నీచమైనవాణ్ణి మాత్రం కాదు. వెళతాను!" అని వీధి గుమ్మంవేసి నడిచాను.

"అన్నయ్యా!...." భాను లోపల గడపలో నుంచుని వుంది. దిగులుగా చూస్తోంది.

"మరేమీ అనుకోకు చెల్లీ! వెళతాను" అనేసి బయటపడ్డాను. రోడ్డు మీద నడుస్తూంటే ఏడుపు ముంచుకొచ్చింది. భానుకి ఏ సహాయమూ చెయ్యలేకపోగా కంటి చూపుకి కూడా దూరమవుతున్నాను. భాను ఏడుస్తుంది. నాకు తెలుసు. నేనేం చెయ్యను?

భాను భర్త! ఆనాడు నేను విడిదికి పరుగెత్తుకువెళ్ళి చూసివచ్చిన రాజశేఖరం! ఏమి చూసి అంత మురిసిపోయాను? ఈ కళ్ళతో చూసి తెలుసుకోగలిగిన సంగతులు అతిస్వల్పం కాదా?

వారం దాటింది. నా మనసు ఏమీ బాగుండ లేదు. రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టటం లేదు. ఏమీ తినబుద్ధి కావటంలేదు. అస్తమానం భాను జ్ఞాపకం వస్తోంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

* * *

ఆరోజు రాత్రి నిద్రపట్టేసరికి ఏదో పీడకల వచ్చింది. భాను పగలబడి నవ్వుతోంది. త్రుళ్ళిపడి లేచాను. ఏదో భయం ముంచుకొచ్చింది భాను ఏడుస్తుందేమో? ఈ అర్ధరాత్రి!....ఒక్కతీ....చాలాసేపు చీకట్లో ఆలోచిస్తూ కూర్చున్నాను. ఒక్కసారి వెళ్ళివద్దామా అనిపించింది. అంత అర్ధరాత్రి వెళ్ళితే అతనేమంటాడో అని జడిశాను. కానీ, అప్పుడే తెగించి వెళ్ళివుంటే భాను బ్రతికేది. నా భానుని చేతులారా జారవిడిచాను. భగవంతుడా! నా భాను నన్ను విడిచి వెళ్ళిపోయింది. తల్లి లేని ఈ పసివాణ్ణి నేనేం చెయ్యను?

భాను శాశ్వతంగా దుఃఖం నుంచి ముక్తి చెందింది. అనంత సాగర గర్భంలో, నిత్యనూతన ప్రవాహంలో, ఎగిరెగిరిపడే కెరటాలలో ఎక్కడో ఎక్కడో జీవాలు విడిచి, సర్వం మరిచి వెళ్ళిపోతోంది! అయ్యో చెల్లీ ....!

* * *

భాను కొడుకుని పిన్ని చేతులకు యెలా అప్పగించానో నాకు తెలీదు. పిన్ని స్పృహతప్పి పడిపోయింది. ఒక్కసారి ఇల్లంతా శోకసముద్రంలో మునిగిపోయింది.

"అమ్మా! భానూ! నిన్ను పెంచి పెద్దచేసిన అమ్మ చచ్చిపోయిం దనుకున్నావా?...తల్లీ! గర్భశోకం ఎరగని అమ్మకి ఆరని చిచ్చు పెట్టావా తల్లీ! నీ కష్టం నాకు చెప్తే నిన్ను కడుపులో పెట్టుకోనా అమ్మా! నీ పసి కందుని అప్పగించి వెళ్ళిపోయావా తల్లీ! భానూ! నిన్ను నేనెలా మరిచిపో నమ్మా! ఏ కెరటాలలో కలిసిపోయావు తల్లీ!"

పిన్నికి స్పృహ రాగానే నేలమీద దొర్లి దొర్లి ఏడవటం ప్రారం భించింది. ఆ దుఃఖంలో నన్ను కూడా తిట్టిపోసింది. భాను సంసార విషయం నేను ఎప్పుడూ తనకు చెప్పలేదని, మాటమాత్రమైనా చెప్పి వుంటే ఈ అఘాయిత్యం జరిగేది కాదనీ బావురుమంది. అదీ నిజమే— ఎన్నడైనా పిన్నికి చెప్పివుంటే ఇలా జరిగేది కాదేమో! ఇప్పుడు చెయ్య గలిగింది ఏముంది?

చీకటి పడింది. ఎవరూలేచి దీపం పెట్టలేదు. ఇల్లు స్మశానమైంది. ఆ ఇంటిలో భాను ఒక్కతేలేదు. పిన్ని మళ్ళా పెద్దపెట్టున ఏడుస్తూంది. కళ్ళు తుడుచుకుని నెమ్మదిగా దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. నా చేతులు పట్టుకొని ఏడవటం మొదలు పెట్టింది నేనూ తమాయించుకోలేక వెక్కి వెక్కి ఏడిచాను.

"బాబూ...! కేశవ్ భాను బ్రతికి వుండదంటావా?"

"పిన్నీ!...నన్ను క్షమించు పిన్నీ! భాను ఇంతపని చేస్తుందని

ఎప్పుడూ అనుకోలేదు. ఎప్పుడూ ఇలా చెయ్యనని కూడా చెప్పింది. నాకు ఉద్యోగం రాగనే భానుని వేరే తీసికెళదామని అనుకున్నాను, ఇంత లోనే...."

భాను కొడుకు అక్కడికి వచ్చాడు. వాణ్ణి కౌగలించుకొని ఘొల్లు మంది పిన్ని.

"పిన్నీ! బాబుగురించి నువ్వు బెంగ పెట్టుకోవద్దు. వాడి భారమంతా నాది! వాణ్ణి నేను పెంచి పెద్దచేస్తాను. కావలసినంత చదువు చెప్పిస్తాను. తల్లీ–తండ్రీ లేని లోటు తీరుస్తాను, నన్ను నమ్ము పిన్నీ!"

"నీకు తెలియదు నాయనా! నీ చేతుల్లో ఏముంది? నా బిడ్డ నాకు భారం కాదు. నేను రాలిపోయేవరకూ కడుపులో పెట్టుకుంటాను. ఆ తర్వాత వాడిగతి...." అంటూ పెద్దగా ఏడ్చింది. పిన్ని భయం నాకు అర్థ మైంది. నిజమే. ఆ భావం ఎవరికైనా కలుగుతుంది కాని, భాను కొడు కుని భానులాగే ప్రేమించే వ్యక్తి లేకపోలేదు. ఆమె సుశీల! సుశీల నా భార్య అయిననాడు బాబు విషయంలో ఏ భయమూ అవసరంలేదు.

"పిన్నీ! అవసరం కాబట్టే నీకు చెపుతున్నాను. నేను సుశీలనే పెళ్ళి చేసుకుంటాను. ఈ నిర్ణయానికి తిరుగులేదు. సుశీలమీద నీకు నమ్మకం ఉందా చెప్పు పిన్నీ!"

"బాబూ....కేశవ్!" పిన్ని కళ్ళెత్తి ఆశ్చర్యంగా చూసింది. "సుశీలా? భాను కబురువిని అది ఎంతగా ఏడుస్తుందో నాకు తెలుసు బాబూ! భాను కొత్తగా కాపరానికి వెళ్ళిననాడు బావురుమని ఏడ్చింది. అన్నం తినటం మానేసింది దాని చేతుల్లో బాబు పెరిగితే నాకు దిగులులేదు. అయినా ఈ పసివాడి కీ పాట్లెందుకు రావాలి భగవంతుడా!" పిన్ని ఏడు స్తూనే వుంది.

నా మనసు ఒకరకంగా శాంతించింది. లేచి బయటికి నడిచాను. చీకట్లో మెట్లు ఎక్కివస్తూ సుశీల తారసపడింది.

"సుశీలా....!" అన్నాను అప్రయత్నంగా. సుశీల నిలబడిపోయింది. "భాను నీకు కూడా ఉత్తరం రాసింది." జేబులో కాయితాలు తడిమి చిన్ని కాగితం తీసియిచ్చాను.

"భాను....నిజంగా చచ్చిపోయిందా....?" సుశీల గొంతు భారంగా ఉంది. "నాకు కూడా ఎప్పుడూ ఏమీ చెప్పలేదు." తలదించుకొంది.

"అది మన దురదృష్టం! చచ్చిపోయిందని అనుకోవద్దు. భాను ఎక్కడో సుఖంగా ఉంది." అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

"నువ్వు ఉండికూడా ఇంతపని జరగనిచ్చావు!"

"నిజమే సుశీలా! నేను భాను దగ్గర ప్రమాణం తీసుకోవలసింది. అంతదూరం ఆలోచించలేకపోయాను. నన్ను క్షమించు! నువ్వు చేయవలసిన కర్తవ్యం .... ముఖ్యమైంది మరొకటి ఉంది. ఈ నిమిషంనుంచీ ఉదయుడు నీ కొడుకు, ఆ బాధ్యత మన ఇద్దరిమీదా ఉంది."

"బావా....!" సుశీల విస్తుపోయినట్టు కంఠం ధ్వనించింది. తల ఎత్తింది.

"నిజమే సుశీలా! నువ్వు లోపలికి వెళ్ళు—పిన్నిని ఓదార్చు."

నేను చరచరా మెట్లుదిగి చీకట్లో సపోటా చెట్టు క్రిందికి వెళ్ళి కూర్చున్నాను. భానుతో ఆడుకున్న ఆ బండరాయి అలాగేవుంది. లేచి వెళ్ళి ఆ రాయిని చేతితో నిమిరాను. 'భాను చచ్చిపోయింది' అన్నాను. వంగి వున్న సపోటా కొమ్మను చేతితో తడిమి—'భాను నీకు తెలుసుకదూ! రాత్రే చచ్చిపోయింది', అన్నాను. నూతి గట్టుమీద కూర్చుని "నువ్వు భానుని ఎరుగుదువుకదూ! ఇప్పుడు లేదు. సముద్రంలోపడి ... పాపం! చచ్చిపోయింది" అన్నాను. నా కేమిటో కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ప్రతి మొక్కకీ, ప్రతి రాయికీ, ప్రతి జీవికీ భాను చచ్చిపోయిందని చెప్పాలని పిస్తోంది. నాకు ఏడుపు రావటంలేదు. మనసు బండబారి పోయింది. ఒక

వేళ నాకు మతి చలిస్తోందేమో! పిచ్చి ఎక్కుతోందేమో! లేకపోతే ఏడు పెందుకురాదు? చాలాసేపు ఆ రాయిమీద కూర్చున్నాను. భాను ఉత్తరం ఇంకా చదవలేదు. అంతవరకూ చదవటానికి మనస్కరించలేదు, అవ కాశమూ చిక్కలేదు. భాను కిందటరాత్రి బ్రతికివుంది. ఇంకా చచ్చిపోయి ఆరపైనాలుగు గంటలు కాలేదు. అసలేం వ్రాసింది? లోపలికి వెళ్ళి వసారాలో ఒకమూల కూర్చుని ఉత్తరాలు తీశాను.

'అన్నయ్యా!

అనుకోకుండా నీకి ఉత్తరం రాయవలసి వచ్చింది. నే చేస్తున్న పనికి నువ్వు ఎంత ఏడుస్తావో నాకు తెలుసు ఊహించగలను. కానీ ఇది నాకు తప్పలేదు. ఇటువంటి దుర్దినం ఎప్పుడూ రాకూడదనీ, ఎంత దుఃఖాన్నయినా భరించి ప్రాణాలతో ఉండాలనీ, నా బాబుని ఈ చేతులతో పెంచి ప్రయోజకుణ్ణి చెయ్యాలనీ అనుకున్నాను. ఎన్నోసార్లు అఘాయిత్యాలకు పాల్పడుతున్న మనస్సుని మందలించుకున్నాను. ఆవేశపడుతూన్న హృదయాన్ని హెచ్చరించుకున్నాను. కానీ....అన్నయ్యా! నేను కోరుకున్నది జీవించటం కానీ, నటించటం కాదు. ఏ క్షణమూ శాంతిలేని ఈ మనసుని, ఏ నిమిషమూ సుఖంలేని ఈ తనువుని ఎన్నిరోజులు, ఎన్ని వారాలు, ఎన్ని సంవత్సరాలు మభ్యపెట్టను? పీసమెత్తు విలువలేని ఈ శరీరాన్ని ఎవరి కోసం బ్రతికించుకోను?

ఈ ఇంట్లో జీవిస్తూన్న ఇద్దరు వ్యక్తులూ ఒకళ్ళకి ఒకళ్ళు ఏమీ కారు. బంధువులూ కారు, స్నేహితులూ కారు. కనీసం పరిచయస్తులూ కారు; తోటి ప్రయాణికులూ కారు. శత్రువులు! ఒకర్ని ఒకరు ద్వేషించుకొనే, ఒకర్ని ఒకరు అసహ్యించుకొనే, ఒకరి ఉనికిని ఒకరు దూరం చేసుకొనే దౌర్భాగ్యులు! కళ్యాణవేదిక అనబడిన ఆ బలిపీఠం ఎక్కక ముందు ఒకరికి ఒకరు ఎంత దూరమో ఇప్పుడు దానికి వేయిరెట్లు! ఆనాటి మత్తునీ, ఆనాటి కోరికలనీ, ఆనాటి ఊహలనీ, సర్వాన్నీ పోగొట్టుకొని, కళకోసమే కళ అన్నట్లు—బ్రతుకు కోసమే బ్రతుకుతూన్న దురదృష్ట వంతులు.

ఇద్దరు వ్యక్తుల్ని—రెండు శరీరాల్ని కలపాల్సిన ఈ మానసిక బంధం పీగిపోయింది. నవజీవితంలో చిగిర్చి సాగిన ఆ అనురాగలత వాడిపోయింది. ఇక ఈ ఇద్దరూ ఒకరికి ఒకరు ఏమీకారు. రెండు పాషాణాలు ఒకేచోట మెసిలితే వాటికి సంఘర్షణ తప్పదు. సుడిగుండాలలో చిక్కుపడిన ఈ సంసార నావ తల్లక్రిందులు కాక మానదు.

ఒకసారి నువ్వు అన్నావు— 'ఇక నీ కొడుకే నీకు ఆశాజ్యోతి బాసూ.' అని. కానీ అది నేను సహించలేకపోయాను. నా ఉద్దేశం చెప్పాలనిపించినా చెప్పలేకపోయాను. 'ఇంకా నాకు బావమీద ఆశ వుంది, అన్నయ్యా!' అంటే నువ్వు నవ్వుకుంటావని సిగ్గుపడ్డాను. నిజానికి బావని నేను యెంత ద్వేషించినా, ఎంత విమర్శించినా, నాలో ఎక్కడో, ఎందుకో ఒక ఆశారేఖ లీలగా మెరుస్తూ వుండేది.. ఒకనాటికి ఆయనలో పరివర్తన కలుగుతుంది; తనకు భార్య ఉందనీ, కొడుకు ఉన్నాడనీ గుర్తు వస్తుంది; ఆ సుదినం తప్పక వస్తుంది - అని.

నిజానికి దారితప్పి నడిచేది ఎవరైనాకానీ, కొన్నాళ్ళకు దారి తెలుసుకుంటారు. మనిషి, చేసిన తప్పులు తెలుసుకోకుండానే ఎప్పుడూ జీవితం ముగిసిపోదు. అలా జరిగితే అది ప్రకృతికే విరుద్ధం! నా ఓర్పు నశించే వరకూ ఆయనలో మార్పు రాలేదు. కానీ...తప్పక వస్తుంది. ఒకప్పటికి! నేను అనుభవించకుండా పోయేటప్పటికి! ఈ జీవితంలో నేను సరిదిద్దుకోలేని పెద్ద పొరపాటువుంది. భర్త కుంటివాడుగానీ, గుడ్డివాడుగానీ, అనామకుడుగానీ, అసమర్థుడుగానీ, దౌర్భాగ్యుడుగానీ, దుష్టుడుగానీ ఎటువంటివాడైనా భార్య ఆ వ్యక్తినే ప్రేమించి గౌరవించాలనీ, అతని అడుగుజాడల్లోనే నడవాలనీ మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. కానీ శాస్త్రాల ఘోష నేను వినను. నా ఘోష శాస్త్రాలు అసలే వినవు. నేను నా భర్తని ప్రేమించలేకపోవటం, ఆయన కోసమే, నా సర్వస్వం అర్పిస్తూ బ్రతకలేకపోవటం, మహాపరాధమే! ఆ శాస్త్రాలే చదువుకున్న యమధర్మరాజు నన్ను నిలవేస్తాడు కాబోలు!

ఆత్తయ్య పోలికలు నాకుఅన్నివిధాలా వచ్చాయి. తృప్తిలేని ఈబ్రతుకు ఇక నేను సాగించలేను. దానివల్ల నా లక్ష్యంకూడా దెబ్బతినవచ్చు. నా ఏకైక లక్ష్యం దెబ్బతిన్ననాడు నేను నిరర్థకంకాదా? సంతోషమే కరువైన ఈ ఇంటిలో, అనురాగం తెలీని తల్లిదండ్రుల మధ్య పెరిగే కొడుకు ఎంత సున్నితమైనవాడు అవుతాడు? ప్రయోజకుడెలా కాగలుగుతాడు? అందుకే నా బాబు మకొంకచోట, శాంతి నిలయంలో—ప్రేమ సదనంలో పెరుగుతాడు. నేను తప్పుకుంటాను. ఇదే నా లక్ష్యమైతే నేను చావనవసరం లేదంటవా? అది నా మీద నీకు ఉన్న అపారమైన అనురాగం—అంతే! ఒక అరదీ తెగించి ఒంటరిగా జీవించే తాహతుకి మన సమాజం పెరగలేదు. మనం అంత పురోగమించలేదు. అయినా సమాజపు స్థాయి నాకు ఎప్పుడూ అవ సరంలేదు. నేను ఎప్పుడైనా ఇదే చేస్తాను. ఇది ఆవేశమే అయితే ఇదే నాకు విముక్తి ఇస్తుంది

బ్రతికిఉంటే నాకు అంతులేని ప్రేమకావాలి. ఒకరిలో ఒకరు ఐక్య మైపోయే, ఒకరికోసం ఒకరు ప్రాణాలు ధారపోయగలిగే, ఒకరికోసమే ఒకరు జీవించి ఉండే ప్రేమవాహిని ప్రవహించాలి. అదే నిజమైన జీవితం! ప్రాణాలతో ఉంటే నాకు అదే జీవితం కావాలి.

పరిస్థితులు ప్రతికూలిస్తే సహించగలిగే ఓర్పు నాకులేదు. మొదటి నుంచీ నాలో లోపం అదే! భగవంతుడు నన్ను సహనంలేని స్త్రీ కావాలని శపించాడు. మరి ఆ భగవంతుడూ పురుషుడేకదా? ఒక స్త్రీకోసం ఏ పురు షుడు మాత్రం ప్రేమ దానం చేస్తాడు?

చూడు అన్నయ్యా! నా బాబు, తండ్రి ఆదరణే తెలీని నా కొడుకు తల్లిని కూడా కరువు చేసుకుంటున్నానని తెలీక అమాయకంగా నిద్ర పోతున్నాడు. వాడు ఇక జీవితంలో అమ్మని చూడడుకదూ? నేను వెళ్ళి పోయాక వాడు లేచి ఏడిస్తే, వాళ్ళ నాన్నగారికి నిద్రాభంగమై చిరాకుపడి కొడితే....?....గది బయటపడేసి తలుపులు మూసుకుంటే! ఆ చీకటిలో వాడు 'అమ్మా....? అమ్మా!....' అని భయంతో విలపిస్తూంటే....?

భగవాన్! మాతృహృదయాన్ని ఇంత నిర్దయంగా సృష్టిస్తావా? తల్లికడుపులో కాఠిన్యం నింపుతావా? నా బాబుని నువ్వు బుజ్జగిస్తావ? నా కళ్ళు చెరువు లౌతున్నాయి. అక్షరాలు చెరిగిపోతున్నాయి.

అన్నయ్యా! ఫర్వాలేదు కదూ? ఈ సంగతి తెలియగానే నువ్వు వస్తావు. బాబుని తీసికెడతావు. అమ్మకి అప్పగిస్తావు. కానీ.... కేశవ్! ఈ బాధ్యత అమ్మదికాదు, నీది! నేను నా బిడ్డని నీకు ఇస్తున్నాను. నా హృద యాన్ని, నా శరీరంలో శరీరాన్ని, నా కొడుకుని, నా ఉదయుణ్ణి, నీకు ఇచ్చి వేస్తున్నాను. నువ్వు వాడికి తల్లివీ, తండ్రివీ, దేవుడివీ, సర్వస్వానివీ!- నాలో ఈ నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ముచేయవు కదూ!

బాబు చదువు విషయంలో నా కోరిక ఒకటి! వాడిని డాక్టరే చది వించు! విదేశాలకు పంపించు! అది నా కాంక్ష! కానీ బాబు డాక్టర్ కావటా నికి విముఖత చూపిస్తే ఎన్నడూ ఒత్తిడి చెయ్యకు. వాడి ఇష్టప్రకారం— వాడు వాంఛించే, అభిమానించే విద్య నేర్పించు. వాడికి బట్టలు కుట్టాలనే కోరిక ఉంటే టెయిలర్ కానీ! వాడికి కుండలు చెయ్యాలనే కోరిక ఉంటే కుమ్మరికానీ! తప్పులేదు. కానీ వాడు ఆ విద్యలో నేర్పరి కావాలి. అదీ ముఖ్యం!

తర్వాత నీ పెళ్ళి విషయం—నువ్వు సుశీలని పెళ్ళిచేసుకో! అను క్షణమూ నిన్నే ధ్యానించే ఒకవ్యక్తి వుందంటే అది నీ భాగ్యం కదూ? ఊహ తెలిసిన ఘడియనుంచీ నిన్ను అభిమానిస్తూ, నిన్ను ఆరాధిస్తూ గడిపే వ్యక్తికి నువ్వు ఎంతైనా ఋణపడి వున్నావు. అది తీర్చుకోనినాడు నువ్వు కృతఘ్నుడివి కూడా అవుతావు.

పెదనాన్న మూర్ఖత్వం నాకు తెలియంది కాదు. అందుకే నీకు ఇంతగా బోధపరుస్తున్నాను. జీవితలక్ష్యం డబ్బు సంపాదించటమే కాదనీ, పరస్పరం కాంక్షించే రెండు హృదయాలను కలపటంలో పుణ్యం, విడ దీయటంలో పాపం కలుగుతాయనీ, ఏనాటికైనా పెదనాన్నకు తెలిస్తే

ఎంత బావుండును! అయినా నువ్వు పురుషుడివి, స్వతంత్రుడివి—ఆలో చించు....తల్లిదండ్రులకు బిడ్డలు ఎప్పుడూ విధేయులై ఉండాలి. నిజమే- అది తమ జీవితాలను బలిపెడుతున్నప్పుడుకాదు. పెద్దలైనా స్వార్థాలకు దాసులైనప్పుడు కాదు. సుశీలతో నీవూ, నీతో సుశీలా జీవితాలను పరి పూర్ణంగా తీర్చిదిద్దుకోగలరు. మీవంటి తల్లిదండ్రులు!.....నా ఉదయ్ అదృష్టవంతుడు! నాకళ్ళు చెమర్చుతున్నాయి. వాడు ఇంకా నిద్రపోతు న్నాడు, పక్కలో నేను ఉన్నాననుకొని ప్రశాంతంగా—నా చేయి వణుకు తూంది. కలం సాగటంలేదు. ఇక ముగించనా....?

నేను ఈ జీవితంనించీ, దుఃఖంనించీ, కన్నీళ్ళనించీ, అశాంతినించీ, ఆలోచనలనించీ, ఆవేదననించీ, శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. పారిపోతు న్నాను. ఇది ఎంత సుదినం! అన్నయ్యా! నాకు పగలబడి నవ్వాలని పిస్తోంది విరగబడి నవ్వాలనిపిస్తోంది. నేను జీవితంలో ఓడిపోయాను ఇది భంగపాటుకాదు. పరాజయం! ప్రతి ఆడదీ ఒక భానుమతి కాక పోవచ్చు. అయినా ఈనాటి సమాజంలో వేలాది భానుమతులు వున్నారు. మన సాంఘిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులు వస్తున్న దశ ఇది. ఈ పరిణామక్రమంలో ఒకవైపు పురోగమనం! మరొకవైపు తిరోగమనం! మేల్కొంటున్న స్త్రీజాతి చైతన్యం, కరుడుగట్టిన సమాజంతో ఢీ కొంటు న్నది. తరతరాలుగా స్థిరపడి ఉన్న పురుషుని ఆధిక్యతక్రింద స్త్రీ చైతన్యం నుగ్గునుగ్గు అవుతున్నది అయినా ఈ తిరుగుబాటు నీ కోసం, నా కోసం ఆగదు ఇది ఉపద్రవమైన వరద వంటిది. దానికి ఎదురీదటానికి ప్రయ త్నించినవాడు కొట్టుకుపోతాడు. ఆరోజు కోసమే కొంతమంది భానుమతులు బలికావాలి.

తర్వాత, నా బాబుకేదో పిచ్చిపిచ్చిగా ఉత్తరం రాశాను. అది జాగ్రత్తగా దాచివుంచి, నా బాబు పెరిగి పెద్దవాడై స్వయంగా దాన్ని అర్థం చేసుకోగలిగే శక్తి వచ్చినప్పుడు ఇస్తావుకదూ?

మరి నేను వెళ్తాను....బాబు నిద్రలేస్తే ఏమీ చెయ్యలేను....

నీ హృదయపూర్వకంగా నాకు బహూకరించిన వాచీ నాతోనే తీసుకువెళ్తున్నాను. అది నా శరీరభాగమే .... నాతోపాటు ఎన్నో అప హాస్యాలు అదీ భరించింది. శాశ్వతంగా నిన్నూ, నా బాబునీ, నా సర్వ స్వాన్నీ కోల్పోతున్న దౌర్భాగ్యపు చెల్లి భాను!....—భానుమతి!"

ఉత్తరం ఒడిలో పెట్టుకొని మోకాళ్ళలో తలదూర్చి వెక్కి-వెక్కి ఏడ్చాడు. నా మనసు హెచ్చరిస్తూంది. భాను కోరిక కోరిక కాదు, శాసనం! మీరటానికి వీలులేదు.

భాను నాకన్నా చిన్నది. నాతో కలిసి చదివింది, ఆడింది, పాడింది. నేను నేనులాగే వున్నాను. భాను ఇల్లాలు అయింది, భార్య అయింది, తల్లి అయింది. చివరికి అంతం కూడా అయింది. నాకు జీవితంతో ఏ వైవి ధ్యమూ లేదు. భాను సుఖించింది; దుఃఖించింది; సంతోషించింది; విచా రించింది; అనుభవించింది; విరక్తిచెందింది; సమస్తం వాంఛించింది; సర్వం కోల్పోయింది.

నేను బ్రతికి ఉన్నాను. భాను చచ్చిపోయింది. అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలీదు. పెద్దక్కయ్య వెదుక్కొంటూ వచ్చింది. "భాను కొడుకు అన్నం తిననని ఏడుస్తున్నాడు. చూడు కేశవ్!" అంది. వెంటనే లేచి వెళ్ళాను. బాబు తలుపుదగ్గర నుంచొని "అమ్మా!.... అమ్మా!"....అని పెద్దగా ఏడుస్తున్నాడు. నాకు దుఃఖం పొర్లుకొచ్చింది. "నాన్నీ...!దామ్మా!" అని ఎత్తుకుని భుజాన వేసుకున్నాను.

"మామయ్యా, అమ్మ...."

"వస్తుందమ్మా! ఊరు వెళ్ళింది. ఇప్పుడే రైలు బండిమీద వస్తుంది. నువ్వు అన్నం తింటావా? నేను తినిపిస్తాను."

"ఊహూఁ! అమ్మ....మా అమ్మ ...."

"అమ్మ వచ్చేసరికి యెంచక్కా నువ్వు అన్నం తినేసి ఉంటే, అమ్మ యెన్నో బొమ్మలు తెస్తుంది నీకు. బూరలు కూడా తెస్తుంది. మనం ఇద్దరం ఆడుకుందాం "

"మా అమ్మ యెక్కడికి వెళ్లింది?"

"ఊరు వెళ్ళింది బాబూ! అప్పుడు నువ్వు నిద్రపోతున్నావు."

"ఊఁ........ఊఁ........నన్నూ తీసికెళ్లలేదేం?" అంటూ తిరిగి ఏడుపు ప్రారంభించాడు. నా మనసు రంపాల మధ్య నలుగుతూంది. వాడిని గుండెలకు హత్తుకున్నాను

"అమ్మ ఇప్పుడే వచ్చేస్తుంది. అందాకా నన్ను చూడమని చెప్పింది. నిజం నానీ, ఏం, మరి అన్నం తింటావా! నేనూ తింటాను "

"నువ్వూ తింటావా?"

"నేనూ, నువ్వూ ఎంచక్కా ఒక్క పళ్లెంలోనే తిందాం!"

"మరి మా అమ్మ ఎక్కడ తింతుంది?"

"అమ్మా? చుట్టాల ఊరు వెళ్ళిందికదూ! అక్కడ అమ్మకి వాళ్ళు అన్నీ పెడతారు, తింటుంది."

"పెరుగు వేత్తారా?"

"ఆ.... పెరుగువేస్తారు. నెయ్యి వేస్తారు? అన్నీ వేస్తారు. నువ్వు కూడా పెరుగు వేసుకుని తినకూడదూ?"

ఓ గంట సేపటికి ఎన్నో ప్రశ్నలువేసి ఎన్నో సమాధానాలు విని, అమ్మ ఆనక వస్తుందని నమ్మకం పెట్టుకొని అప్పుడు అన్నం తినటానికి ఒప్పుకున్నాడు. పది కావచ్చింది అన్నం కలిపేసరికి. సాయంత్రం అంతా దిగులుతో కూర్చున్నారు ఎనిమిది గంటలవేళ పక్కింటి ముసలమ్మ ఎవరో వచ్చి కొంచెం అన్నం వండి పడేసింది. పెద్దక్కయ్య లేచి పిల్లలకి అన్నాలు కలిపింది.

(19)

నానీతో పాటు నేనూ నాలుగైదు ముద్దలు తినవలసి వచ్చింది. అన్నం తినిపించి భుజంమీద వేసుకు తిప్పి నిద్రపుచ్చాను. వాడు నిద్ర పోయాక లేచి గదిలోకి వెళ్ళాను.

అర్ధరాత్రి...ఇల్లంతా నిశ్శబ్దంతో భయం కొల్పుతూ ఉంది. పినిమె ఉండి ఉండి పెద్దపెట్టున ఏడుస్తోంది పిన్ని కడుపు తరుక్కుపోతోంది. నేను గదిలోకి వెళ్ళి లైటువేసి భాను కొడుక్కి వ్రాసిన ఉత్తరం తీశాను. నాకు భాను మాట్లాడుతోంటే అలా వినాలని ఉంది. ఉత్తరం ద్వారానైనా భానుతో మాట్లాడాలి ఉత్తరంలో చాలాచోట్ల అక్షరాలు చెరిగి. ఉన్నాయి– కళ్ళు తుడుచుకొని ఉత్తరం ప్రారంభించానో లేదో కెవ్వుమంటూ లేచాడు నానీ. కంగారుగా బయటికి వెళ్లాను వాణ్ణి మళ్ళీ భుజంమీద వేసుకుతిప్పి పడుకోబెట్టాను.

ఎందుకో నాకు భాను కొడుక్కి రాసిన ఉత్తరం చదవబుద్ధికాలేదు. ఆ తల్లి కొడుక్కేం రాసిందో! వాడు పెద్దవాడయ్యాక వాడికే ఇస్తాను– పట్టెడు దుఃఖం వచ్చింది.

భానూ!....అమ్మా!....భానూ!

ఈ దుఃఖాన్ని నేను భరించలేను నీ సాహసాన్ని నేను క్షమించ లేను, నీకోసం అలమటించే బిడ్డకి ఇంత అన్యాయం చేస్తావా? స్వార్థం కంటే త్యాగం ఎంత ఘనమైందో ఆలోచించావా? నీ స్వార్థంకోసం నిన్ను ప్రేమించేవాళ్ళని సర్వనాశనం చేస్తావా? నువ్వు సుఖానికి దూరమైనా నా. కోసం, ఈ అన్నంకోసం బ్రతికి వుండకూడదా అమ్మా! అప్పుడు నాదీ స్వార్థమంటావా? నీ బిడ్డని నువ్వే పెంచుకోలేక పోయావా? దానికి నేను ఉన్నానంటావా? ఇది నీకు న్యాయంకాదు భానూ! న్యాయంకాదు! నువ్వు కట్టినవన్నీ పేకమేడలే అయితే, అవి అనుభవానికి రాకుండాపోతే అప రాధ మెవరిదంటావు? అది నీ దౌర్భాగ్యమని ఎందుకనుకోవు

భానూ? ఇప్పుడు నేను ఎన్ని చెబితే నీకు వినపడుతుంది? ఎంత ఏడిస్తే నీకు దయ కలుగుతుంది చెల్లీ!....

"కేశవ్! ఏడుస్తున్నావా?"

"అఁ....లేదు. రా అక్కయ్యా! భాను చూశావా ఎంతపని.... చేసిందో!"

"అవును, ఎంతపని చేసింది! ఉత్తరాల్లో ఏం రాసింది?"

"కారణం ఏమీ రాయలేను. రాయకూడని దేదో జరిగి ఉండాలి. లేకపోతే నాకు తప్పకుండా రాసేది."

అక్కయ్య దిగాలుపడి నించుంది.

"బాబు నిద్రపోతున్నాడా?"

"కదులుతూంటే జోకొట్టి వచ్చాను. నువ్వు కాస్సేపు పడుకో కూడదూ?"

"కూర్చున్నా, పడుకున్నా ఒకటే అక్కయ్యా! కళ్ళు మూతలు పడటంలేదు. మనసంతా ఏమిటోగా ఉంది."

"భానుకి ఏ అదృష్టమూ లేదనుకొంది గానీ, నీవంటి అన్నయ్యే చాలు! దాని కోసమే అది బ్రతికి ఉండాల్సింది."

కొంతసేపు మాట్లాడి, అక్కయ్య, కూతురు లేస్తే వెళ్ళింది. నేను నెమ్మదిగా వెళ్ళి నాని పక్కలో పడుకున్నాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. కానీ ఎవరూ నిద్రపోవటంలేదు.

తెల్లవారింది బాబు మళ్ళీ ఏడుపు ప్రారంభించాడు. మళ్ళా ఏదో మభ్యపెట్టబోయాను. వాడు నమ్మలేదు. వాడికి ఊహ ఎక్కువ "మా అమ్మ....వత్తుందన్నావ్....మామయ్యా!......మా అమ్మ ఏదీ?" అని నిల దీసి అడుగుతున్నాడు.

"వస్తుందిరా మరి! చుట్టాలు తొందరగా రానిస్తారేఁవిటి? రెండు రోజుల్లో వచ్చేస్తుంది. అందాకా నిన్నూ, నన్నూ ఆడుకోమని చెప్పింది."

"ఊహూఁ! నేను ఆడుకోను. మామయ్యా!...నన్ను మా అమ్మ దగ్గరికి తీసుకెళ్ళవూ...?" బాబు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నేను ఏమీ జవాబు చెప్పలేకపోతున్నాను. వాడి ప్రశ్నలకు నేను ఏం చెప్పినా వాడు వినటంలేదు. పిల్లలందర్నీ పిలిచి చూపిస్తే వాళ్ళతో చేరటంలేదు. నా దగ్గర తప్పితే ఎక్కడికీ వెళ్ళటంలేదు. "అమ్మా!" అంటూ , దీనాతి దీనంగా ఏడుస్తూనే వున్నాడు. ఆ రోజూ వాడు సరిగా అన్నం తినలేదు. రాత్రి నేను పక్కలో పెట్టుకు పడుకున్నాను. ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. నిద్రలోకూడ వెతుక్కున్నాడు. త్రుళ్ళిపడి లేచి ఏడుపు ప్రారంభించేడు. వాణ్ణి ఎలా సముదాయించాలో ఇంట్లో ఎవరికీ అర్థం కావటంలేదు. పిన్ని ఎత్తుకోబోయింది. కెవ్వుమంటూ నన్ను కావలించుకున్నాడు. "వద్దు నానీ! ఎవరి దగ్గరికీ వెళ్ళొద్దు. నేనే ఎత్తుకుంటానుగా!"

వాడు పుట్టింది మొదలు ఒక్క గంటకూడా తల్లిని విడిచిలేదు, ఇంట్లో తండ్రివున్నా తల్లితోనే వాడికి అనుబంధం. ఇప్పుడు వాడికి ఊహ తెలుస్తూన్న సమయం. తల్లిని ఎలా మరిచిపోతాడు? నా హృదయం దడ దడలాడింది. వాడు బెంగపెట్టుకుంటే ఏం చెయ్యాలి? చిన్నతనమనీ, వాడే క్రమంగా మారిపోతాడనీ అనుకున్నానుగానీ, వాడు నిద్రలేచి మళ్ళా ఏడిస్తే ఏం చెప్పాలి? నెమ్మదిగా వాణ్ణి పక్కమీద పడుకోబెట్టాను.

మరి రెండు రోజులు గడిచాయి. బాబు బెంగపడి పోయాడు. పూర్తిగా అన్నం తినటం మానేశాడు. "అమ్మా! అమ్మా!" అనే మాటకు విరామం లేకుండా ఏడుస్తున్నాడు. అమ్మని తీసుకు రమ్మంటున్నాడు. లేక పోతే తనని తీసుకు వెళ్ళమంటున్నాడు.

పిన్ని ఏడుపుతో మరీ జడిసిపోయాడు. నిద్రలో ఉలిక్కిపడటం, ఏడవటం, అందరి ముఖాల్లోనూ ఏదో వెతుక్కోవటం, నిరాశపడి బావురు

మనటం. నా కేమిటో భయంగా ఉంది. పిన్ని, అక్కయ్యలూ నెమ్మదిగా వాడిని సముదాయించటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ వాడు ఎవర్నీ దగ్గరకు రానివ్వటంలేదు ఆ రాత్రి వాడికి జ్వరం తగిలింది. వెంటనే వెళ్ళి డాక్టర్‌ని లేపుకొచ్చాను. డాక్టర్ ఏదో ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళారు.

తెల్లవారేసరికి కొంచెం తగ్గింది. వాడు ఇంకా నిద్రపోతున్నాడు. నేను మొహం కడుక్కొని వచ్చి దగ్గరగా కూర్చున్నాను.

నెమ్మదిగా పిలిచాను. "నానీ...."

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

"అమ్మదొంగా! మెలుకువనే వున్నావా?"

"అమ్మ ఏదీ?"

అయ్యో! ఎంత తప్పు చేశాను? ఆ అక్షరాలే వాడికి గుర్తు తేకూడదు.

"మామయ్యా!"

"అవునుగానీ, నానీ! నువ్వు కాఫీ తాగుతావా కొంచెం?"

"ఉహూఁ! మా అమ్మ ఎప్పుడూ కాఫీ ఇవ్వదు."

"పోనీ పాలు తాగుతావా?"

"నా కొద్దు."

"నువ్వు మంచివాడివి కదూ? కొంచెం తాగు, తీసుకురానా?"

"మా అమ్మ దగ్గిరికి తీసికెళ్లవా?"

సరేనంటే పాలు తాగగానే బయలుదేరదామంటాడు. కాదంటే పాలే తాగనంటాడు. మాట్లాడకుండా కూర్చున్నాను. వాడు ఏడవటం మొదలు పెట్టాడు. వాడిని చూస్తున్నకొద్దీ నా కడుపు తరుక్కుపోతూంది. ఇంత చిన్నతనంలో తల్లిని పోగొట్టుకున్నవాడు ఎంత దౌర్భాగ్యుడో కదా! వాడు మంచం దిగిపోయి నామీద కోపంతో నాలుగడుగులు వెళ్ళి నుంచుని ఏడుస్తు

న్నాడు వాడికి యెవరూ లేనట్టూ, అనాథ అయిపోయినట్టూ, ఏకాకిగా విల పిస్తున్నట్టూ అనిపిస్తున్నది. పిన్ని ఈ బెంగతో మరీ కుళ్ళిపోతోంది. నేను బలవంతంగా వాణ్ణి దగ్గరకు తీసుకున్నాను. వాడు నిస్సహాయంగా నా ఒడిలో ఇమిడిపోయాడు వెక్కుతూ.

* * *

బాబు విపరీతమైన జ్వరంతో పడివున్నాడు. తెలివిలేదు. మధ్య మధ్య "అమ్మ! అమ్మా!" అంటూ కలవరిస్తున్నాడు. డాక్టరు ఇంజక్షన్ తయారు చేస్తున్నాడు. మౌనంగా ఇంట్లో అందరూ బాబు పరిసరాల్లో కూర్చుని ఉన్నారు. అందరి మొహాల్లోనూ ఏదో భయం కొట్టుకులాడు తూంది. నేను తటాలున లేచి వెళ్ళాను. డాక్టర్ అప్పుడే సిరంజి తీసుకు రాబోతున్నాడు. 'డాక్టర్!....' అంటూ చేతులు పట్టుకున్నాను. భయంతో నా శరీరం కంపిస్తోంది. గొంతు పెగిలిరావటంలేదు· "బాబుని... బ్రతి కిస్తానని వాగ్దానం చెయ్యండి డాక్టర్....!"

"రావుగారూ! మీరు భయపడకండి. నేను మంచి మందులు వాడు తున్నాను. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను."

"కాదు డాక్టర్! బాబు...బ్రతుకుతాడని చెప్పలేరా? ఏ సిటీకైనా తీసికెళ్ళ పొమ్మంటారా?"

"రావుగారూ! మీరు తొందర పడుతున్నారు. బాబుకి తల్లిపైన బెంగ తప్పితే మరే జబ్బూ లేదు. నన్ను డాక్టర్‌గా కాదు, మీ సోదరుడిగా చూడండి ఒక పసిపాపకు నేను అన్యాయం చేస్తానా?"

"క్షమించండి డాక్టర్! నా బాధ మీకు తెలీదు: మా చెల్లి తన కొడు కుని నాకు అప్పగించి ఆత్మహత్య చేసుకుంది. బాబుని నేను బ్రతికించుకో లేకపోతే, డాక్టర్...! నేను చెప్పలేను ...వాణ్ణి బ్రతికించి తీరాలి."

డాక్టర్ నన్ను తీసుకుని బయటికి వెళ్ళాడు. నేను వెనకే పరి

గెత్తాను, ఇంజెక్షన్ నొప్పితో బాబు కెవ్వుమన్నాడు. కళ్ళు మూసుకొని పడుకొని ఎంతోసేపు ఏడిచాడు.

క్రమంగా పగలు జారిపోతూంది. నలువైపులా చీకటి అలుము కుంటూంది. పిన్ని, నేనూ బాబు మంచం దగ్గరే కూర్చున్నాము. నాకు నాలుగైదు రోజుల నుంచీ నిద్రలేదు. అలా బాబు పక్కలో పడుకొంటే కళ్ళు మూతలు పడిపోతున్నాయి

* * *

సావిడి అంతా చీకటిగా వుంది. పిన్ని లేచి దీపం వెయ్యలేదు. చీకటిలోనే మెట్లు ఎక్కి ఎవరో వస్తున్నారు. కదలికలన్నీ భాను నడకని పోలివున్నాయి. మరీ దగ్గరకు వచ్చింది! భాను!

"భానూ ...!" అంటూ అరిచాను. పిన్ని స్పృహ తప్పి పడిపో యింది. భాను మరీ దగ్గరకువచ్చి నవ్వింది. 'కోపం వచ్చింది కదూ నీకు? వచ్చేశాగా?' నేను కెరటాలలో కొట్టుకుపోతూంటే ఒక జాలారి బ్రతికిం చాడు. రెండు రోజులు నాకు తెలివే రాలేదు', చెప్పుకు పోతూంది. నేను వెర్రివాడిలా చూస్తున్నాను.

"అయ్యో! బాబుకి జ్వరం వచ్చిందా? నాన్నా! నేనమ్మా! వచ్చాను ....అమ్మని చూడు నానీ!" భాను నానీని తీసి గుండెలకు హత్తుకుంది. బాబుని ఎత్తుకుని గాలిలో నుంచి అలా.... తేలుకు ఎగిరిపోతోంది.

"భానూ!" అని వెర్రికేక పెట్టాను.

* * *

"కేశవ్! కేశవ్! బాబూ."

ఎవరో తట్టి లేపుతున్నారు. ఉలిక్కిపడ్డాను. దిగ్గునలేచి కూర్చు న్నాను. బాబు పక్కలోనే ఉన్నాడు. నా శరీరమంతా గజగజ వణికిపో తూంది. పిన్ని నా చెయ్యి గట్టిగా పట్టుకొంది.

"పిన్నీ! భాను రాలేదా?"

"...."

"పిన్నీ! నువ్వు కూడా భానుని చూశావు కదూ?"

పిన్ని నెమ్మదిగా అంది— "కల వచ్చిందా బాబూ?" భాను తిరిగి వస్తుందా? అంత భాగ్యమా?"

"కలకాదు పిన్నీ! భాను నాకు పూర్తిగా కన్పించింది. ఒక జాలరి బ్రతికించాడని చెప్పింది."

"నీకు కలే వచ్చింది అయ్యో తల్లీ!" అంటూ పిన్ని పెద్ద పెట్టున ఏడవటం మొదలుపెట్టింది.

బాబు ఉలిక్కిపడి లేచిపోయాడు. భయంతో నన్ను అంటిపెట్టుకుపోయాడు. వీపు నిమురుతూ ఒళ్ళో పడుకోబెట్టుకున్నాను. సన్నగా పుల్లలా ఎండిపోయాడు. కళ్ళు గుంటలు పడిపోయి లోతుకు దించుకుపోయాయి. తల దుబ్బుగా పెరిగింది. కడుపు వెన్నెముకకు అంటుకుపోయింది. నాకు దుఃఖం ఉబికి వచ్చింది. ఇప్పుడు భాను వుంటే నిజంగా వస్తే బాబు యిలా అయిపోతాడని తెలిస్తే.... భాను ఎప్పుడూ అంతపని చేసేది కాదు.

వీధిలోకి, చీకటిలోకి శూన్యంగా చూస్తు కూర్చున్నాను. ఈసారి నిజంగా ఎవరో మెట్లు ఎక్కి వస్తున్నారు. నేను తటాలున లేచి దీపం వేశాను. నిర్ఘాంతపోయాను బావ! బాబు తండ్రి! నేను ఆశ్చర్యంతో అలాగే నిలబడి వున్నాను! అతను నా దగ్గరగా వచ్చి నా చేతుల్లోంచి బాబును అందుకున్నాడు. వాడి ముఖంలోకి తదేకంగా చూడసాగాడు. అతని కళ్ళ వెంట నీళ్ళు ధారాపాతంగా జారిపోతున్నాయి. బాబుని గుండెలకు అదుముకున్నాడు.

నేను మంత్రించినట్టు నిలబడి పోయాను. బావ మారిపోయాడా? నిజంగా మారిపోయాడా? పిన్నికూడా నాలాగే రాయిలా కూర్చుండి పోయింది.

ఎవరితో ఎవరూ ఏమీ మాట్లాడటం లేదు. అతను మాసినగడ్డంతో చిరిగిపోయిన బట్టలతో వికారిలా ఉన్నాడు. కళ్ళల్లో అగాధాలు కన్పిస్తు

న్నాయి. ఏదో సత్యం తెలుసుకో గలిగినట్లు క్రుంగిపోతున్నాడు. ఎవరినీ చూడలేనట్లు కొడుకు ముఖంలోకి దృష్టి సారించాడు. ఆ దృష్టిలో నిజమైన పశ్చాత్తాపం.... అవునా? భాను అయితే నమ్ముతుందా?

బాబు అప్రయత్నంగా కళ్ళు తెరిచాడు. వెర్రిగా క్షణం సేపు చూసి కెవ్వుమన్నాడు. ఒక ఊపుతో తండ్రి చేతుల్లోంచి గచ్చుమీద పడిపోయాడు. పరుగెత్తి వెళ్ళేసరికి తండ్రి తిరిగి కొడుకుని ఒళ్ళోకి తీసుకోబోయాడు.

"బాబు జడుస్తున్నాడు. నేను ఎత్తుకుంటాను" అన్నాను నెమ్మదిగా. తల దించుకొని నేలమీద కూర్చున్నాడు. బాబు తెలివిలో లేడు. ఒళ్ళు నిమురుతూ ఒడిలో పడుకోబెట్టుకున్నాను.

"అ....మ్మ....అమ్మ" పెదవులు చలిస్తున్నాయి. నాకేమీ తోచటం లేదు. చెయ్యికూడా కదపలేక పోతున్నాను ఏదో మొండితనంతో బాబు ముఖంమీదికి వంగి కళ్ళల్లోకి చూడసాగాను. ఆ పసికళ్ళల్లో జ్యోతి చాలా పేలవంగా వెలుగుతూంది. కనురెప్పలు ఎత్తి చూడలేకపోతున్నాడు. డాక్టర్ వచ్చాడు.

బాబు కళ్ళు మూతలు పడిపోయాయి. ఉదయుడు అస్తమించాడు.

తండ్రి—కొడుకు మృతకళేబరాన్ని గుండెలకు అదుముకుంటూ రోదిస్తున్నాడు. అదే పాదే బాబుని, బంతిలా తిరిగిన కొడుకుని, ఒక్కసారి కూడా ఎత్తుకోని, కనీసం కన్నెత్తి చూడని దౌర్భాగ్యుడు....

'నన్నూ తీసికెళ్ళు, చెల్లీ! నన్ను క్షమించు!' నా తల భారంగా.... నా కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఎంతో సేపటికి లేచి.... దుఃఖంతో.... పిచ్చివాడిలాగా భాను, కొడుక్కి రాసిన ఉత్తరం తీసి చదవసాగాను.

'నాన్నా!'

ఉదయా! నా చిరంజీవి! నిన్ను ఏమని పిలవను? మూడు సంవత్సరాల నిన్ను, సరిగా మాటలే రాని నిన్ను, పాతిక సంవత్సరాల పురుషుడిగా, సర్వం తెలుసుకున్న పెద్దమనిషిగా ఊహిస్తూ, ఉత్తరం రాయాలంటే నాకూ ఏమీ తోచడం లేదు బాబూ! నీకు నేను ఈ కడసారి ఘడి

యల్లో ఏదో చెప్పాలి. ఏదో బోధించాలి. ఎన్నో నీకు అర్థం అయ్యేటట్లు చెయ్యాలనీ, నా మనసు నీ ముందు విప్పి పెట్టాలనీ తపించిపోతున్నాను. ఇప్పుడు నేను నీ పక్కలోనే కూర్చున్నాను. నువ్వు గాఢంగా నిద్రపోతు న్నావు మధ్య మధ్య నవ్వుతున్నావు. నిన్ను ముద్దు పెట్టుకోవాలని ఆత్మ కొట్లాడుతుంది. కానీ అది ఇప్పుడు నేను చెయ్యకూడదు. నీది సున్నిత మైన మనస్సు. ప్రతి చిన్న చప్పుడికీ లేచిపోతావు. ఇప్పుడు నువ్వే లేస్తే నేను ఏమైనా చెయ్యగలనా? నువ్వు ఏమైనా చెయ్యనిస్తావా?

నాన్నా! నీకు అమ్మని.... కరువు.... చేస్తున్నాను. నీవు నిద్ర లేచి ఏడుస్తావు. తెలిసీ తెలియని మనసుతో బాధపడతావు. అందరి ముఖాల్లోనూ అమ్మకోసం వెతుక్కుంటావు. ఎక్కడా అమ్మ కనిపించకపోతే, రోజుల కొద్దీ అమ్మ మాయమైతే, నీ పసిహృదయం కొట్టుకులాడుతుంది బెంగతో నోరు విప్పి చెప్పుకోలేని బాధతో ఏడుస్తావు. నీ లేత మనస్సుని ఇంతగా మూగగా బాధిస్తున్నానని నాకు తెలుసు దీనికి నన్ను క్షమిస్తావా నాన్నా? నువ్వే ఆలోచించు— కాలికి ముల్లు గుచ్చుకుంటేనే విలవిలలాడిపోతామే! అంత సున్నితంగా కాపాడుకొనే ఈ శరీరాన్ని మనకై మనం త్యజిస్తా మంటే, చేతులారా నిప్పు ముట్టించుకు కాలిపోవటానికీ, నడిచివెళ్ళి సముద్ర కెరటాలలో కలిసిపోవటానికీ, తన చేతులతోనే తన కంఠానికి ఉరి బిగించు కోవటానికీ, తన బ్రతుకుని తనే అసహ్యించుకోవటానికీ కారణాలు ఎంత బలీయమై ఉంటాలో ఆలోచించు! ఆలోచించగలిగితే నువ్వు నన్ను క్షమి స్తావు నాన్నా! క్షమిస్తావు!

నువ్వు కడుపులో ఉన్నావని గ్రహించిన క్షణం నేను ఏమిటో అయిపోయాను. నన్ను మాతృమూర్తిని చేసిన నా చిరంజీవీ! నువ్వు పుట్టినరోజు నేను సర్వం మరచిపోయాను. కళ్ళయినా తెరిచిచూడవి నిన్ను హృదయానికి చేర్చుకుని పొంగిపోయాను. నువ్వు సూర్యుడితో కలిసి ఉదయించావు. అందుకే నీకు ఉదయుడని పేరుపెట్టాను. జీవితంలో నేను స్వతంత్రించి చేయగలిగిన పని ఇది ఒక్కటే! దానికి కారణం ఉంది. ఒక

వ్యక్తి ఒక పని చేస్తున్నప్పుడు కావలసినవారు ఆటంక పరచలేదంటే పూర్తిగా ఇష్టంవల్లా కావచ్చు, లేదా ఆ పనిని పట్టించుకోక పోవటంవల్లా కావచ్చు. నీ పేరు విషయంలో ఏది జరిగిందో నువ్వే ఊహించు.

నీ మీద నేను ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నాసంతోష సదనానికి నువ్వే పునాది వేస్తావనీ, ఈ చీకటి జీవితానికి వెలుగు చూపిస్తావనీ, నా కన్నీళ్ళు నీ చిట్టి చేతులతో తుడిచి వేస్తావనీ ఇంకా...ఇంకా. నేను బ్రతికే వుంటే నువ్వు అన్నీ చేసేవాడివి. కాని నాన్నా! దురదృష్టం నన్ను బ్రతక నివ్వదంలేదు ఇప్పుడు దానికి నేను విచారించటంలేదు కూడా. నా విచారం, నా దుఃఖం, నా అభిమానం, నా ఆవేశం అన్నీ గతంలో పూర్తి అయ్యాయి.

కానీ ఈ చివరి ఘడియల్లో నాలో మిగిలి ఉన్న ఒక్క కోరికా నీకు చెబుతాను. అది తీర్చవలసింది నువ్వే! నువ్వు పెరిగి పెద్దవాడై వృద్ధిలోకి రావాలి. ఆదర్శప్రాయుడైన వ్యక్తివి కావాలి. ఈ పురుష లోకంలో ఈ చీకటి సమాజంలో మాణిక్యమై వెలగాలి. అన్యాయాలు చూసి అసహ్యించుకొనే, అక్రమాలు చూసి ఆవేశపడే, దౌర్భాగ్యుల్ని చూసి కన్నీరు కార్చే, నీచత్వాన్ని చూసి తల దించుకునే పవిత్రమూర్తివి కావాలి. ఆ రోజు రావాలి. అది నువ్వే తేవాలి. విన్నావా బాబూ! ఇది నీకు చాలా చిన్న కోరికగా కనిపిస్తుంది కదూ? మామయ్య సంరక్షణలో నువ్వు ఇప్పటికి అలాగే పెరిగి వుంటావు. అవునా?

నువ్వు అన్నిటికన్నా ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉంది. ఈ విశాల ప్రపంచ సృష్టికర్త భగవంతుడు కానీ, మరేదైనా శక్తి కానీ, ఏదైనా- ఈ ప్రకృతిలో సర్వజీవులూ సమానులు. ఏనుగు ఎంత పెద్దదో, చీమ అంత చిన్నది! కానీ, దేని విశిష్టత దానికి ఉంది. దేని విలువ దానికి ఉంది. చీమ నీచమైనదీ కాదు. ఏనుగు ఉన్నతమైనదీకాదు. అది నువ్వు అంగీకరించాలి.

అన్నిటికన్నా మానవుడు ఉత్కృష్టమైనవాడు. ఆలోచించ గలడు, అర్థం చేసుకోగలడు, ఆచరించగలడు. ఈ ప్రత్యేకత పశుపక్ష్యాదులలో గానీ, క్రిమికీటకాదులలో గానీ, మరే ప్రాణికీ లేదు. అందుకే మానవుడు మానవుడుగానే ఉండాలి. ఏ ప్రాణికీ సంక్రమించని ఆ ప్రత్యేకత నిలుపుకోవాలి. పశువులు చూశావా? తిండికోసం బిడ్డతో తల్లి కుమ్ములాడుతుంది. తల్లితోనే బిడ్డ సుఖిస్తుంది. అది వాటి అపరాధం కాదు? వాటికా పరిజ్ఞానం భగవంతుడు ప్రసాదించలేదు. కానీ సర్వం తెలుసుకోగలిగిన మానవుడు అధికారాన్ని ఆరాధిస్తే, అక్రమాలకు దాసుడైతే, నీచత్వానికి తలదించితే అది పశుత్వం కాదంటావా? నువ్వు మానవుడిగా పుట్టావు. మానవుడుగానే జీవించు. మానవుడిగానే మరణించు!

నువ్వు ఒక ఆదర్శప్రాయమైన, బలీయమైన వ్యక్తిత్వం ఏర్పరచుకున్న నాడు ఎదుటివారి వ్యక్తిత్వాన్ని కాపాడగలుగుతావు ఎదుటి వ్యక్తిని తెలుసుకోగలుగుతావు.

నా గురించి నీకు మామయ్యద్వారా చాలా తెలిసి ఉంటుంది. నేను ప్రస్తుత సాంఘిక జీవితానికి పనికిరాను. అక్రమమైన ఈ పురుషాధికారానికి తల దించలేను. ఈ నిస్సహాయ స్త్రీ జీవితాన్ని ఆమోదించలేను. అందుకే నేను తప్పుకొంటున్నాను.

మళ్ళీ కొన్ని తరాల తర్వాత, స్త్రీని పురుషుడు గౌరవించ గలిగినప్పుడు, భార్యని భర్త ప్రేమించగలిగినప్పుడు, ఈ శరీరాలలో అధికార దాహం అంతరించిపోయినప్పుడు, ప్రతి సనాతన రక్త బిందువూ ఇగిరి గాలిలో కలిసిపోయినప్పుడు, నీ—నా ఎక్కువ తక్కువలు అంతరించినప్పుడు, గృహాలన్నీ శాంతినిలయాలయినప్పుడు, ప్రతి స్త్రీ హృదయమూ సంతోష సదనమైనప్పుడు, మనిషి మనిషిగానే బ్రతుకుతూన్నప్పుడు—అప్పుడు—నాకు స్త్రీగా జన్మించాలని ఉంది. అంతటి పరిణామానికి నీవంటి పసిపాపలు లక్షలాదిమంది శ్రమించాలి. అవసరమైతే చిరునవ్వుతో బలి కావాలి.

నాన్నా! జీవితం అనుభవించటానికేగానీ, ఇలా చేతులారా నాశనం చేసుకోవటానికి కాదు. కానీ జీవితాన్ని అనుభవించాలంటే జీవించి ఉండటం

ఒక్కటే ముఖ్యంకాదు. ఈ శరీరాన్ని నడిపించే హృదయం పాడుకాకూడదు. ఒక్క మర చెడితే యంత్రం పనిచేస్తుందా?

అమ్మని నువ్వు అర్థం చేసుకోవటానికి ఒక్క విషయం చెప్తాను. నేను చిన్నదాన్నిగా ఉన్నప్పుడు నాకు జడ వెయ్యటానికి మా అమ్మ బంగారు కుప్పెలు తెచ్చి కిటికీలో పెట్టింది అంతలోనే చెల్లి ఏడిస్తే పాలు కలపటానికి వెళ్ళిపోయింది. నేను జుట్టు విరబోసుకునే ఆడుకోవటానికి పరుగెత్తాను. తర్వాత జ్ఞాపకం వచ్చి చూస్తే కిటికీలో కుప్పెలు లేవు. అమ్మ దిగాలుపడి కూర్చుంది. నాన్నకు తెలిసి నవ్వి ఊరుకున్నారు. అమ్మ మరెన్నడూ అంత నిర్లక్ష్యంగా ఉండలేదు. అటువంటి అనురాగాల మధ్య పెరిగిన నేను కొత్త జీవితంలో అడుగుపెట్టి నాలుగు సంవత్సరాలు బ్రతికివున్నాను. దుఃఖంతో, కన్నీళ్ళతో, భయంతో, నిరాశతో, విరక్తితో జీవచ్ఛవాన్నై ఈ క్షణంవరకూ ఊపిరి పీల్చుకుంటున్నాను.

నేను లేనని బాధ పడకు. మరో స్త్రీని బ్రతక నివ్వటానికే ప్రయత్నించు. నేను ఏడిచానని విచారించకు. మరో వ్యక్తి కన్నీటికి నువ్వు కారణం కాకు. నేను ఖైదీగా గడిపానని ఆవేశపడకు: మరో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నువ్వు అపహరించకు! నేను భయంతోనే బ్రతికానని పిగ్గువడకు: మరో వ్యక్తిని జీవితంలో భయపడనివ్వకు — అప్పుడే నువ్వు మానవుడివి.

ఈనాటి స్త్రీ పొందలేని న్యాయాన్ని - ఆనాటి స్త్రీని అనుభవించనియ్యి! ఈనాటి కాలిదారిని నువ్వు రాజబాటగా మార్చివెయ్యి! అప్పుడే నువ్వు సంస్కర్తవు!

నాన్నా!....నానీ! నీకు నా మనసులో ఉన్నదంతా చెప్పాను. ఇక ముగిస్తాను బాబూ! నువ్వెందుకు ఈ రాత్రి ఇంత గాఢంగా నిద్రపోతున్నావు? నా యీ సాహసాన్ని నువ్వు ఆమోదిస్తున్నావా? నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోవటానికి ఈ మనసు అంగీకరించటంలేదు ఉదయా! కానీ ఇది తప్పదు నాన్నా!....నన్ను వెళ్ళనియ్యి!....నువ్వు మామయ్యతో సుఖంగా ఆడుకో!....మరి వెళ్ళిపోనా?

నా చిట్టితండ్రీ....నీకు నా ఆశీస్సులు! తల్లిగా నీకు నేను ఒక ఆజ్ఞ ఇస్తున్నాను. నీ కి జన్మ ఇచ్చిన నీ కన్నతండ్రిని ఎన్నడూ ద్వేషించకు. నా మాట పాటిస్తావు. నాకు తెలుసు—

ప్రేమతో
అమ్మ!'

పట్టరాని దుఃఖంతో—"ఇదిగో, భాను కొడుక్కి ఉత్తరం రాసింది. చదువుకో." అంటూ ఉత్తరాన్ని బావమీదికి విసిరేశాను! అతను వణికే చేతులతో ఉత్తరం తెరిచాడు—అంతా చదివి మొహం దించేసుకున్నాడు.

నాసితో పాటు ఆ ఉత్తరాన్ని కూడా భూదేవి గర్భంలో దాచేశాను.

* * *

భాను నిజంగా పేకమేడలే కట్టిందా? మనిషికి మనిషే విలువ అని నమ్మటంలో తప్పటడుగు వేసిందా? చదువు విషయంలో ఆశలు నిరాశ లయినా బెదిరిపోక, అది జీవితంలో ఒక భాగమేగానీ అదే జీవితం కాదని సరిపెట్టుకొని, అసలైన జీవితంలో కోరికలు పెంచుకొని పొరపాటు చేసిందా? భార్యగా, ఇల్లాలిగా తనకు ఒక విలువైన స్థానం కావాలనీ, తన భర్త హృదయంలో తనకు విశాలమైనచోటు లభించాలనీ కాంక్షించ టంలో దురాశ పడిందా? స్త్రీగా, తల్లిగా పవిత్రమైన స్థానంలో ఉండాలనీ, తన బిడ్డని స్వహస్తాలతో పెంచి ప్రయోజకుణ్ణి చెయ్యాలనీ తపించిపోవ టంలో తొందరపడిందా?

ఎంత ఆలోచించినా ఇవి ఏవీ నిజం కావనిపిస్తోంది. అయినప్పుడు భానుకు పరాజయమే ఎందుకు ఎదురౌతూ వచ్చింది? అన్ని విషయాల లోనూ శోకదేవతే ఎందుకు స్వాగతం పలికింది? భాను కట్టినవన్నీ చూపు లకేగానీ, అనుభవానికి వీలుకాని పేకమేడలే ఎందుకయ్యాయి? అది ఆమె దౌర్భాగ్యమనీ, జన్మ సుకృతమనీ, కర్మఫలమనీ ఎందుకు సమర్థించవలసి వచ్చింది?

కారణం తోస్తున్నది.

భాను, భారతదేశంలో స్త్రీగా పుట్టింది!

—: o :—

163

రంగనాయకమ్మ రచనలు

		ధర
1.	జానకి విముక్తి (3 భాగాలు)	60-00
2	అంధకారంలో...	(కాపీలు లేవు)
3.	స్వీట్ హోమ్ (2 భాగాలు)	26-00
4.	చదువుకున్న కమల	8-00
5.	ఇదే, నా న్యాయం!	15-00
6.	రచయిత్రి	15-00
7.	స్త్రీ	15-00
8.	కూలిన గోడలు	15-00
9.	బలిపీఠం	30-00
10.	పేకమేడలు	13-00
11.	స్పార్టకస్ (నవలా పరిచయం)	6-00
12	టామ్ మామ ఇల్లు [,,]	12-00
13.	స్వేచ్ఛాపథం [,,]	9-00
14.	ఆండాళమ్మగారూ, పల్లెటూరు	8-00
15.	నా డైరీలో ఒక పేజీ	3-00
16.	చుట్టాలు	6-00
17.	పందిట్లో పెళ్ళవుతోంది	3-50
18.	అమ్మ	4-00
19.	పెళ్ళానికి ప్రేమలేఖ	4-00
20.	ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది	5-00
21.	తెరవెనక	(కాపీలు లేవు)
22.	అనితరసాధ్యుడు	7-00

23. రామాయణ విషవృక్షం (3 భాగాలు) 115-00
24. నాస్తికత్వం-ఒక పరిశీలన 6-00
25. నాస్తికవాదం, హేతువాదం,
నవ్యమానవవాదం 6-00
26. నీడతో యుద్ధం 5-00
27. శాస్త్రీయ దృక్పథం
(కొన్ని ప్రశ్నలూ, జవాబులూ) 14-00
28. చలం సాహిత్యం 7-50
29. యజ్ఞం కథ మీద రెండు వ్యాసాలు 4-00
30. స్త్రీ స్వేచ్ఛ 12-00
31. తులసీదళం కాదు, గంజాయిదమ్ము 12-00
32. మార్క్స్ "కాపిటల్" పరిచయం(5భాగాలు) 129-00
33. శీగలాగారు, డొంకంతా కదిలింది! 10-00
34. కట్నం హత్యల్ని ఆపలేమా? 8-00
35. జల్లెడకి ఎన్ని చిల్లులో అన్ని చిల్లులు! 6-00
36. 'అనమానత్వం'లో నించి 'అనమానత్వం'లోకి 12-00
37. వాడుక భాషే రాస్తున్నామా? 13-00
38. తెలుగు నేర్పడం ఎలా? 22-00
39. పాఠకుల ప్రశ్నలూ
రంగనాయకమ్మ జవాబులూ 16-00

—ఈ పుస్తకాలు దొరికేచోటు—

అరుణా పబ్లిషింగ్ హౌస్

ఏలూరు రోడ్డు,

విజయవాడ-520 002.

166 RSKO1D308

మీరు చదివారా?

మార్క్స్

"కాపిటల్" (పరిచయం)

(5 భాగాలు)

* * *

రామాయణ విషవృక్షం

(3 భాగాలు)

* * *

జానకి విముక్తి

(3 భాగాలు)

వివరాలకూ, ప్రతులకూ :

అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్ - విజయవాడ-2

మనసు ఫౌండేషన్
పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RsKOLD308
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	19/06/23
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	169
పెద్ద సైజు పేజీలు	లేవు
ఖాళీ పేజీలు	[illegible]
లేని పేజీలు	లేవు
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	లక్ష్మి
స్కాన్ చేసినది	JYOthi
పరీక్ష చేసినది	[illegible]
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	